[illegible]

# రోమీయులకు, 4



[illegible]

[illegible]

# 44

# “యూదుల సమస్య”

## (9:1-13)

ఈ పాఠంలో, రోమీయులకు వ్రాసిన పత్రికలోని రెండవ భాగాన్ని ఆరంభించుదాం. ఈ పత్రికకైన మన అవుట్‌లైన్‌లో, తొలి 8 అధ్యాయాలు “సిద్ధాంతపరమయ్యింది గాను,” రెండవ 8 అధ్యాయాలు “అభ్యాస సంబంధమైనది గాను” చిత్రింపబడినట్టు చూచాం. అభ్యాస సంబంధమైనది మరి రెండు భాగాలుగా విభజింపబడింది: “వివరణ” (అధ్యాయాలు 9-11) మరియు “వర్తింపు” (అధ్యాయం 12తో ఆరంభమౌతుంది). (అవుట్‌లైన్ చూడు “రోమా పత్రిక యొక్క అవుట్‌లైన్” ఈ పుస్తకంలో తరువాత కన్పిస్తుంది.) ఈ వరుసలోని తరువాత కొన్ని పాఠాలు “వివరణ” భాగం మీద కేంద్రీకరించబడ్డాయి. సీనాయి పర్వతం వద్ద దేవుడు యూదులతో చేసిన నిబంధనకు విశ్వాసమువలన నీతిమంతులుగా తీర్చబడే సిద్ధాంతంతో ఎలా సంబంధం కలిగి ఉంటుందో అనే దానిని “యూదుల సమస్య” అని Jim McGuiggan పిలిచిన[1] విషయం మీద పౌలు వివరణను మనం చూస్తాం.

అధ్యాయం 9నుండి 11వరకు గల కొన్ని భాగాలు అర్థం చేసికొనడం కష్టం. “ముండ్ల పంది ముండ్లతో నిండుకొనియున్నట్టు రోమా 9-11 సమస్యలతో నిండికొని ఉన్నాయి” అని Tom Wright అన్నాడు.[2] D. Martyn Lloyd-Jones యిలా రాశాడు, “రోమా పత్రిక ఆరంభమందు ఎనిమిది అధ్యాయాలు ‘సువార్త’ గాను, చివరి నాలుగు అధ్యాయాలు ‘వర్తింపు’ గాను ఎంచి, మధ్యలోని మూడు చిక్కు ముడిగా విడిచి, యిది పాడుపని అని అనేకులు చేతులెత్తారు.”[3]

ఈ అధ్యాయాలు ఎందుకు అంత కష్టంగా ఉన్నాయి? పలు కారణాలు యివ్వవచ్చు. మొదటిది, మనం యికనెన్నడు ఎదుర్కోని మొదటి శతాబ్దపు సమస్యతో అది డీల్ చేస్తుంది. రెండవది, నీవు, నేను చేయదగు విధానంలో పౌలు ఆ సమస్యను సంధించలేదు. తన సమయంలో ఎక్కువ భాగం, తన సాటి యూదుల మనో భావాలను అనుసరించి తన పంథాను అల్లాడు.

ఇది తికమక గల భాగంగా ఉండటానికి మరొక కారణం దోషాన్ని బోధించడానికి యిది ఉపయోగింపబడింది. అనేక సంవత్సరాలుగా, భవిష్యత్ జ్ఞానము, భవిష్యత్ నిర్ణయము, మరియు ఏర్పాటు అనేవాటికి కాల్వినిష్టులకు యిది ప్రియమైన మూల వాక్యంగా ఉండిపోయింది. అప్పుడు, ఇటీవల కాలంలో, వారి “లోకాంతము” యొక్క దృశ్యంలో ఈ అధ్యాయాలను వెయ్యేండ్ల పరిపాలనావాదులు ఒక భాగంగా తమ సిద్ధాంతంలో చేర్చుకున్నారు. వారికి ప్రత్యేకమైన ఆసక్తిని కలిగించే మాటలు రోమా

11:26లో ఉన్నాయి: “ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురు.” లోకాంతము యొక్క చివరి కాలంలో ఎప్పుడో, యూదులందరు యేసును మెస్సీయగా అంగీకరిస్తారని వారు ఉపదేశిస్తారు.

చివరిగా, యిది పోటీకి పిలిచిన భాగం ఎందుకంటే, ఈ అధ్యాయాలు మొదటి శతాబ్దపు సమస్యతో సంబంధం కలిగినవైయున్నందున, అవి మనకు ఎలా వర్తిస్తాయో చూడడం అంత సులభం కాదు. (రోమా 8తో రోమా 12ను పౌలు అనుసరించి ఉండి నట్టయితే, 9నుండి 11 అధ్యాయాలను మనం ఎన్నడూ పోగొట్టుకొనక ఉండేవారమేనని చెప్పబడింది.) ఏది కాకపోయినా, రోమా 9–11ను ప్రభువు భద్రపరచినందున, పౌలు సందేశం క్రైస్తవ యుగమంతటికి చెందినదైయుండాలి. ఈ అధ్యాయాలను మనం చదువుతుండగా, ఏమి నేర్చుకోవాలని దేవుడు మనలను కోరుతున్నాడో దాన్ని కనుగొనడం మన లక్ష్యంగా ఉంది.

ఈ పాఠము మొదట మూల వాక్యాన్ని చర్చించి తరువాత ఈ వచనాల్లో పొందుపరచబడిన శాశ్వత సత్యాలపై దృష్టి నిలుపుదాం. ఈ పాఠం అధ్యాయం 9లోని 13 వచనాలను చుట్టి వస్తూ, రోమా పత్రికలోని ఈ క్రొత్త భాగానికి పరిచయంగా ఉంటుంది.

## గంభీరమైన మూల వాక్యం (9:1-13)

**పౌలు యొక్క దుఃఖం (1–5 వచనాలు)**

ఆత్మ యొక్క నడిపింపు క్రింద, తన సాటి యూదులకు పౌలు అధ్యాయం 9ని విన్నవించుకొనడంలో బహు నేర్పును కనుపరచాడు. వారి పట్ల తనకున్న ప్రేమను, అక్కరను వ్యక్తపరచుతూ ఆరంభించాడు. 8 అధ్యాయాలవరకు జనులు ధర్మశాస్త్రాన్ని ఆచరించడంవలన గాని, సున్నతివలన గాని నీతిమంతులుగా తీర్చబడరని పౌలు అంటూ వచ్చాడు. అది నిజం కాకపోయినా తన స్వజనులకు ద్రోహం చేసినవాడై యున్నట్టు కనబడతాడేమోయని అతడు గుర్తించాడు. పౌలుకు దేవుడనుగ్రహించిన పరిచర్య అన్యజనుల కొరకైనదేనా (రోమా 11:13; అపొస్తలుల కార్యములు 9:15; గలతీయులకు 2:9లను చూడు), అతడు అన్యజనుల వైపుకు మరలక ముందు అతడు యూదులకు సువార్త ప్రకటించాడు (అపొస్తలుల కార్యములు 13:14, 46 చూడు). రోమా పత్రికలోని చర్చకు వచ్చిన ప్రతిపాదనలో, సువార్త “మొదట యూదునికి” అని అతడు చెప్పాడు (1:16). ఇక్కడ అతడిలా అంటున్నాడు,

> నాకు బహు దుఃఖమును, నా హృదయములో మానని వేదనయు కలవు. క్రీస్తునందు నిజమే చెప్పుచున్నాను, అబద్ధమాడుట లేదు. పరిశుద్ధాత్మయందు నా మనస్సాక్షి నాతో కూడ సాక్ష్యమిచ్చుచున్నది. సాధ్యమైనయెడల, దేహసంబంధులైన నా సహోదరుల కొరకు నేను క్రీస్తునుండి వేరై శాపగ్రస్తుడనై యుండగోరుదును (9:1–3).

పౌలు చెప్పబోతున్నది సత్యమని స్థాపించడానికి ఈ ప్రతిపాదన యిలా ఆరంభ మౌతుంది: "క్రీస్తునందు నిజమే చెప్పుచున్నాను, అబద్ధమాడుట లేదు. పరిశుద్ధాత్మయందు నా మనస్సాక్షి నాతో[4] కూడ సాక్ష్యమిచ్చుచున్నది" (2 వచనం). "క్రీస్తునందు," "పరిశుద్ధాత్మయందు" అనే ఈ రెండు ప్రయోగాలు దేవత్వంలోని ఈ యిద్దరి సమక్షంలో పౌలు ఈ మాటలు పలుకుతున్నట్టును, సత్యం మాట్లాడడంలో అతడు తప్పిపోయినట్టయితే, వారికి జవాబు చెప్ప బాధ్యుడైయున్నట్టును పౌలు గుర్తించాడు.[5]

పౌలు చెప్పదలచిన సత్యమిది: "నాకు బహు దుఃఖమును, నా హృదయములో మానని వేదనయు కలవు" (1 వచనం). ఇంతటి భయంకరమైన దుఃఖంలో అతని ముంచివేసినదేమి? తన సాటి యూదులు యేసును మెస్సీయగా నిరాకరించినందున నశించిపోయారనేది తరువాత జరుగనైయున్న చర్చ సూచిస్తుంది. "ఇశ్రాయేలీయులు రక్షణపొందవలెనని" తన "హృదయాభిలాషయు, వారి విషయమై తాను చేయు ప్రార్థనయై యున్నట్టు" అధ్యాయం 10లో అతడు తెలిపాడు (1 వచనం).

పౌలు యొక్క అక్కర ఎంత గొప్పది? వచనం 3లో దిగ్భ్రమ కలిగించే ప్రతిపాదనను విను: "సాధ్యమైనయెడల, దేహసంబంధులైన నా సహోదరుల కొరకు నేను క్రీస్తునుండి వేరై శాపగ్రస్తుడనై యుండగోరుదును." "శాపగ్రస్తుడనై" అనేది *anathema* నుండి తర్జుమా చేయబడింది. శాపగ్రస్తమైన కర్మకు పౌలు ఆ పదాన్ని వాడతాడు. "... దేవుని న్యాయమైన ఉగ్రతకు అప్పగించడమనేది భావన. ..."[6] *anathema* అనే పదానికి సంబంధించి Douglas J. Moo యిలా అభిప్రాయపడ్డాడు, "క్రొత్త నిబంధనలో, దేవుని ప్రజలనుండి మినహాయించబడి శిక్షావిధి క్రింద ఉన్నవాడైయుంటాడు (1 కొరింథీయులకు 12:3; 16:22; గలతీయులకు 1:8-9 చూడు)."[7]

తన తోటి యూదుల కొరకు పౌలు శాపగ్రస్తుడై ఉండ వల్లపడదనుకో. "మనలో ప్రతివాడును తన్నుగురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను" అని అధ్యాయం 14 అంటుంది (12 వచనం). అది సాధ్యమైతే, అది దేవుని చిత్తమైతే, యూదులైన తన సహోదరులను రక్షించడానికి అతడు అంత దూరమైనా వెళ్లడానికి యిష్టపడుతున్నాడు. బంగారు దూడను చేసికొని దేవునికి కోపము పుట్టించిన ఇశ్రాయేలీయుల పట్ల మోషే కనుపరచిన అక్కరను యిది మనకు గుర్తుచేస్తుంది:[8] "అయ్యో యీ ప్రజలు గొప్ప పాపము చేసిరి; వారు బంగారు దేవతను తమకొరకు చేసికొనిరి. అయ్యో నీవు వారి పాపమును ఒకవేళ పరిహరించితివా, లేనియెడల నీవు వ్రాసిన నీ గ్రంథములోనుండి నా పేరు తుడిచివేయుమని బతిమాలుకొనుచున్నాననెను" (నిర్గమకాండము 32:31, 32).[9] "నీవు నా తోటి ఇశ్రాయేలీయులకు శిక్ష విధించినట్టయితే, నాకును శిక్ష విధించుమన్నట్టు" మోషే ప్రార్థించాడు. పౌలైతే, తనతోటి యూదులకు శిక్ష విధించడానికి బదులు తనకే శిక్ష విధించుమని ప్రార్థించాడు. రెండు సందర్భాలలోను, గాఢమైన అక్కర మనఃపూర్వకమైన ప్రేమ వ్యక్తపరచబడ్డాయి.

రోమా 9:3లోని ఈ మాటలను గమనించు: "దేహ సంబంధులైన నా సహోదరుల కొరకు." సాధారణంగా "సహోదరులని" పౌలు తన సాటి క్రైస్తవులను సూచించడానికి ఆ పదం వాడతాడు (ఉదాహరణకు, 1:13; 12:1; 15:30 చూడు); కాని యిక్కడ

అతడు తన తోటి యూదులకు వర్తింపజేస్తున్నాడు. యూదులతో తనకున్న బంధాన్ని అతడు నొక్కి చెప్పగోరతాడు, వారు తన "సొంత శరీరమును రక్తమునైయున్నారు" (9:2; TEV). ఆత్మ సంబంధంగా, అతడు క్రైస్తవుడు; అయితే జాతీయంగా, అతడొక యూదుడు. (నేను క్రైస్తవుడను; కాని నేను రోపర్ కుటుంబంలో ఒక భాగమని, అమెరికా పౌరుడననే వాస్తవాన్ని అది మార్చలేదు.)

యూదులను పౌలు తన "సహోదరులని," "దేహ సంబంధమైన బంధువులని," యూదా జనాంగముపై దేవుడు ప్రసాదించిన దీవెనల సంగ్రహముతో పలికాడు. "అట్లయితే యూదునికి కలిగిన గొప్పతనమేమి?" అని గతంలో అతడు అడిగాడు (3:1ఎ). "ప్రతి విషయమందును అధికమే" అని తన ప్రశ్నకు తానే బదులిచ్చాడు. అయితే ఆ సమయమందు అతడు పేర్కొన్న ఒకే ఒక ఆధిక్యత, "దేవోక్తులు యూదుల పరము చేయబడెను" అనేదే (2 వచనం). ఇప్పుడు అతడు ఆ జాబితాను పెంచాడు: 9:4, 5లో దేవుడు యూదులకు ప్రసాదించిన తొమ్మిది దీవెనలను అతడు పేర్కొన్నాడు:

> వీరు ఇశ్రాయేలీయులు; దత్తపుత్రత్వమును మహిమయు నిబంధనలును ధర్మశాస్త్ర ప్రధానమును అర్చనాచారాదులును వాగ్దానములును వీరివి. పితరులు వీరివారు; శరీరమునుబట్టి క్రీస్తు వీరిలో పుట్టెను. ఈయన సర్వాధికారియైన దేవుడైయుండి నిరంతరము స్తోత్రార్హుడైయున్నాడు. ఆమేన్.

(1) "ఇశ్రాయేలీయులు." పౌలు మొదటిగా, "వీరు ఇశ్రాయేలీయులు" అని అన్నాడు. యాకోబు దేవదూతతో పెనుగులాడిన తరువాత, అతని పేరు "ఇశ్రాయేలుగా" మార్చ బడింది (ఆదికాండము 32:28), దానికి అర్థం "దేవునితో పోరాడినవాడు" లేక "దేవుడు పోరాడతాడు" అని.[10] "ఇశ్రాయేలీయుడు" అనే పదం ఇశ్రాయేలు/యాకోబు సంతతివాడని సూచింపబడతాడు; "అది యూదులకు ప్రత్యేక ప్రాధాన్యతగా ఉంటుంది. నిబంధనల మధ్య కాలంలోను తరువాత (క్రొత్త నిబంధన) కాలంలోను, పాలస్తీనాలోని యూదులు దేవునిచే ఏర్పరచబడిన జనాంగమని చెప్పుకొనడానికి ఆ పేరును ఉపయోగించుకునే వారు."[11] (రోమా పత్రికలోని తొలి 8 అధ్యాయాలలో పౌలు "యూదుడు," "యూదులు" అనే పదాలే ఉపయోగించాడు; కాని 9నుండి 11 అధ్యాయాలలో మాత్రం అతడు ప్రధానంగా, "ఇశ్రాయేలు" మరియు "ఇశ్రాయేలీయులు" అనే వాడాడు.)

(2) "దత్తపుత్రత్వము." "దత్త పుత్రత్వము వారికే చెందుతుందని" పౌలు ఆ తరువాత అన్నాడు. "దత్తపుత్రత్వము" అనేది ఇశ్రాయేలు జనాంగమునే దేవుడు తన కుమారులు గాను, కుమార్తెలు గాను ఏర్పరచుకొన్నాడన్న విషయాన్ని నొక్కి చెప్పుతోంది (నిర్గమ కాండము 4:22; హోషేయ 11:1 చూడు).[12] ఆయన ఇశ్రాయేలునే గాని, ఐగుప్తు లేక బబులోను లేక అష్షూరువంటి బలీయమైన దేశాలను తన జనాంగంగా ఏర్పరచుకొనలేదు. "భూమిమీద సకల వంశములలోను మిమ్మును మాత్రమే నేను ఎరిగియున్నాను" అని దేవుడు ఇశ్రాయేలీయులకు తెలిపాడు (ఆమోసు 3:2ఎ).

(3) మహిమ. తరువాత "మహిమ" పేర్కొనబడింది. దేవుడు ఇశ్రాయేలీయులను తన ప్రజలుగా ఏర్పరచుకొనుటలోనే వారికి మహిమ ప్రసాదించబడిందని దీని అర్థం

కావచ్చు. తన ప్రజల మధ్య దేవుని ప్రసన్నత మహిమ గలదైయున్నట్టు దీని భావం కావచ్చు. దీనికి హెబ్రీ పదం *shakinah.* ఇశ్రాయేలీయులను అరణ్యములో నడిపించిన కాలంలో పగలు మేఘ స్తంభములోను రాత్రి అగ్ని స్తంభములోను దేవుని మహిమ ప్రదర్శింపబడింది (నిర్గమకాండము 13:21 చూడు). ప్రత్యక్ష గుడారము నిర్మింపబడి నప్పుడు, దేవుని మహిమ దాన్ని నింపింది (నిర్గమకాండము 40:34), దేవాలయము ప్రతిష్ఠింపబడినప్పుడు సయితం అదే జరిగింది (1 రాజులు 8:10, 11). ఇశ్రాయేలు మాత్రమే ఈ విధంగా ఘనపరచబడింది.

(4) "నిబంధనలు." నాల్గవ సంగతి "నిబంధనలు."[13] వారి పితరుడైన అబ్రాహాముతో – దేవుడు ఒక నిబంధన చేశాడు (ఆదికాండము 17:1–8; 12:1–3; 22:18లను చూడు). సీనాయి పర్వతము వద్ద యూదా జనాంగముతో ఆయన మరియొక నిబంధన చేశాడు (నిర్గమకాండము 24:8; 20:1–17 చూడు). ఇతర నిబంధనలు కూడ చేయబడ్డాయి. వాటిలో ఆయన రాజైన దావీదుతో చేసిన నిబంధన చేర్చబడింది (2 సమూయేలు 23:5; 7:12 చూడు). ఈ నిబంధనలన్నింటితో ఇశ్రాయేలు జనాంగం మాత్రమే సంబంధం కలిగియుంది.

(5) "ధర్మశాస్త్రము." తరువాత పౌలు, "ధర్మశాస్త్ర ప్రధానములను" గూర్చి మాట్లాడాడు, దేవోక్తులు యూదుల పరము చేయబడెను అనేదే యూదులకున్న ఆధిక్యతగా ముందుగానే గుర్తించాం (3:1, 2). రచనలో దేవుని నియమం కలిగినవారు యూదులు తప్ప మరెవ్వరూ లేరు. ఏదియెలాగున్నా, అధ్యాయం 9లో పౌలు జాబితాలో "ధర్మశాస్త్ర ప్రధానమును" కూడ చేర్చాడు. "ఆ పర్వతము మీద ఉరుములు మెరుపులు సాంద్ర మేఘము బూరధ్వని, కొలిమి ధూమమువలె లేచిన ధూమము, పర్వతమంతయు మిక్కిలి కంపించడం" అనే ఒక సందర్భాన్ని నీ మనస్సులో చిత్రించుకో. "యెహోవా అగ్నితో సీనాయి పర్వతము మీదికి దిగి వచ్చినందున అదంతయు ధూమ మయమైయుండెను. దాని ధూమము కొలిమి ధూమమువలె లేచెను, పర్వతమంతయు మిక్కిలి కంపించెను" (నిర్గమకాండము 19:16, 18). ఇంతకంటె కనులకు వింతైన దృశ్యాన్ని ఊహించడమే కష్టం – అది కూడ ప్రత్యేకించి ఇశ్రాయేలుకు చెందిందే.

(6) ఆరాధన. యూదుల దీవెనలలో "అర్చనాచారాదులును" పౌలు చేర్చాడు ("దేవాలయము" అని ఆంగ్లంలో చేర్చబడిన పదం తెలుగులో లేదు). కాని "అర్చనాచా రాదులు" అనేది *latreia* అనే పదంనుండి తర్జుమా చేయబడింది. ఇది దేవునికి చేసే సేవ, ఆయనను ఆరాధించడం కూడా చేర్చబడింది.[14] దేవుడు తన్ను సమీపించే అవకాశాన్ని సాధ్యం చేశాడనే దానిమీద యిక్కడ నొక్కి చెప్పబడింది. ప్రత్యక్ష గుడా రములోను, అటు తరువాత దేవాలయములోను వారు ఆయనను ఎలా సమీపించాలో ఆ సంబంధమైన ఖచ్చితమైన వివరాలను దేవుడు వారికి ప్రసాదించాడు. దేవుని ఎలా సంధించాలో – ఆయన ఆశీర్వాదముల కొరకు ఎలా విన్నవించుకోవాలో, ఆయన కనికరమును ఎలా పొందాలో ఆ విధానాన్ని ఇశ్రాయేలీయులకు మాత్రమే ప్రత్యేకించి చెప్పబడింది.

(7) "వాగ్దానములు." "వాగ్దానములును వీరివి" అంటూ వచనం 4లో ముగించ

బడుతుంది. దేవుని ప్రజలకొరకైన వాగ్దానాలతో పాత నిబంధన నింపబడింది, కాని మెస్సీయ రాకకు సంబంధించిన వాగ్దానాలు అతి ప్రాముఖ్యమైనవిగా ఎంచబడ్డాయి. ఇశ్రాయేలీయులకు మాత్రమే ఈ వాగ్దానాలు యివ్వబడ్డాయి.

(8) "పితరులు." వచనం 5 ఎనిమిదవ దీవెనతో ఆరంభమౌతుంది: "పితరులు వీరివారు." (NIV అన్నట్టే తెలుగులో ఉంది). అసలైన తండ్రులు/పితరులు: అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు అనేవారు. యూదులైతే ఈ వర్గంలో మోషే, దావీదు వంటివారిని సహా చేర్చారు. యూదులు తమ పితరులను బట్టి న్యాయ సమ్మతంగానే అతిశయించారు.

(9) "క్రీస్తు." చివరిదియు (మిక్కిలి ముఖ్యమైనదియునైన) ఆధిక్యత వచనం 5 చివరి భాగంలో వ్రాయబడింది: "శరీరమునుబట్టి క్రీస్తు [మెస్సీయ] వీరిలో పుట్టెను." ఒక్క జనాంగాన్ని వేరు చేయడంలో దేవుని ప్రాథమిక ఉద్దేశం ఎవరి ద్వారా మెస్సీయ (క్రీస్తు) వస్తారో ఆ జనులను ఆయత్తం చేయడమైయుంది. ఇది ఇశ్రాయేలు యొక్క అత్యుత్తమ శ్రేణికి గురుతైయుంది; ఏ యితర జనాంగం ఈ విధంగా ఘనపరచ బడలేదు.

"శరీరమునుబట్టి" అనే ప్రయోగాన్ని పౌలు ఉపయోగించాడు ఎందుకంటే శరీర సంబంధమైన (మానవ) పక్షంగా యేసు తన యూదా పితరులనుండి వచ్చారు (రోమా 1:2-4; మత్తయి 1:1-25 చూడు). ఆత్మ సంబంధమైన (దేవుని) పక్షంగా యేసు పరలోకమునుండి వచ్చినవారు (లూకా 1:26-35 చూడు).

"ఎవరి గుండా క్రీస్తు వస్తారో" అని అపొస్తలుడు అనలేదు ఎందుకంటే క్రీస్తు (యేసు) అంతకు ముందే వచ్చారు. యేసును మెస్సీయాగా అంగీకరింపని అనేక మంది యూదులు యింకను మెస్సీయా రావాలని ప్రార్థిస్తారు. Gerald R. Cragg యిలా రాశాడు, "అంధత్వం విపత్కరమైనది, కాని మహిమాయుక్తమైన తన సొంత వారసత్వం విషయమై గుడ్డిగా ఉండడం మాటలలో వ్యక్తపరచలేనంత భయంకరమైన సంఘటనయై ఉంటుంది."[15]

ఇశ్రాయేలీయులపై దేవుని దీవెనలను ప్రత్యేకించి యేసు యొక్క దీవెనను పౌలు ముగిస్తుండగా, అతడు ఉద్వేగంచేత జయింపబడినవాడై ప్రభువును స్తుతించడానికి ఆగాడు: "... క్రీస్తు ... సమస్తమునకు పైనున్నవాడు, దేవుడైయుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు. ఆమేన్" (రోమా 9:5బి, సి). అతని స్తుతి పలుకులు క్రీస్తు మొదట "సమస్తము పైన" ఉన్నట్టు గుర్తిస్తున్నాయి. యేసు భూమిని విడిచి వెళ్లడానికి కొంత ముందుగా, "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారమియ్యబడి యున్నదని" చెప్పారు (మత్తయి 28:18). ఆయన ఆరోహణమైన పిమ్మట, ఆయన దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి (మార్కు 16:19), అక్కడనుండి ఆయన ఏలుబడి చేస్తున్నారు (1 కొరింథీయులకు 15:25 చూడు).

స్తుతి పలుకులలో తరువాత ఈ మాటలున్నాయి "దేవుడు నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు." ఇది ప్రాథమికంగా, "నిరంతరము స్తోత్రార్హుడైన దేవుడు" (NKJV). వ్రాతలోని విరామ సమయాలు ఆది భాషలోనే తక్కువగా వాడబడినందున, "over all"

తరువాత (,) కామా రావాలో, లేక (.) చుక్క రావాలో నిశ్చయంగా చెప్ప వల్లపడదు. ఆ ప్రయోగం (,) కామా తరువాత (NASB, KJV, NIVలలో వలె) వచ్చినట్టయితే, "దేవుడు నిరంతరము స్తోత్రార్హుడైయున్నాడనేది" ప్రభువైన యేసుకు సూచిస్తుంది. అది (.) చుక్క తరువాత వచ్చిందంటే (NCV; NEB చూడు), వచనం 5 ముగింపు మాటలు దేవునికి వర్తిస్తాయి.

కనీసం రెండు కారణాలను బట్టి, "దేవుడు నిరంతరం స్తోత్రార్హుడైయున్నాడు" అనే మాటలు యేసు దేవత్వాన్ని సూచిస్తున్నాయి. మొదటిది, ఆది క్రైస్తవ రచయితలు ఈ మాటలను క్రీస్తుకు వర్తింపజేశారు. రెండవది, "శరీరమునుబట్టి" అనేదాన్ని సమం చేసే ఏదో యొకటి అవసరమైయుంటుంది. "శరీరమునుబట్టి," యేసు ఒక ఇశ్రాయేలీయుడు, కాని "ఆత్మనుబట్టి," "ఆయన నిరంతరము స్తోత్రార్హుడైన దేవుడు." "Over all"కు తరువాత (.) పెట్టినా, కుమారుడైన దేవుడు యింకను పౌలు మనస్సులో ఉండవచ్చు.

"[NIV] తర్జుమా ఖచ్చితమైనదని ఊహించి [క్రొత్త నిబంధన] అంతటిలో కన్పించే క్రీస్తు యేసు యొక్క దేవత్వపు మిక్కిలి తేటైన ప్రతిపాదనలన్నిటిలో" రోమా 9:5 ఒకటని Walter W. Wessel పిలిచాడు.[16] "సంబంధిత విషయం చిక్కుతో కూడింది, అయితే వ్యాకరణమందలి వాక్య పరిచ్ఛేదము మరియు సందర్భము 'కామా'తో కూడి ఉంది కనుక, ఈ వచనం క్రొత్త నిబంధనలో యేసును 'దేవుడుగా' నిర్ద్వందంగా పరిగణించిందని" Moo వ్రాశాడు.[17]

**దేవుని సర్వాధిపత్యం (6–13 వచనాలు)**

అతడు యూదులకు స్నేహితుడే గాని శత్రువు కాదని స్థాపించిన తదుపరి, "యూదుల సమస్యను" చర్చించుటను పౌలు ఆరంభించాడు. వచనం 6ఎ మాటలు రోమా 9–11 సారాంశ ప్రతిపాదనగా పేర్కొన్నారు: "అయితే దేవుని మాట తప్పిపోయినట్టు కాదు." యూదులనుండి పౌలు ఈలాటి ఆక్షేపణను ఎదుర్కొంటున్నాడు: "మన ప్రజలతో దేవుడు చేసిన నిబంధనలు మరియు మనకు అనుగ్రహింపబడిన పవిత్రమైన వాగ్దానములను గూర్చి నీవు యిప్పుడే మాట్లాడియు, నీతిమంతుడుగా తీర్చబడుటకు ఒకడు యేసునందు విశ్వాసముంచవలెనని నీవు నిర్బంధించుతున్నావు. ఎక్కువమంది యూదులు యేసును మెస్సీయగా నమ్మరు గనుక దేవుడు మాతో చేసిన నిబంధన విషయంలోను, మాతో ఆయన చేసిన వాగ్దానాల విషయంలోను తప్పిపోయాడని నీవు చెప్పుతూ ఉండాలి."

దేవుని మాట తప్పిపోయినట్టు కాదు అని పౌలు వెంటనే స్పందించాడు. "ఇశ్రాయేలీయులందరు ఇశ్రాయేలీయులు కారు" (6బి వచనం). "Descended" అనేది NASBలో ఇటాలిక్స్‌లో ఉంది, అంటే, అది తర్జుమాదారులచే చేర్చబడినట్టు సూచించ బడింది. అసలైన మూల వాక్యము "ఇశ్రాయేలీయులందరు ఇశ్రాయేలీయులు కారు" అని ఉంది (KJV చూడు). రెండు వృత్తాలను ఆలోచించు; ఒక వృత్తము పెద్ద వృత్తములో ఉంది.[18] ఈ రెండును "ఇశ్రాయేలీయులే": పెద్ద వృత్తము ఇశ్రాయేలు (యాకోబు) భౌతికమైన సంతానమైయుండగా, చిన్న వృత్తాన్ని "నిజమైన ఇశ్రాయేలు"

అని మనం పిలువవచ్చు. (తరువాత తన చర్చలో, పౌలు వారిని "శేషము" అని పిలిచాడు [9:27; 11:5].)




చిన్న వృత్తంలో ఉన్నవారు ఇశ్రాయేలు (యాకోబు) యొక్క భౌతిక సంతతివారే, కాని వారు యేసునందు కూడ విశ్వాసముంచినవారే. "బాహ్యమునకు యూదుడైనవాడు యూదుడు కాడు ... అంతరంగమందు యూదుడైనవాడే యూదుడు" అని అధ్యాయం 2లో పౌలు అన్నాడు (28, 29ఎ వచనాలు). అధ్యాయం 2లోని "నిజమైన యూదుడు" మరియు అధ్యాయం 9లోని "నిజమైన ఇశ్రాయేలీయుడు" అనేవి - యేసును మెస్సీయగా అంగీకరించి, యూదా జనాంగం కొరకైన దేవుని ఉద్దేశాలను నెరవేర్చే కొద్దిమంది యూదులను సూచించినవే.

రోమా 2:28, 29లోను, 9:6బిలోను ఉన్న ప్రతిపాదనల వంటివి యూదులలో అధిక సంఖ్యాకులకు దిగ్భ్రమ కలిగించియుండవచ్చు. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు తమకు పితరులైయుండడమే వారి నిత్య రక్షణకు సరిపోతుందని వారు నమ్మారు. ఇది నిజం కాదు అని చెప్పడానికి గతంలో దేవుడు చేసిన రెండు అవకాశాలను పౌలు తన పాఠకులకు గుర్తుచేశాడు.

(1) దేవుడు ఇస్సాకును కోరుకున్నాడు (7-9 వచనాలు). అబ్రాహాముకు భౌతికమైన సంతతియైనంత మాత్రానే చాలదని పౌలు తొలుత స్థాపించాడు: "అబ్రాహాము సంతానమైనంత మాత్రముచేత అందరు పిల్లలు కారు గాని: 'ఇస్సాకువల్లనైనది నీ సంతానము అనబడును' " (9:7). అబ్రాహాముకు హాగరు ద్వారా కలిగిన ఇష్మాయేలుతో పాటు పలువురు పిల్లలున్నారు (ఆదికాండము 25:1, 2; ఆదికాండము 16:15 చూడు). అయినప్పటికిని, ఆదిలో అబ్రాహామునకు యివ్వబడిన వాగ్దానాలను అతని పిల్లలలో ఒకడు మాత్రమే పొందుతాడు. రోమా 9:7లోని కొటేషన్ ఆదికాండము 21:12నుండి తీయబడింది. "ఇస్సాకువలన అయినదియే నీ సంతానమనబడును" అని దేవుడు అక్కడ తెలియజేశాడు.

"అనగా శరీర సంబంధులైన పిల్లలు దేవుని పిల్లలు కాదు గాని వాగ్దాన సంబంధులైన పిల్లలు సంతానమని యెంచబడుదురు" అంటూ పౌలు కొనసాగించాడు (రోమా 9:8). "శరీర సంబంధులైన పిల్లలు" అనేది విస్తరించిన అబ్రాహాము యొక్క

భౌతిక సంతతికి సంబంధించినది - ఇస్సాకు ద్వారాను, ఇష్మాయేలు సంతతివారు (అరబ్బులు), కెతూరా ద్వారా వచ్చిన సంతానము (మిద్యానీయులును, యితరులు). ఏదియెలాగున్నా, దేవుడు కేవలం "వాగ్దాన సంబంధులైన పిల్లలను" మాత్రమే (ఇస్సాకు ద్వారా) తన పిల్లలుగాను, అబ్రాహాము యొక్క నిజమైన సంతానంగాను అంగీకరిస్తాడు.

"వాగ్దాన సంతానం" అనేవారు వాగ్దానంనుండి వచ్చిన పిల్లలను సూచిస్తుంది. అది ఏ వాగ్దానం? పౌలు యిలా అన్నాడు, "వాగ్దానరూపమైన వాక్యమిదే: 'మీదటికి ఈ సమయమునకు వచ్చెదను; అప్పుడు శారాకు కుమారుడు కలుగును' " (9 వచనం). అబ్రాహాము రమారమి 99 సంవత్సరములవాడును, శారా 90 సంవత్సరముల ప్రాంతమునై యున్నప్పుడు దేవుడు అతనికి యిలా వాగ్దానం చేశాడు: "మీదటికి ఈ కాలమున నీయొద్దకు నిశ్చయముగా మరల వచ్చెదను; అప్పుడు నీ భార్యయైన శారాకు ఒక కుమారుడు కలుగునని చెప్పెను" (ఆదికాండము 18:10). ఒక సంవత్సరం తరువాత, దేవుడు తన వాగ్దానాన్ని నెరవేర్చాడు (21:1-3), మరియు ఇస్సాకు జన్మించాడు.

పౌలు తన ఆలోచనా సరళితో ఎటు పోతున్నాడు? ఇష్మాయేలు, ఇస్సాకుల మధ్య దేవుడు తనకిష్టమైనదానిని ఎన్నుకున్నాడు అని అనగానే, దేవునికి అలా ఎన్నుకునే హక్కు ఉందని, అందులో ఆయన సరియైన పనిని జరిగించాడని యూదులు అంగీకరిస్తారనేది నిస్సందేహం. పౌలు వారిని ఈ తీర్మానానికి తీసికొని పోతున్నాడు: దేవుడు, దేవుడు గనుక ఆయనకు ఆలాటి ఎన్నిక చేసికొనే హక్కు ఉంటుంది, ఆయన కోరుకున్న ప్రతివి సరియైనవే. అందువలన భౌతికమైన ఇశ్రాయేలులో "నిజమైన ఇశ్రాయేలుగా" ఎవరిని కోరుకుంటాడో ఆ హక్కు ఎల్లప్పుడు క్రీస్తువారితో ఉంటుంది. భౌతికమైన ఇశ్రాయేలులో తనకు కావలసినవారిని కోరుకొనడానికి దేవునికి హక్కు ఉంది.

(2) దేవుడు యాకోబును కోరుకున్నాడు (10-13 వచనాలు). పితరులు భౌతికమైన సంతానమైయున్నందుననే చాలదు. పౌలు ఒక తరము ముందుకు సాగి, ఇస్సాకు కుమారుల యొద్దకు వచ్చాడు:

> అంతేకాదు; రిబ్కా మన తండ్రియైన ఇస్సాకు అను ఒకనివలన గర్భవతియైనప్పుడు, ఏర్పాటును[19] అనుసరించిన దేవుని సంకల్పము, క్రియల మూలముగా కాక పిలుచువాని మూలముగానే నిలుకడగా ఉండు నిమిత్తము, పిల్లలింక పుట్టి మేలైనను కీడైనను చేయక ముందే "పెద్దవాడు చిన్నవానికి దాసుడగును" అని ఆమెతో చెప్పబడెను. ఇందును గూర్చి "నేను యాకోబును ప్రేమించితిని, ఏశావును ద్వేషించితిని" అని వ్రాయబడియున్నది (రోమా 9:10-13).

తాను కోరుకున్న ఎవరినైనా ఏర్పాటు చేసికొనడానికి సర్వాధికారపు హక్కు దేవునికి ఉంది అని పౌలు స్థాపించగోరాడు. ఆయనకు "సంపూర్ణమైన" అధికారమున్న కారణాన ఎవడూ ఆయనను ప్రశ్నించ వల్లపడదు. గత ఉదాహరణకు సంబంధించి (ఇష్మాయేలుపై ఇస్సాకును ఏర్పరచుకొనడం) ఇష్మాయేలుకంటే ఇస్సాకు ఎక్కువ

భక్తిపరుడైయుండినందున జరిగినదని వాదింపవచ్చు. ఈ ఉదాహరణలో (ఏశావుకు బదులు యాకోబును ఏర్పాటు చేసికొనడం), ఆ కవలలు యిద్దరు జన్మించక ముందే జరిగింది. అందువలన, సాధనలు, మంచితనము, దాగియున్న శక్తి సహితము భాజకములు కానేరవు.[20] నీకు ఈ కథ జ్ఞాపకం ఉండియుండవచ్చు:[21] రిబ్కాకు కవలలు గర్భమందుండగా, దేవుడు ఆమెకు ఈ సమాచారం యిచ్చాడు, "రెండు జనములు నీ గర్భములో కలవు; రెండు జన పదములు నీ కడుపులోనుండి ప్రత్యేకముగా వచ్చును; ఒక జనపదముకంటే ఒక జన పదము బలిష్ఠమైయుండును; పెద్దవాడు చిన్నవానికి దాసుడగును" (ఆదికాండము 25:23). కొంత కాలం గడిచిన తరువాత కవలలు జన్మించారు: మొదట ఏశావు తరువాత యాకోబు వచ్చారు (ఆదికాండము 25:24-26).

రోమా 9:12లో "పెద్దవాడు చిన్నవానికి దాసుడగును" అనే ప్రతిపాదనకు కొందరు ఆశ్చర్యపోయారు. వాస్తవానికి, ఆదికాండము 33:8బి ప్రకారం, ఏశావును యాకోబు "ప్రభువా," అని పిలువడంలో వ్యత్యాసాన్ని కనుపరచాడు. ఆదికాండము 25లోని పూర్తి ప్రతిపాదన విషయాన్ని తేటపరచుతోంది, ఎందుకంటే, "రెండు జనములు నీ గర్భములో కలవు; రెండు జనపదములు నీ కడుపులోనుండి ప్రత్యేకముగా వచ్చును; ఒక జనపదము కంటే ఒక జనపదము బలిష్ఠమైయుండును; పెద్దవాడు [అంటే, పెద్దవాని సంతతి] చిన్నవానికి [చిన్నవాని సంతతికి] దాసుడగును" అని రిబ్కా వింది (23 వచనం; నొక్కి చెప్పింది నాది). (ఇశ్రాయేలీయుల రాజైన దావీదు క్రింద) ఏశావు సంతతివారు (ఎదోమీయులు) యాకోబు సంతతివారికి దాసులైయుండడమనేది చారిత్రక విషయమై యుంది (2 సమూయేలు 8:14 చూడు).

ఆదికాండము 25:23 వ్యక్తిగతమైన ప్రవచనం కాదు, అది జాతీయ ప్రవచనమై ఉంది. ఈ తీర్మానం రోమా 9:13లో కోట్ చేయడంవలన తిరిగి ప్రవేశపెట్టబడింది: "ఇందును గూర్చి 'నేను యాకోబును ప్రేమించితిని, ఏశావును ద్వేషించితిని' " అని వ్రాయబడియున్నది. ఈ కొటేషన్ మలాకీ 1:2, 3నుండి వచ్చింది:

> యెహోవా సెలవిచ్చునదేమనగా, "నేను మీ యెడల ప్రేమ చూపియున్నాను," అయితే మీరు "ఏ విషయమందు నీవు మాయెడల ప్రేమ చూపితివందురు." "ఏశావు యాకోబునకు అన్న కాడా?" అయితే "నేను యాకోబును ప్రేమించితిని; ఇదే యెహోవా వాక్కు. ఏశావును ద్వేషించి అతని పర్వతములను పాడుచేసి అతని స్వాస్థ్యమును అరణ్యమందున్న నక్కల పాలు చేసితిని."

ఇశ్రాయేలు జనాంగముగా యెహోవా మాట్లాడుతున్నాడు, మరియు ఏశావు అనే రెఫరెన్సు ఎదోము దేశానికి సంబంధించినదైనట్టు సందర్భం తేటపరచుతుంది (4 వచనం గమనించు).

"ఏశావును ద్వేషించితిని" అనే ప్రతిపాదన విషయంలో కూడ కొందరు ఆశ్చర్యాన్ని వ్యక్తపర్చుతారు. లేఖనాల్లో "ద్వేషము" అనే పదం "తక్కువగా ప్రేమించు" అనే భావంతో కొన్నిసార్లు ఉపయోగించబడింది (లూకా 14:26తో పోల్చి చూడు). "ద్వేషించెను" అనే

పదం తరువాత రోమా 9:13లో ABనందు ఈ వివరణ ఉంది: "యాకోబు పట్ల నాకున్న భావం కంటె తక్కువ గౌరవం కలిగియున్నాను." రోమా 9లో పౌలు ఉద్దేశానికి సంబంధించి, "యాకోబును ఏర్పరచుకొంటిని ఏశావును నిరాకరించితిని" అన్నట్టు వచనం 13 యొక్క కొటేషన్ను చెప్పవచ్చు.

రోమా 9:1–13లో ఏర్పరచుకున్న రెండు సంఘటనలు సేవకు సంబంధించినవే గాని రక్షణకు సంబంధించినవి కావు. Leon Morris యిలా రాశాడు, "తన పత్రికలోని ఈ భాగమంతటిలో ప్రాథమికంగా ఇశ్రాయేలు మొత్తం తన మనస్సులో ఉన్నట్టుగా కన్పిస్తుంది, వ్యక్తులు కారు. మరియు నిత్య రక్షణ కొరకు కాకుండ సేవ కొరకు ఏర్పరచు కొనడాన్ని గూర్చి పౌలు డీల్ చేస్తున్నట్టు కన్పిస్తుంది."[22] "నిత్య రక్షణ కాక ఏర్పాటులో ఉన్నవారికి గల ఆధిక్యత మనస్సులో ఉన్నట్టు" Morris మరల అన్నాడు.[23] దేవుడు తన దైవికమైన ఉద్దేశాన్ని కొనసాగించుటకు ఎవరిని ఉపయోగించుకోవాలి అనేదాన్ని గూర్చి ఏర్పరచుకున్నాడు, అయితే అలా చేయటంలో ఏర్పరచబడినవారి నిత్య గమ్యంపై ఏ ప్రభావమును చూపదు. J. D. Thomas గారిచే ఉపదేశింపబడిన రోమా 9:11–24పైన క్లాసు కొరకు నేను పేపర్ వ్రాసినప్పుడు,[24] నా పేపరు అడుగు భాగాన ఆయన "తాత్కాలికమైన ఏర్పాటు శాశ్వతమయ్యింది కాదు" అని వ్రాశాడు. కాల్వినిష్టులు దీనిని తమ రుజువుకు మూల వాక్యముగా దీర్ఘ కాలం ఉపయోగించుకున్నారు – కాని వారు ఏమి ఉపదేశింపనుద్దేశించారో దానిని యిది ఉపదేశింపదు.




ఎవరి ద్వారా మెస్సీయ రావాలో ఆ రక్తపు బాంధవ్యాన్ని (గీతను) ఆయన స్థాపించు తుండగా దేవుడు రెండు ఏర్పాట్లు చేసికొన్నట్టు మన మూల వాక్యం తెలిపింది. దేవుడు ఇష్మాయేలుకు పైన ఇస్సాకును ఏర్పరచుకున్నాడు. తరువాత ఏశావు యాకోబుల విషయంలో పెద్ద కుమారునికి పైన చిన్న కుమారుని ఆయన ఏర్పరచుకున్నాడు. ఆయన దేవుడు గనుక దేవునికి యిలా ఏర్పరచుకునే హక్కు ఉందని పౌలు సూచించాడు. ఆయన సర్వాన్ని ఏలేవాడు ఆయనకు అత్యున్నతమైన అధికారముంది. ఏ యూదుడు దీనితో వివాదించడు. అయితే యూదులను కలవరపెట్టేదేమంటే, పౌలు దాన్ని వారికి

వర్తింపజేసిన విధానమే! ఇస్సాకును కోరుకొని ఇష్మాయేలును నిరాకరించడానికిని, యాకోబును ఏర్పరచుకొని ఏశావును నిరాకరించడానికిని దేవునికి హక్కు ఉండినట్టయితే, కొందరు ఇశ్రాయేలీయులను ఏర్పరచుకొని యితరులను నిరాకరించడానికి దేవునికి హక్కు ఉంది. దేవుని సర్వాధిపత్యమనే సిద్ధాంతం రెండంచులు గల ఖడ్గమైయుండి, అది రెండు దిశలను కోస్తుంది.

## ప్రముఖమైన సత్యాలు (9:1-13)

9:14–29 మీద రాబోయే మన తరువాత పాఠంలో పౌలు ఆలోచనా విధానాన్ని తిరిగి ఆలోచించుదాం. మనం ముగించడానికి ముందు, మొదటి శతాబ్దపు సమస్యలపై అతని ఉపదేశాన్ని తనిఖీ చేసి, ఏ 21వ శతాబ్దపు సత్యాలను కనుగొనగలమో చూద్దాం.[25]

**నశించినవారి పట్ల అక్కర కలిగియుండు (1–3 వచనాలు).**

యూదులను ద్వేషించడానికి పౌలుకు ప్రతి హేతువుంది. దాదాపుగా తాను సందర్శించిన ప్రతి పట్టణంలో అతడు యిబ్బంది పెట్టబడ్డాడు. అయినా, వారు యేసును అంగీకరించకపోతే, దాన్ని ఆలోచించుతుంటే అతని హృదయం పగిలిపోతుంది. వారు యేసును అంగీకరించకపోయినట్టయితే, అధ్యాయం 8లోని అద్భుతమైన దీవెనలను వారు ఎన్నడూ అనుభవించలేరు. మనం ఊహించగలిగినంత మిక్కిలి భయంకరమైన అనుభవాల గుండా పౌలు వెళ్లినా, నశించిన జనులను గూర్చి ఉన్నంతగా గాఢంగా తన బాధలను గూర్చి ఎన్నడూ వ్యక్తపరచలేదు. ప్రభువైన యేసునందు విశ్వసించి ఆయన లోబడకుంటే నిత్యము నశించే ప్రజలచేత నీవు, నేను ఆవరించబడియున్నాం. వారిలో కొందరు "శరీరమునుబట్టి మన బంధువులే కావచ్చు." మనం కూడా "బహు దుఃఖమును మానని వేదనయు" వారిపట్ల మన హృదయాల్లో ఉంచుకోవాలి.

**ఏదైనా మంచిది చెప్పు (4, 5 వచనాలు).**

పౌలు ఉత్తరాల ఆరంభాన్ని తనిఖీ చేయి. వారి సమస్యలను అతడు చర్చించక ముందు సాధారణంగా తన పాఠకులను గూర్చి ఏదో ఒక మంచి చెప్పుతూ ఉంటాడు. యౌవన సువార్తికులేమి (వృద్ధులేమి) పౌలు ఉదాహరణలోనుండి మనం నేర్చుకోగలం. మనము ఇతరులతో అనుకూలమైన బాంధవ్యాల కొరకు చూడవలసిన అవసరముంది.

**అవకాశాలు వ్యర్థపరచుకునే వీలుంది (4, 5 వచనాలు).**

యూదులకు దేవునిచే అనేక ప్రత్యేక ఆధిక్యతలు యివ్వబడ్డాయి, కాని వారు వాటిని సద్వినియోగం చేసికోలేదు. వారు తమ అవకాశాలను వ్యర్థం చేసికొన్నారు, వ్యర్థం చేసికొన్న అవకాశం శాశ్వతంగా వ్యర్థమైపోయినట్టే. ఎఫెసీయులకు 5:16లో, "దినములు చెడ్డవి గనుక సమయము సద్వినియోగము చేసికొనుచు [ప్రతి అవకాశాన్ని కొంటూ] ఉండమని" పౌలు క్రైస్తవులను కోరాడు (AB). దేవుడు మనకు ప్రసాదించే

అవకాశాలను,[26] అందులో ప్రత్యేకించి ఆత్మ సంబంధమైన అవకాశాలను గూర్చి ఆలోచించు: వాటిని మనం వ్యర్థం చేసికొంటే ఎంత విషాదమయమౌతుందో!

**రక్షణ వ్యక్తిగతమైనది (6బి, 7ఎ వచనాలు).**

భౌతికంగా వారు అబ్రాహాము సంతానమైనందువలన మాత్రమే తాము రక్షింపబడతామని యూదులు తలంచారు, కాని అది వాస్తవం కాదు. " 'అబ్రాహాము మాకు తండ్రి అని' మీలో మీరనుకొన మొదలుపెట్టుకొనవద్దు; దేవుడు ఈ రాళ్లవలన అబ్రాహామునకు పిల్లలను పుట్టింపగలడని మీతో చెప్పుచున్నాను" అని బాప్తిస్మమిచ్చు యోహాను ఒకసారి యూదులతో అన్నాడు (లూకా 3:8). నేడు, ఉన్నతమైన క్రైస్తవ తలిదండ్రులు తమ్మును క్రైస్తవులను కావిస్తారని కొందరు తలంచుతున్నట్టున్నారు. అది నిజం కాదు. నీవు తలిదండ్రులనుండి గాని ముత్తవ్వలనుండి గాని రక్షణను వారసత్వంగా పొందలేవు. ఇది వ్యక్తిగతమైన విషయం. వ్యక్తిగతంగా నీవు ప్రభువును అంగీకరించి ఆయన చిత్తాన్ని చేయాలి (యోహాను 8:24; లూకా 13:3; మార్కు 16:16).

**దేవుడు దేవుడైయున్నాడు (11, 12 వచనాలు).**

రోమా 9లో కన్పించే మిక్కిలి ప్రధానమైన సత్యమేమంటే దేవుడు దేవుడైయున్నాడు కేవలం ఆయన దేవుడైయున్నందుననే ఆయన తనకు యిష్టమైనదాన్ని జరిగిస్తాడు[27] – దేవునికున్న ఈ గుణ లక్షణానికి దైవతత్వ శాస్త్ర పదం "అత్యధిక అధికారము." మానవాళి యొక్క స్వేచ్ఛా చిత్తాన్ని గూర్చి ఎక్కువ కాలం గడుపుతూ, దేవుని సర్వాధికారాన్ని గూర్చి కొంచెం సమయం గడుపుతాం. వారు జన్మించక ముందే ఏశావును కాక యాకోబును ఏర్పరచుకొనడం, దేవుడు భవిష్యత్తులోనికి చూచి, తన ఉద్దేశాలకు ఏశావుకంటే యాకోబు శ్రేష్ఠమైన అభ్యర్థియై ఉంటాడని ఎరుగగలడు. అది నిజమే కావచ్చు, కాని పౌలు యొక్క పాయింటు ఏమంటే, ఏశావు యాకోబుల జన్మ తరువాత వారు చేసిన పనులు దేవుడు వారిని ఏర్పరచుకొనడంలో అవసరమైనవి కాదు. దేవుడు దేవుడైయుండి అందునుబట్టి ఏ ఒక్కనికిని ఆయన పూటపడినవాడైయుండడు! ఆయనను, దేవుని ఘనపరచడానికి నేర్చుకుందాం.

**మనం ఎన్నడూ ఎరుగలేనిది ఎంతో ఉంటుంది.**

ఏది కాకపోయినా, అధ్యాయాలు 9నుండి 11వరకు గల కష్టమైన భాగాలు, దేవుని గూర్చియు, ఆయన ఉద్దేశాలను గూర్చియు మనం ఎన్నడూ ఎరుగలేనిది ఎంతో ఉందని మనలను ఒప్పించాలి. దేవుని గూర్చి మనం సమస్తం తెలిసికోవాలని మనలో కొందరు యిష్టపడతారు. ఇదంతయు వ్రాతలో పెట్టి, ఒక పెట్టిలో ఉంచి, దానిపైన ఒక రిబ్బనును అతికించాలని యిష్టపడతాము – కాని దేవుడు ఆ పెట్టిలో యిమడ్చబడడు. "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మశాస్త్ర వాక్యములన్నిటి ననుసరించి నడుచుకొనునట్లు బయలుపరచబడినవి యెల్లప్పుడు

మనవియు మన సంతతివారివియునగునని” మోషే రాశాడు (ద్వితీయోపదేశకాండము 29:29). దేవుడు కొన్ని సంగతులను మనకు బయలుపరచినందుకే దేవునికి మనం కృతజ్ఞత కలిగియుందాం. ఆయన మనకు ఏమి బయలుపరచాడో దాన్ని పఠించి లోబడియుందాం. ఆయన బయలుపరచాడు – ఆయన సమస్తాన్ని బయలుపరచలేదని కూడ మనం గ్రహించాలి. రోమా పత్రిక మనలను వినయం గల వారినిగా చేయాలి.

**దేవుడు తన వాగ్దానాలను నెరవేర్చుతాడు (6ఎ వచనం).**

రోమా 9–11లో పౌలు మొదటి శతాబ్దపు సమస్యను చర్చిస్తున్నాడని నేను పలు మారులు అన్నాను. ఆ సమస్యను వ్యక్తపరచే విధానం యిక్కడ ఉంది: “యూదా జనాం–గానికి ఆయన చేసిన వాగ్దానాలను దేవుడు నెరవేర్చుతాడా?” ఈ ప్రశ్నను మొదటి శతాబ్దంతో ముడివేద్దాం. అయితే 21వ శతాబ్దానికి అందులో తీవ్రమైన సంగతులు గుప్తమైయున్నాయి: దేవుడు మనకు చేసిన వాగ్దానాలను ఆయన నెరవేర్చుతాడా? రాబోయే పాఠాలలో, ఈ ప్రశ్నతో పౌలు పెనుగులాటను మనం చూస్తాం. అయితే అతని తీర్మానం మన మూల వాక్యం వచనం 6లో ముందుగానే చెప్పబడింది: “అయితే దేవుని మాట తప్పిపోయినట్టు కాదు.” శ్రద్ధగా ఆలకించు: దేవుడు మనకిచ్చిన వాక్యం తప్పిపోదు! దేవుడు తన వాగ్దానాలను నెరవేర్చుతాడు. ఈ సత్యంమీద నీవు నీ జీవితాన్ని ఆధారం చేసికోవచ్చు.

## ముగింపు

తరువాత పాఠం 9:14తో ఆరంభమౌతుంది. ఇప్పుడే చెప్పబడిన సత్యాలకు సంబంధించి కొన్ని హెచ్చరికలతో ముగించుదాం. మొదటిది, నీవు క్రైస్తవుడవు కాకపోతే, రక్షణ వ్యక్తిగతమయ్యిందని గ్రహించు. వేరెవ్వరు నీ కొరకు నమ్మి, మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొందలేరు. నీవు నీ జీవితాన్ని క్రీస్తుకు సమర్పించియుండక పోయినట్టయితే, నేడే ఆ పని జరిగించు. రెండవది, ప్రభువు ప్రసాదించిన అవకాశాలను సద్వినియోగం చేసికోనట్టయితే, మారుమనస్సు పొంది శ్రేష్ఠంగా జీవించాలని తీర్మానించుకో (అపొస్తలుల కార్యములు 8:22; 1 యోహాను 1:9). నీవు గతంతో డీల్ చేయవలసియుంటే (యాకోబు 5:16 చూడు), దానిని చేయడానికి సమయం యిదే (2 కొరింథీయులకు 6:2).

---

సూచనలు

[1]Jim McGuiggan, *The Book of Romans,* Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1982), 5. [2]Quoted in John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 261. [3]Ibid. [4]రోమా 2:15లోని ప్రతిపాదనతో దీన్ని పోల్చు. రోమా పుస్తకం 1లో “అన్యజనులు, మనస్సాక్షి, సువార్త పని (2:14, 15)” మీద కామెంట్సు చూడు. [5]“పరిశుద్ధాత్మయందు” అనేది పౌలు పరిశుద్ధాత్మచే ప్రేరేపింపబడ్డాడనే వాస్తవాన్ని స్థాపించవచ్చు. [6]J. Behm, *“anathema”* in Geoffrey W.

Bromiley, *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel and Gerhard Friedrich, trans. Geoffrey W. Bromiley, abr. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 57. [7]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 292. రోమా 9:3లో *anathema* అంటే శాశ్వతంగా నశించి పోవడమైయుంది. [8]నిర్గమకాండము 32లోని సంఘటన శ్రోతలకు పరిచయం కానిదైతే దాన్నిగూర్చి మరోసారి వివరించు. [9]"యెవడు నా యెదుట పాపము చేసెనో" వాడే బాధ్యుడని దేవుడు మోషేకు తెలిపాడు (నిర్గమకాండము 32:33). [10]ఈ నోటు NASB నా కాపీలో కన్పిస్తుంది.

[11]Walter W. Wessel, notes on Romans, *The NIV Study Bible,* ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 1719. [12]"కుమారత్వపు దీవెన (8:14–17)" మీద కామెంట్సు రోమా పుస్తకం 3లో చూడు. [13]కొన్ని ప్రాచీన ప్రతులలో "నిబంధన" అని (ఏకవచనంలో) ఉంది. పౌలు మనస్సులో ఒకే ఒక నిబంధన ఉన్నట్టయితే, అది సీనాయి పర్వతం మీద దేవుడు చేసినదై ఉంటుంది (నిర్గమకాండము 24:8 చూడు). [14]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 563. 12వ అధ్యాయంలో *latreia* గూర్చి ఎక్కువ నేర్చుకుంటాం. [15]Gerald R. Cragg, "The Epistle to the Romans," in *The Interpreter's Bible* (Nashville: Abingdon Press, 1954), 9: 540. [16]Wessel, 1719. [17]Moo, 294. [18]Richard Rogers, *Paid in Full: A Commentary on Romans* (Lubbock, Tex.: Sunset Institute Press, 2002), 147. [19]"ఏర్పరచుకొను" అనేది *eklektos*నుండి తర్జుమా చేయబడింది దీనినుండి మనకు "ఎన్నిక" అనే పదం వచ్చింది (KJV చూడు). కాల్విన్ దైవతత్వ శాస్త్రవేత్తలు "election" అనే పదాన్ని స్వీకరించి దాన్ని వారి థియోలజీలో కీలకమైన దానిగా వాడుకున్నారు. "Election" అనే పదానికి ముందు "s" చేర్చి ఆలోచించు "selection." "మూడు ప్రశ్నలకు ఒకే జవాబు (8:31–37)" రోమా పుస్తకం 3లో "elect" అనే దానిమీద కామెంట్స్ చూడు. [20]ఏశావు కంటే యాకోబును ఎన్నుకోవడం విషయం గూర్చి KJVలో చిన్న బ్రాకెట్‌లో ఉంచబడింది.

[21]పౌలు ప్రస్తావించిన పాత నిబంధనలోని సంగతులన్నిటిని శ్రోతలకు పరిచయం కానివాటిని క్లుప్తంగా వివరించాలి. [22]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 352. [23]Ibid., 356. [24]David Roper, "Romans 9:11-24," a paper submitted on November 29 for J. D. Thomas, *Romans,* Abilene Christian College (1955). [25]ఈ భాగం కావాలనే సంక్షిప్తంగా వ్రాయబడింది. మీ శ్రోతలకు పరిచయమైన అన్వయముతో వివరించు. [26]అవకాశాలు ప్రాంతాన్ని బట్టి, వ్యక్తులను బట్టి మారుతూ ఉంటాయి. ఇది వ్యక్తిగతంగా చేసికో. [27]అనేక సాధారణ ప్రతిపాదనలవలె, దీనికి కొంత యోగ్యత అవసరం: ఆయన చిత్తానికిని, శీలానికిని అనుగుణంగా ఉన్నంతవరకు దేవుడు తనకు యిష్టమైనదాన్ని చేస్తాడు. ఆ అర్హతలను గుర్తించటానికి నీ సొంతదైన ఉదాహరణను ఈ ఆలోచనలను పంచుకొనడంలో ఉపయోగించు.

---

## రోమా పత్రిక అవుట్‌లైన్

పరిచయం (1:1–17)

- I. సిద్ధాంతపరమైనవి (1:18–8:39)
  - A. నేరారోపణ (1:18–3:20)
    1. అన్యజనులు
    2. యూదులు
  - B. నీతిమంతులుగా తీర్చబడడం (3:21–5:21)
  - C. పరిశుద్ధపరచబడడం (6:1–7:25)

D. మహిమపరచబడడం (8:1–39)

II. అభ్యాస సంబంధమైనవి (9:1–15:13)

A. వివరణ (9:1–11:36)

1. ఇశ్రాయేలుతో చేయబడిన వాగ్దానాలతో విశ్వాసంవలన నీతిమంతులుగా తీర్చబడడమనేది సమాధానపరచబడింది
2. విశ్వాసంవలన నీతిమంతులుగా తీర్చబడడం దేవుని విశ్వాస్యతతో సమాధానపరచబడింది

B. వర్తింపు (12:1–15:13).

ముగింపు (15:14–16:27)

# 45

# దేవుడు న్యాయవంతుడా?

# (9:14-29)

"అది న్యాయం కాదు!" అనే మాటలు నీవెప్పుడైనా విన్నావా? సంతోషం లేని పిల్లలు, అవమానించబడిన నవయౌవనులు, ఆశించినదానిని పొందని పెద్దలు ఈ మాటలు పలకడం నేను విన్నాను. ప్రభువు విషయంలో కూడ ఈలాటి మనో భావాలను వ్యక్తపరచిన ప్రజలను గూర్చి నేను విన్నాను: "నేను అంత చెడ్డవాడనేమి కాదు. నేను యితరులకు సహాయపడ ప్రయత్నిస్తాను. అయినా దేవుడు నాకు యిది చేశాడు. ఇది న్యాయం కాదు!"

దేవుడు న్యాయవంతుడా? మన మూల వాక్యంలో పౌలు ఈ విషయాన్ని (ప్రశ్నను) చర్చిస్తున్నాడు. "దేవునియందు అన్యాయము కలదా?" అని వచనం 14లో అతడు అడుగుతున్నాడు (NIV). "Is God unfair?" అని NCV వ్యక్తపరుస్తుంది. కొందరు ఇశ్రాయేలీయులను (అంటే, యేసునందు విశ్వాసముంచినవారిని) దేవుడు ఏర్పరచుకొని యితరులను (ఆయనయందు నమ్మికయుంచని) నిరాకరించడం దేవునికి న్యాయమేనా కాదా అనేది ఈ ప్రశ్నకు పూర్వ గాథయై ఉంది. దీన్ని మరొక విధంగా అడగాలంటే, (విశ్వసించని) యూదులను నిరాకరించి (నమ్మిన) అన్యజనులను అంగీ-కరించడం దేవునికి న్యాయమా? వచనం 14 మాటలను పౌలు వ్రాయించేటప్పుడు, అతని మనస్సులో ప్రత్యేకమైన పరిస్థితి ఉంది; కాని ప్రశ్నకు విశాలమైన వర్తింపు ఉంది. తన సమస్త కార్యములలో దేవుడు న్యాయవంతుడేనా? ఆయన నిరంతరం న్యాయం ఆచరిస్తాడా?

9:14-29లో, దేవుడు న్యాయవంతుడు ఎందుకంటే ఆయన ఎన్నికలు ఏక-రీతిగా ఉంటాయి. అది ఆయన ఆచరణ, వ్యక్తిత్వం మరియు ఉద్దేశంతో పొందిక కలిగి ఉంటాయి.

## ఆయన ఆచరణతో పొందికగా ఉంటాయి (9:14-18)

9:1-13లో, దేవుడు చేసుకొన్న ఏర్పాట్లను గూర్చి పౌలు మాట్లాడాడు. దేవుడు ఇస్సాకును కోరుకొని ఇష్మాయేలును నిరాకరించాడు (7బి-9 వచనాలు); ఆయన యాకోబును కోరుకొని ఏశావును నిరాకరించాడు (10-13 వచనాలు). "కాబట్టి ఏమందుము?" అని పౌలు అడిగాడు (14ఎ వచనం). అంటే, "గతంలో దేవుడు ఏర్పరచుకొన్నవాటి విషయంలో ఏమంటాం?" ఈ చర్చలోని ఈ పాయింటు వద్ద, మన ప్రస్తుతపు పాఠం కేంద్రీకృతమయ్యింది: "దేవునియందు అన్యాయము కలదా?

అట్లనరాదు" (14బి వచనం). దేవుడు అన్యాయస్థుడని నిర్ణయం జరిగినా పౌలును కలతపరచుతుంది. అందువలననే "అట్లనరాదు!" అని వెంటనే పౌలు దానితో చేర్చాడు (14సి వచనం).

ఇష్మాయేలుకు పైన ఇస్సాకును, ఏశావుకు పైన యాకోబును దేవుడు ఏర్పరచుకొనడం అన్యాయమని ఏ యూదుడును తలంచడు. ఈ తీర్మానం కొరకు పౌలు పూర్వగాథను ఏర్పాటు చేస్తున్నాడు: ఆ ఏర్పాట్లు చేసినప్పుడు న్యాయవంతుడై యున్నట్టయితే, నమ్మని యూదులపై నమ్మిన యూదులను ఏర్పరచుకొనినప్పుడు కూడ దేవుడు న్యాయవంతుడే. పైగా, విశ్వసించని యూదులపై విశ్వసించిన అన్యజనులను ఏర్పరచుకొనడం న్యాయమే.

**కనికరం: దైవికమైన అంగీకారం (15, 16 వచనాలు)**

దేవుడు ఇస్సాకు యాకోబులను కోరుకొనడం అనే విషయంనుండి, యూదుడైన ప్రతి పాఠకునికి ఎరుకైన మరి రెండు బైబిలు సంఘటనలకు పౌలు కదిలిపోయాడు. ఆ రెండును ఐగుప్తునుండి ప్రయాణానికి సంబంధించినవే. మొదటిది మోషేకును అరణ్యంలోని ఇశ్రాయేలీయులకు చెందినది: " 'ఎవనిని కరుణింతునో వానిని కరుణింతును; ఎవనియెడల జాలి చూపుదునో వానియెడల జాలి చూపుదును[1]' " (15 వచనం). ఈ కొటేషన్ నిర్గమకాండము 33:19నుండి తీయబడింది. బంగారు దూడ సంఘటనను వెంబడించి మోషేకును, దేవుడైన యెహోవాకును మధ్య జరిగిన సంభాషణ అది. దేవుని మాటలకు అర్థమేమంటే, "నా కనికరమును దయయు ఎవరు పొందుతారో నేను నిర్ణయించుతాను" అనేదే.

ఆ ప్రతిపాదననుండి, పౌలు ఈ తీర్మానానికి చేరుకుంటాడు: "కాగా పొందగోరువాని వలననైనను, ప్రయాసపడువానివలననైనను కాదు గాని, కరుణించు దేవునివలననే అగును" (రోమా 9:16). గ్రీకు మూలానికి "పరుగెత్తు మనుష్యుడు" అక్షరార్థమైన తర్జుమా పందెమందు గెలవాలని ఒక మనుష్యుడు చేయగలిగినదంతయు చేయువాని పోలికను పౌలు ఉపయోగించాడు. "పందెమందు పరుగెత్తుటలో (ఒకని) పూర్ణ ప్రయత్నపు పాటు" అని AB సూచిస్తుంది. వచనం 16ను మనం యిలా అనవచ్చు: "హృదయపూర్వకంగా కనికరం కోరే ("వాంఛించే") లేదా కనికరం పొందాలని బహుగా ప్రయాసపడే ("పరుగెత్తే") మనిషి మీద అది ఆధారపడదు. అయితే, కనికరాన్ని ప్రసాదించే దేవుని మీదనే అది ఆధారపడియుంటుంది."

పౌలు యొక్క ప్రతిపాదన ఈలాటి స్పందనను రేకెత్తించవచ్చు: "తప్పకుండా మనం కనికరాన్నే కోరాలి, మరియు కనికరం పొందడానికి మనం ఏమి చేయగలమో దాన్ని చేయాలి." అది నిజమే, కాని ఆ వాంఛ మరియు ఆ ప్రయాస కనికరమునకు హామీ కాదని పౌలు స్థాపించుతున్నాడు. వాంఛించడం, పని చేయడం అనేవి దేవుణ్ణి మనపట్ల రుణస్థునిగా చేయవు. ఎవని మీద కనికరాన్ని ప్రసాదించబోతాడో తీర్మానించుకోడం దేవునికి గల హక్కు.

అరణ్యంలోని ఇశ్రాయేలీయులు యిందుకుగాను మంచి ఉదాహరణయై ఉన్నారు.

ఈ సందర్భం యొక్క కొటేషన్ నిర్గమమునుండి తీయబడింది. మోషే ఇశ్రాయేలీయుల పట్ల విన్నవించుకొంటూ, వారిని క్షమించుమని అతడు దేవుని వేడుకొంటున్నాడు (నిర్గమకాండము 32:31, 32ఎ), వారితో కూడ కొనసాగునట్లు అడుగుతున్నాడు (33:15). ఈ కనికరపు ప్రదర్శనలకు ఇశ్రాయేలీయులు పాత్రులా? లేదు, ఆ సందర్భంలో దేవుడు వారిని కనికరింపగోరుకున్నాడు. వారి పితరులకు కృపను దేవుడు విస్తరింప జేయడం న్యాయమేనని పౌలు యొక్క యూదులైన పాఠకులు నమ్ముతారా? నమ్ముతారు.

**కఠినపరచబడడం: దైవిక నివారణ (17, 18 వచనాలు)**

వచనం 17లో పౌలు నిర్గమానికి ముందటి కాలానికి జరిగిపోయాడు: "మరియు లేఖనము ఫరోతో ఈలాగు చెప్పెను,[2] 'నేను నీయందు నా బలము చూపుటకును, నా నామము భూలోకమందంతట[3] ప్రచురమగుటకును, అందు నిమిత్తమే నిన్ను నియమించితిని.' " ఈ కొటేషన్ నిర్గమకాండము 9నుండి తీయబడింది. ఇది ఆరవ తెగులైన పొక్కులు పొక్కు దద్దురులకును, ఏడవ తెగులైన వడగండ్లకును మధ్య, దేవుడు మోషేచేత ఫరోకు ఒక సందేశాన్ని పంపాడు. అతనిని, ఐగుప్తునంతటిని ఆయన నశింప జేసియుండేవాడే. కాని, మోషే ద్వారా ఫరోకు యెహోవా యిలా తెలిపారు: "నా బలమును నీకు చూపునట్లును, భూలోకమందంతట నా నామమును ప్రచురము చేయునట్లును ఇందుకే నేను నిన్ను నియమించితిని" [అక్షరార్థంగా, "నిలిపితిని"[4]] (నిర్గమకాండము 9:16). నిర్గమకాండంలోని మూల వాక్యానికిని పౌలు కొటేషన్‌కును కొంచెం వ్యత్యాస ముంది. "అందు నిమిత్తమే నిన్ను [రాజుగా] నియమించితిని" అని పౌలు అన్నాడు. పాత నిబంధనలో "ఇందుకే నేను నిన్ను [రాజుగా] నియమించితిని." ఎటు చూచినా దేశముల గతిని దేవుడు తన స్వాధీనంలో ఉంచుకున్నట్టు నొక్కి చెప్పబడుతుంది.

"నా జనులను పోనిమ్ము" అనే దైవికమైన ఆదేశానికి ఫరో ఎలా ప్రత్యుత్తరమిచ్చినా సరే దేవుని ఉద్దేశం నెరవేర్చబడియుండేదేనని మనం ఎరగాలి (నిర్గమకాండము 5:1). ఫరో లోబడియుండినట్టయితే, ఐగుప్తు దేశపు మహా రాజు ఇశ్రాయేలీయుల దేవుని ఆదేశాలకు లోబడ్డాడనే వార్త వ్యాపించేదే. తత్‌ఫలితంగా, దేవుని యొక్క శక్తి ప్రదర్శింపబడేదే ఆయన నామము భూలోకమందంతట ప్రచురమయ్యేదే. ఫరో నిరాకరించాడనుకో. తత్‌ఫలితంగా పది తెగుళ్లు వాటివెంట నిర్గమము, ఎఱ్ఱ సముద్రాన్ని దాటడం, ఐగుప్తు సైన్యం లయమవ్వడం లాంటివి జరిగాయి. బలీయమైన ఆ కార్యముల సమాచారం ఎంతో దూరం వ్యాపించింది (యెహోషువ 2:10, 11; 9:9; 1 సమూయేలు 4:8 చూడు).

దేవుడు ఫరోతో ఎలా వ్యవహరించాడో పౌలు వివరాలు యివ్వలేదు, ఎందుకంటే బడికి వెళ్లిన ప్రతి బాలునికి ఆ కథ తెలుసు. పౌలు తన పాఠకుల దృష్టిని కేంద్రీకరింప జేయగోరిన కీలక విషయం ఫరో హృదయాన్ని కఠినపరచడం. దేవుడు "ఎవని కఠినపరచగోరునో వాని కఠినపరచును" అని పౌలు వచనం 18లో చెప్పాడు. కఠిన

హృదయము నమ్మని, మొండి, లోబడనొల్లని హృదయం. “దేవునికి, ఆయన వాక్యానికి, ఆయన పనికి ఇంద్రియ జ్ఞానములేని స్థితి” అని Douglas J. Moo వ్రాశాడు.[5]

దేవుడు ఫరో హృదయాన్ని ఎలా (ఏ భావంలో) కఠినపరచాడో చర్చించుచుతూ జనులు గంటలు గడిపారు. మనం పది తెగుళ్లను గూర్చి చదివేటప్పుడు, దేవుడు ఫరో హృదయాన్ని కఠినపరచినట్టు సమయంలో కొంత భాగం అంటుంది (నిర్గమకాండము 9:12; 10:1, 20, 27; 11:10; 14:8), మరికొంత భాగం ఫరో తన హృదయాన్ని కఠినపరచు కొన్నట్టు అది అంటుంది (నిర్గమకాండము 7:13, 14, 22; 8:15, 19, 32; 9:7, 34, 35). “నా జనులను పోనిమ్ము” అని మోషే చెప్పడం ద్వారా పరోక్షంగా దేవుడు ఫరో హృదయాన్ని కఠినపరచాడని, దేవుని రాజ శాసనాన్ని ఆలకించ నిరాకరించుటవలన ఫరో తన సొంత హృదయాన్ని కఠినపరచుకున్నాడని అనేకమంది రచయితలు తీర్మానించారు. “ఇక్కడే గాని మరి యింకెక్కడే గాని మొదట తన్నుతాను కఠినపరచుకొనని ఎవనినైనను దేవుడు కఠినపరచినట్టు చెప్పబడలేదు” అని Leon Morris అన్నాడు.[6]

సూర్య కిరణాలు వెన్నమీద, బురదమీద ఎలాటి ప్రభావాన్ని కనుపరచుతాయో అనేది తరచుగా ఉపయోగించే ఉదాహరణయైయుంటుంది. వెన్నను కరిగించిన అదే కిరణాలు బురదను గట్టిపరుస్తాయి. ఆలాగే, దేవుడు మాట్లాడినప్పుడు, కొందరి హృదయాలు మెత్తన చేయబడుతుండగా, మరికొందరి హృదయాలు కఠినమౌతాయి. దేవుని వాక్యం ఫరో హృదయాన్ని కఠినపరచింది ఎందుకంటే (నేను యిలా చెప్పినట్టయితే) అది “బురదతో చేయబడింది.”

దేవుడు ఫరో హృదయాన్ని ఎలా కఠినపరచాడో అనే దానిమీద నేడు జనులు పెనుగులాడతారు. యూదులైన తన శ్రోతలకు వివాదాస్పదమైన విషయాన్ని పౌలు లేవనెత్తలేదని మనం గ్రహించాలి. దేవుడు ఫరో హృదయాన్ని కఠినపరచాడని చదివి అతని విషయమై చింతించిన కొద్దిమందిని నేను కలిసికొన్నాను. కాని యూదుల హృదయాల్లో ఫరో పట్ల జాలి ఎవరికీ లేదు. వారికి సంబంధించినంతమట్టుకు, అణచివేసిన ఆ ఏలికకు దేవుడు ఏమి కోరుకుంటాడో దాన్ని చేయడానికి ఆయనకు హక్కు ఉన్నట్టు వారు భావించుతారు.

అప్పుడు పౌలు ఒక సంగ్రహమైన ప్రతిపాదనను చేశాడు: “కావున ఆయన ఎవనిని కనికరింపగోరునో వానిని కనికరించును; ఎవని కఠినపరచగోరునో వాని కఠినపరచును” (రోమా 9:18). “మీ పితరుల మీద కనికరము చూపినప్పుడు, దేవుడు న్యాయవంతుడేనా?” అని నీవు యూదుని అడిగియుండినట్టయితే, “అవును” అని చెప్పియుండేవాడే. “ఫరో హృదయాన్ని కఠినపరచినప్పుడు, దేవుడు న్యాయవంతుడేనా?” అని నీవు అతనిని అడిగియుంటే “పరిపూర్ణంగా!” అని అతడు బదులిచ్చేవాడే. ఈ విధంగా, కొందరిని అంగీకరించి, యితరులను నిరాకరించడం దేవునికి న్యాయమే అనేది సంవత్సరాలనుండి దేవుని ఆచరణతో అనుగుణంగా ఉందని పౌలు స్థాపించుతున్నాడు. ఆయన ఎల్లప్పుడు కొందరిని అంగీకరించి యితరులను నిరాకరిస్తునే ఉన్నాడు.

## ఆయన వ్యక్తిత్వంతో పొందికగానుండు (9:19-21)

ఏర్పాట్లు చేసికొనడంలో దేవుడు న్యాయవంతుడు ఎందుకంటే ఆయన తన వ్యక్తిత్వంతో పొందిక కలిగియుంటాడు. అంటే, ఆయన ఏర్పాట్లు ఆయన ఏమైయున్నాడో ఆయన స్వభావము ఏమైయుందో దానికి అనుగుణంగానే ఉంటాయి.

### ప్రేరేపించు ప్రశ్న (19 వచనం)

పౌలు తన ఆలోచనను, ఆక్షేపణను ఎదురు చూస్తూ ప్రవేశపెట్టాడు: "అట్లయితే 'ఆయన చిత్తమును ఎదిరించినవాడెవడు? ఆయన ఇకను నేరము మోపనేల?' " (19 వచనం). ఈ వచనంలో ఆక్షేపించినట్టు ఊహించబడినవాడు యూదుడు కాకపోవచ్చు (వచనం 7 మధ్యలోనుండి ఆరంభించి), యింతవరకు యూదుడు అంగీకరింపని ఏ విషయాన్ని పౌలు తన వాదనలో తెలుపలేదు. గనుక, మనం వచనం 19కి వచ్చి చేరగా, పౌలు తన సాటి యూదుని పక్షంగానే నిలిచి, తన ఊహలో వ్యతిరేకించినవానిని ఎదుర్కొంటున్నట్టు మనం చిత్రించవలసియుంటుంది. వచనం 20లో పౌలు అతనిని "ఓ మనుష్యుడా" అని సంబోధిస్తున్నాడు. ఈ వ్యక్తి యొక్క ఫిర్యాదు యివ్వబడింది: "దేవునికి ఎదురు చెప్పుటకు నీవెవడవు? [18 వచనం చూడు] నన్నెందుకీలాగు చేసితివని రూపింపబడినది రూపించినవానితో చెప్పునా?"

దైవికమైన భవిష్యత్ జ్ఞానము మీద జరిగే చర్చలలో ఈలాటి ప్రశ్నలు ప్రముఖ స్థానంలో ఉంటాయి. దేవుడు ముందుగా ఎరిగి, కొన్ని సందర్భాలలో ఫలాని వ్యక్తి, ఫలాని పని చేస్తాడని ముందుగా చెప్పియున్నట్టయితే, ఆ వ్యక్తి చేసినదానికి అతనిని ఎందుకు బాధ్యుడైనట్టు ఎంచాలి? దేవుని చిత్తాన్ని ప్రతిఘటించగలవాడెవడు? వచనం 19లో ఈ ప్రశ్నలు మనం చదువుచుండగా, పౌలు ఎలా బదులిచ్చాడో వినడానికి మనం ఆతురత కలిగియున్నాం.

### ఆశ్చర్యాన్ని కలిగించే జవాబు (20, 21 వచనాలు)

ఎలా జవాబు చెప్పుతాడని మనం ఎదురు చూస్తాం. ఆ విధంగా పౌలు జవాబు చెప్పలేదు. దేవుని సర్వాధిపత్యానికిని, మానవ స్వేచ్ఛా చిత్తానికిని మధ్యగల సంబంధాన్ని దీర్ఘంగా చర్చించడానికి అతడు వెళ్లలేదు. అయితే, దేవుడు మనిషికి జవాబుదారీ కాడు అనేది అతని ప్రాథమిక జవాబైయుంది. ఆయన దేవుడైయున్నాడు సుమీ!

"అవును గాని ఓ మనుష్యుడా, దేవునికి ఎదురు చెప్పుటకు నీ వెవడవు?" (20ఎ వచనం). ఈ ప్రశ్నలో రెండు పదాలు తారతమ్యం చేయబడ్డాయి: "మనుష్యుడు" (*anthropos*[7]) మరియు "దేవుడు" (*theos*). ఒకవైపు నిమిత్తమాత్రుడు, పరిమితుడు, అల్పుడు, విషయ పరిజ్ఞానం లేనివాడు; మరోవైపు అనంతుడు, అపరిమితుడు, సర్వశక్తుడు, సర్వమునెరిగిన దేవుడు. "దేవునితో తిరిగి మాట్లాడడాన్ని కేవలం నరమాత్రుడా, నీవు ఏపాటివాడవు?" అంటూ ఆ తారతమ్యాన్ని వచనం 20 తొలి భాగాన్ని CJB ఎత్తి చూపుతుంది.

నరమాత్రుడు తిరిగి దేవునితో మాట్లాడడంలోని వైపరీత్యాన్ని చూపడానికి,

యూదులకు ఎరుకైన ఒక పోలికను పౌలు ఉపయోగించాడు: మట్టి పాత్రలు చేయువాడు (కుమ్మరి) మట్టి పాత్ర (యెషయా 29:16; 45:9; 64:8; యిర్మీయా 18:6 చూడు). "నన్నెందుకీలాగు చేసితివని రూపింపబడినది రూపించినవానితో చెప్పునా? ఒక ముద్దలో నుండియే యొక ఘటము ఘనతకును ఒకటి ఘన హీనతకును చేయుటకు మంటిమీద కుమ్మరివానికి అధికారము లేదా?" (రోమా 9:20బి, 21).

చక్రం మధ్య మంటి ముద్దను అతడు పెట్టి, చక్రాన్ని త్రిప్పుతూ, ఆ మంటి ముద్దను నేర్పుగా ఒక పాత్రగా రూపించుతాడు. అది "ఘనత కొరకు వాడబడే" "మనోహరమైన పాత్ర" (Phillips) లేదా అది "సాధారణమైన పనులకు వాడబడే" "చెత్తకుప్పను వేసే" పాత్ర కావచ్చు (NLT). "ఘనతకొరకు వాడబడేది" మరియు "సాధారణమైన పనులకు వాడబడేది" అనేవాటికి బదులుగా గ్రీకు మూలంలో, "ఘనత," "ఘన హీనత" అనే పదాలు వాడబడ్డాయి. ప్రత్యేకమైన తన ప్రజలుగా దేవుడు ఇశ్రాయేలీయులను ఏర్పరచు కొనడమే (4, 5 వచనాలు) "ఘనత" కొరకు చేయబడిన పాత్రకు ఉదాహరణయై ఉన్నారు. ఫరో "ఘన హీనత" కొరకు చేయబడిన పాత్రకు ఉదాహరణ అయ్యుండవచ్చు. మంటిమీద కుమ్మరివానికి అధికారముందని పౌలు అంటున్నాడు. మరియు "రమ్యమైన పాత్రగా నన్నెందుకు చేయలేదు?" అని చెత్త కుప్ప వేయబడే పాత్ర సహితము ఎన్నడూ ఫిర్యాదు చేయలేదు.[8]



అన్ని పోలికలవలెనే దీనిని కూడా బహు దూరంగా సాగదీయ కూడదు. మొదట, ప్రజలు ప్రాణంలేని మంటి ముద్దలు కారు. వారు దేవుని ప్రతిఘటించగలరు; దేవుడు వారిని ఎలా చేశాడో దాన్ని గూర్చి తరచుగా వారు ఫిర్యాదు చేస్తారు. (నేనెందుకు యింత పొట్టిగా ... పొడవుగా ... లావుగా ... సన్నగా ... ఉన్నాను?) రెండవది, "జిగటమంటి" యొక్క తరహాను బట్టి అది ఏ విధమైన పాత్రగా చేయబడవలెనో, ఎలా ఉపయోగింపబడవలెనో ఆధారపడియుంటుంది (యిర్మీయా 18:1–10; 2 తిమోతి 2:20, 21లను చూడు). ఫరో విషయంలో అది నిశ్చయముగా వాస్తవమైయుంటుంది. అయినా పౌలు యొక్క ఆలోచన చట్ట ప్రకారం చెల్లునదైయుంది; దేవుడు దేవుడై యున్నాడు, ఆయన తాను కోరుకున్నదానిని జరిగింప హక్కు గలవాడైయున్నాడు.

వచనం 19 యొక్క ప్రశ్నకు బదులివ్వడానికి పౌలు ప్రయాసపడలేదని మనలో కొందరు నిరాశపడవచ్చు; గాని యూదులకు చెప్పుకునే విధానంలో తన ఆలోచన రూపించబడిందని మనస్సులో ఉంచుకో. ఇష్మాయేలుకు పైన ఇస్సాకును, ఏశావుకు పైన యాకోబును దేవుడు ఏర్పరచుకొనడం అన్యాయమని, లేక యెహోవా ఫరో హృదయాన్ని కఠినపరచిన తరువాత తిరుగుబాటు చేసిన ఇశ్రాయేలీయులను ఉండనీయడం అన్యాయమని ఒక యూదేతరుడు అంటే ఏమౌతుంది? "నిన్ను గూర్చి నీవు ఏమనుకుంటున్నావు? దేవుని ప్రశ్నించడానికి నీకేమి హక్కుంది?" అని జగడానికి వచ్చే యూదుని ఊహించడం కష్టం కాదు. తన ఏర్పాట్ల విషయంలో దేవుని ప్రశ్నించడానికి యూదునికి కూడ హక్కు

లేదనే తీర్మానాన్ని పౌలు ఎదురు చూస్తున్నాడు.

"దేవుడు న్యాయవంతుడా?" అనే ప్రశ్నకు సంబంధించి, పౌలు యొక్క రెండవ పాయింటును మనం ఈ విధంగా వ్యక్తపరచవచ్చు: "దేవుడు న్యాయవంతుడు ఎందుకంటే దేవుడు దేవుడైయున్నాడు – మరియు ఆయన జరిగించే ఏదైనా ఆయన స్వభావానికిని, ఆయన ఏమైయున్నాడో దానికిని అనుగుణంగా ఉంటుంది." దేవుడు తాను జరిగించే వాటిని ఎందుకు చేస్తున్నాడో కొన్నిసార్లు నీవు నేను గ్రహించలేకపోవచ్చు (మనం కేవలం నరమాత్రులమే) ఆయన సరియైనదే చేస్తాడని ఆయనను మనం నమ్ముకోవచ్చు. అబ్రాహాము అన్నట్టే, "సర్వలోకమునకు తీర్పు తీర్చువాడు న్యాయము చేయడా?" (ఆదికాండము 18:25).

## ఆయన ఉద్దేశంతో పొందిక కలిగియుండుట (9:22-29)

కొందరిని స్వీకరించి, కొందరిని నిరాకరించే హక్కు దేవునికి ఉన్నదని స్థాపించిన మీదట, (యూదులైనా, అన్యజనులైనా) అవిశ్వాసులకు పైగా విశ్వాసులను దేవుడు ఏర్పరచుకునే ప్రత్యేకమైన ప్రశ్నవైపుకు పౌలు తిరిగాడు. వచనం 22తో ఆరంభించి వచనం 29వరకు దేవుని న్యాయ విధానమునకు పౌలు రుజువునిచ్చాడు. ప్రత్యేకించి, దేవుని ఏర్పాట్లు న్యాయమైనవి ఎందుకంటే అవి ఆయన ఉద్దేశంతో పొందిక కలిగి ఉంటాయి – పాత నిబంధన ప్రవక్తల ద్వారా ముందుగా ఆయన ప్రకటించిన ఉద్దేశమే.

### దేవుని ఉద్దేశం నెరవేర్చబడింది (22–24 వచనాలు)

గ్రీకులో 22నుండి 24 వచనంవరకు ఒకే వాక్యం (KJV చూడు). గ్రీకులోని మాటల అమరిక చిక్కుగాను, తికమకగాను ఉన్నట్టు కన్పిస్తాయి, కాని పౌలు యొక్క ప్రాథమిక సందేశం తేటగా ఉంది. ఆ వాక్యం అపొస్తలుడు అడుగుతున్నట్టు ప్రారంభిస్తుంది, "ఆలాగు దేవుడు తన ఉగ్రతను అగపరచుటకును, తన ప్రభావమును చూపుటకును, ఇచ్ఛయించినవాడై, నాశనమునకు సిద్ధపడి ఉగ్రతాపాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘశాంతముతో సహించిననేమి[9]?" (22 వచనం).

ఈ వచనాన్ని అర్థం చేసికొనడానికి, దీన్ని విడదీసి, ముక్కలు, ముక్కలుగా చూడడంవలన సహాయం చేస్తుంది. దేవుడు "తన ఉగ్రతను అగపరచుటకును, తన ప్రభావమును చూపుటకును, ఇచ్ఛగలవాడై." ఈ సందర్భంలో, దేవుడు ఫరోకు తెలిపిన మాటలను యిది సూచించవచ్చు (17 వచనం చూడు), కాని యివి ఒక సాధారణ నిజాన్ని కూడ తెలుపుతున్నాయి. అంతంలో, తన ఉగ్రత భక్తిహీనులపై పడునప్పుడు, దేవుని శక్తి ప్రదర్శింపబడుతుంది (1:18 చూడు).

తీర్పు రాబోతున్నా, "ఉగ్రతా పాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘ శాంతముతో సహించుతున్నాడు." జిగట మన్ను, కుమ్మరి పోలికను పౌలు కొనసాగిస్తున్నాడు, అయితే వ్యత్యాసమైన వర్తింపుతో (కొనసాగిస్తున్నాడు). "నాశనమునకు

సిద్ధపడిన ఉగ్రతా పాత్రమైన" "దీర్ఘకాలము సహింపబడిన ఘటానికి" ఫరో మంచి ఉదాహరణయైయున్నాడు. ఇశ్రాయేలీయులను పోనిచ్చునట్లు అతని మనస్సు మార్చుకొనడానికి దేవుడు ఫరోకు తరుణం వెంట తరుణం ప్రసాదించుతునే వచ్చాడు. మరో ఉదాహరణ, అరణ్యంలోని ఇశ్రాయేలీయులు. ఆయన "బహు దీర్ఘశాంతముతో [వారిని] సహించకపోయినట్టయితే," జనాంగంగా వారు ఎన్నడో తుడిచిపెట్టుకు పోయేవారే. పాత నిబంధన కాలంలో భక్తిహీనులైన అన్యజనులకు కూడ ఈ సూత్రము వర్తింపజేయ బడవచ్చు. "నాశనమునకు సిద్ధపడి ఉగ్రతా పాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘశాంతముతో" యింకను సహించుతునే ఉన్నాడు. ఎందుకంటే, మారుమనస్సు పొందడానికి ఆయన మనకు అవకాశాలను ప్రసాదిస్తున్నాడు (2:4 చూడు). "... ప్రభువు ... యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు" అని పేతురు వ్రాశాడు (2 పేతురు 3:9). దేవుడు తన ఉగ్రతను కుమ్మరించే దానికంటెను ఆయన కనికరమును కనుపరచువాడైయున్నాడు.

ఇదంతా మనస్సులో ఉంచుకొని, వచనం 22లోని ప్రశ్నతో మనం ఆరంభించిన ప్రశ్నను కలుపుదాం. వచనం 14లోని ప్రశ్న: "దేవుడు న్యాయవంతుడా?" (లేక "దేవునియందు అన్యాయము కలదా?"; NCV). వచనం 22లో, "నశించినవారికి మారుమనస్సు పొందే అవకాశాన్ని యిస్తూ శాంతంతో ఉన్న దేవుని సంగతి ఏమిటి?" "దేవుడు ఎంత న్యాయవంతుడో అనడానికి యిది నిదర్శనము కాదా?"; "తప్పకుండా!" అని వచనం 22లో ప్రశ్న, జవాబులు గుప్తమైయున్నాయి.

"[మారుమనస్సుకు నశించినవారిని తెచ్చుటకు ఆయన దీర్ఘశాంతము గలవాడై యుండి] మహిమ పొందుటకు ఆయన ముందుగా సిద్ధపరచిన కరుణాపాత్ర ఘటముల యెడల ... తన మహిమైశ్వర్యము కనుపరచవలెననియున్ననేమి?" అంటూ వచనం 23 సాగింది. "కరుణా పాత్ర ఘటముల యెడల తన మహిమైశ్వర్యమును కనుపరచవలె ననునది" నిర్గమము మరియు సీనాయి పర్వతము వద్ద ఇశ్రాయేలీయులను కనికరముతో బ్రదుకనిచ్చుట అనే కథ మనకు గుర్తొస్తుంది (15, 18ఎ వచనాలు). ఆ సందర్భంలో దేవుడు చేసినది యావత్తు ఆయన కనికరము యొక్క "ఐశ్వర్యాన్ని" కనుపరచుతోంది.

ఫరో, ఇశ్రాయేలీయుల ఉదాహరణలనుండి, చర్చలోని విషయాన్ని వర్తింపజేయడానికి పౌలు సిద్ధంగా ఉన్నాడు. "కరుణాపాత్ర ఘటములను" సూచించిన తరువాత అపొస్తలుడు యిలా చేర్చాడు, "మహిమ పొందుటకు ఆయన ముందుగా సిద్ధపరచి పిలిచెను" అని అన్నాడు (23బి, 24ఎ వచనాలు). "ముందుగా సిద్ధపరచి," "పిలిచెను" అంటే, ఆయన ఎవరిని ముందుగా ఎరిగెనో లేక ముందుగా నిర్ణయించెనో (8:29, 30)[10] – వేరుగా చెప్పాలంటే దేవుని కృపచేత రక్షింపబడినవారని.

"ఆయన పిలిచిన మనలను" అని సూచించిన తరువాత (9:24ఎ), "అనగా యూదులలోనుండి మాత్రము కాక, అన్యజనులలోనుండియు" అంటూ పౌలు వివాదపు కేంద్ర స్థానానికి వెళ్లాడు (24బి వచనం). అనేకమంది యూదులను దేవుడు నిరాకరించెను అనేదే యూదులకు చాలినంత కలవరం కలిగిస్తుంది. అదే

సమయంలో, దేవుడు అనేక మంది అన్యజనులను అంగీకరించెను అనేది వారికి మరీ కుదురుబాటులేని స్థితిని కల్పించింది. వాస్తవానికి, ఆయన యూదులకంటెను ఎక్కువమంది అన్యజనులనే అంగీకరించాడు.[11] శతాబ్దాలకు ముందు దేవుడు యూదా జాతితో చేసిన నిబంధనను దృష్టిలో ఉంచుకుంటే యిది న్యాయంగా ఉంటుందా?

**దేవుని ఉద్దేశం ముందుగా చెప్పబడింది (25–29 వచనాలు)**

ఈలాటి పరిస్థితులు ప్రవక్తలచే ముందుగానే ప్రవచింపబడుతుందనేది పౌలు జవాబై యుంది. దేవుని ఏర్పాట్లలోను, సంకల్పంలోను అన్యజనులు చేర్చబడడం అనుకూల మయ్యిందేనని రుజువు చేయడానికి ప్రవక్తయైన హోషేయనుండి పౌలు మొదటిగా రెండు లేఖన భాగాలను కోట్ చేశాడు; ఆ ప్రకారము:

> "నా ప్రజలు కానివారికి 'నా ప్రజలనియు,'
> ప్రియురాలు కానిదానికి 'ప్రియురాలనియు' పేరు పెట్టుదును
> [హోషేయ 2:23]."
> "మరియు జరుగునదేమనగా, 'మీరు నా ప్రజలు కారని'
> యేచోటను వారితో చెప్పబడెనో,
> ఆ చోటనే జీవముగల దేవుని కుమారులని
> వారికి పేరు పెట్టబడును అని హోషేయలో
> ఆయన చెప్పుచున్నాడు[12] [హోషేయ 1:10]" (రోమా 9:25, 26).

హోషేయలోని వచనాలను వాటి సందర్భంలో చదువు, హోషేయ అన్యజనులను గూర్చి గాక, వెనుదిరిగిన యూదులను గూర్చియన్నట్టు నీవు కనుగొంటావు. దైవ ప్రేరేపణ వలన పౌలు ఈ లేఖన భాగాన్ని ఉపయోగిస్తూ ఒక సూత్రాన్ని స్థాపించుతున్నాడు: దేవుని ప్రజలు కానివారు దేవుని ప్రజలయ్యే వీలుందనడానికి ఈ లేఖన భాగం వాడబడింది. అందువలన, దేవుని ప్రజలు కాని అన్యజనులు (ఎఫెసీయులకు 2:11, 12 చూడు). దేవుని ప్రజలు (క్రైస్తవులు)గా అవడమనేది దేవుని ఉద్దేశాలకు అనుగుణంగా ఉంది.

(యేసునందు విశ్వాసముంచిన) కొద్దిమంది ఇశ్రాయేలీయులను అంగీకరించి ఇశ్రాయేలు దేశంలో అత్యధికులను నిరాకరించిన వాస్తవాన్ని గూర్చి ఏంటి (రోమా 9:6బి చూడు)? విషయం యిలాగైయుంటుందని ప్రవక్తలు కూడ ప్రవచించారని పౌలు చెప్పాడు. ఈసారి అతడు యెషయాను కోట్ చేశాడు:

> "మరియు **ప్రభువు** తన మాట సమాప్తము చేసి, క్లుప్తపరచి[13] భూలోకమునందు దానిని నెరవేర్చును గనుక ఇశ్రాయేలు కుమారుల సంఖ్య సముద్రపు ఇసుకవలె ఉండినను [ఆదికాండము 22:17 చూడు], శేషమే రక్షింపబడునని" యెషయాయు ఇశ్రాయేలును గూర్చి బిగ్గరగా పలుకుచున్నాడు (రోమా 9:27, 28; యెషయా 10:22, 23 చూడు).

ఈ లేఖన భాగంలో కీలకమైన పదం "శేషము" (*hupoleimma*) "చిన్న సంఖ్యను" సూచిస్తుంది.[14] యెషయా 10:22, 23 సందర్భాన్ని నీవు చదివావంటే, చెరలోనుండి

కనానుకు చేరుకునే శేషమును గూర్చి ప్రవక్త మాట్లాడుతున్నట్టు నీవు గమనించగలవు. మరల, పౌలు దైవ ప్రేరేపితమైన వర్తింపు చేస్తున్నాడు. పాత నిబంధనలో, యూదా యొక్క శేషమే చెరనుండి రక్షింపబడింది. ఇశ్రాయేలు యొక్క శేషమే క్రొత్త నిబంధన యుగంలో రక్షింపబడిందంటే ఆశ్చర్యపడనక్కర లేదు.

"శేషము" యొక్క సందేశం రెండు విధాలు. మొదట, కేవలం శేషం మాత్రమే రక్షింపబడుతుందనే వార్త విషాదకరమైనది. రెండవది, శేషమైనా రక్షింపబడుతుందనేది శుభవార్త కూడా (రోమా 11:5 చూడు). ఇశ్రాయేలీయులందరు నిరాకరింపబడలేదు. యెషయానుండి కోట్ చేస్తూ సందేశంలో రెండో భాగాన్ని పౌలు తెలియజేస్తున్నాడు: "మరియు యెషయా ముందు చెప్పిన ప్రకారము, 'సైన్యములకు అధిపతియగు **ప్రభువు,** [hosts[15]] మనకు సంతానము శేషింపచేయకపోయినయెడల సొదొమవలెనగుదుము, గొమొఱ్ఱాను పోలియుందుము' " (9:29; యెషయా 1:9 చూడు).

అష్షూరీయులు దేశంపై దండెత్తినప్పుడే, యూదాకును, యెరూషలేముకును ఇబ్బందిగానుండిన సమయాన్ని యెషయాలోని లేఖన భాగం సూచిస్తుంది. ముందు, దేవుడు సొదొమ, గొమొఱ్ఱాను భూతలమునుండి తుడిచివేశాడు (ఆదికాండము 19:24, 25 చూడు) – అవి ఎంత శుద్ధంగా తుడిచివేయబడ్డాయంటే, ఆ పట్టణాలు ఎక్కడ ఉండినవో కనీసం తెలిసికోలేని పరిస్థితి. అష్షూరు దండెత్తినప్పుడు, యూదులకు అలా సంభవించ లేదు. కాని శేషము విడిచిపెట్టబడింది, విత్తనాలు మొలకెత్త విడిచిపెట్టబడ్డాయి. ఆలాగే, పౌలు దినాల్లో సహ దేవునికి ఆయన శేషం ఇశ్రాయేలులో ఉంది – పౌలువలె యేసును మెస్సీయగా అంగీకరించిన యూదులు (11:1 చూడు). ఈ జనుల ద్వారా దేవుడు తన ఉద్దేశాలను నెరవేర్చుకుంటాడు.

## ముగింపు

దేవుడు ఇశ్రాయేలీయులతో శతాబ్దాల తరబడి పని చేశాడు. అలాటప్పుడు, దేవుని సంకల్పములో ఇశ్రాయేలులో కేవలం శేషమే మిగిలియుండడానికి హేతువేమి? తన పత్రికలోని తరువాత భాగంలో పౌలు ఆ ప్రశ్నకు జవాబు యిచ్చాడు.

ఈ పాఠంలో, కొందరిని ఏర్పరచుకొనడం, కొందరిని నిరాకరించడంలోని దేవుని న్యాయాన్ని చర్చించాం. పౌలు చర్చించిన ప్రత్యేకమైన సమస్యలు నేటికి సంబంధించినవి కాకపోయినా, దేవుడు న్యాయవంతుడనే ఈ సత్యం నీ మనస్సులో ముద్రించబడిందని నేను నిరీక్షిస్తున్నాను: ఆయన న్యాయవంతుడు; ఆయన తీర్పు తీర్చువాడు; ఆయన నీతిపరుడు. దేవుడు న్యాయవంతుడు కాదని ఎవడైనా చెప్పబూనుకొన్నప్పుడు, అతడు దేవుని గూర్చి గాక తన్నుగూర్చియే అధికంగా చెప్పుకొంటున్నాడు. అతడు తన సొంత విషయ పరిజ్ఞాన లేమిని, అవిశ్వాసాన్ని బయటపెట్టుకున్నవాడైయుంటాడు.

ఏదియెలాగున్నా, దేవుడు న్యాయవంతుడని మన మూల వాక్యము ప్రకటించుట మాత్రమే గాక, ఆయన కనికరము గలవాడని కూడ అది ప్రకటిస్తుంది. అధ్యాయాలు 9నుండి 11ల్లో "కీలక పదం," "కనికరము"[16] అని అభిప్రాయపడ్డాడు. ఈ పదం యొక్క నామవాచకం, క్రియావాచక రూపాలు ఈ అధ్యాయాల్లో 9 సార్లు కన్పిస్తాయి.

ఈ పత్రికలోని మిగిలిన అధ్యాయాల్లో ఒకదానిలో ఒకటి మాత్రమే కన్పిస్తుంది.[17] దేవుడు న్యాయవంతుడు గనుక నేనాయనకు కృతజ్ఞుడనైయున్నాను. కాని ఆయన కనికరము గలవాడు కూడా అయ్యున్నందున నా హృదయమంతటితో ఆనందిస్తున్నాను. ఇది వాస్తవమైనందున, నేను శాశ్వతంగా రక్షింపబడతాననే నిరీక్షణ నాకుంది!

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

ఈ పాఠం ఉపయోగించినప్పుడు, దేవుని కనికరముపైన ముగింపు – విధేయతతో కూడిన విశ్వాసంతో దేవుని కనికరాన్ని ఎలా సద్వినియోగం చేసికోవాలో ఆ చర్చకు నడిపించవచ్చు.

మన మూల వాక్యంలో ఆ యా చోట్ల ఆగి నీ శ్రోతలకు వ్యక్తిగతంగా వర్తింప జేయవచ్చు. దీనిలోని భాగాలు తీసికొని కూడ అంశ పాఠాలుగా ఉపయోగించ గోరవచ్చు. ఉదాహరణకు, కనికరము అనే చర్చనీయాంశం 15, 16, మరియు 18 వచనాలలో ప్రత్యేకంగా చూపవచ్చు.

దేవునివైపు తిరిగి ప్రజలు మాట్లాడటం వర్తింపుకు, చర్చకు నడిపించేది (20 వచనం). నేడు, "నన్నెందుకు యిలా చేశావు?" అని కొందరు అడుగుతారు. భౌతికంగా, మానసికంగా, ఉద్వేగంగా మనం చేయబడిన విధానం మనపై పరిమితులను విధిస్తుంది. మనకు ఏమి సంభవించినా ప్రశ్నించడం ఎప్పుడు సరియైనది, ఎప్పుడు తప్పో అనే చర్చను వచనం 20 ప్రవేశపెడుతుంది. Walter W. Wessel యిలా రాశాడు, "నరుడు దేవుని ఏ ప్రశ్నయు అడుగకుండ పౌలు నోరు మూయించడం లేదు, కాని మారుమనస్సు లేని, దేవుని ధిక్కరించు స్వభావం గలవారితో, తాను చేసేదానికి దేవుని జవాబుదారిగా చేయగోరి, వారి ప్రశ్నలవలన దేవుని శీలాన్ని అవమానం చేసేవారిని గూర్చి పౌలు మాట్లాడాడు."[18] "దేవుని గ్రహింపగల మానవ సామర్థ్యాన్ని మించి దేవునియందు నమ్మికయుంచడానికి నరుడు పిలువబడ్డాడు. దేవుని చర్యలకు హేతుబద్ధంగా వివరించే ప్రయత్నాలు భ్రష్టత్వపు భక్తిహీనులకు సంబంధించినవి, దేవుని కార్యములు మానవ హేతువుకు అంగీకారంగా చేయాలనే వాంఛ ఆలాటివారికి కలుగుతుంది" అని Richard Batey గుర్తించాడు.[19]

---

సూచనలు

[1]ఈ లేఖన భాగంలో, "కనికరించు" (*eleeo*) "దయగలిగియుండు" (*oikteiro*), అనేవి దాదాపు పర్యాయ పదాలుగా ఉపయోగించ లేదు. [2]ఈ మాటలు అసలు ఫరోచే పలుకబడ్డాయి (నిర్గమకాండము 9:13, 16), కాని తరువాత అవి భవిష్యత్ తరాల ప్రయోజనం కొరకు లిఖించబడ్డాయి. [3]ఫరో హృదయాన్ని కఠినపరచడం, అరణ్యంలో ఇశ్రాయేలీయులను కనికరించడం తన సంకల్పాన్ని కొనసాగించేవే గాని, కొందరిని బలవంతంగా నరకానికి పంపడం, కొందరిని పరలోకం పంపడానికి సంబంధించినవి కావు. [4]ఈ నోట్ NASBలోని నా ప్రతిలో ఉంది. [5]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 311. [6]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.:

Wm. B. Eerdmans Publishing Co., 1988), 361. [7]*Anthropos* అనేది "మనిషి" ఆడ కావచ్చు, మగ కావచ్చు. [8]మరల, పౌలు ఉదాహరణ పనిమీద కేంద్రీకరింపబడిందే గాని, నిత్యత్వం మీద కాదు. [9]"నాశనము కొరకు" ఈ ఘటములను "సిద్ధపరచినది" ఎవరు అనే దానిమీద పండితులు చర్చించారు: వ్యక్తులు తమకు తామే, దేవుడు, సాతాను లేక ఎవరు? వచనం 23లో దేవుడు మహిమకొరకు పాత్రలను సిద్ధపరచుతున్నట్టు మాట్లాడబడినందున, వచనం 22లో దేవుని చర్యయే పౌలు మనస్సులో కూడ ఉండియుండవచ్చు. ఆ యా సంగతుల కలయిక ఉంటుందని మనం అర్థం చేసికుంటాం. వ్యక్తులే తమ జీవితాలవలన పరలోకానికో, నరకానికో సిద్ధపడతారు. [10]దేవుని భవిష్యత్ జ్ఞానం మీద నోట్సు రోమా పుస్తకం 3లో "ఆయన సంకల్పము చొప్పున (8:29, 30)" అనే పాఠంలో చూడు.

[11]పౌలు రోమీయులకు వ్రాసే కాలంలో సంఘమందు యూదులకంటెను అన్యజనులే ఎక్కువమంది ఉన్నారు. అనేకమంది యూదులు అంగీకరింపకపోగా ఆ అన్యజనులు యేసును అంగీకరించారు. [12]"Hosea" అనడానికి బదులు "Osee" అనియు (25 వచనం), "Isaiah" కు బదులుగా "Esaias" (27, 29 వచనాలు) అని KJVలో ఉంది. ఈ ప్రవక్తల గ్రీకు రూపాన్ని KJV ప్రదర్శించింది. [13]తాను ఏమి చేస్తానని చెప్తాడో దాన్ని చేసేవాడు దేవుడు – మరియు ఆయన దాని విషయంలో జాగు చేయడు – యెషయా 10:23 అంటే అదే అర్థమౌతుంది. [14]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 522-23. [15]Do not confuse "Sabaoth" with "Sabbath." "Sabaoth" means "hosts," referring to *armies* (McCord). The NIV translates the phrase "the Lord Almighty." [16]C. E. B. Cranfield, *Romans: A Shorter Commentary* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 215. For other references to God's mercy, see Romans 11:30-32. [17]Morris, 345. [18]Walter W. Wessel, notes on Romans, *The NIV Study Bible,* ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 1720. [19]Richard A. Batey, *The Letter of Paul to the Romans,* The Living Word Commentary (Austin, Tex.: R. B. Sweet Co., 1969), 127.

## "ముందుగా సిద్ధపరచబడెనా"?

కొందరు వ్యక్తులు ఆయన కనికరాన్ని పొందడానికి దేవుడు ముందుగా తీర్మానించాడని, ఆ వ్యక్తులు ఏమి చేసినాసరే, ఆ నిర్ణయము మార్చబడదని, రోమా 9:23లోని "ముందుగా సిద్ధపరచబడిన" అనే ప్రయోగాన్ని కొందరు అర్థం చేసికొన్నారు. "నాశనమునకు సిద్ధపడి ఉగ్రతా పాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘశాంతముతో సహించినట్లు" రోమా 9:22ను గమనించు. దేవుని దీర్ఘ శాంతంలో గుప్తమైయున్న దేవుని ఉద్దేశము వీరికి మార్పు పొందునట్లు ఒక అవకాశం యివ్వడమే – నాశనమునకు కాక మహిమకు సిద్ధపడు పాత్రలగునట్లు చేయడం. నాశనంకొరకు సిద్ధమైన పాత్ర మహిమకొరకు సిద్ధపడిన పాత్రగా మారగలిగితే, అప్పుడు మహిమకొరకు సిద్ధపరచబడిన పాత్ర నాశనమునకు సిద్ధపరచబడిన పాత్రగా మారగలదు. సర్వాధికారపు దేవుని చర్యలు మానవ స్వేచ్ఛా చిత్తాన్ని రద్దుపరచవు. చిట్టచివరిది, ఏదో ఒక గుంపుతో స్నేహం కలిగియుండడానికి మనలో ప్రతి ఒక్కరం ఒక నిశ్చయానికి వస్తాం: అంటే మహిమకు సిద్ధపరచబడిన పాత్రలగానో నాశనమునకు సిద్ధపడిన పాత్రలగానో.

## 46

# ఎవరిని నిందించాలి?

## (9:30-10:13)

తమ పతనాలకు, ఓటమికి యితరులను నిందించుతుంటారు. ఆదాము, హవ్వలు దేవునికి అవిధేయులైనప్పుడు, ఆదాము తన భార్యయైన హవ్వను నిందించాడు, హవ్వ సర్పాన్ని నిందించింది (ఆదికాండము 3:12, 13). "బాధ్యత" అనేది "తన పొరుగువాని భుజాలమీదికి సులభంగా మార్చగల విడదీయబడు భారమైయున్నదని" నిర్వచింపబడింది.[1] వారు సరియైనదాని చేయుటలో తప్పిపోయినప్పుడు, అనేకులు తమను తప్ప ఎవనినైనా, దేనినైనా నిందిస్తారు. "అది నా తల్లిదండ్రుల తప్పు." "అది నా భార్య/భర్త తప్పు." "అది సమాజం తప్పు." "ఇతర పిల్లలకున్న ఆధిక్యతలు నాకు లేవు." "అది నాకు జబ్బు వచ్చినందువలన."

నేరాన్ని యితరులమీదికి నెట్టడానికి నేను ఆలోచిస్తుండగా (మా తల్లిదండ్రుల యింట నివసించిన) యిద్దరు కుర్రాళ్ళు నా మనసులో మెదిలారు. "అతడు చేశాడు"; "లేదు, అతడు చేశాడు" అని అరుస్తూ ఒకనివైపు ఒకడు చూపించుకొంటున్నారు. ఒక తల్లి తన కుమారునికి బుద్ధి చెప్పినదాన్ని గూర్చి నేను చదివాను, "పిల్లి తోకను లాగడం ఆపు!" దానికి ఆ బాలుడు యిలా జవాబిచ్చాడు, "నేను పిల్లి తోకను లాగడం లేదు. నేను ఊరకనే దాన్ని పట్టుకున్నా; వాడే ఈ లాగుడంతా చేస్తుంది" అని బదులిచ్చాడట.[2]

అన్యజనులు కొందరిని అంగీకరింపగా, అనేకమంది యూదులను దేవుడు విడనాడడంలో నిందుతులెవరు? అనే ప్రశ్న ఈ మూల వాక్యంలో చర్చించబడింది. రోమా 9:14-29లో, దేవుడు న్యాయవంతుడనే సత్యాన్ని స్థాపించాడు. అది సత్యమైయున్నందున, యూదుల ఎటూ తోచని స్థితికి దేవుడు బాధ్యుడైయుండరు. అప్పుడు నిందితులెవరు? దాన్ని అంగీకరించడానికి యూదులు యిష్టపడరు కాని, తమను తప్ప యింకెవరిని నిందించాలో యూదులకు తెలియకుంది.

9:30లో దేవుని సర్వాధిపత్యంనుండి మానవ బాధ్యతవైపుకు తన దృష్టిని మళ్లించాడు. ఒకదానికొకటి పరస్పర వైరుధ్యంగా కన్పించే ఈ రెండు సిద్ధాంతాలకు సంబంధించి R. B. Kuiper యిలా అన్నాడు,

> పై కప్పులోని రెండు రంధ్రాల ద్వారా గిలక మీదుగా వెళ్లిన రెండు త్రాళ్లకు నేను ఆ రెండింటిని పోల్చుతాను. నేను వాటిచే సహాయపడగోరితే, నేను ఆ రెండింటిని ఆనుకోవాలి. నేను ఒకదాన్ని మాత్రమే ఆనుకొంటే రెండవ దానిని ఆనుకోకపోతే, నేను క్రిందికి వెళ్లతాను.

> ... చిన్న బిడ్డవంటి నమ్మికవలె, నేను రెండు త్రాళ్లను సంపూర్ణ నమ్మికతో ఆనుకుంటాను. నిత్యత్వంలో సత్యం యొక్క రెండు పోగులు ఒకే ముక్కయై యున్నట్టు నేను చూస్తాను.[3]

పాఠాల్లో మనం గుర్తించినట్టు ఈ రెండు సిద్ధాంతాలను సమాధానపరచడానికి పౌలు ఏ విధమైన ప్రయత్నమూ చేయలేదు, కాని ఆ రెండింటిని అతడు స్థిరంగా నమ్మాడు. 9:30–10:21లో, అతని ముఖ్యాంశం మానవ బాధ్యత. అనేకులైన యూదులు దేవునిచే ఎందుకు నిరాకరింపబడ్డారో అతడు చర్చించాడు.

## యూదులు అలక్ష్యం చేసిన మార్గం (9:30-33)

**నిజ స్థితి (30, 31 వచనాలు)**

"అట్లయితే మనమేమందుము?" అంటూ పౌలు ఆరంభించాడు (30ఎ వచనం). అంటే, "యూదులు నిరాకరింపబడిన విషయాన్ని గూర్చి యింకా ఏమి చెప్పాలి?" అని అతడు అడుగుతున్నాడు. పౌలు యింకా చెప్పవలసినది ఏముంది? యేసునందు విశ్వాస ముంచినందువలన అన్యజనులు అంగీకరింపబడ్డారనేదే తాను నొక్కి చెప్పుతున్నాడు. "నీతిని వెంటాడని అన్యజనులు నీతిని, అనగా విశ్వాసమూలమైన నీతిని పొందిరి" (30బి వచనం).

వచనాలు 30, 31లో, "నీతి" అనేది దేవునిచే సరిగా ఉన్నట్టు లెక్కించబడడానికి సూచింపబడింది. "విశ్వాసమూలమైన నీతి" – విశ్వాసపు ఆధారం మీద దేవునితో సరియైన స్థితిలో నిలిచియుండుట. తిరిగి పౌలు ఈ పత్రిక యొక్క ప్రధాన చర్చ నీయాంశాన్ని చెప్పాడు, అది మన క్రియలను బట్టి కాదు. 9:1–29లో, తాను యిష్టపడిన ఎవరినైనా ఏర్పరచుకొనడానికి దేవునికి హక్కు ఉందని పౌలు స్థాపించాడు. దేవుడు చేసికొన్న ఏర్పాటు విశ్వాసులను – యేసుక్రీస్తునందు విశ్వాసముంచినవారిని ఏర్పరచు కొనడం అనే విషయాన్ని యిక్కడ అతడు తన పాఠకులకు గుర్తు చేస్తున్నాడు.

అన్యజనులు దేవుని నీతిని "వెంటాడలేదు." "వెంటాడుట" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం (*dioko*) "మనఃపూర్వకమైన ప్రయాసను"[4] సూచిస్తుంది. దేవునితో సరియైన స్థితి కొరకు అన్యజనులు "మనఃపూర్వకముగా ప్రయాసపడలేదనేది" నిజ స్థితికంటె తక్కువగా చెప్పుటయై ఉంది. మినహాయింపులు ఉన్నప్పటికిని, మొత్తం మీద అన్యజనులు అవినీతిపరులు, విగ్రహారాధన చుట్టు జీవితాలు నిర్మించుకున్నవారు (1:18–32 చూడు). ఆత్మ సంబంధమైన విషయాలలో అల్పమైన ఆసక్తిగల అన్యజనులు దేవునితో సరియైన స్థితిని ఎలా పొందగలుగుతారు? సువార్తను వినడంవలన, ఆ అన్యజనులు తమ పాపముల విషయమై ఒప్పింపబడినవారై ప్రభువువైపు విశ్వాసము, విధేయతలతో తిరిగారు.

అన్యజనులకు భిన్నంగా, "ఇశ్రాయేలు నీతికారణమైన నియమమును వెంటాడినను ఆ నియమమును అందుకొనలేదు" (9:31). ఈ వచనములో "నియమము" అని పౌలు మనస్సులో ఉన్నదాని విషయంలో ఏకీభావము లేదు. మోషే ధర్మశాస్త్రమని కొందరు;

సాధారణంగా, ఏదో యొక నియమమని మరికొందరు; ప్రాథమిక సూత్రమని[5] యితరులు అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతానికి, "నియమము" అనేదాన్ని గూర్చి ఆందోళన చెందకుండ అన్యజనులవలె కాక నీతిని పొందాలని చురుకుగా ప్రయాసపడిన యూదులు అనే దానిమీద మన దృష్టిని కేంద్రీకరించుదాం. వారు తమ ఆచార క్రియలను జరిగించారు. వారు తమ కర్మకాండను కొనసాగించారు. మతపరమైన పారంపర్యముల విషయంలో వారు తీవ్రంగా ఉన్నారు. వారు సబ్బాతును, పండుగ దినాలను ఆచరించారు. వారు యెరూషలేమునకు నియమింపబడిన ప్రయాణాలను చేశారు. అయినా, కోరుకున్న తమ గమ్యాన్ని చేరలేకపోయారు.

**కారణం (32ఎ వచనం)**

"వారెందుకు అందుకొనలేదు? వారు విశ్వాసమూలముగా కాక క్రియల మూలముగా నైనట్టు దానిని వెంటాడిరి" (32ఎ వచనం). ఇప్పుడు మనము "నియమము" అనే మాట కొరకు సిద్ధంగా ఉన్నాం. ధర్మశాస్త్రాన్ని అనుసరించడంవలన, ఫలాని పనులు చేయడంవలన నీతిని పొందవచ్చునని యూదులు తలంచారు. సువార్త ప్రకటింపబడినప్పుడు, రక్షణ అవసరతలో ఉన్న పాపులని పరోక్షంగా సూచింపబడ డంవలన, వారు అవమానపరచబడ్డారు. వారు యేసును నిరాకరించారు సరిగదా ఆయన సిలువ మరణంచేత అభ్యంతరపరచబడ్డారు. వారు నీతిని వెంటాడిన మాట వాస్తవమే గాని, తప్పు దిశగుండా వారు పయనించారు. అందువలన వారు దాన్ని అందుకోలేకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. తూర్పుననున్న నీ గమ్యాన్ని చేరగోరి పశ్చిమ దిశగా పయనించితే, నీవు పయనించిన ప్రతి మైలు గమ్యంనుండి నిన్ను దూరం చేస్తుందే గాని దగ్గరకు తీసికొనిరాదు గదా.

**ఫలితం (32బి, 33 వచనాలు)**

దేవుడు తమ కొరకు ఏర్పరచిన మార్గాన్ని యూదులు వెంటాడియుండినట్టయితే, వారు యేసును మెస్సీయగా అంగీకరించియుండేవారే. వారు అలా అంగీకరించని కారణాన, "వారు అడ్డు రాయి తగిలి, తొట్రుపడిరి" (33బి వచనం; యెషయా 8:13-15 చూడు). "తొట్రుపడిరి" అనేది *proskopto* నుండి తర్జుమా చేయబడింది. "ఎదురు తట్టుకొనుట," మరియు "తొట్రుపాటుకు వాడబడింది" అని అర్థం.[6]

"తొట్రిల్లుటకు అడ్డు రాయి" యేసు (1 పేతురు 2:8 చూడు[7]). కీర్తన రచయిత యిలా అన్నాడు, "ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను" (కీర్తనలు 118:22). ఈ లేఖన భాగాన్ని క్రొత్త నిబంధన లేఖకులు వక్తలు ప్రభువైన యేసుకు వర్తింపజేశారు (మార్కు 12:10; అపొస్తలుల కార్యములు 4:11లను చూడు).

ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి అడ్డురాయి ఆయెననే పోలిక భవన నిర్మాణం చేసే పనివారిని గుర్తుచేస్తుంది. శిల్పకారుని పునాది గీతలను అలక్ష్యం చేసి, ఆ కట్టడం ఎలాగుండాలని తాము కోరుకుంటారో వారు అలా నిర్మించుకుంటారు. తత్ ఫలితంగా,

మూలరాయి వారికి అప్పగింపబడినప్పుడు, అది తృణీకరింపబడింది పని జరుగుతున్న చోట అది విడిచిపెట్టబడింది. వారు ఏర్పరచుకొన్న ప్లాను ప్రకారం వారు కట్టుతూ పనివారు అటు యిటు హడావిడిగా తిరుగుతున్నప్పుడు, తృణీకరింపబడిన రాయి వారికి తగిలి పడిపోతున్నారు. అందువలన, కట్టడానికి కీలక ఆధారం అవడానికి బదులు, ఆ రాయి సంకట హేతువుగాను, కోపము రేపునది గాను భావించబడింది.

యేసు ప్రత్యక్షమైనప్పుడు, యూదులు మెస్సీయాను గూర్చి ముందుగా చేసిన ఆలోచనలకు ఆయన "సరిపడ" లేదు. ఆయన రాజ వస్త్రాలు ధరించలేదు. భూ సంబంధమైన రాజుగా చేయబడడానికి ఆయన నిరాకరించారు (యోహాను 6:15). రోమీయులను పాలస్తీనానుండి తోలివేయడానికి ఆయన బలమైన సైన్యాన్ని సమకూర్చలేదు (యోహాను 18:36 చూడు). మెస్సీయ కొరకు యూదులు కల్పించిన రాతిలోని గోడవంటి ఖాళీకి యేసు సరిపోనందున, వారు ఆయనను నిరాకరించారు. తత్ ఫలితంగా, యేసు వారికి సంకట హేతువుగాను, కోపము పుట్టించు అభ్యంతర కారణంగాను మారిపోయారు. వారాయనను చంపి తొలగించుకొన చూచారు.

యేసు నిజంగా మెస్సీయయే అయ్యుంటే ఆయన తప్పక ఇశ్రాయేలుచేత అంగీ-కరింప బడియుండేవాడే అనేది వారి ఆక్షేపణయై ఉండవచ్చు కూడ. ఏదియెలాగున్నా, మెస్సీయ ఇశ్రాయేలుచే నిరాకరింపబడతాడని ప్రవక్తలు ముందుగా తెలియజేశారు. యెషయా గ్రంథంనుండి పౌలు కోట్ చేస్తూ, 28:16తో 8:14 మిళితం చేస్తున్నాడు. రోమా 9:33 యిలా ఆరంభమౌతుంది, "ఇదిగో 'నేను అడ్డురాతిని [యెషయా 28:16ఎ] అడ్డుబండను సీయోనులో (యెరూషలేము) స్థాపించుచున్నాను' [యెషయా 8:14బి]." "అడ్డు" అనేది *skandalon* అనే గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడింది. దీనినుండి మనకు "scandal" మరియు "scandalous" అనే పదాలు వచ్చాయి.

> *skandalon* అనేది ఆదిలో బోనునందు ఎర తగిలించే భాగానికి పేరైయుండేది.
> …
> … [క్రొత్త నిబంధనలో] *skandalon* అనేది ఎల్లప్పుడు రూపకాలంకారముగా ఉపయోగింపబడుతుంది, మరియు సాధారణంగా పరపక్ష ద్వేషాన్ని రేపే దేనికైనా సాధారణంగా లేదా యితరులకు ఉండేది, లేక వారు పడిపోయేలా చేసేది. …[8]

"వారిని పడద్రోసిన రాయి" అని NCVలో ఉంది.

యూదులకు, యేసు విషయమై ప్రధాన అభ్యంతరము ఆయన ఒక సాధారణమైన నేరస్థుడైయున్నట్టు సిలువ వేయబడ్డాడన్న వాస్తవమే. "అయితే మేము సిలువవేయ బడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. ఆయన యూదులకు ఆటంకముగాను … ఉన్నాడు" అని పౌలు కొరింథీయులకు తెలిపాడు (1 కొరింథీయులకు 1:23). "సిలువ విషయమైన అభ్యంతరమును" గలతీయులకు 5:11లో అతడు సూచించాడు. యూదులకు సంబంధించినంతమట్టుకు, సిలువ మీద మరణించడం జరుగకూడని సంగతియైయుంది!

ఇశ్రాయేలులో అనేకులు యేసును నిరాకరిస్తారని దేవునికి తెలుసు, అయితే

కొందరు ఆయనను అంగీకరిస్తారని కూడ ఆయన ఎదురు చూచాడు. ఈ హేతువునుబట్టి, "ఆయనయందు విశ్వాసముంచువాడు సిగ్గుపరచబడడు" అని యెషయా (ముందు మాటలతో) చేర్చాడు (రోమా 9:33బి; యెషయా 28:16బి చూడు). "సిగ్గుపరచబడడు" అనే పదం *kataischuno*నుండి వచ్చింది, (*aischuno*) అనేది "సిగ్గుపరచబడడం" దానికి ముందు *kata*[9] చేర్చబడింది. తీర్పు దినాన ఒకడు ప్రభువుచే నిరాకరింపబడినప్పుడు, అవమానపరచబడడాన్ని యిది సూచిస్తుంది. యేసు యిలా అన్నారు, "నన్నుగూర్చియు నా మాటలనుగూర్చియు సిగ్గుపడువాడెవడో, వానినిగూర్చి మనుష్యకుమారుడు తన తండ్రి మహిమగలవాడై పరిశుద్ధ దూతలతో కూడ వచ్చునప్పుడు సిగ్గుపడును" (మార్కు 8:38). ఏదియెలాగున్నా, యేసునందు విశ్వసించినవాడు – యూదుడైనా, అన్యజనుడైనా – సిగ్గుపరచబడడు. నిరీక్షణ మీద తన ఆలోచనా సరళిని దీనితో ముగిస్తున్నాడు.

## యూదులు పయనించిన మార్గము (10:1-8ఎ)

సరియైన మార్గాన్ని వారు అలక్ష్యం చేసి (9:31, 32) తప్పు మార్గాన వెళ్లడమందు వారు పట్టువీడక ఉన్నందున (32ఎ వచనం), వారు దేవునిచే నిరాకరింపబడినందుకు తమను తప్ప యూదులు మరెవ్వరిని నిందించ నవసరం లేదు. అధ్యాయం 10 మొదటి భాగంలో, జనులు వెళ్లగల రెండు మార్గాల వ్యత్యాసాన్ని కనుపరచాడు. అలా చేయడంలో, యూదులు తప్పు మార్గాన్ని ఎన్నుకున్నట్టు అతడు నొక్కి చెప్పాడు.

### పౌలు యొక్క మనో భావం (1వ వచనం)

తన స్వదేశీయుల పట్ల పౌలు తన ప్రేమను, అక్కరను 10:1లో మరోసారి స్థిరపరుస్తున్నాడు (9:1–3తో పోల్చి చూడు). "సహోదరులారా, ఇశ్రాయేలీయులు రక్షణ పొందవలెనని నా హృదయాభిలాషయు, వారి విషయమై నేను దేవునికి చేయు ప్రార్థనయునై యున్నది." ఈ వచనంలో "సహోదరులారా" అనేది క్రైస్తవులను, "వారి" అనేది యూదులను సూచిస్తున్నాయి (NIV చూడు). పౌలు అక్కర కలిగియున్నాడు – గాఢంగా అక్కర కలిగియున్నాడు – యూదుల యొక్క నశించిన స్థితిని గూర్చి. అతడు వారి "రక్షణను గూర్చి" ప్రార్థిస్తున్నాడు: యేసును గూర్చిన సత్యాన్ని అంగీకరించేవారైయున్నట్టు. "నా హృదయాంతరాళంనుంచి ఇశ్రాయేలీయులు రక్షింపబడాలని కోరి దేవునికి ప్రార్థిస్తున్నానని" Phillips అంటుంది. మన చుట్టూ నివసించుతూ నశించినవారి పట్ల, నశించిన లోకం పట్ల మనకు అట్టి అక్కర ఉన్నదా? మనం వారి కొరకు ప్రార్థిస్తున్నామా?

### యూదుల సమస్య (2–4 వచనాలు)

"వారు (యూదులు) దేవునియందు ఆసక్తిగలవారని వారినిగూర్చి సాక్ష్యమిచ్చు చున్నాను; అయినను వారి ఆసక్తి జ్ఞానానుసారమైనది కాదు" (2 వచనం). "నేను సాక్ష్యమిచ్చుచున్నాను" అనేది *martureo*నుండి వచ్చింది, అంటే "నేను సాక్ష్యం చెప్పుతున్నాను" అని అర్థం.[10] "స్వయంగా తనకు కలిగిన జ్ఞానాన్ని ఆధారం చేసికొని[11]

సాక్ష్యమివ్వడం." ఈ విషయంలో పౌలుకు తన సొంత జీవిత అనుభవమే ఉంది. "నేను కిలికియలోని తార్సులో పుట్టిన యూదుడను. అయితే ఈ పట్టణములో గమలీయేలు పాదములయొద్ద పెరిగి, మన పితరుల ధర్మశాస్త్రసంబంధమగు నిష్ఠయందు శిక్షితుడనై, మీరందరు నేడు ఉన్న ప్రకారము దేవుని గూర్చి ఆసక్తుడనైయుండి ..." (అపొస్తలుల కార్యములు 22:3 [నొక్కి చెప్పింది నాది]; గలతీయులకు 1:13, 14; ఫిలిప్పీయులకు 3:6 చూడు).

"ఆసక్తి" అనేది *zelos* అనే గ్రీకు పదంనుండి వచ్చింది. "ఉడుకుట" "వేడిగానుండుట" (*zeo*)[12] ఆయనకొరకు మనం "మండుతూ ఉండాలని" దేవుడు కోరుతున్నాడు. "నీవు [*zestos*] వెచ్చగానైనను చల్లగానైనను ఉండక, నులివెచ్చనగా ఉన్నావు గనుక నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయనుద్దేశించుచున్నాను" అని యేసు లవొదికయ సంఘానికి తెలిపారు (ప్రకటన 3:16). ఆయన రూకలు మార్చువారిని దేవాలయమునుండి వెళ్లగొట్టినప్పుడు, దేవుని యింటిని గూర్చిన ఆసక్తి ఆయనను "భక్షించుచున్నదని" చెప్పబడింది (యోహాను 2:17 చూడు).

ఏదియెలాగున్నా, ఆసక్తిని హద్దులో ఉంచుకోవలసియుంది. అదుపులో లేని అగ్ని ఎంతో వినాశనాకరంగా ఉంటుందన్నట్టు అదుపులో లేని ఆసక్తిని గూర్చి నేను తలంచు తాను. నేను మొదటి తరగతి చదువుతున్నప్పుడు యింటనుండి అగ్గిపెట్టె తీసికొని పోయి, మా యింటి ప్రక్కన ఉన్న ఒకదానికి ఆకస్మికంగా నిప్పు పెట్టాను. మా యిల్లును ఆ ప్రాంతంలోని ఆస్తియు తగలబడకుండ మా తండ్రియు, చుట్టునున్న వ్యవసాయదారులు ఎంతగా ప్రయాసపడ్డారో జ్ఞాపకం వస్తుంది.

ఆసక్తి అదుపులో ఉంచబడి సరియైన పంథాలో జ్ఞానంగా నడిపింపబడాలి. "తెలివిలేని ఆసక్తి మంచిది కాదు" (సామెతలు 19:2ఎ; NLT) అని జ్ఞాని అన్నాడు. రోమా 10:2లో, "జ్ఞానానుసారమైన" అనేది *epignosis*నుండి తర్జుమా చేయబడింది: "జ్ఞానము" (*gnosis*) అనేది (*epi*) అనేదానిచే బలపరచబడుతుంది. *Epignosis* " 'సరియైనా లేక పూర్తియైన తెలివిని' సూచిస్తుంది."[13] యూదులు పూర్ణమైన ఆసక్తి కలిగియున్నారు కాని వారు జ్ఞానమందు లోపం కలిగియున్నారు. వారు విషయం తెలియని ఆసక్తి కలిగియున్నారు (NEB). వారిది "తప్పుగా నడిపింపబడిన" ఆసక్తి (JB), "తప్పు త్రోవను నడచిన" ఆసక్తి (LB).

ఒకడు దేవుని ఆనందింపజేయాలంటే, కావలసినదంతా మతపరమైన ఆసక్తియేనని నేడు అనేకులు నమ్ముతారు. ప్రజాభిమాన నమ్మకం ఈ విధంగా వ్యక్తపరచబడుతుంది: "ఒకడు యథార్థంగాను నిష్కపటముగాను ఉన్నంత కాలం అతడు పరలోకానికి వెళ్లతాడు." ఇది నిజం కాదని రోమా 10:2 ప్రకటిస్తుంది. "నిష్కపటత ఒక్కటే చాలదు, ఎందుకంటే మనం నిష్కపటంగానే అపార్థం చేసికోవచ్చు."[14]

జ్ఞానము లేకయే ఆసక్తిగా ఉండే అనిశ్చయమైన స్థితి అనేక మార్గాలలో ఉదహరించ వచ్చు. కొంతమంది రచయితలు జ్ఞానాన్ని వెలుగుతో సమానం చేస్తారు (కీర్తన 119:105 చూడు). జ్ఞానం లేని ఆసక్తిపరుడు తానెక్కడికి వెళ్లుతున్నాడో ఆలోచన లేకుండ అంధకారం గుండా తాను పరుగెత్త గలిగినంత వేగముగా పరుగెత్తు

మనిషిని పోలియున్నాడు. నా మనస్సుకు తట్టే ఆలాటి ఉదాహరణ, కారు. ఆసక్తిని మోటారుకును, జ్ఞానాన్ని స్టీరింగుకును పోల్చవచ్చు. ఒక పాత కారు మైదానానికి అడ్డంగా శబ్దం చేసికొంటూ వెళ్లే కథ ఒకటుంది. ఒక మనిషి డ్రైవర్‌ని యిలా అడుగుతున్నాడు: "మనం ఎక్కడికి వెళ్లుతున్నాం." డ్రైవర్ జవాబిచ్చాడు: "నాకు తెలియదు, కాని మంచి సమయాన్ని గడుపుతున్నాం!"

యూదులు యిబ్బందిలో ఉన్నారు ఎందుకంటే వారు జ్ఞానం లేకుండ ఆసక్తి కలిగియున్నారు. జ్ఞానం కలిగి ఆసక్తి లేకుంటే కూడా అంతే చెడ్డ అనే సంగతిని మనం అర్థం చేసికోవాలి. ఆ రెండింటిలో ఏ స్థితియైనా దేవునికి అంగీకారం కానిదే.

జ్ఞానము లేని సంగతిని యూదులు నిరాకరించేవారేననుకో. చెప్పుకోదగినంత లేఖన భాగాన్ని వారు కోట్ చేయగలరు. "జ్ఞానము" అని రోమా 10:2లోని అర్థం "పూర్ణ జ్ఞానము." యూదులకు కొన్ని సంగతులు తెలుసు. కాని అతి ముఖ్యమైన విషయంలో వారు సంగతి తెలియనివారైయున్నారు. వచనం 3 యిలా ఆరంభిస్తుంది, "వారు దేవుని నీతినెరుగక." యిక్కడ "దేవుని నీతి" దేవుని శీలాన్ని గూర్చి సూచించడం లేదు; మనుష్యులను నీతిమంతులుగా ఎంచే ఆయన ఏర్పాటుకు సంబంధించినదైయుంది. వేరుగా చెప్పాలంటే, అది కృప/విశ్వాస నియమాన్ని సూచించునదైయుంది. ఈ విషయంలో యూదులు కావాలని సంగతి ఎరుగకున్నారు ఎందుకంటే వారు ఏర్పరచుకున్న ధర్మశాస్త్రము/క్రియలు అనేదానితో యిది సంఘర్షణ పడుతుంది.

పౌలు యిలా అన్నాడు, "వారు దేవుని నీతినెరుగక తమ స్వనీతిని స్థాపింప బూనుకొనుచు దేవుని నీతికి లోబడలేదు" (3ఎ, బి వచనం). అపొస్తలుడు తిరిగి వ్యక్తిగతమైన అనుభవంనుండి మాట్లాడుతున్నాడు. ఫిలిప్పీయులకు 3లో, క్రీస్తుకొరకు తాను ఏమి వదలుకొన్నాడో అతడు పేర్కొన్నాడు. "క్రీస్తును సంపాదించుకొని, ధర్మశాస్త్ర మూలమైన నా నీతిని గాక, క్రీస్తునందలి విశ్వాసమువలననైన నీతి అనగా విశ్వాసమును బట్టి దేవుడు అనుగ్రహించు నీతిగలవాడనై ఆయనయందు అగుపడు నిమిత్తము" (9 వచనం; నొక్కి చెప్పింది నాది).

పౌలు యూదుని గూర్చి ఏమి చెప్పాడో సాధారణంగా మానవ జాతిని గూర్చి అదే చెప్పాడు: దేవుని మార్గంతో తృప్తిచెందక, పరలోకానికి వెళ్లడానికి మనుష్యులు తమ సొంత పద్ధతులను స్థాపించుకున్నారు.[15] "నేను నా మార్గంలో చేశాను" అనేది అనేకుల యిష్టమైన "గీతం."[16] మన మార్గంలో కాకుండ తన మార్గంలో సాధించుకొనడానికి దేవుడు మనకు సహాయము చేయును గాక!

నీతిమంతులుగా లెక్కింపబడడానికి యూదులు ధర్మశాస్త్రాన్ని ఆచరించడం మీద ఆధారపడ్డారు. తరువాత రెండు వచనాలలో పౌలు ఈ అవకాశాన్ని ఉదహరించాడు. వచనం 4 యిలా అంటుంది, "విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రము నకు సమాప్తియైయున్నాడు." "సమాప్తి" అనేది *telos*నుండి తర్జుమా చేయబడింది, ఈ పదానికి వీలైన పలు అర్థాలున్నాయి. "అంతము" అనే భావంతో NASBలో సూచింప బడింది; కాని "గమ్యము" అనే అర్థం కూడా నా NASB ప్రతిలో మధ్య నోట్‌లో ఉంది. అనేక తర్జుమాల్లో "అంతము" లేక దానికి సమానమైన పదం వాడబడింది (NASB;

NIV; RSV; NEB; JB; NCV; TEV), కాని కొన్ని తర్జుమాలు "గమ్యము" లేక దానికి సమానమైన పదాన్ని వాడాయి (CJB; McCord).

మోషే ధర్మశాస్త్రంతో ఏ నిర్వచనమైనా సత్యమే. వాస్తవానికి రెండును ఒకదానిమీద ఒకటి పడుతుంది.[17] క్రీస్తు ధర్మశాస్త్రానికి "గమ్యమై" ఉన్నాడన్న దానికి సంబంధించి, గలతీయులకు 3లో, "క్రీస్తునొద్దకు నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను" అని పౌలు రాశాడు (24 వచనం). "విశ్వాసము వెల్లడి యాయెను గనుక మనము యికను బాలశిక్షకుని [ధర్మశాస్త్రం] క్రింద ఉండము" (25 వచనం) అని అతడు చేర్చాడు. క్రీస్తు రాకతో వచ్చిన ఒక ఫలితం తన ప్రజలకు దేవుని ప్రస్తుతపు ప్రత్యక్షతగా ధర్మశాస్త్రం "అంతమయ్యింది."[18] యూదులు ధర్మశాస్త్రాన్ని ఆశ్రయించడం మానివేసి, "ధర్మశాస్త్రమునకు అంతమైయున్న" యేసువైపుకు తిరగడాన్ని ఏ నిర్వచనమైనా ప్రకటిస్తుంది.

రోమా 10:4ను మనం విడిచిపెట్టక మునుపు మోషే ధర్మశాస్త్రాన్ని గూర్చి పౌలు కేవలం ఒక ప్రతిపాదన చేయకపోవచ్చు. "యూదుల సమస్యను" అతడు చర్చిస్తున్నందున, అతని మనస్సులో తప్పక మోషే ధర్మశాస్త్రం ప్రాథమికంగా ఉంటుంది. ఏదియెలాగున్నా, మనము సాధారణమైన వర్తింపును కూడ చేసికొనవచ్చు. ఎందుకంటే గ్రీకు మూల వాక్యంలో "law" అనేదానికి ముందు definite article లేదు. *Telos* అనేదానికి "అంతము," "సంపూర్తి" అని అర్థమిచ్చే పదాన్ని ఉపయోగించి ఆ వచనం యిలా చదివేలా మనం దాన్ని పెంచవచ్చు: "నీతిని పొంద ప్రయత్నించే సాధనంగా ధర్మశాస్త్రాన్ని ఆచరించడానికి క్రీస్తు అంతమైయున్నాడు [యేసునందు] విశ్వాసముంచిన ప్రతివానికి [యిది దేవునిచే అనుగ్రహింపబడినదైయుంది]."

**మోషే యొక్క ఉచ్చరింపులు (5-8ఎ వచనాలు)**

చట్టాన్ని అనుసరించడంవలన నీతిని పొందే ప్రయత్నంలో, ప్రాణాంతకమైన లోపమున్నట్టు వచనం 5లో పౌలు తిరిగి చూపడానికి మరలాడు. "ధర్మశాస్త్ర మూలమగు నీతిని నెరవేర్చువాడు దానివలననే జీవించునని మోషే వ్రాయుచున్నాడు" అని అతడు వ్రాశాడు (5 వచనం). లేవీయకాండము 18:5 పౌలు మనస్సులో ఉన్నట్టు తేటపడుతుంది. అక్కడ యెహోవా ఇశ్రాయేలీయులకు యిలా సెలవిచ్చాడు: "మీరు నా కట్టడలను నా విధులను ఆచరింపవలెను. వాటిని గైకొనువాడు వాటివలన బ్రదుకును." "బ్రదుకును" అని లేవీయకాండము 18:5లోను, "జీవించును" అని రోమా 10:5లోను ఉన్నవాటికి "జీవమును కనుగొనుము" అని అర్థం.[19] "ధర్మశాస్త్రమును ఆచరించువారు దానినుండి జీవమును పుచ్చుకొందురు" అని JB అంది.

తన విధులను, కట్టడలను వారు ఆచరించినట్టయితే, వారు జీవమును కనుగొందురని దేవుడు ఇశ్రాయేలీయులకు సెలవిచ్చాడు. జీవాన్ని కనుగొనడం అనేది మంచిగా వినిపిస్తుంది – అయితే సమస్య ఏమి? సమస్య ఏమంటే, ధర్మశాస్త్రాన్ని ఆచరించడంవలన జీవాన్ని పొందడమనేదే. చట్టాన్ని (ధర్మశాస్త్రాన్ని) పరిపూర్ణంగా ఆచరించాలి. (ధర్మశాస్త్రాన్ని అనుసరించడంలో తప్పిపోయినవాడు శాపగ్రస్థుడు

[ద్వితీయోపదేశకాండము 27:26; గలతీయులకు 3:12, 13 చూడు].) మోషే మాటలను CEV రోమా 10:5లో యిలా తర్జుమా చేస్తుంది: "నీవు జీవించగోరితే, ధర్మశాస్త్రం ఆజ్ఞాపించు సమస్తాన్ని నీవు చేయాలి" (నొక్కి చెప్పింది నాది). ఏదియెలాగున్నా, ఏ ఒక్కడును సమస్త ఆజ్ఞలను అన్నివేళలా నిష్కళంకంగా ఆచరించలేడు. ఈ హేతువును బట్టి, చట్టము/క్రియా విధానము ఆధారం చేసికొని నీతిని పొందడం అసాధ్యం.

దానికి భిన్నంగా, దేవుని కృప/విశ్వాస నియమమును ఆధారం చేసికొని నీతిని పొందడం సాధ్యమే. తరువాత కొన్ని వచనాల సందేశం అదే – ఆ సందేశం ఉపయోగించే పలుకులు మొదటి శతాబ్దపు యూదా పాఠకులకు పరిచయమైనవి మనకు పరిచయం లేనివైయున్నాయి.

వచనం 6 యిలా ఆరంభమౌతుంది, "అయితే విశ్వాస మూలమగు [కృప/విశ్వాస నియమం] నీతి [దేవునితో సరియైన స్థితి] యీలాగు చెప్పుచున్నది." ధర్మశాస్త్రము/క్రియలు నియమాన్ని గూర్చి మోషే మాట్లాడినదానిని పౌలు యిప్పుడే సూచించాడు (5 వచనం). కృప/విశ్వాస నియమానికి వక్తగా యిప్పుడే నీతి వ్యక్తీకరించబడింది. "విశ్వాసమూలమగు నీతి" ఏమంటుంది? ఆలకించు:

> … విశ్వాసమూలమగు నీతి యీలాగు చెప్పుచున్నది: " 'ఎవడు పరలోకములోనికి ఎక్కిపోవును?' (అనగా క్రీస్తును క్రిందికి తెచ్చుటకు); లేక 'ఎవడు అగాధములోనికి దిగిపోవును?' (అనగా క్రీస్తును మృతులలోనుండి పైకి తెచ్చుటకు) అని నీవు నీ హృదయములో అనుకొనవద్దు." అదేమని చెప్పుచున్నది? "వాక్యము నీయొద్దను, నీ నోటను నీ హృదయములోను ఉన్నది" (6–8ఎ వచనాలు).

ఇశ్రాయేలీయులకు మోషే యిచ్చిన వీడ్కోలు ప్రసంగమైన ద్వితీయోపదేశకాండము 30నుండి పౌలు ఈ మాటలను వాడుతున్నాడు:

> "నేడు నేను నీ కాజ్ఞాపించు ఈ ధర్మమును గ్రహించుట నీకు కఠినమైనది కాదు, దూరమైనది కాదు. మనము దానిని విని గైకొనునట్లు, 'ఎవడు ఆకాశమునకు ఎక్కిపోయి మనయొద్దకు దాని తెచ్చును?' అని నీ వనుకొనుటకు అది ఆకాశమందు ఉండునది కాదు; మనము దాని విని గైకొనునట్లు, 'ఎవడు సముద్రము దాటి మన యొద్దకు దాని తెచ్చును అని నీవనుకొననేల?' అది సముద్రపు అద్దరి నుంచునది కాదు. నీవు దానిననుసరించుటకు ఆ మాట నీకు బహు సమీపముగానున్నది; నీ హృదయమున నీ నోట నున్నది" (ద్వితీయోపదేశకాండము 30:11–14; నొక్కి చెప్పింది నాది).

"సముద్రము" అనేదానికి బదులు పౌలు "అగాధమును" ఉపయోగించాడు. "అగాధము" అనేది *abussos*నుండి వచ్చింది, అంటే "అడుగులేని."[20] పాత నిబంధన గ్రీకులో "అగాధము" అనేది జలములకు తరచుగా సంబంధం కలిగియున్నట్టు కన్పిస్తుంది (కీర్తన 68:22 చూడు). "సముద్రపు లోతులలోనికి ఎవడు దిగును?" అని రోమా 10:7 KJVలో ఉంది (NIV చూడు). పౌలు క్రీస్తు యొక్క పునరుత్థానానికి దాన్ని వర్తింపజేసినందున, మృతుల నివాసం గూర్చిగాని (NLT), లేక సమాధిని

గూర్చి గాని (McCord) అతని మనస్సులో ఉండియుండవచ్చు. ఖచ్చితమైన నిర్వచనం అప్రాముఖ్యం. "పరలోకము" అనేది నరుడు ఎక్కిపోదగిన ఉన్నత స్థానమని, "పాతాళము" అంటే అతడు దిగగల క్రింది భాగమనే అర్థంతో పౌలు ఉపయోగించాడు.

"పాతాళము" అనే పదమును బదులుగా వాడడం తప్ప, ద్వితీయోపదేశకాండము 30:11-14 భాగాలను పౌలు నకిలీ తీశాడు. ఏదియెలాగున్నా, ఈ వ్యాఖ్యానాలను చేర్చుతూ, ఈ పదజాలాన్ని అతడు తన సొంత ఉద్దేశం కొరకు వాడుకున్నాడు: "అనగా క్రీస్తును క్రిందికి తెచ్చుటకు," "అనగా క్రీస్తును మృతులలోనుండి పైకి తెచ్చుటకు." పాత నిబంధన ప్రయోగాలతోను, తన వ్యాఖ్యానంతోను పౌలు తెలియజేయ ఉద్దేశించిన సందేశమేమి? ద్వితీయోపదేశకాండము 30:11-14 యొక్క పరిచయపు మాటల్లో తాళపు చెవిని కనుగొనవచ్చు: "నేడు నేను నీ కాజ్ఞాపించు ఈ ధర్మమును గ్రహించుట నీకు [1] కఠినమైనది కాదు, [2] దూరమైనది కాదు" (11 వచనం).

రోమా 10:6-8ఎలో, పౌలు సందేశంలోని మొదటి భాగము సువార్త కోరేవి కఠిన సంగతులు కావు. "ఏవి అసాధ్యమైనవో వాటికి లోకోక్తులను పౌలు ఉపయోగించాడని" Leon Morris అభిప్రాయపడ్డాడు.[21] పరలోకంనుండి క్రీస్తును క్రిందికి తెమ్మని గాని, లేదా పాతాళంనుండి క్రీస్తును పైకి తెమ్మని గాని మానవాతీతమైన పనులకు దేవుడు మనకు ఆదేశించలేదు. మనం కేవలం విశ్వసించి మన విశ్వాసాన్ని వ్యక్తపరచుడని చెప్పబడ్డాం (మార్కు 16:16).

పౌలు సందేశం యొక్క రెండవ భాగము మొదటి భాగానికి సంబంధం కలిగియున్నదే: నీతిని పొందడం ప్రతివానికి అందుబాటులో లేనిది కాదు – ఎందుకంటే ప్రతి ఒక్కరు ప్రభువును ఆయన మార్గాన్ని నమ్మకంపై నడిపించగలవారే.[22] "వాక్యము వారికి సమీపంగా ఉందని" పౌలు యూదులను నమ్మించజూచాడు ఎందుకంటే, ఒక క్రొత్త చోటు అంటూ ఎక్కడికి వెళ్లినా, సువార్తనే మొదటి అవకాశమును అతడు యూదులకిచ్చాడు (అపొస్తలుల కార్యములు 13:14; 14:1; 17:1; 18:19; రోమా 1:16 చూడు).

రోమా 10:6-8ఎ లోని ప్రాథమిక సందేశం అది; అయితే, వర్తింపజేసే పౌలు మాటలను నేను చదివేటప్పుడు, యూదుల అవిశ్వాసాన్ని అవి ప్రతిబింబింపజేస్తాయి గనుక అతడు ఆ రెండు అసాధ్యమైన కార్యాలను ఎన్నుకున్నాడు: యూదులు యేసును మెస్సీయగా అంగీకరించనందున, పరలోకమునుండి "క్రిందికి తేబడ్డాడన్న" సందేశాన్ని (ఆయన నిజంగా వచ్చాడని) వారు నమ్మలేదు. పైగా, యేసు మృతులలోనుండి లేపబడ్డాడన్న విషయాన్ని కూడ వారు నమ్మలేదు. ఆయన వచ్చి ఉండినందున, క్రీస్తును క్రిందికి తెచ్చుటకు ఎవడును పరలోకమునకు వెళ్లడం అనేది అనవసరం. క్రీస్తును మృతులలోనుండి పైకి తెచ్చుటకు ఎవడును అగాధములోనికి దిగిపోనవసరం లేదు, ఎందుకంటే ఆయన అప్పటికే లేపబడియున్నాడు.

ద్వితీయోపదేశకాండము 30:11-14 ఈ మాటలతో ముగిస్తుంది: "నీవు దాని ననుసరించుటకు ఆ మాట నీకు బహు సమీపముగానున్నది; నీ హృదయమున నీ నోట నున్నది" (14 వచనం; నొక్కి చెప్పింది నాది). "దేవుని చిత్తము ఇశ్రాయేలీయులకు

తేటగా బయలుపరచబడి యున్నదని మోషే తేటపరచాడు ([ద్వితీయోపదేశకాండము] 29:29). అందువలన, ఇశ్రాయేలు నోటిలోను, గ్రహింపు (హృదయము)లోను ఉన్నదాని ప్రకారం ప్రవర్తించాలి: నీవు దానిని చేయవచ్చు."[23] ధర్మశాస్త్రమును గూర్చిన మోషే మాటలను తీసికొని పౌలు సువార్తకు వర్తింపజేశాడు. సువార్త యూదుల హృదయాల్లోను, మాటల్లోను ఉందని పౌలు చెప్పడం లేదు, కాని అది అలా ఉండగలదు, ఉండాలి అని అతడంటాడు. సువార్త యొక్క అందుబాటు మరియు లభ్యమయ్యే స్థితిని అతడు నొక్కి చెప్తున్నాడు.

## యూదులు తీసికొనవలసిన మార్గము (10:8-13)

### రక్షించు సందేశం (8–10 వచనాలు)

సువార్త యొక్క క్లుప్త చర్చకు నడిపించడానికి పౌలు మోషే మాటలను ఉపయోగించాడు. "అదేమని చెప్పుచున్నది? వాక్యము నీయొద్దను, నీ నోటను నీ హృదయములోను ఉన్నది; అది మేము ప్రకటించు విశ్వాసవాక్యమే" (రోమా 10:8). "విశ్వాస వాక్యమే," అంటే విశ్వాసాన్ని పుట్టించే వాక్యము (రోమా 10:17) మరియు "విశ్వాసము యొక్క ప్రత్యుత్తరాన్ని కోరే సందేశం, అంటే, సువార్త"[24] (రోమా 1:16 చూడు).

"విశ్వాస వాక్యము" అనే దీనిలోని సమాచారమేమి? దేవుని కృపయు, యేసు మరణమును గూర్చి చదువ మనం ఎదురు చూడవచ్చు. దీనికి బదులు, ద్వితీయోపదేశ కాండము 10:14 యొక్క పదజాలంనుండి తన జాడ తీసికొని, దేవుని ప్రేమ గాథకు మానవ ప్రత్యుత్తరాన్ని గూర్చి పౌలు మాట్లాడాడు. "అదేమనగా - యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు[25] విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9). ఇశ్రాయేలు రక్షణకొరకు తాను ప్రార్థిస్తున్నట్టు పౌలు 10:1లో చెప్పాడు. వారు ఎలా రక్షింపబడతారో యిప్పుడు చెప్తున్నాడు: హృదయమందు విశ్వసించి నోటితో ఒప్పుకొనుటవలన. కాలక్రమము యొక్క క్రమమేమంటే, హృదయమందలి విశ్వాసము వెంట నోటితో ఒప్పుకొనడం జరగాలి, కాని ద్వితీయోపదేశకాండము 30:14లో మోషే ఉపయోగించిన క్రమాన్ని పౌలు ప్రతిబింబింపజేస్తున్నాడు. అక్కడ "నీ హృదయములో" అనడానికి ముందు "నీ నోటను" అని ఉంది. మన మూల వాక్యంలోని వచనం 10లో పౌలు కాలక్రమమును తిరుగ త్రిప్పాడు.

అవి లేకుండ జరుగని (కుదరని) వాటి స్థానంలో వేరొకటి పెట్టలేని సువార్త యొక్క రెండు విషయాలను రోమా 10:9 తాకుతుంది: దేవుడు యేసును మృతులలోనుండి లేపిన వాస్తవం (1 కొరింథీయులకు 15:17 చూడు), యేసు ప్రభువు అనే వాస్తవం (కొలొస్సయులకు 2:6 చూడు). "ప్రభువు" (*kurios*) దేవత్వం యొక్క అర్థంతో ఉపయోగింపబడింది. పవిత్రమైన దేవుని[26] నామాన్ని సూచించడానికి సెప్టూజెంట్ *kurios* అనే పదాన్ని ఆరువేలకంటే ఎక్కువసార్లు ఉపయోగించింది. మొదటి సువార్త ప్రసంగంలో, ఈ రెండు ప్రధానమైన తలంపులను పేతురు చేర్చాడు. "మరణము

ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనను (యేసును) లేపెను" అని అతడు ప్రకటించాడు (అపొస్తలుల కార్యములు 2:24; నొక్కి చెప్పింది నాది). తరువాత, తన ప్రసంగ అంతానికి చేరుకున్నప్పుడు, అతడు ఈ తీర్మానానికి వచ్చాడు: "మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను" (36 వచనం; నొక్కి చెప్పింది నాది).

ఈ సత్యాలను నమ్మడం, ఒప్పుకొనడం యొక్క ప్రాముఖ్యత రోమా 10:10లో అమలులోనికి తేబడింది. ఇది ఈ రెండింటిని కాలక్రమం యొక్క క్రమంలో ఉంచుతుంది. "ఏలయనగా నీతి కలుగునట్లు మనష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగు నట్లు నోటితో ఒప్పుకొనును." "నీతి" (దేవునితో సరియైన స్థితి) మరియు "రక్షణ" అనేవి ఈ వచనంలో పర్యాయంగా వాడబడ్డాయి. విశ్వాసము, ఒప్పుకోలు అనే రెండును ఒకే ఉద్దేశం కొరకు ఉన్నాయి: రక్షింపబడడానికి, నీతిమంతులుగా తీర్చబడడానికి.

మన హృదయాల్లో విశ్వాసాన్ని ఒప్పుకొనుట యొక్క ప్రాముఖ్యతను చూపడానికి యివి కీలక రెఫరెన్సులు గనుక బైబిలు విద్యార్థులకు 9, 10 వచనాలు ప్రత్యేకమైన ఆసక్తిని కలిగిస్తాయి. యేసు యిలా అన్నారు, "మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును" (మత్తయి 10:32). "యేసు దేవుని కుమారుడని యెవడు ఒప్పుకొనునో, వానిలో దేవుడు నిలిచి యున్నాడు, వాడు దేవునియందున్నాడు" (1 యోహాను 4:15; వచనం 2 చూడు) అని యోహాను వ్రాశాడు. KJVలో ఐతియొపీయుడైన నపుంసకుని మార్పులో, సువార్తికునికిని, నపుంసకునికిని మధ్య జరిగిన సంభాషణ యిలాగుంది:

> 36వారు [నపుంసకుడును ఫిలిప్పును] త్రోవలో వెళ్లుచుండగా నీళ్లున్న యొక చోటికి వచ్చినప్పుడు: నపుంసకుడు, ఇదిగో నీళ్లు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. 37ఫిలిప్పు, నీవు పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు, యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను. 38ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్లలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను (అపొస్తలుల కార్యములు 8:36-38).

వచనం 37 మూల వాక్యంలోని భాగమైయున్నట్టు నిపుణులు అంగీకరిస్తారు. అదే సమయంలో, బాప్తిస్మం పొందక ముందు ప్రజలు యేసునందలి తమ విశ్వాసాన్ని ఒప్పుకొనే ఆది సంఘ విధానాన్ని ఈ వచనం చూపుతున్నట్టు పండితులు అంగీకరిస్తారు.

రోమా 10:9, 10లో ప్రస్తావించబడిన ఒప్పుకొనడం, బాప్తిస్మం పొందక ముందు ఒప్పుకోలును నిశ్చయంగా చేర్చుతుంది,[27] కాని దానికి మాత్రమే అది పరిమితి అయ్యింది కాదు. వచనం 10లో వర్తమాన కాలం ఉపయోగింపబడింది, కొనసాగించే

కార్యాన్ని సూచిస్తుంది. "నమ్మికయుంచుతూ ... బహిరంగముగా ఒప్పుకొంటూ" అని CJB అంది. రహస్యమైన శిష్యత్వాన్ని బైబిలు ప్రబోధించదు. ఆది క్రైస్తవులు తమ విశ్వాసాన్ని మరణం ఎదుర్కోవలసి వచ్చినా ధైర్యంగా ప్రకటించారు.

మనం యేసునందు విశ్వాసముంచడం కీలకమైయుంది. ఇతరులకు తెలిసేటంత బలంగా మనం విశ్వసించడం కూడ ప్రాముఖ్యమే: ఆయనను యితరులు ఒప్పుకొనడం. రక్షింపబడడానికి విశ్వాసము ఒప్పుకోలు అనే రెండును అవసరమైనవే. ఒప్పుకోలేని విశ్వాసం పిరికితనమైయుంటుంది; విశ్వాసం లేని ఒప్పుకోలు వేషధారణ.[28]

"విశ్వాసంవలన మాత్రమే రక్షణ" అని ఉత్తరవాదం చేసేవారు, రక్షణకు ఒప్పుకోలు కావాలనే పౌలు ఉపదేశంతో అసౌకర్యంగా ఉంటారు. "విశ్వాసం మాత్రమే" అనేదానికి తరచుగా వాడే నిర్వచనం "విశ్వాసంతో కలిపేది ఏమియు లేదు, తీసివేసేది ఏదియులేదు." ఏదియెలాగున్నా, రోమా 10:9, 10 విశ్వాసముతో ఒప్పుకోలు కూడ కలిగియుంది. ఒప్పుకొనుటను విశ్వాసంకంటె భిన్నమైన వర్గంలో పెట్టడానికి కొందరు తర్జుమాదారులు యత్నం చేశారు. వచనం 10ని వారు యిలా వ్యక్తపరచారు: "హృదయముతో మనుష్యుడు నమ్మును, అది నీతిమంతులుగా తీర్చుటలో ఫలిస్తుంది, మరియు నోటితో అతడు ఒప్పుకొంటాడు, అది అతని రక్షణను స్థిరం చేస్తుంది." అయితే, గ్రీకు మూలంలో, నమ్మిక, ఒప్పుకొనుట అనే రెండును అదే పదజాలంతో కలుపబడ్డాయి. "Resulting in" అనే ప్రయోగం యొక్క తర్జుమా గ్రీకు విభక్త్యర్థకమైన అవ్యయము *eis* అంటే ప్రాథమికంగా, "లోనికి"[29] అని అర్థం. విశ్వాసము ఒకనిని నీతి/రక్షణ "లోనికి" తెచ్చును, ఒప్పుకొనుట ఒకని రక్షణ/నీతి "లోనికి" తెచ్చును. విశ్వాసము, ఒప్పుకొనుట రెండును రక్షణ/నీతిమంతునిగా తీర్చుటకు అవసరమైయున్నాయి.

విశ్వాసంవలన మాత్రమే జనులు రక్షింపబడతారు రక్షణకు బాప్తిస్మం అవసరం లేదని "నిరూపించడానికి" రోమా 10:9, 10ని కోట్ చేసేవారితో ఆ యా సందర్భాల్లో నేను బైబిలు పఠించాను. విశ్వాసము ప్లస్ ఏమియు లేదు, "విశ్వాసము మైనస్ ఏమియు లేదు" అని రోమా 10:9, 10 ఉపదేశించనందున, యిది ఎల్లప్పుడు నన్ను ఆశ్చర్యపర్చు తోంది. విశ్వాసము ప్లస్ ఒప్పుకొనుట అనేదాన్ని యిది ఉపదేశిస్తుంది. ఆ రెండును దగ్గర సంబంధం కలిగియున్నాయి. కాని ఆ రెండును పర్యాయ పదాలు కావు. ఒప్పుకొన కుండగనే ఒకడు నమ్మిక కలిగియుండవచ్చు (యోహాను 12:42, 43 చూడు), మరియు ఒకడు విశ్వసింపకుండగనే ఒప్పుకోవచ్చు (మత్తయి 7:21-23; లూకా 6:46 చూడు).

రోమా 10:9, 10లో విశ్వాసము ప్లస్ ఒప్పుకొనడం కూడ ఉన్నట్టు నేను చూపేట ప్పుడు, సహజమైన జవాబు ఏమంటే, "ఒప్పుకొనడం విశ్వాసాన్ని వ్యక్తపరచడమే" అని అంటారు. అది నిజమే – కాని "విశ్వాసంవలన నీతిమంతులుగా" తీర్చబడే సిద్ధాంతంలో న్యాయసమ్మతంగా ఒప్పుకోలు వ్యక్తపరచబడినట్టయితే, దేవునిచే నియమింపబడిన మారుమనస్సు బాప్తిస్మమనేవి ఎందుకు చేర్చబడకూడదు (రోమా 2:4; 6:3-6)? అపొస్తలులు కార్యములు 2లో, మారుమనస్సు బాప్తిస్మాలతో అదే విభక్త్యర్థకమైన అవ్యయము *eis*ను పేతురు ఉపయోగించినట్టు గమనించు. పౌలైతే దానిని విశ్వాసము

ఒప్పుకొనుట అనేవాటి సందర్భంగా రోమా 10లో వాడాడు. పాపులైనవారికి పేతురు ఈలాగున ఆజ్ఞాపించాడు: "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము [*eis*] ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొస్తలుల కార్యములు 2:38).

**సార్వత్రిక సందేశం (11–13 వచనాలు)**

మన మూల వాక్యంతో కొనసాగిస్తూ, రోమా 10:11కు వచ్చి చేరుకున్నాం, ఇక్కడ పౌలు సందర్భానికి తగిన ఒక పాత నిబంధన లేఖన భాగాన్ని కోట్ చేశాడు, కొంత సేపటికి ముందు తాను ఉపయోగించినదే (9:33 చూడు): "ఏమనగా, 'ఆయనయందు విశ్వాసముంచువాడెవడును సిగ్గుపడడు [యెషయా 28:16].' " విశ్వాసమువలన నీతిమంతులుగా తీర్చబడే తన ప్రాథమిక చర్చనీయాంశానికి తిరిగి వచ్చినవాడై, "యూదుడని గ్రీసు దేశస్థుడని భేదము లేదు" అని పౌలు గుర్తించాడు (రోమా 10:12ఎ). యూదులు అన్యజనుల మధ్య "ఏ భేదమును లేదు" అని అధ్యాయం 3లో అతడన్నాడు (22 వచనం); రక్షణ యొక్క అవసరతలో ఏ భేదమును లేదని అక్కడ అతడు ప్రదర్శించాడు. "[యూదులు అన్యజనులు యిరువురు] అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (23 వచనం). 10:12లో రక్షణ యొక్క ఆధారానికి సంబంధించి, ఏ భేదమును లేదని పౌలు నొక్కి చెప్పుతున్నాడు: అందరును విశ్వాస ఆధారం మీదనే రక్షింపబడతారు. F. F. Bruce యిలా రాశాడు,

> రోమా పత్రికలోని వాదం యొక్క ముందటి దశలో, "ఏ భేదము లేదు" అనేదానికి బాగా మసి పేరుకొనిన శబ్దం ఉండేది, ఎందుకంటే దేవునికి విరోధమైన పాపము మరియు వ్యక్తిగతమైన ప్రయాసమువలన ఆయన అంగీకారాన్ని సంపాదించుకొనడంలో యూదులు అన్యజనులు ఏకంగా విఫలమైనట్టు ఒప్పింపబడ్డారు. ... యిప్పుడైతే అవే మాటలు ఆనందదాయకమైన శబ్దం చేస్తున్నాయి, ఎందుకంటే వారి ప్రవేశంకొరకు దేవుని కనికరపు ద్వారాలు బారలుగా తెరువబడియున్నట్టు యూదులకు, అన్యజనులకు ఏకంగా అవి ప్రకటిస్తున్నాయి. తమ విశ్వాసంచేత క్లెయిమ్ చేసే ఎల్లరికి క్రీస్తునందు ఉచితమైన క్షమాపణ అభయమియ్యబడింది.[30]

పౌలు యిలా చేర్చుతున్నాడు, "ఒక్క ప్రభువే అందరికి [యూదులకు, అన్యజనులకు ప్రభువైయుండి; 3:29, 30 చూడు], తనకు ప్రార్థన చేయువారందరి యెడల [యూదులు, అన్యజనులు] కృప చూపుటకు ఐశ్వర్యవంతుడైయున్నాడు" (10:12బి). లోకంలో[31] మహా ధనవంతులను గూర్చి ఆలోచించు. వారు ఎంత ధనవంతులైనా వారి ఆస్థికి పరిమితులుంటాయి – అయితే దేవుని ఆస్థికి హద్దులుండవు. "ఎంతమంది ఆయన సహాయం కోరినా, ... ప్రభువు ... ఐశ్వర్యము చూపుటకు కృపగలవాడై యున్నాడు" అని JB అంటుంది.

"ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడు" (13 వచనం). ఏదోయొక "మంత్ర సంబంధమైన దానిని" వల్లించడం కాదు. చాలని భావంతో "ప్రభువు నామమును

బట్టి ప్రార్థించుటయైయుంది. తనమీద ఆనుకొనడానికి ప్రభువు నమ్మదగినవాడని ఒప్పింపబడి ముందుకు సాగవలసియుంది."[32] "ప్రభువు నామమునుబట్టి ప్రార్థించుట" అంటే, "అవసరతలో ఉన్న ఒకని విలాపము" అని McGuiggan అన్నాడు.[33]

"ప్రభువు నామమును బట్టి ప్రార్థించుట" అనేది (14 వచనం) యోవేలు 2:32 మీద ఆధారపడియుంది, పౌలు దాన్ని వచనం 13లో కోట్ చేశాడు: "**ప్రభువు** నామమును బట్టి ప్రార్థనచేయువాడెవడో వాడు రక్షింపబడును." "యెహోవా యొక్క భయంకరమైన ఆ మహా దినము" యొక్క రాకను గూర్చి యోవేలు లేఖనం పలుకుతుంది (యోవేలు 2:31), "యెహోవా" అనే రెఫరెన్సు దేవునికి సంబంధించింది. యోవేలులో " 'యెహోవా' అనేది దేవుని నిబంధన నామమైయుంది. ఆ 'ప్రభువును' పౌలు ఈ సమయంలో యేసుతో గుర్తించుతున్నాడు (రోమా 10:9, 12 చూడు). ... అప్పుడు, వచనం 13, ఆది క్రైస్తవులు యేసును దేవునిగా గుర్తించారనడానికి ప్రాముఖ్యమైన రుజువైయుంది"[34] అని Douglas J. Moo వ్రాశాడు

సాధారణమైన విధేయతను, ప్రత్యేకించి బాప్తిస్మాన్ని నమ్మరాని స్థితికి దిగజార్చుడానికిని కొందరు రోమా 10:12, 13ను ఉపయోగిస్తారు. ఒకడు చేయవలసినదంతా "ప్రభువు నామమునుబట్టి ప్రార్థించడమేనని" వారు అంటారు, ఒక వ్యక్తి "ప్రభువుకు ప్రార్థించడమంటే" "పాపి ప్రార్థనను వల్లించడమేనని" వారు వక్కాణిస్తారు. ఏదియెలాగున్నా, వచనం 12, 13లోని ప్రభువు నామమును బట్టి ప్రార్థించడమంటే, 10, 11 వచనాల్లో అన్నట్టు నమ్మి, ఒప్పుకొనడం వంటిదే. పైగా, యోవేలులోని లేఖన భాగాన్నే పేతురు అపొస్తలుల కార్యములు 2:21లో కోట్‌చేసి, మారుమనస్సు పొంది బాప్తిస్మం పొందుడని తన శ్రోతలకు తెలిపాడు (అపొస్తలుల కార్యములు 2:38). ఆ పైన, "ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయడంతో" బాప్తిస్మము చేరికయైన దైవ ప్రేరేపితమైన ఉదాహరణ మనకున్నది. సువార్తికుడైన అననీయ పౌలుతో యిలా అన్నాడు, "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్చి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసి కొనుము" (అపొస్తలుల కార్యములు 22:16). చివరిగా, వచనం 10లోని నమ్మడం, ఒప్పుకొనడంవలెనే, తన జీవితం అంతటిలో నమ్మకమైన క్రైస్తవుడు ప్రభువు నామమున ప్రార్థన చేస్తునే ఉండాలి (1 కొరింథీయులకు 1:2; 2 తిమోతి 2:22 చూడు).

రోమా 10:9–13 పైనున్న వివాదము పౌలు ఉపదేశించే సత్యంనుండి నిన్ను తొలిగించకుండ జాగ్రత్తపడు. ఒకటి యూదులకు, మరొకటి అన్యజనులకు అంటూ దేవునికి రక్షణ కొరకైన రెండు మార్గాలు లేవు. అయితే, యూదులు, అన్యజనులు ఒకే విధానంగా రక్షింపబడతారు: యేసునందు విశ్వాసముంచి ఆ విశ్వాసాన్ని వ్యక్తపరచడం వలన అది జరుగుతుంది. యేసును మెస్సీయగాను, వారి రక్షకునిగాను యూదులు అంగీకరించనందుకు వారు తమకు తామే నిందించుకోవాలి.

## ముగింపు

"యూదుల్లో అనేకమందిని దేవుడు నిరాకరించడంలో నిందితులెవరు?" అని

ఈ పాఠంలో అడిగాం. తమ నశించిన స్థితికి యూదులు తామే బాధ్యులని మనం తీర్మానించాం. ఒక పిల్లవాడు, తినే వస్తువు ఉన్న మరొక పిల్లవాన్ని చూచి, "వానికి తినేది ఉంది, నాకు లేదు" అని ఫిర్యాదు చేసేవాని దృశ్యం జ్ఞాపకం వస్తుంది. మొదటి పిల్లవాని తలిదండ్రులు అదే పిండివంట చేతపట్టుకొని "అయితే నీకు యిదిగో! నీవు చేయవలసిందంతా వచ్చి తీసికొనడమే!" అంటూ ఎప్పుడూ పిలుస్తునే ఉన్నారు.

"వారు యేసును ఎందుకు అంగీకరించి రక్షింపబడరు?" అని మనం యూదులవైపు చూచి ఆశ్చర్యపడవచ్చు. యేసును వారు నిరాకరించి, దేవుడు వారిని నిరాకరించినందుకు ఫిర్యాదు చేసేవారి స్థితిని మనం పరిహాస పదమైనదిగా తలంచవచ్చు. యూదులను విమర్శించడంలో మనలను మనమే దోషులనుగా చేసికొనే అవకాశముందా? యేసును మనం మెస్సీయగాను, రక్షకునిగాను అంగీకరించామా? ఆయన మృతులలోనుండి లేపబడ్డాడని విశ్వసించి, ఆయనను ప్రభువుగా మనం ఒప్పుకున్నామా? ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మం పొందామా? క్రైస్తవ జీవితంలో ఆయనతో నడుస్తూ ఆయన నామమున ప్రార్థించుటలో కొనసాగుతున్నామా? ప్రభువుతో మనకున్న సంబంధంలో ఏదైనా లోపముందా? అదేదైనా ఉంటే, ప్రభువును, ఆయన మార్గాన్ని అంగీకరించడానికి త్వరపడదాం. నేను కఠినంగానుండ ఉద్దేశించను, నేను తేటగా ఉండగోరతాను: నీవు నశించిపోయినట్టయితే నిన్ను నీవే తప్ప మరెవరిని నిందించే అవకాశముండదు!

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

మన మూల వాక్యము రెండు మార్గాల భేదాన్ని తెలుపుతుంది – మరల మరల – చట్టము దానికి వ్యత్యాసంగా విశ్వాసం (9:30, 31; 10:3, 5, 6). "నీవు ఏ మార్గంలో ఉన్నావు?" అనేదానిపై మాట్లాడవచ్చు. మత్తయి 7:13, 14లోని యేసు ప్రతిపాదనతో పాఠాన్ని పరిచయం చేయవచ్చు.

మూల వాక్యం గుండా మనం వెళ్తుతుండగా, ఆ స్థలాల్లో ఆగి శ్రోతలకు వర్తింపజేసే వాటిని సూచించడానికి ప్రయత్నించాను. అనేక వర్తింపులు చేయవచ్చు. నశించినవారి పట్ల అక్కర కనుపరచడంతో పాటు ప్రార్థించడం జ్ఞానంలేని ఆసక్తి యొక్క అపాయం, "క్రీస్తు, అడ్డు రాయి" (9:32, 33);[35] "నేను నా మార్గంలో చేశాను" (10:3); "రక్షణను ఒప్పుకొనడం" (10:9, 10); మరియు "ప్రభువు నామమున ప్రార్థించడం" (10:12, 13).

---

సూచనలు

[1]Ambrose Bierce, quoted in Leonard Louis Levinson, *Webster's Unafraid Dictionary* (New York: Collier Books, 1967), 206. [2]నిందను ఇతరుల మీద వేసేవారి కథలు నీవు ఎరిగియుండవచ్చు ఆశానిగ్రహము లేని భర్తను కల్గిన భార్యకు నేను ఒకప్పుడు సలహా యిచ్చాను. భర్త ఒక గ్లాస్ కిటికీని కోపముతో

బద్దలుచేసి రక్తము కారుతున్న తన చేతులను భార్యవైపు చూపి, "చూడు నన్ను ఏమి చేయనిచ్చావో!" అని వాపోయాడు. [3]Quoted in Craig Brian Larson, ed., *Illustrations for Preaching and Teaching* (Grand Rapids, Mich.: Baker Books, 1993), 234. [4]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 374, n. 135. [5]ఇలాంటి ప్రశ్నలను రచయితలు కల్గియున్నారు: "నీతిని కలుగజేసే ధర్మశాస్త్రాన్ని గూర్చియా," "నీతిని వాగ్దానం చేసే ధర్మశాస్త్రమును గూర్చియా," లేక "(క్రియలవలన) నీతిని పొందే సూత్రాన్ని గూర్చియా" పౌలు మాట్లాడుతున్నది. కొందరు పౌలు మోషే ధర్మశాస్త్రాన్ని ప్రస్తావించాడని, అది (క్రీస్తునొద్దకు) యూదులను నడిపించేదని ఆలోచించేవారు (గలతీయులకు 3:24ను చూడు). [6]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 606. [7]వారి ఆశ్రయ స్థానముగా యూదులు దేవుని నిరాకరించిన వాస్తవాన్ని సూచించే పాత నిబంధన లేఖన భాగమిది. క్రొత్త నిబంధన రచయితలు ఈ లేఖన భాగాన్ని యేసుకు వర్తింపజేశారు. [8]Vine, 441. [9]C. F. Hogg and W. E. Vine, *The Epistle to The Galatians* (Grand Rapids, Mich.: Kregel Publications, 1921), 262. NASB నా కాపీలో: "[అక్షరార్థంగా] అవమానపరచబడడం" అనే నోట్ ఉంది. [10]Ibid., 681.

[11]Quoted in Morris, 378. [12]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, Ltd., 1971), 181. [13]Vine, 348. [14]John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 280. [15]"పరలోకానికి వెళ్లడానికి" మానవ కల్పిత మార్గాలు మీ ప్రాంతంలోనివి చేర్చి నీవు దీన్ని పెంచవచ్చు. [16](Paul Anka, "My Way" [1968]) అనే పాట Frank Sinatraనుండి మాటలివి. [17]F. F. Bruce, *The Letter of Paul to the Romans,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 190. [18]ఈ పాఠంలో 7:1–6 మీద కామెంట్సు "క్రైస్తవుడు, ధర్మశాస్త్రం (7:1–14)" అనే పాఠంలో రోమా, 3వ పుస్తకంలో చూడు. [19]"విశ్వాసమువలన జీవించును" అనే ప్రయోగం మీద కామెంట్స్ "అసలు విషయం (1:16, 17)" రోమా పుస్తకం, 1లో చూడు. [20]Vine, 75.

[21]Morris, 383. [22]దీనికి తేలైన మినహాయింపులున్నాయి – ఏదో ఒక కారణాన్ని బట్టి, జనులు – వారి చర్యలకు వారు బాధ్యులైయుండరు – కాని పౌలు మనస్సులో ఉన్నది రూలే గాని మినహాయింపు కాదు. [23]J. A. Thompson, *Deuteronomy,* Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1974), 286. [24]Stott, 283. [25]"హృదయపూర్వకంగా" పనులు చేయడం యొక్క ప్రాధాన్యత రోమా పత్రిక అంతటిలో నొక్కి చెప్పబడింది (6:17, 18లో వలె). [26]C. E. B. Cranfield, *Romans: A Shorter Commentary* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 258. [27]రోమా 10:9, 10 మీద వ్యాఖ్యానిస్తూ, అనేకమంది వ్యాఖ్యానకర్తలు బాప్తిస్మానికి ముందు ఒప్పుకొనడాన్ని ప్రస్తావించారు. [28]Adapted from R. C. Bell, *Studies in Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1957), 122. [29]D. F. Hudson, *Teach Yourself New Testament Greek* (London: English Universities Press, 1960), 106. [30]Bruce, 193.

[31]నీ శ్రోతలకు పరిచయమైన ఐశ్వర్యవంతుని పేరును ప్రస్తావించు. ఒకవేళ తరగతులలో బోధిస్తున్నయెడల పాల్గొన్నవారిని కొన్ని పేర్లను పేర్కొనమని చెప్పు. [32]Morris, 388. [33]Jim McGuiggan, *The Book of Romans,* Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1982), 311. [34]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 333. [35]A supplementary section entitled "Christ the Living Stone" is included in James Burton Coffman, *Commentary on Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1973), 352-57.

## 47

# పరిపూర్ణమైన ఏర్పాటు - అయితే ఏమయ్యింది?

## (10:14-21)

పరిపూర్ణంగా ఉన్నట్టు కన్పించిన ప్రణాళిక - ఆచరించలేని ప్రణాళిక - నీవు ఎప్పుడైనా ఒక ప్లాన్ వేశావా? కావలసిన మెటీరియల్ నీవు సంపాదించలేకపోయి ఉండవచ్చు. ఇతరుల సహాయం మీద నీవు లెక్క వేసికొనియుండగా, వారు తమ భాగం చేయడంలో తప్పిపోయి ఉండవచ్చు. నీవు ఏర్పాటు చేసికొన్న ప్లాన్ను నీవు జరిగించలేవన్నట్టు నీకు నీవే కనుగొనియుండవచ్చు. నేను ప్లాన్ వేసికొనేవాడనే; కాని ఏదో యొక కారణాన్ని బట్టి, నా ఆరంభపు ఏర్పాట్లను నేను నెరవేర్చలేనట్టు, అది పని చేయదన్నట్టు తరచుగా నేను కనుగొన్నాను (అది ప్లాన్ A). అప్పుడు, నేను ప్లాను B, C లేక Dకి మార్చుకున్నాను.

ఇంతమట్టుకు మన స్టడీస్‌లో, నీతిమంతులుగా తీర్చబడడం విశ్వాసం మీద ఆధారపడియేనని పౌలు మరల మరల నొక్కి చెప్పుతున్నట్టు మనం చూచాం - అయితే ఏ సంఘటనల క్రమం విశ్వాసాన్ని తెస్తుంది? రోమా 10 యొక్క చివరి భాగంలో, ప్రజల హృదయాల్లో విశ్వాసాన్ని పుట్టించే దేవుని ఏర్పాటును పౌలు అవుట్‌లైన్ వేశాడు. అది దేవుని ఏర్పాటైయున్నందున, అది తప్పక పరిపూర్ణమైన (ప్లాన్) ఏర్పాటైయుండాలి. అది ఒక ప్రశ్నను రేపుతుంది. అది పరిపూర్ణమైనదైతే, ప్రతి ఒక్కడు ఎందుకు నమ్మడం లేదు? అందుకు జవాబేమంటే, ఆ ఏర్పాటులో మానవ ప్రమేయం ఉంది. దేవుని (ప్లాన్) ఏర్పాటు పరిపూర్ణమయ్యిందే గాని, దాన్ని అంగీకరించుమని ఆయన ఎవనిని బలవంతం చేయడు. ప్రజలు దాన్ని నిరాకరించగలరు, నిరాకరిస్తున్నారు.

మన మూల వాక్యంలో, ప్రత్యేకించి యూదులు దేవుని ఏర్పాటును నిరాకరించిన విషయాన్ని పౌలు చర్చించాడు. ఏదియెలాగున్నా, ఈ లేఖన భాగం మనం చదువుతుండగా, మన ఆలోచన కేవలం ఇశ్రాయేలుకు మాత్రమే పరిమితి చేయకూడదు. ఈ వచనాలలో మనకందరికి పాఠాలున్నాయి.

### దేవుని ఏర్పాటు ఉంది (10:14-17)

**పరిపూర్ణమైన ఏర్పాటు (14-17 వచనాలు)**

రోమా 10 యొక్క గత భాగాన్ని ఈ ప్రతిపాదనతో ముగించబడింది: "యూదుడని

గ్రీసు దేశస్థుడని భేదము లేదు; ఒక్క ప్రభువే అందరికి ప్రభువైయుండి, తనకు ప్రార్థన చేయువారందరి యెడల కృప చూపుటకు ఐశ్వర్యవంతుడైయున్నాడు. ఎందుకనగా, '**ప్రభువు** నామమునుబట్టి ప్రార్థనచేయువాడెవడో వాడు రక్షింపబడును' " (12, 13 వచనాలు). "ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయు" అవసరతలో ఆరంభించి, దేవునిచే ఆరంభింపబడిన క్రమాన్ని తిరుగ త్రిప్పి పౌలు అవుట్‌లైన్ చేశాడు: "వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? విననివానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు? ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు?" (14, 15ఎ వచనాలు). ఈ ప్రశ్నలలో ప్రతిదానికి గుప్తమైయున్న జవాబు "వారు చేయలేరు." పౌలు తన ప్రశ్నలను ఈ మాటలతో వెంబడించాడు:

> "ఇందు విషయమై, ఉత్తమమైనవాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి" అని వ్రాయబడియున్నది!
>
> అయినను అందరు సువార్తకు లోబడలేదు, "**ప్రభువా,** మేము తెలియజేసిన సమాచారమెవడు నమ్మెను?" అని యెషయా చెప్పుచున్నాడు గదా? కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును (15బి–17 వచనాలు).

రోమా 10:14–17లో, మానవాళిని రక్షించుటకొరకైన దేవుని సంకల్పము యొక్క ప్రాథమిక విషయాలు మనం కనుగొంటాం. సంకల్పానికి అవసరమైనవి ఏవో వీక్షించడానికి కొద్ది క్షణాలు తీసికొందాం. మన అవుట్‌లైనుకు వచనాలు 14, 15లను ప్రాథమికంగా వాడుకొందాం. మూల వాక్యం యొక్క అమరికను తిప్పివేసి కాలక్రమం యొక్క క్రమంలో ఉంచుదాం.

(1) దైవికమైన ఆదేశంతో దేవుని ప్లాన్ ఆరంభమౌతుంది. 15ఎ వచనంలో మనం యిలా చదువుతాం, "ప్రకటించువారు పంపబడనియెడల ఎట్లు ప్రకటించుదురు?" (నొక్కి చెప్పింది నాది). మిషినెరి ప్రయాస సందర్భంలో మనం తరచుగా ఈ ప్రశ్నను ఉపయోగిస్తాం: "[ఫలాని దేశంలో] [మనచే] వారు పంపబడనియెడల వారెట్లు ప్రకటించుదురు?" ఇది చెల్లుబడి అయ్యే అవసరమైన ప్రశ్నయే. అయితే పౌలు అడిగినదానిలో ప్రాథమిక ఒత్తిడి దానిమీద కాదు. దేవుడు వారి రక్షణ కొరకై ప్రతి విధమైన ఏర్పాటును చేశాడు గనుక యూదులు నిరుత్తరులైయున్నారు. సందర్భంలో, ప్రశ్న యొక్క అర్థమేమంటే – "వారు దేవునిచే పంపబడకుంటే ఎలా ప్రకటిస్తారు – వారికి దైవికమైన ఆదేశం లేకుంటే వారెట్లు ప్రకటిస్తారు?" అనేది.

"పంపబడిన" అనే పదం *apostello*నుండి తెనిగింపబడింది, దానికి "పంపబడిన వారు" అని అర్థం యిస్తుంది (*apo* అంటే "నుండి").[1] *Apostello* అనేది "అపొస్తలుడనే" దానికి క్రియా వాచకమైయుంది. పౌలును, యితర అపొస్తలులును ప్రభువునొద్దనుండి ప్రత్యేకమైన ఆదేశాన్ని, వెళ్లి సువార్త ప్రకటించడానికి, పొందారు. అయితే *apostello* అనేది ఆ కొద్దిమంది మనుష్యులకు మాత్రమే పరిమితి అయ్యింది కాదు. వెళ్లి ఉపదేశించడానికిని, ప్రకటించడానికిని దైవికమైన ఆదేశం నీకు, నాకు కూడ ఉంది.

అది దర్శనం ద్వారానో, "మెల్లని స్వరము ద్వారానో" వచ్చేది కాదు (1 రాజులు 19:12; KJV); కాని, మనకు అది రచనలోనే ఉంది:

> అయితే యేసు వారియొద్దకు వచ్చి, "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని" వారితో చెప్పెను (మత్తయి 28:18-20).

నశించినవారితో మనం సువార్తను పంచుకొనుచుండగా, ప్రభువు యొక్క సొంత అధికారపు ఆధారంతో మనం ఈ పని చేస్తున్నాం.

(2) దేవుని సంకల్పం యొక్క తరువాత మూల వస్తువు సువార్త ప్రకటన. మన మూల వాక్యానికి వెనుకకు వెళ్ళితే, "ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు?" అని చదువుతాం (రోమా 10:14సి; నొక్కి చెప్పింది నాది). ప్రకటించుట యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పే క్రొత్త నిబంధన మూల వాక్యాలలో యిది ఒకటి (1 కొరింథీయులకు 1:21; KJV). పౌలు తిమోతికి యిలా చెప్పాడు,

> దేవునియెదుటను సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు ఎదుటను, ఆయన ప్రత్యక్షతతోడు ఆయన రాజ్యముతోడు, నేను ఆనబెట్టి చెప్పునదేమనగా: వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధి చెప్పుము (2 తిమోతి 4:1, 2; నొక్కి చెప్పింది నాది).

అయినా, రోమా 10:14లో ("సువార్తికుడు") "ప్రసంగి" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం ఆదివారము గాని యితర సమయాల్లో గాని ప్రసంగ వేదికపై నిలిచి ఆ హద్దుకి పరిమితియైన మనిషిని సూచించదు అని మనం అర్థం చేసికోవాలి. ఆ పదం *kerusso* అంటే, "ప్రకటించువాడు."[2] "చాటించువాడు" అనేదానికి ప్రాథమిక అర్థం "పంపుటతో" సన్నిహితంగా కలిసియుంటుంది. మొదటి శతాబ్దపు ప్రకటించువాడు అధికారంలో ఉన్న ఒకరిచేత ఆ వర్తమానం అందించడానికి పంపబడినవాడు. చాటించువాడు గ్రామంలో తిరుగుతూ, తాను కలిసికొన్న ప్రతివానికి – గ్రామము రోడ్డు కలయికల్లో గాని లేక పట్టణపు మార్కెట్టు స్థలంలో మనుష్యులు గుమికూడిన చోట ప్రకటిస్తాడు. ప్రభువువారి గ్రేట్ కమీషన్ ఒక విధంగా, ప్రతి క్రైస్తవుని ప్రకటించు వానిగా పంపుతుంది. కొందరు బహిరంగంగాను, కొందరు వ్యక్తిగతంగాను ప్రకటిస్తారు. కాని మనలో ప్రతి ఒక్కరు దానిని పంచుకోవలసియుంది.

ఏదియెలాగున్నా, శక్తి ప్రకటించువానిలో లేదు; ఆ ప్రకటించే సందేశంలో ఉంది. దేవుని ఏర్పాటుకు సంబంధించి, యింతకు సందేశమేమి? అని వచనం 14 చెప్పడం

లేదు గాని, తరువాత వచనాలు చెప్పుతున్నాయి. NASBలో, 15, 16 వచనాలు (సువార్త) "శుభవార్త" అనే ప్రయోగం ఉపయోగించబడింది. గ్రీకులో వచనం 15 క్రియా రూపంలోను, వచనం 16లో నామవాచకంలోను ఉంది: *euangelion* "సువార్త' ' అనే పదం.[3] "... సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి" అని KJV కూడ అంటుంది. "... అయినను అందరు సువార్తకు లోబడలేదు" (15బి, 16ఎ వచనాలు; నొక్కి చెప్పింది నాది). సువార్త యేసును గూర్చిన శుభవార్తయై ఉంది (1 కొరింథీయులకు 15:1-4 చూడు).

ఈ సందేశాన్ని వచనం 17 "క్రీస్తును గూర్చిన మాట"[4] అని అంది. క్రీస్తు ప్రకటించిన మాటను యిది సూచించవచ్చు (McCord) లేదా క్రీస్తును గూర్చిన వార్తయైయుండవచ్చు (CEV; CJB; NLT). క్రీస్తును గూర్చిన మాటలో వచనం 9లో ప్రస్తావించబడిన వాస్తవాలు చేర్చబడియుండవచ్చు: ఆయన ప్రభువు, దేవుడు ఆయనను మృతులలోనుండి లేపాడు. "క్రీస్తును గూర్చిన మాట" అనే ప్రయోగంలో పౌలు ఈ భావాలను కలిపియుండవచ్చు: "క్రీస్తును గూర్చిన మాటలో క్రీస్తు దాని విషయమును దాని కర్తయునైయుంటారు."[5]

"క్రీస్తును గూర్చిన మాట" అనేది ఎలా వ్యాఖ్యానించినా, క్రీస్తును ప్రకటించడం అనేదానిమీద నొక్కి చెప్పబడింది. "అయితే మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక" అని పౌలు గలతీయులకు వ్రాస్తూ అన్నాడు (గలతీయులకు 6:14ఎ). "యేసుక్రీస్తును అనగా, సిలువవేయబడిన యేసుక్రీస్తును తప్ప, మరిదేనిని మీమధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" అని పౌలు కొరింథీయులకు తెలిపాడు (1 కొరింథీయులకు 2:2). అంటే సిలువ కాకుండా మరి ఏ యితర అంశం మీద పౌలు ప్రసంగించ లేదని దాని భావం కాదు. (1) సిలువకు సంబంధం కలిగియున్నది తప్ప మరి దేనిని, (2) సిలువతో పోల్చితే తాను "ఎరిగిన" మరి దేనిని కాదని దాని అర్థం.

ప్రసంగించే, ఉపదేశించే మనం (అందులో ప్రతి క్రైస్తవుని చేర్చాలి) పౌలు వద్దనుండి నేర్చుకోవాలి. మన శ్రోతల హృదయాలలో విశ్వాసాన్ని నిలపాలంటే, క్రీస్తును, ఆయన సిలువ మరణాన్ని ప్రసంగించకుండ, ఉపదేశించకుండ ఉండకూడదు. "ఆ గొప్ప పాత గాథ" మన సందేశం యొక్క కేంద్రమైయుండకపోయినట్టయితే, అది సువార్త సందేశం కాదు.

ఈ శుభవార్తను మనం యితరులకు చెప్పినట్టయితే, మన దేహంలో రెండు అవయవాలు సుందరములైయున్నట్టు పౌలు అంటున్నాడు. మన ముఖాలు ఆకర్షణ లేనివి లేక మన దేహాలకు పరిపూర్ణత లేకపోవచ్చు; కాని మనకు సుందరములైన పాదములున్నట్టు పౌలు అంటున్నాడు: " 'ఇందు విషయమై - ఉత్తమమైనవాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి' అని వ్రాయబడి యున్నది" (15బి వచనం). పౌలు యెషయా 52:7నుండి కోట్ చేస్తున్నాడు, బబులోను చెరనుండి విడిపింపబడతారని చెరలోని యూదులకు శుభవార్తను తెచ్చేవారిని అది సూచించింది. పాప బంధకాలనుండి విడిపింపబడే సువార్తను నశించినవారికి

తెచ్చేవారికి పౌలు దీన్ని వర్తింపజేస్తున్నాడు.

నేను బాలుడుగా ఉన్నప్పుడు, రోమా 10:15లోని పౌలు మాటలు నాకు చిక్కుగా ఉండేవి. మొదటిగా, ఎందుకంటే, పాదములు దేహంలోని అవయవాలలో ఆకర్షణ మిక్కిలి తక్కువైనవైయుంటాయి. రెండవది, నేనెరిగిన ఎక్కువమంది సువార్తికులకు పెద్ద సైజు పాదాలు, వాటిని ఎవరు సుందరమైన పాదాలని వర్గీకరింపరు. తరువాత, ప్రకటించు వాని గూర్చిన భావనను నేర్చుకున్నాను. వర్తమానంతో ఒక చోటునుండి మరియొక చోటుకు వెళ్లే వర్తమానికుడు. ఆ చాటించేవాడు సువార్తను తీసికొని వచ్చినప్పుడు, చెప్పులు తొడుగుకొనిన అతని పాదాలు రోతగా, పగుళ్ళుగా, కాయలు కాసినవిగా, లేక అవి వాసన కూడ కొట్టవచ్చు – ఆ పాదాలు అతనిని తన శ్రోతల యొద్దకు కొనిపోయాయి. గనుక, వారికి, ఆ పాదములు "సుందరములైనవి." యెషయా నుండి ఈ కొటేషన్ను JB యిలా తర్జుమా చేసింది: "శుభవార్తను తెచ్చేవారి అడుగుల ధ్వని ఆహ్వానించు శబ్దమైయుంది."

(3) రక్షణ కొరకైన దేవుని సంకల్పములో మరియొక ముఖ్యాంశము గ్రహింపుతోను, అంగీకారంతోను వినడం. మన మూల వాక్యంలో యింకా వెనుకకు వెళ్ళితే మనకు ఈ ప్రశ్న ఉంది: "వినని వానిని ఎట్లు విశ్వసించుదురు?" (14బి వచనం; నొక్కి చెప్పింది నాది). సువార్త ప్రకటించే బాధ్యత సువార్తికునిది, అయితే అతడెవరికి ప్రకటిస్తున్నాడో వారికి కూడ బాధ్యత ఉంది: వారు వినాలి. వచనం 17 యిలా అంటుంది, "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును." అంగీకరించే శ్రోతగా ఉండడంలోని ప్రాముఖ్యతను ప్రభువువారి "విత్తువాని ఉపమానం నొక్కి చెప్పుతుంది" (మత్తయి 13:3–9, 18–23).

అనేకమంది చదవడానికి వీలులేని దినాల్లో పౌలు వ్రాశాడు. పైగా, చేతిప్రతుల కాపీలు సాధారణమైనవారికి చాలా ఖరీదుగా ఉంటాయి. శుభవార్త జనులు వినకపోయి నట్టయితే, ఎక్కువమంది దాన్ని నేర్చుకొనియుండేవారు కారు. నేడైతే, అనేకులు చదువగలరు, గనుక దేవుని వాక్యం చదువుటవలన కూడ విశ్వాసం వస్తుంది (యోహాను 20:30, 31 చూడు). అయినప్పటికిని, వాక్యం వినడమనేది యింకను బలీయమైన ప్రభావాన్ని కలిగియుంటుంది. సువార్త యొక్క శక్తికి (రోమా 1:16 చూడు) దేవుడు చెప్పినది సత్యమని స్థిరపరచే సువార్తికుని ప్రభావం చేర్చబడుతున్నట్టుంటుంది.

వచనాలు 14, 17ల్లోని "విను," "వినుట," "వినెను" అనేవాటికి గ్రీకు పదాలు *akouo* రూపంనుండి వచ్చినవే – దీనినుండి "acoustic" అనే పదం వచ్చింది. ఈ వచనాలలోని "వినుట" అనే పదం శ్రోత యొక్క స్పృహలో మాట్లాడినది రిజిష్టర్ చేయడం అనే విధానాన్ని కేవలం సూచించదు. గ్రహింపుతోను, అంగీకారంతోను వినడం అని సందర్భం సూచిస్తుంది. తన ఉపదేశాన్ని నిరాకరించేవారిని గూర్చి ప్రభువైన యేసు పలికినప్పుడు, వారు వినుటమట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు అని ఆయన సూచించారు (మార్కు 4:12 చూడు).

దేవుని ఏర్పాటులోని ఈ భాగాన్ని మనం విడువక ముందు, పౌలు అడిగిన

ప్రశ్నలోని ఒక ముఖ్యమైన వివరాన్ని గుర్తించుదాం. దాన్ని తిరిగి చూడు: "విననివానిని ఎట్లు విశ్వసించుదురు?" (10:14బి). "ఎవనిని గూర్చి వారు వినలేదో ఆయనయందు వారు ఎలా విశ్వసిస్తారు?" (KJV; NIV లను చూడు), కాని గ్రీకు మూల వాక్యం యొక్క అక్షరార్థమైన తర్జుమా - "విననివానిని ఎట్లు విశ్వసించుదురు?" "క్రీస్తు వాక్యమును" మనం ప్రకటిస్తున్నప్పుడు, క్రీస్తు మన ద్వారా ప్రకటిస్తున్నారనేది పౌలు మనస్సులో ఉండియుండవచ్చు. ప్రకటించే ప్రయాణంలో ప్రభువు తన శిష్యులను పంపినప్పుడు, "మీ మాట వినువాడు నా మాట వినును, మిమ్మును నిరాకరించువాడు నన్ను నిరాకరించును" అని అన్నారు (లూకా 10:16ఎ). Jim McGuiggan యిలా రాశాడు,

> సమాధానపడుడని ప్రజలతో తన వర్తమానికుల ద్వారా విన్నవించుకునేది క్రీస్తే. అది నమ్మశక్యము గాని ఆలోచన కాదా?! ఆదేశింపబడిన ప్రకటనకు అది ఘనతను యివ్వదా? (కాదు, అది ఘనతకంటే ఎక్కువైనది! భయంకరమైన శోభ) నిజమైన ప్రకటనలో తనయందు నమ్మికయుంచుడని క్రీస్తు ప్రజలకు విన్నవిస్తున్నారు.[6]

(4) దేవుని సంకల్పం ప్రకారం, సువార్త సందేశానికి ప్రత్యుత్తరం విధేయతతో కూడిన విశ్వాసం. మన మూల వాక్యంలోని మొదటి ప్రశ్నకు యిది మనలను తోడుకొని వస్తుంది: "వారు విశ్వసింపనివానికి ఎట్లు ప్రార్థన చేయుదురు?" (14ఎ వచనం; నొక్కి చెప్పింది నాది). "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" అని పౌలు చెప్పిన మాటను జ్ఞాపకం ఉంచుకో (17 వచనం). యథార్థమైన హృదయములతో మనం సువార్తను శ్రద్ధగా విన్నట్టయితే - కేవలం మేధావి అభ్యాసం వలె కాకుండ - అప్పుడు విశ్వాసం ఫలితంగా వస్తుంది. రోమా పత్రిక యొక్క ప్రాముఖ్యమైన భావనకు యిది మనలను తెస్తుంది. "నేను ఆయనని [మెస్సీయనని] మీరు విశ్వసించినయెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" (ప్రభువైన) యేసు చెప్పారు (యోహాను 8:24).

రోమా 10:14లోని నమ్మకం మృతమైన, నిష్ఫలమైన విశ్వాసం కాదు (యాకోబు 2:17, 26 చూడు); అది సజీవమైనదియు, చురుకైనదియు, విధేయతతోకూడిన విశ్వాసమై యుంది. మన మూల వాక్యంలోని వచనం 16 చూడు, ఆలాటి విశ్వాసం లేనివారిని గూర్చి అది మాట్లాడుతుంది: "అయినను అందరు సువార్తకు లోబడలేదు- '**ప్రభువా,** మేము తెలియజేసిన సమాచారమెవడు నమ్మెను' అని యెషయా చెప్పుచున్నాడు గదా?" "లక్ష్యపెట్టు" అనే మాట *hupakouo*నుండి తర్జుమా చేయబడింది (*akouo* ["వినుట"] ప్లస్ *hupo* ["క్రింద"]).[7] *Hupakouo* లోబరచుకొనుటయందు, విధేయత యందు ఫలించేలా అంగీకరించు, వినుటను సూచిస్తుంది. CJB 16వ వచనాన్ని యిలా తర్జుమా చేస్తుంది: "వారు అందరు శుభవార్తకు శ్రద్ధను కనుపరచి లోబడి నవారు కారు." "లోబడు" అనే పద రూపాలను రోమా 10:16లోని *hupakouo* అనే పదాన్ని అనేక తర్జుమాలు వాడతాయి (KJV; NRSV; NKJV; McCord).[8]

వచనం 16లోని *hupakouo*ను NASB "లోబడు" అని ఎందుకు తర్జుమా చేయలేదో నాకు తెలియదు. రోమా పత్రికలోని యితర భాగాల్లో, ఆ పదం యొక్క ఆ యా రూపాలను "విధేయుడు" మరియు "విధేయత" అని NASB తర్జుమా చేస్తుంది (1:5; 6:17; 16:26), అయితే యిక్కడ మాత్రం అలా చేయలేదు. సందర్భంలో, "లక్ష్యపెట్టు" అనే పదం "వినుట," "విశ్వసించుటకు" విధేయత అనే భావాన్ని స్ఫురింప జేస్తుందని తర్జుమాదారులు తలంచియుండవచ్చు. కారణమేమైయున్నా, వచనం 16 మొదటి భాగం KJV అక్షరార్థమైన తర్జుమా అయ్యున్నట్టు మనస్సులో ఉంచుకోవాలి: "అయితే వారందరు సువార్తకు లోబడలేదు."[9]

అది వాస్తవమైయున్నందున, "లోబడు" మరియు "నమ్ము" అనే పదాలను పర్యాయములుగా రోమా 10:16 ఉపయోగించడం గమనార్హం (యితర ఉదాహరణల కొరకు, యోహాను 3:36; హెబ్రీయులకు 3:18, 19లను చూడు). మరల, KJVని ఆలోచించుదాం: "అయితే వారందరు సువార్తకు లోబడలేదు ఎందుకంటే **ప్రభువా,** మేము తెలియజేసిన సమాచారమెవడు నమ్మెను అని [యెషయా] చెప్పుచున్నాడు." విశ్వాసమువలన నీతిమంతులుగా తీర్చబడడాన్ని గూర్చి వేరే చోట్ల చెప్పేదానితో యిక్కడ పౌలు మాటలు అనుగుణంగా ఉన్నాయి. మనం విశ్వాసపు ఆధారం మీద రక్షింప బడతాం, కాని కంపించే, చురుకైన విశ్వాసం. Larry Deason యిలా రాశాడు, "రోమా 10లోని పౌలు పాయింటు 'విధేయత' యొక్క అవసరతతో, 'విశ్వాసమువలననైన నీతికి' తారతమ్యాన్ని చూపడం లేదు, కాని (చట్టం యొక్క క్రియల మీద) తనమీద ఆనుకొనడానికిని క్రైస్తవుడు నీతిని సమీపించుటలో (విధేయతతో కూడిన విశ్వాసం మీద) క్రీస్తు మీద ఒరగడానికిని వ్యత్యాసాన్ని తేటగా చూపుతున్నాడు."[10]

"విధేయతతో కూడిన విశ్వాసంలో" ఇమిడియున్నదేమి (16:26; 1:5 చూడు)? పౌలు మారుమనస్సు (2:4), ఒప్పుకొనుట (10:9, 10), బాప్తిస్మం (6:3–6), శరీరము ననుసరింపక ఆత్మననుసరించియే నడుచుకొనుట (8:4) అనే విషయాలను చర్చించాడు. దేవుని ఏర్పాటులోని చివరి మెట్టులో యిదంతా చేర్చబడింది.

(5) ఈ ఏర్పాటులో చివరిది ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయడం. " 'ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును' " అనే కొటేషన్‌తో వచనాలు 14, 15 తొలి పలుకులుగా నిలిచాయి (13 వచనం; నొక్కి చెప్పింది నాది; యోవేలు 2:32). మన విశ్వాసము ఆ యా వాస్తవాలను కేవలం మానసికంగా అంగీకరించడం కాదు, అది హృదయపూర్వకమైన ప్రత్యుత్తరమైయున్నది (9, 10 వచనాలు). యేసును గూర్చిన సువార్త విశేషమునకు మరియు ప్రభువునకును ఆయన మార్గంవైపుకు తిరుగుటయందు ఫలిస్తుంది. 10:13కు సంబంధించి "ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేయుట" అనేదానిలో చేర్చబడినదాని విషయం చర్చించాం.

దేవుని పరిపూర్ణమైన ప్లాన్ యొక్క దృశ్యమంతటిని మనం చూడ సిద్ధంగా ఉన్నాం:

(1) దైవికమైన ఆదేశం

↓

(2) సువార్త ప్రకటన

↓

(3) గ్రహింపుతో అంగీకారంతో వినుట

↓

(4) విధేయతతో కూడిన విశ్వాసం

↓

(5) ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయుట

(4) లేకుండ (5) సాధ్యం కాదు, (3) లేకుండ (4) సాధ్యం కాదు – అంటూ (1) యొద్దకు వెళ్లడమే. ఇక్కడ కన్పించే ప్రాథమిక సత్యమేమంటే, సువార్త ప్రకటించే వారికి దైవికమైన ఆదేశముంది. దేవుడు తన సంకల్పాన్ని గమనంలో ఉంచాడు. ఇది అటు యూదులు, యిటు అన్యజనుల కొరకైన ఏర్పాటు (12 వచనం). ఈ విధంగా, ఇశ్రాయేలు రక్షణ కొరకు దేవుడు ఏర్పాటు చేశాడు.

### వ్యక్తిగతమైన (ప్లాన్) ఏర్పాటు (13–17 వచనాలు)

మానవ రక్షణ కొరకు యిది దేవుని సంకల్పమైయుంది. అది పరిపూర్ణమైన ఏర్పాటు, ప్రతి ఆత్మ యొక్క రక్షణ దీని ఫలితమైయుండవచ్చు. అయినా, ప్రతి ఆత్మయు రక్షణ పొందదు. అందువలననే దేవుడు పరిపూర్ణమైన (ప్లాన్) ఏర్పాటునిచ్చాడు – అయితే ఏమయ్యింది అని దీని తలరాతలోనే అడిగాం: ఆ ప్రశ్నకు జవాబును కొంచెం సేపట్లో చర్చిస్తాం; కాని దానికి ముందు, మనం యిప్పుడే చదివిన వచనాలకు అధికమైన వర్తింపులను చేద్దాం.

ఈ వచనాలు తరచుగా మిషన్ వర్క్ ప్రోత్సహించడానికి ఉపయోగింపబడతాయని ముందుగా గమనించాం. ఆ సందర్భంలో, "పంపుట" అనే మాటమీద సాధారణంగా నొక్కి చెప్పడం జరుగుతుంది: "మనం పంపితేనే గాని మిషినెరీలు ఉండరు [వారిని ఆర్థికంగా సపోర్టు చేయడంతో సహా]." అయినా, సందర్భంలో, దేవుడు ఆదేశించేది ("పంపడమనేది") ప్రజలు ఉపదేశించి ప్రకటించడానికి సంబంధించిందని నేనంటాను. స్థానికంగానేమి, యితర దేశాల్లోనేమి మిషన్ వర్క్ చేయడానికి యిందులో ప్రోత్సాహం లేదని దాని అర్థమా, కాదు. ఈ వచనాలలో సువార్త చేయడానికి శక్తివంతమైన భావాన్ని కలిగించేది ఉంది.

దేవుని ఏర్పాటు యొక్క దృశ్యాన్ని మరోసారి చూడు. మానవ జాతిని రక్షించడానికి యిదే

దేవుని ఏకైక సంకల్పమైయుంటుందని గ్రహించు. మన పాఠం యొక్క ఆరంభంలో, నేనైతే ప్లాన్ B, C లేక Dకి మార్చుకోవలసి వస్తుందని ప్రస్తావించాను. దేవునికైతే B, C లేక D ప్లాన్ లేదు, ప్లాన్ A మాత్రమే ఉంది: బాధ్యతగల ప్రజలు విని, విశ్వసించి, లోబడునట్లు సువార్త ఉపదేశింపబడవలసియుంది.

నశించినవారిని రక్షణలోనికి నడిపించడానికి మత ప్రపంచం పలు విధములగు మానవ కల్పిత పద్ధతులను పన్నారు (అందులో "పరిశుద్ధాత్మ నేరుగా పని చేసే పద్ధతి" అని చెప్పబడేది కూడ చేర్చబడింది). మనం జాగ్రత్తగా లేకుండే, వేరైన ఏర్పాట్లను కల్పించే దోషం చేసినవారమైయుంటాం. దశాబ్దాలుగా నేను ప్రకటించేదానిలో, ఎక్కువ బాప్తిస్మాలు, పెద్ద ఎత్తున సంఘాభివృద్ధి "హామీ యిచ్చే" అనేక పద్ధతులను గూర్చిన ప్రతిపాదనలను నేను విన్నాను. ఈ పద్ధతులు కొన్నింటిలో సుకృతాలున్నాయి, కాని చెప్పబడినవన్నీ చేసినా, వాక్యం వినుటవలన విశ్వాసము కలుగును అనే వాస్తవంనుండి ఎన్నడూ దృష్టిని మరల్చకూడదు. సువార్త ప్రకటింపబడనియెడల, విశ్వాసం ఉండదు గనుక రక్షణ కూడ ఉండదు.

పలు సంవత్సరాల క్రిందట "లైఫ్‌స్టైల్ ఇవాంజిలిజం" అంటూ ప్రజలు ఉబలాట పడిపోయారు. ఈ విధానం మీద నేను పుస్తకాలు చదివాను, క్లాసులు కూడ ఉపదేశించాను. ఇది దాన్ని మెచ్చుకోవలసిన పద్ధతే. వారికి సువార్త ప్రకటించునట్లు యిది మనకు, యితరులకు వంతెనలు నిర్మిస్తుంది. అయినా, కేవలం "క్రైస్తవ జీవిత విధానాన్ని" జీవించడంతోనే మనం గ్రేట్ కమీషన్ నెరవేర్చుతామని కొందరు తీర్మానించగా నేను భయపడ్డాను. మనం క్రైస్తవ జీవితాలు జీవించకుండ మన సందేశాన్ని ప్రజలు వినగోరరు అనేది నిజమే. అయినప్పటికిని, ఒకడు క్రైస్తవ జీవితం జీవించుతున్నంత మాత్రానే యితరులలో విశ్వాసం రాదు. అది క్రీస్తును గూర్చిన సందేశం వినుటవలన కలుగుతుంది. ఇతరులకు ఉపదేశించే ఏ పద్ధతిని, ఏ విధానాన్ని అనుసరించినా, అంతంలో, మాటల్లో యేసు యొక్క సందేశాన్ని వారికి చెప్పవలసియుంది.

వెళ్లడానికి ప్రభువు మనకు "మార్చింగ్ ఆర్డర్స్" యిచ్చారు (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16). ఆయన ఆదేశాన్ని కొనసాగించడానికి రోమా 10:14, 15 అధికమైన ప్రోత్సాహాన్ని యివ్వాలి. "సంఘం యొక్క ఉద్దేశాల్లో ఒకటి పరలోకపు జనాభాను వృద్ధి చేయడమైయుంది"[11] అని Dale Hartman ఒకసారి అన్నాడు. ఆ ఉద్దేశాన్ని మనం నెరవేర్చుతున్నామా?

## యూదులకు సమస్య ఉంది (10:16-21)

### సమస్య పరిశీలించబడింది (16, 17 వచనాలు)

మన మూలవాక్యం యొక్క ప్రధానాంశంనొద్దకు వద్దాం: యూదులను రక్షించడానికి దేవునికి పరిపూర్ణమైన ఏర్పాటు ఒకటుంది. విషాదకరంగా, యూదులు వినడానికి నిరాకరించారు, నమ్మడానికి నిరాకరించారు, ప్రభువైన యేసుకు లోబడ నిరాకరించారు. 16వ వచనం యిలా ఆరంభమౌతుంది, "అయినను, అందరు సువార్తకు [శుభవార్తకు]

లోబడలేదు [లక్ష్యపెట్టలేదు]" (16ఎ వచనం). సందర్భంలో, "వారు" అన్నది యూదులను సూచిస్తుంది (NIV చూడు). "వారందరు శుభవార్తను లక్ష్యపెట్టలేదు" అనేది నిజం కంటె తక్కువ ప్రతిపాదనయై ఉంది ఎందుకంటే ఇశ్రాయేలులో చిన్న శాతం ("శేషం"; 9:27) సువార్తకు లోబడ్డారు.

దేవునికి యిదేదో వింతగా లేదు అని పౌలు దీన్ని తేటపరచాడు: " 'ప్రభువా, మేము తెలియజేసిన సమాచారమెవడు నమ్మెను' అని యెషయా చెప్పుచున్నాడు గదా?" (10:16బి). యెషయా 53లోని ఆరంభపు వచనంనుండి ఈ కొటేషన్ వచ్చింది, మెస్సీయ శ్రమనొందిన సేవకునిగా చిత్రించిన గొప్ప అధ్యాయమది. శక్తివంతుడు విజయశాలియైన వీరుడుగా యూదుల్లో అనేకులు మెస్సీయాను గూర్చి తలంచారు. ఈ హేతువుచేత యెషయా 53 మెస్సీయకు సంబంధించిన అధ్యాయమని అనేకమంది యూదులు నమ్మలేకపోయారు, అయితే అపొస్తలుల కార్యములు 8:32-34 చూడు. అదే రకమైన పరపక్ష ద్వేషము చివరికి ఆయన ప్రత్యక్షమైనప్పుడు, మెస్సీయ (యేసు)ను నిరాకరించేలా చేసింది (యోహాను 12:37-41 చూడు).

రోమా 10:13-15లో వివరించబడిన ఏర్పాటు యొక్క దృష్టి క్లుప్తంగా వచనం 17లో పౌలు యిచ్చాడు: "కాగా [అంగీకారంతో] వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును." అది పరిపూర్ణమైన ఏర్పాటు, అయితే ఈ ఏర్పాటును ఎవరు చిక్కుపెట్టారు? యేసు యొక్క సందేశాన్ని తీక్షణంగా ఆలకించ నిరాకరించి యూదులే ఈ తప్పు చేశారు. ఆయన భూనివాస కాల పరిచర్యలో, యేసు యెషయా 6:10నుండి కోట్ చేశారు: "ఈ ప్రజలు కన్నులార చూచి, చెవులార విని, హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నావలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది, వారి చెవులు వినుటకు మందములైయున్నవి. ... మీరు వినుట మట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు ..." (మత్తయి 13:15). తన జత ఆటగాడి మాట వినబడకుండునట్టు చెవులు మూసికొనిన బాలుని పోలి కొందరు యూదులున్నారు.[12] మరికొందరైతే నావలె ఏదో పనిపై ఉండి వినిపించుకొనని వానివలె ఉండవచ్చు.[13] కారణం ఏమైయున్నా సరే, యూదులు వినడంలో తప్పిపోయారు గనుక నమ్మడంలో తప్పిపోయారు.

**ఆక్షేపణలకు బదులు చెప్పబడింది (18-21 వచనాలు)**

దేవుడు వారిని నిరాకరించడంలో వారిదే తప్పు అని యూదులు అంగీకరించడం కష్టమని పౌలుకు తెలుసు. అందువలన, ఎవరైనా చేయజూచే ఆక్షేపణలను పౌలే వ్యక్తపరచు తున్నాడు. మొదటిది, యూదులకు వినే అవకాశం లేకుండపోయింది అనేది కావచ్చు: "వారు వినలేదా?" అన్న తక్షణమే (రోమా 10:18ఎ). "వారు విన్నారు గదా?" (18బి వచనం) అని పౌలు బదులిచ్చాడు, మరియొక లేఖన భాగాన్ని కోట్ చేశాడు: "వారి స్వరము భూలోకమందంతటికిని, వారి మాటలు భూదిగంతములవరకును బయలువెళ్లెను" (18సి వచనం). ఈ కొటేషన్ కీర్తన 19:4నుండి తీయబడింది. సందర్భం సూర్య, చంద్ర, నక్షత్రముల సార్వత్రిక సాక్ష్యమును సూచిస్తుంది. ఆకాశ జ్యోతులు ఎంతో

విస్తారంగా వెలుగును వెదజల్లుతున్నట్టే, సువార్త ప్రకటన కూడ జరుగుతున్నట్టు కీర్తన 19 భాషను పౌలు ఉపయోగించాడు.

"భూలోకమందంతటికిని," "భూదిగంతములవరకు" అనే ప్రయోగాలవలన, పౌలు రోమా పత్రిక వ్రాసేనాటికే వీలైన ప్రాంతాలన్నిటిలో సువార్త ప్రకటింపబడిందని అర్థం కాదు. ఈ పత్రికలో తరువాత అతడు స్పెయిన్‌కు వెళ్లాలనియున్నాడు (రోమా 15:28), క్రీస్తు "నామము అక్కడ అప్పటికి తెలియబడని" దేశమైయున్నట్టు పౌలు మాట్లాడాడు (20 వచనం). రోమా 10:18లోని పద ప్రయోగం సువార్త వినడానికి యూదులకు అవకాశం యివ్వబడిందని స్థాపించడానికే. ఆ కాలంలో, యూదుల్లో అనేకులు మధ్యధరా సముద్రపు చుట్టు ప్రక్కల నివసించారు, ఆ ప్రాంతంలోని దాదాపు సగం భాగానికి పౌలే సువార్తను ప్రకటించాడు.

పౌలు ఎదురు చూచిన రెండవ ఆక్షేపణ ఏమంటే, యూదులు వినినప్పటికిని, ఏమి సంభవించుతున్నదో వారు నిజంగా అర్థం చేసికోలేదు. ఈ హేతువును బట్టి, మానవ తర్కం ప్రకారం, వారు బాధ్యులుగా ఎంచబడరట: "మరియు నేను చెప్పున దేమనగా, ఇశ్రాయేలుకు తెలియకుండెనా?" (19ఎ వచనం). దీనికి పౌలు జవాబేమంటే, అది వారికి తెలిసియుండాలి వారు దానిని గ్రహించియుండాలి ఎందుకంటే జరిగింది ప్రతిదీ లేఖనములయందు ముందుగా ప్రవచింపబడింది.

పౌలు యిలా అన్నాడు, " 'జనము కాని వారివలన మీకు రోషము పుట్టించెదను, అవివేకమైన జనమువలన మీకు ఆగ్రహము కలుగజేతును' " అని "మొదట" మోషే చెప్పుచున్నాడు (19బి వచనం). ఇది ద్వితీయోపదేశకాండము 32:21నుండి కొటేషన్. వారి కృతజ్ఞత లేమికిని, అవిధేయతకును మోషే వారిమీద మోపుతున్న నేరంలో యిది భాగము. ఇశ్రాయేలును అణచి శిక్షించడానికి దేవుడు అన్య దేశాలను ఉపయోగించు కుంటాడని మోషే ప్రవచించాడు. "Not a nation" అనే ప్రయోగంలో, హోషేయ 1:10లోని భావం వంటిదానిని పౌలు చూచాడు. "జనము కానివారిని" అని రోమా 10:19లో సూచించింది "నా ప్రజలు కానివారు" అని రోమా 9:26లో పిలువబడ్డారు – అంటే అన్యజనులని (అర్థం). యూదులకు సంబంధించినంతమట్టుకు, అన్యజనులు "గ్రహింపులేనివారని." (2:19 మీద కామెంట్స్ చూడు.)

తరువాత అధ్యాయంలో, అన్యజనులను అంగీకరించడంవలన యూదులను విధేయతకు ప్రేరేపించాలని దేవుడు ఎలా ప్లాన్ చేశాడో పౌలు విస్తరించి పలికాడు (11:11, 13, 14 గమనించు). ఇక్కడ, దేవుడు అన్యజనులను అంగీకరిస్తే అది యూదులకు షాకు కానవసరం లేదు ఎందుకంటే ఆ విషయాన్ని మోషే ముందుగా చెప్పాడని అతడు సాధారణంగా చెప్పుతున్నాడు. "గ్రహింపు లేనివారు" అనే ప్రయోగంలో గుప్తమైనదేదైనా ఉండాలి: అన్యజనులు "గ్రహింపులేనివారని" చెప్పబడినవారే దేవుని సంకల్పం యొక్క గ్రహింపుకు రాగలిగినట్లయితే, దేవునిచే ఏర్పరచబడిన ఉపదేశకుల వరుసచే దీవించబడిన యూదులు – ఎంతగా దాన్ని అర్థం చేసికోగలిగియుండాలో. గనుక వారు నిరుత్తరులైయున్నారు.

పౌలు మరోసారి పాత నిబంధననుండి కోట్ చేస్తున్నాడు: "మరియు యెషయా

తెగించి, 'నన్ను వెదకనివారికి నేను దొరికితిని; నన్ను విచారింపనివారికి ప్రత్యక్షమైతిని' అని చెప్పుచున్నాడు" (10:20). ఈ కొటేషన్ యెషయా 65:1ది. అసలైన మూలవాక్యంలో, ఆ మాటలు తిరుగుబాటు చేసిన ఇశ్రాయేలీయుల సందర్భమైయుండ వచ్చు. అన్యజనులకు వర్తింపజేయు సందర్భం ఉన్నట్టు పౌలు గుర్తిస్తున్నాడు. 9:30లో ఉపదేశించిన సత్యాన్ని పౌలు మరోసారి అంటున్నాడు: "నీతిని వెంటాడని," "దేవుని వెదకని" అన్యజనులు ఉభయులను కనుగొన్నారు ఎందుకంటే, సువార్త సందేశాన్ని వారు తమ హృదయాలను తాకనిచ్చారు.

సువార్త వినే అవకాశము యూదులకు కలిగినట్టయితే, వారు దేవుని ఏర్పాటును అర్థం చేసికోగలిగియున్నట్టయితే యిక సమస్య ఏముంది? సమస్యను సాధారణంగా చెప్పాలంటే, యూదులు మొండికి తిరిగిన తిరుగుబాటు జనులు. పౌలు మరొక కొటేషన్ యెషయానుండి వాడాడు: " 'అవిధేయులై యెదురాడు ప్రజలకు నేను దినమంతయు నా చేతులు చాచితిని' " (10:21). ఇది యెషయా 65:2నుండి (పౌలు ముందు కోట్ చేసిన వచనం తరువాతది). ఇశ్రాయేలు జాతీయ చరిత్ర చదువు. అది అవిశ్వాసము అవిధేయత యొక్క కథయే. ఇశ్రాయేలీయులు మానక, దేవుని హృదయాన్ని పగులగొట్టుతునే ఉండిరి. వారు గతంలో ఉన్నట్టే, వారి విమోచన కొరకైన దేవుని ఏర్పాటు విషయంలో పౌలు దినాల్లో కూడ ఉంది. NASB వారిని "obstinate" అంటే "మొండికి తిరిగినవారని" అంటుంది. "వారు నాకు అవిధేయులైయుంటూ నాతో వాదిస్తున్నారు" అని NLT అంటుంది.

యూదుల నిరీక్షణ ఏదైనా ఉందా? యెషయానుండి కొటేషన్ మాటలను నిర్లక్ష్యం చేయకు: "... దినమంతయు నా చేతులు చాచితిని ..." తిరుగుబాటు చేస్తున్న తన కుమారుని ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండి, సహనముతో తన చేతులు చాపియుంచిన తండ్రిగా దేవుడు చిత్రింపబడ్డాడు. యూదులు దేవునియొద్దకు తిరిగి వచ్చి ఆయన ఏర్పాటు అంగీకరించినట్టయితే, ప్రేమగల తన హస్తములతో ఆయన వారిని ఆలింగనము చేసికొంటాడు. రోమా 11 మీద మన పఠనంలో దీనిమీద ఎక్కువ యింకా చెప్పవలసి యుంది.

## ముగింపు

దేవుడు ఒక (ప్లాన్) ఏర్పాటును తయారుచేశాడు – మానవ రక్షణ కొరకు – పరిపూర్ణమైన ప్లాను అది.[14] విషాదకరంగా, నాడేమి, నేడేమి యూదులు విశ్వసించి విధేయులగుటకు మొండికి తిరిగారు. అయినా, యూదులవైపు నేరారోపణ చేసే వ్రేలును గూర్చి మనం జాగ్రత్తగా ఉందాం. మనం వ్యక్తిగతమైన వర్తింపు చేసికోవాలి. నేను "సువార్త విని ... క్రీస్తునందు విశ్వాసముంచి ... క్రీస్తువారి ఆజ్ఞలకు లోబడియున్నానా?" అంటూ ప్రతి ఒక్కరు తననే ప్రశ్నించుకోవాలి. విశ్వమంతటిలోను దేవుడు కోరిన చోట ఉండని, దేవుడు కోరుకున్నది చేయనిది ఒకే ఒక నరుడు అని యిటీవల Dale Hartman అన్నాడు.[15] సూర్య, చంద్ర నక్షత్రాదులు, వాటికి దేవుడు ఏర్పరచిన వలయంలో ఆకాశమందు పయనిస్తాయి. వృక్షములు, జంతువులు కూడ ఎలా ఉండడానికి దేవుడు

వాటిని నిర్మించాడో అలా అవి ప్రవర్తిస్తాయి. కేవలం నరుడు మాత్రమే దేవుడు ఉండ మని కోరినట్లు ఉండడు మరియు దేవుడు వాని కోరినట్లు చేయడు. నీ సంగతి ఏమిటి? దేవుడు ఎలా ఉండమని నిన్ను కోరాడో నీవు అలా ఉన్నావా? దేవుడు కోరినదానినే నీవు చేస్తున్నావా?

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

దేవుని ఏర్పాటు యొక్క దృశ్యాన్ని ప్రదర్శించు - చాక్‌బోర్డు మీద వ్రాయి - పేపరు మీద గాని, కార్డుమీద గాని వ్రాయి. పాఠం కొనసాగేకొలది దాన్ని మాటిమాటికి చూపవచ్చు.

ఈ పాఠంలో, వ్యక్తిగత సువార్తను నేను నొక్కి చెప్పాను. రోమీయులకు మీద John R. W. Stott వ్యాఖ్యానాలలో, 9నుండి 11 అధ్యాయాల్లో "సువార్త కొరకైన చట్టం Manifesto" అన్నాడు.[16] అందరు నశించిపోయారు, అందరు వినవలసిన అవసరముంది. అందరు సువార్తను యితరుల రక్షణ కొరకు పంచుతూ దేవుని మహిమపరచాలి. అతని ఉద్దేశాన్ని సువార్త చేసే పాఠం కొరకు వాడుకోవచ్చు.

---

సూచనలు

[1]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 560. [2]Ibid., 481. [3]రోమా, 1 పుస్తకం "అసలు విషయం (1:16, 17)" మీద "సువార్త" పాఠాన్ని చూడు. [4]KJV "దేవుని వాక్యము" అని ఉంది. "క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" "క్రీస్తును గూర్చి దేవుని వాక్యము" అనే సందేశంగా ఆలోచింపవచ్చు. [5]James D. G. Dunn, *Romans 9-16,* Word Biblical Commentary, vol. 38b (Dallas: Word Books, 1988), 623. [6]Jim McGuiggan, *The Book of Roma*ns, Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1982), 312. [7]Vine, 438. [8]విధేయతకు సంబంధించి ఏ సూచనయైనా దాన్ని *hupakouo*లోనుండి తొలిగించాలని కొన్ని తర్జుమాలు (ప్రత్యేకించి ఒక మనిషి తర్జుమాలు) ప్రయత్నించాయి - అయినా అది అక్కడుంది. [9]2 థెస్సలొనీకయులకు 1:8 NASBలో "సువార్తకు లోబడని" అనే ప్రాథమిక గ్రీకు తర్జుమా ఉంది. "ఉపదేశ క్రమము (6:3–6, 17, 18)"లో "సువార్తకు లోబడుటను" గూర్చి పరిచయం చూడు, రోమా, 2 పుస్తకం. [10]Larry Deason, *"The Righteousness of God": An In-depth Study of Romans,* rev. (Clifton Park, N.Y.: Life Communications, 1989), 260.

[11]Dale Hartman, sermon preached at Eastside church of Christ, Midwest City, Oklahoma, 16 November 2003. [12]నీ శ్రోతలకు వర్తించే ఉదాహరణను ఉపయోగించు. మా దేశములో చెవులో ఇయర్ ఫోన్ పెట్టుకొని వినోద సంగీతాన్ని వింటున్న యౌవనులు యితరులు చెప్పేది వినిపించుకోరు అనే ఉదాహరణను సూచిస్తాను. [13]నా జీవితమంతటిలో, మరి దేనికంటెను యిది నాకు ఎక్కువ కలతను కలిగించింది. [14]ఆ ఏర్పాటును నీవు రివ్యూ చేయవచ్చు. [15]Dale Hartman, sermon preached at Eastside church of Christ, Midwest City, Oklahoma, Spring 2005. Brother Hartman "నరుడు" అనే పదమును స్త్రీ పురుషులిరువురిని సూచించే పదంగా ఉపయోగించాడు. [16]John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 313-15.

## 48

# పాపుల పట్ల దేవుడు ఆశ వదులుకుంటాడా?

## (11:1-12)

అధ్యాయం 10లో అనేకులైన యూదుల ఆత్మ సంబంధమైన స్థితిని గూర్చి పౌలు తేటగా మాట్లాడాడు. వచనాలు 1, 2లో అతడిలా అన్నాడు, "సహోదరులారా, ఇశ్రాయేలీయులు రక్షణపొందవలెనని నా హృదయాభిలాషయు, వారి విషయమై నేను దేవునికి చేయు ప్రార్థనయునైయున్నవి. వారు దేవునియందు ఆసక్తిగలవారని వారిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను; అయినను వారి ఆసక్తి జ్ఞానానుసారమైనది కాదు." "– యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు" అని అతడు నొక్కి చెప్పాడు (9 వచనం). యూదులలో అనేకులు యేసునందు నమ్మికయుంచ లేదు, పైగా వారాయనను ఒప్పుకొన నిరాకరించారు. వారు "అవిధేయులై యెదురాడు ప్రజలైనట్టు" యెషయానుండి కోట్ చేస్తూ, అతడు ఆ అధ్యాయాన్ని (21 వచనం) ముగించాడు. ఒకప్పుడు తన నిబంధన జనముగా ఉండిన యూదుల పట్ల తనకు అభిలాష ఏ మాత్రమును లేనట్టును ఆయన వారిని విడిచిపెట్టినట్టును పౌలు చెప్పుచున్నాడా? ఆ ప్రశ్నకు 11వ అధ్యాయంలో జవాబుంది.

ఏదియెలాగున్నా, రోమా 9–11లో చర్చయందున్న పరిస్థితిని దాటి ఆ ప్రశ్నలోని సంగతులు గుప్తమైయున్నాయి. జనులు యింకా నశించిపోతున్నారు. కొందరికి ఆసక్తి ఉంది, అయితే అది జ్ఞానానుసారమైనది కాదు. అనేకులు నమ్మరు, ఒప్పుకొనడంలో తప్పిపోయారు. "అవిధేయులు," "లోబడనొల్లనివారు" అనేది పాపిష్ఠి లోకానికి బిరుదులై ఉన్నాయి. దేవుడు నేడు పాపులను వదులుకున్నాడా? నీ స్నేహితుల్లో, కుటుంబంలో, లేక పొరుగువారిలో దేవుడు ఎవరినైనా వదులుకున్నాడా? దేవుడు నీ మీద ఆశ వదులుకున్నాడా? ఈ ప్రశ్నలకు లోనణగియున్న నిత్యమైన అర్థాలున్నాయి.

### యూదుల నిరాకరణ సంపూర్తి కాలేదు (11:1-10)

కీర్తన 94:14[1] యొక్క పదజాలాన్ని ప్రతిధ్వనించే ప్రశ్నతో పౌలు ఆరంభించాడు: "ఆలాగైనయెడల, నేనడుగునదేమనగా, దేవుడు తన ప్రజలను విసర్జించెనా?" (రోమా 11:1ఏ). సందర్భంలో, "తన ప్రజలు" అనేది ఇశ్రాయేలును సూచిస్తుంది. "అట్లనరాదు!" అంటూ ఆ ప్రశ్న వెంట దిగ్భ్రమ కలిగించే జవాబు యిచ్చాడు (1బి వచనం). "తాను

ముందెరిగిన తన ప్రజలను దేవుడు విసర్జింపలేదు" అని అతడు వచనం 2లో తెలిపాడు (నొక్కి చెప్పింది నాది).

దేవుడు ఇశ్రాయేలును విడిచిపెట్టలేదని పౌలు నిశ్చయంగా చెప్పాడు – అయితే, ఈ అధ్యాయంలో, తన "రక్త సంబంధులను" అతడు సూచించాడు, "వారు నిరాకరింప బడినట్టు" మాట్లాడాడు (14, 15 వచనాలు). ఈ రెండు ప్రతిపాదనలు పరస్పర విరుద్ధాలుగా కన్పిస్తాయి: దేవుడు ఇశ్రాయేలును నిరాకరించలేదు ... దేవుడు ఇశ్రాయేలును నిరాకరించెను. ఈ రెండు ఆలోచనలను మనమెట్లు సమన్వయపరచగలము? 9:6లోని అపొస్తలుని ప్రతిపాదనకు తిరిగి వెళ్లు: "ఇశ్రాయేలు సంబంధులందరు ఇశ్రాయేలీయులు కారు." పెద్ద వృత్తంలోని చిన్న వృత్తం చూపబడిన చార్టును గుర్తు తెచ్చుకో:




దేవుడు ఇశ్రాయేలులో అనేకులను నిరాకరించాడు (పెద్ద వృత్తం), యేసునందు విశ్వాసముంచిన యూదులను ఆయన నిరాకరించలేదు (చిన్న వృత్తం). మనం 11వ అధ్యాయం గుండా వెళ్లుతున్నప్పుడు ఈ వ్యత్యాసాన్ని మనస్సులో ఉంచుకో. ఈ అధ్యాయం యేసునందు విశ్వాసముంచిన యూదులు దేవుని "ప్రజలుగా" (1 వచనం), "దేవుడు ముందెరిగిన ప్రజలు గాను" (2 వచనం), "ఏర్పాటునొందినవారు" (7 వచనం) అని చిత్రించబడ్డారు.

**రుజువు (1సి, 2ఎ వచనాలు)**

ఇశ్రాయేలు జాతిని దేవుడు విడువలేదనడానికి రుజువుగా పౌలు తన్నుతాను చూపుకున్నాడు:[2] "నేనుకూడ ఇశ్రాయేలీయుడను, అబ్రాహాము సంతానమందలి బెన్యామీను గోత్రమునందు పుట్టినవాడను" (1సి వచనం; ఫిలిప్పీయులకు 3:5తో పోల్చి చూడు). పౌలు "ఇశ్రాయేలులోని ఇశ్రాయేలులో" భాగమైయున్నాడు: వారు యేసును మెస్సీయగా అంగీకరించిన యూదులు.

పౌలు యూదుడైయుండి దేవునిచే అంగీకరింపబడినందున, అతడు యిలా తీర్మానించ గలుగుతున్నాడు, "తాను ముందెరిగిన తన ప్రజలను దేవుడు విసర్జింపలేదు" (2ఎ వచనం). ముందుగా చర్చించినట్టే, దేవుని భవిష్యత్ జ్ఞానము మానవ స్వేచ్ఛా

చిత్తాన్ని రద్దుపరచదు.[3] దేవుడు ఎవరిని "ముందుగా ఎరిగెనో" వారు సువార్త పిలుపుకు లోబడ్డారు (2 థెస్సలొనీకయులకు 2:14), విశ్వాసం ద్వారా (రోమా 1:16) అందునుబట్టి వారు నీతిమంతులుగా తీర్చబడ్డారు (రోమా 5:1). ఈ యోగ్యతలున్న ఏ యూదుని దేవుడు నిరాకరించలేదు.

**సమాంతరం (2బి–4 వచనాలు)**

అనేకమంది యూదులకు ఈ యోగ్యతలు లేవు – అయితే అది ఆశ్చర్యం కలిగించ నక్కరలేదు. ఎందుకంటే, ఇశ్రాయేలు చరిత్ర అంతటిలో, యూదా జనాంగంలోని కేవలం అల్ప భాగమే దేవుని వెంటాడింది. బాగుగా ఎరుకైన పాత నిబంధన గాథలో యిది వాస్తవమైయుంది.

> ఏలీయాను గూర్చిన[4] భాగములో లేఖనము చెప్పునది మీరెరుగరా?[5] "**ప్రభువా**, వారు నీ ప్రవక్తలను చంపిరి, నీ బలిపీఠములను పడగొట్టిరి,[6] నేనొక్కడనే మిగిలియున్నాను, నా ప్రాణము తీయజూచుచున్నారు" అని ఇశ్రాయేలునకు విరోధముగా దేవుని యెదుట అతడు వాదించుచున్నాడు (2బి, సి వచనాలు).

ఏలీయా మాటల పూర్వ గాథ నీకు జ్ఞాపకం ఉండియుండవచ్చు.[7] కర్మేలు పర్వతమునొద్ద ఆ ప్రవక్త బయలు దేవతా[8] ప్రవక్తలపై జయమొందాడు (1 రాజులు 18). ఆ విజయం దేశ వ్యాప్తమైన ఉజ్జీవాన్ని మండించుతుందేమోనని అతడు ఎదురు చూచియుండవచ్చు. దానికి బదులుగా, రాణియైన యెజెబెలు అతని చంప వెదకినప్పుడు, తన ప్రాణ రక్షణ కొరకు అతడు పారిపోవలసి వచ్చింది (19:1–8). ఒంటరిగాడై, నిరాశపడిపోయి, తన నిరాశను దేవుని సముఖంలో అతడు యిలా కుమ్మరిస్తున్నాడు: "... ఇశ్రాయేలువారు నీ నిబంధనను త్రోసివేసి నీ బలిపీఠములను పడగొట్టి నీ ప్రవక్తలను ఖడ్గముచేత హతము చేసిరి, ... నేను ఒకడను మాత్రమే మిగిలియుండగా వారు నా ప్రాణమును కూడ తీసివేయుటకై చూచుచున్నారు" (1 రాజులు 19:10; 14 వచనం కూడ చూడు). నమ్మకమైన ఇశ్రాయేలు సంపూర్ణంగా తుడిచివేయడానికి అంచు మీద నిలిచియున్నట్టు ఏలీయా తలంచాడు.

కథకు అది ముగింపు కానందున నీకు కృతజ్ఞత గలవాడనైయున్నాను. అయితే పౌలు యిలా కొనసాగించాడు, "అయితే దేవోక్తి అతనితో [ఏలీయాతో] ఏమి చెప్పుచున్నది? 'బయలుకు మోకాళ్లూనని[9] యేడువేలమంది పురుషులను నేను శేషముగా నుంచుకొని యున్నాను' " (రోమా 11:4; 1 రాజులు 19:18 చూడు). దేవుని మాటలలోనుండి రెండు వర్తింపులను చేసికోవచ్చు. మొదటిది, ఇశ్రాయేలు జనాంగంలో కేవలం ఏడు వేల మంది అల్ప భాగమే.[10] ఆ ఏడువేల మందిని "ఇశ్రాయేలులో ఇశ్రాయేలు" అని మనం అనవచ్చు. ఏలీయా దినాల్లో, "నిజమైన ఇశ్రాయేలు" ఇశ్రాయేలు జనాంగంలో కేవలం ఒక చిన్న భాగమై యుండినందున, ఆలాటి పరిస్థితి పౌలు దినాల్లో ఉందంటే యూదులు ఆశ్చర్యపడనవసరం లేదు.

అయినా, రోమా 11లోని ప్రాథమిక వర్తింపు ఏమంటే, ఏడువేలమంది అల్ప

సంఖ్యయే అయినా, ముఖ్యమైన సంఖ్యయే. ఈ ఏడువేలమంది భార్యలను, పిల్లలను కలిపితే, వారి సంఖ్య ఇరవై వేలవరకైనా వచ్చియుండవచ్చు. ఏలీయా మనస్సులో ఉండిన దానికంటే యిది ఎంతో హెచ్చయినది. పౌలు దినాల్లో, ఎక్కువ మంది యూదులు దేవునిచే నిరాకరింపబడినవారైనా, ముఖ్యమైన సంఖ్య మాత్రం నిరాకరింపబడలేదు. పెంతెకొస్తు దినాన మూడువేలమంది యూదులు బాప్తిస్మం పొంది రక్షింపబడ్డారు (అపొస్తలుల కార్యములు 2:5, 37, 38, 41, 47). యెరూషలేములో యూదుల్లోనుండి వచ్చిన శిష్యుల సంఖ్య బహుగా విస్తరించింది. వారు పదులవేలవరకు పెదిగియుండ వచ్చు (అపొస్తలుల కార్యములు 2:47; 4:4; 5:14). యెరూషలేమునుండి సంఘం వేరుచేయ బడినప్పుడు (అపొస్తలుల కార్యములు 8:1, 4), అక్కడక్కడ యూదులు సువార్తకు అనుకూలంగానే స్పందించారు (అపొస్తలుల కార్యములు 14:1; 17:1-4, 10-12). మూడవ సువార్త ప్రయాణంలో పౌలు యెరూషలేమునకు తిరిగి వచ్చినప్పుడు, "సహోదరుడా, యూదులలో విశ్వాసులైనవారు ఎన్నివేలమంది యున్నారో[11] చూచు చున్నావు గదా?" అని పట్టణంలోని సంఘ నాయకులు సూచించారు (అపొస్తలుల కార్యములు 21:20). దేవుడు ఇశ్రాయేలును నిరాకరించలేదనడానికి ఆ "వేలమంది" తగిన రుజువైయుంది. ప్రత్యేకించి, (పెద్ద వృత్తంలో ఉన్న) ఇశ్రాయేలు దేశములో ఉన్న "తన ప్రజలను" (చిన్న వృత్తంలోవారిని) దేవుడు నిరాకరించలేదు.

**సూత్రం (5, 6 వచనాలు)**

ఏలీయా దినాలనుండి సమాంతరాన్ని గీచిన తరువాత, పౌలు యిలా కొనసాగి స్తున్నాడు, "ఆలాగుననే అప్పటి కాలమందు సయితము కృపయొక్క ఏర్పాటు చొప్పున శేషము మిగిలియున్నది" (రోమా 11:5). "శేషము" అనేది *leimma* నుండి తర్జుమా చేయబడింది; అంటే "మిగిలినది" అని అర్థం. (*Leimma* అనేది *leipo,* "విడిచిపెట్టుట"[12] అనేదానికి సంబంధించింది). "శేషము" యిర్మీయా 42:2లో "అనేకులలో కొద్దిమందిని" సూచిస్తుంది. రోమా పత్రికలోని ముందు భాగమందు, పౌలు యెషయాను కోట్ చేశాడు: "ఇశ్రాయేలు కుమారుల సంఖ్య సముద్రపు ఇసుకవలె ఉండినను శేషమే[13] రక్షింపబడును" (9:27). "అనేకులలోనుండి కొద్దిమంది" ఇశ్రాయేలీయులు మాత్రమే రక్షింపబడుదురని ప్రవచింప బడింది (పెద్ద వృత్తంలో చిన్న వృత్తం).

దేవుని దయను పొందడానికి వారు వేరుచేయడంలో, వారు చేసిన యోగ్యతా కార్యమును శేషించినవారని దాని అర్థమా? వ్యక్తిగతమైన యోగ్యతగాని, లేక సాధన గాని వారు అంగీకరింపబడుటకు హేతువు కాదని పౌలు దీన్ని తేటపరచగోరాడు, కాని అది దేవుని కృప కనికరముల ప్రదర్శనయై ఉంటుంది: అది "దేవుని కృపా ఏర్పాటును బట్టి జరిగింది."

"దేవుని కృపా ఏర్పాటును" ప్రస్తావించిన తరువాత, కృపా విధానంలో రక్షింపబడ డానికిని, క్రియల మీద ఆధారపడి రక్షింపబడే విధానానికిని మధ్యగల తారతమ్యాన్ని మిక్కిలి బలీయమైన తన ప్రతిపాదనతో వ్యక్తపరచాడు: "అది కృపచేతనైన యెడల ఇకను క్రియల మూలమైనది కాదు; కానియెడల కృప ఇకను కృప కాకపోవును" (11:6).

కృపచేత రక్షణ అనే భావన క్రియల మీద ఆధారపడిన రక్షణ అనే భావనతో పొసగనిదై యుంటుంది. మనం జరిగించిన దాన్నిబట్టి రక్షణ మనం సంపాదించుకున్నందున దేవుడు కృపచేత మనలను రక్షించాడనడం అర్థంలేని పలుకులై ఉంటాయి. "నేను మురికి చేసు కొనడంవలన శుద్ధుడనయ్యాను" అనిగాని, "నేలమీద ఉండడంవలన పక్షి గాలిలోనికి దూసికొనిపోయింది" అన్నట్టు ఉంటుంది. మన క్రియల ఆధారం మనం కృపచేత రక్షింపబడ్డాం అనడం "కృప" దాని అర్థాన్ని కోల్పోయినట్టే ఔతుంది. "కృప" యికను "కృప" కాకుండపోతుంది.

మనం 5, 6 వచనాలు వదలి వెళ్లక ముందు, "శేషము" అనే పదానికి సంబంధించి కొన్ని సంగతులు చెప్పాలి. శేషము యొక్క రక్షణను గూర్చి మాత్రమే బైబిలు ఎల్లప్పుడు తెలుపుతోంది (చిన్న భాగం)[14] నోవహు దినాలలో, భూమిమీద నివసించే వేలకొలది జనులలోనుండి కేవలం ఎనిమిది మంది (కొద్ది శేషము) సజీవులుగా మిగిలారు (1 పేతురు 3:20). సొదొమ గొమొఱ్ఱాలు నాశనమైనప్పుడు, లోతును అతని యిద్దరు కుమార్తెలు మాత్రమే (కొద్ది శేషము) బ్రదికారు (ఆదికాండము 19:15–26). యూదులు చెరలోనికి కొనిపోబడిన పిమ్మట, కొద్ది మంది మాత్రమే తిరిగి వచ్చారు (యెషయా 10:21). క్రొత్త నిబంధనలో, కొద్దిమంది రక్షింపబడతారు అనేకులు నశించిపోతారని యేసు ప్రవచించారు (మత్తయి 7:13, 14). "దేవుని ఆజ్ఞలు గైకొనుచు ... ఆమె సంతానంలో శేషించిన"[15] దేవుని ప్రజలను ప్రకటన వర్ణిస్తుంది (12:17; KJV). అధ్యాయం 11 మీద తరువాత రాబోయే పాఠంలో, కొన్ని లేఖన భాగాలతో మనం తంటాలుపడుతూ, ఈ ప్రాముఖ్యమైన సత్యాన్ని మనస్సులో ఉంచుకొనడం అవసరం: కేవలం శేషం మాత్రమే రక్షింపబడుతుందనేది సత్యం.

**హేతువు (7–10 వచనాలు)**

ఇశ్రాయేలులో కేవలం శేషం మాత్రమే ఎందుకు రక్షింపబడుతుంది? 7 నుండి 10 వచనాలవరకు పౌలు ఈ ప్రశ్నకు బదులిస్తున్నాడు. "ఆలాగైన ఏమగును? ఇశ్రాయేలు వెదకునది ఏదో అది వారికి దొరకలేదు" (7ఎ వచనం). ఇశ్రాయేలు (దేవునితో సరియైన స్థితిని) నీతిని వెంటాడినను వారు దానిని అందుకోలేదు, "ఎందుకంటే వారు విశ్వాసంతో (వలన) దానిని అనుసరించలేదు" (9:31, 32). పౌలు 11:7లో ప్రాథమికంగా చెప్పు సంగతి కూడ అదే: "ఇశ్రాయేలు వెదకునది ఏదో (దేవునితో సరియైన సంబంధం) వారికి దొరకలేదు."

అయినను, కొందరు ఇశ్రాయేలీయులు వారు కోరుకొనిన దానిని పొందారు: "ఏర్పాటు నొందినవారికి అది దొరికెను" (7బి వచనం). వీరు "నిజమైన ఇశ్రాయేలు" (పెద్ద వృత్తంలో చిన్న వృత్తం) వారు దేవునితో సరియైన స్థానాన్ని పొందారు. ఎందుకంటే వారు యేసునందలి "విశ్వాసాన్ని వెంటాడారు."

అప్పుడు, ఇశ్రాయేలులో ఎక్కువమందికి ఏమి సంభవించింది? "తక్కినవారు కఠిన చిత్తులైరి" అని మనం చదువుతాం (7సి వచనం). "కఠినపరచబడడం" *poroo* నుండి వచ్చింది, అంటే, "గట్టిపరచు" లేక "స్పర్శ లేకుండ చేయు" అని అర్థం.[16]

దేవుడు "ఎవని కఠినపరచగోరునో వాని కఠినపరచును" అని అధ్యాయం 9లో పౌలు ప్రకటించాడు (18 వచనం). ఒకడు తన సొంత హృదయాన్ని కఠినపరచుకొనకుంటే దేవుడు ఎవనినైనా కఠినపరుస్తాడని బైబిల్లో మనం ఎక్కడా చదువం[17] ఫరోను మనం ఉదాహరణగా చూచాం[18] (17 వచనం). (పెద్ద వృత్తంలోని) ఇశ్రాయేలుతో ఉన్న సమస్య ఏమంటే, వారు తిరుగుబాటు చేయువారు, అంగీకరించే హృదయాలు లేనివారు (మత్తయి 13:15; అపొస్తలుల కార్యములు 28:27 చూడు).

సాధారణంగానే, పౌలు తన ప్రతిపాదనను లేఖనాలతో నిలబెడతాడు. అతని తొలి రెఫరెన్సు రెండు పాత నిబంధనల మూల వాక్యాలను, ద్వితీయోపదేశకాండము 29:4 మరియు యెషయా 29:10ని మిళితం చేయడం: "ఇందు విషయమై, 'నేటివరకు దేవుడు వారికి నిద్రమత్తుగల మనస్సును, చూడలేని కన్నులను, వినలేని చెవులను ఇచ్చియున్నాడని' వ్రాయబడియున్నది" (రోమా 11:8).

అప్పుడు పౌలు కీర్తన 69నుండి కోట్ చేస్తున్నాడు, ఈ కీర్తనను ప్రభువైన యేసును ఆది క్రైస్తవులును ఉపయోగించారు (ఉదాహరణకు, యోహాను 2:17; 15:25; అపొస్తలుల కార్యములు 1:20; రోమా 15:3 చూడు): "మరియు, 'వారి భోజనము వారికి ఉరిగాను, బోనుగాను,[19] ఆటంకముగాను వారి క్రియలకు ప్రతిఫలము గాను ఉండును గాక. వారు చూడకుండునట్లు వారి కన్నులకు చీకటి కమ్మును గాక. వారి వీపును ఎల్లప్పుడును వంగిపోవునట్లు చేయుము' అని దావీదు చెప్పుచున్నాడు" (రోమా 11:9, 10; కీర్తన 69:22, 23 చూడు). తన శత్రువులకు విరోధంగా పలు కార్యాలు జరిగించునట్లు దావీదు దేవుని వేడుకొంటున్నాడు. అయితే పౌలు ఆలోచనా విధానానికి వర్తించే భాగం యిది: "వారు చూడకుండునట్లు వారి కన్నులకు చీకటి కమ్మును గాక" అనేది. ఇశ్రాయేలు (పెద్ద వృత్తంలోనివారు) "కన్నులు" "చీకటిమయమయ్యాయ్." వారు దీర్ఘ కాలంగా ఏ మెస్సీయ కొరకు వేచియున్నారో ఆయన యేసేనని దేవుడు యిచ్చిన సాక్ష్యాన్ని యూదుల్లో అనేకులు "చూడ" నిరాకరించారు.

## యూదుల నిరాకరణ కడపటిది కాదు (11:11, 12)

"దేవుడు తన ప్రజలను విసర్జించెనా?" అని పౌలు అడిగాడు (1 వచనం). తన ముగింపును బలపరచుకొనడానికి, దేవుడు యూదులను నిరాకరించడం సంపూర్ణం కాలేదని మొదట అతడు చూపాడు. పౌలును, యేసును అంగీకరించిన యితర యూదులును యేసును అంగీకరించినందున, వారు దేవునిచే అంగీకరింపబడినవారై యున్నారు. అతని రెండవ రుజువు ఏమంటే, దేవుడు యూదులను నిరాకరించడం అంతము కాదు. మారుమనస్సు పొంది తిరిగి రావడానికి దేవుడు అవకాశాన్ని విస్తరింప జేశాడు. అధ్యాయం 11లోని మిగిలిన భాగం యొక్క ప్రధాన చర్చనీయాంశం యిదే. ప్రస్తుతానికి, తరువాత రెండు వచనాలను మాత్రమే చూద్దాం, అది అంశాన్ని పరిచయం చేస్తుంది.

### ఏర్పాటు (ప్లాన్) (11వ వచనం)

క్రొత్త భాగాన్ని పౌలు, "నేనడుగునదేమనగా" అంటూ ఆరంభించాడు (11ఎ

వచనం). జనాంగం (దేశంగా)గా ఇశ్రాయేలును దేవుడు అంగీకరించలేదని ఒప్పుకొని, అధికమైన ఆలోచనలను అతడు అందులో చేర్చగోరాడు: "వారు పడిపోవునట్లుగా తొట్రిల్లిరా?" "తొట్రిల్లుట" *pipto* నుండి వచ్చింది (11ఎ, బి వచనం). మరోసారి పౌలు తన సొంత ప్రశ్నకు "అట్లనరాదు!" అని జవాబిస్తున్నాడు (11సి వచనం; 1 వచనం కూడ చూడు).

మరల, పరస్పర విరుద్ధంగా కన్పించే పరిస్థితిలో మనం ఎదుర్కొంటున్నాం. యూదులు పడిపోనట్టు వచనం 11 అన్నట్టు కన్పిస్తుంది – కాని మనం చదువుటలో కొనసాగిద్దాం. వచనాలు 11, 12 యూదుల "అతిక్రమము," "తప్పిపోవడాన్ని" గూర్చి మాటలాడుతున్నాయి. వచనం 15 "వారు నిరాకరింపబడుటను" గూర్చి తెలుపుతుంది. నమ్మికయుంచని యూదులను "దేవుడు విడిచిపెట్టలేదని" పౌలు అన్నాడు (వచనాలు 20, 21). దేవుని "... కాఠిన్యమును అనగా పడిపోయినవారి మీద కాఠిన్యమును" కనుపరచాడు; పడిపోయిన [*pipto*నుండి] యూదుల మీద కాఠిన్యము (22 వచనం; నొక్కి చెప్పింది నాది). యూదులు తొట్రుపాటు పడ్డారు, యూదులు తొట్రుపడలేదా? యూదులు తూలిపోవునట్టుగా తొట్రిల్లారని వచనం 11లో గుప్తమైయున్నదాన్ని దిద్దవలసిన అవసరం ఉంది.

"తిరిగి బాగుపడనంతగా వారు తొట్రిల్లారా?" అని NIV అంది. వారు తమ అవిశ్వాసమందు పట్టువీడక యుండడం మానుకుంటే, యూదులకు నిరీక్షణ ఉందని మిగతా అధ్యాయం నొక్కి చెప్పియున్నందున, మూల వాక్యానికి యిచ్చిన ఈ భావం అంత చెడ్డదేమీ కాదు. ఏదియెలాగున్నా, వచనాలు 11, 12 వెలుగులో, వారు "అడ్డురాయియగు" (9:32) యేసు వద్ద తొట్రిల్లినప్పుడు యూదులు మాత్రమే పడిపోయినట్టు కాదు అనే మార్పును నేను సూచింపగోరతాను. యూదులు పడిపోవడంలో వచ్చిన మంచి ఫలితాన్ని పౌలు గుర్తిస్తున్నాడు: అన్యజనుల మార్పు.

పౌలు యిలా కొనసాగించాడు, "వారి తొట్రుపాటువలన అన్యజనులకు రక్షణ కలిగెను" (11:11డి). పౌలు ఒక క్రొత్త పట్టణానికి చేరుకున్నప్పుడు, అతడు తొలిగా యూదుల సమాజ మందిరానికి వెళ్లేవాడు. యూదులు అతనిని నిరాకరించినప్పుడు (తప్పక వారలా చేశారు), అతడు అన్యజనుల వద్దకు వెళ్లాడు (అపొస్తలుల కార్యములు 13:46; 14:1; 18:6; 19:8, 9; 28:28 చూడు). ఈ విధంగా, యూదుల అతిక్రమము (సువార్తను నిరాకరించడం) అన్యజనులు విని విశ్వసించడానికి సందర్భం ఏర్పడింది. వారు [యూదులు] వెలుపలికి నడిచిపోయినప్పుడు, వారు ఆ తలుపును తెరచియుంచారు, మరియు వెలుపటివారు [అన్యజనులు] లోపలికి వచ్చారు అని MSG అంది. యూదులు సువార్తను నిరాకరించడం సువార్త అన్యజనుల వద్దకు తీసికొని వెళ్లే సందర్భాన్ని కల్పించింది కాని కారణం కాదని గుర్తించాలి. యూదులు తన సందేశాన్ని అంగీకరించినప్పటికిని పౌలు అన్యజనులకు ప్రకటించియుండేవాడే.

అయినా, అన్యజనుల మార్పు అనంతర సంగతులకు అంతంగా దేవుడు ఉద్దేశింపలేదు. తరువాత పౌలు ఏమంటున్నాడో గమనించు: "వారికి [యూదులకు] రోషము పుట్టించుటకై వారి తొట్రుపాటువలన అన్యజనులకు రక్షణ కలిగెను" (11డి, ఇ

వచనం). అన్యజనులు అంగీకరించబడడమనే భావన యూదులకు రోషం పుట్టిస్తుందని పౌలు 10:19లోనే పరిచయం చేశాడు: "జనము కాని [అన్యజనుల] వారివలన మీకు [యూదులకు] రోషము పుట్టించెదను."[20]

"రోషము" అనే పదం యిక్కడ ఉపయోగింపబడడం కొంతమంది పాఠకులకు వింతగా తోస్తుంది. "రోషము" *parazeloo*నుండి వచ్చింది. *Para* అనేది *zeloo*తో ఉద్రిక్తం చేయబడింది. *Zeloo*కు మూలం *zeo* అనేది, దానికి "ఉడుకు, మరుగు, వేడిగానుండు"[21] అని అర్థం. *Zeloo* అంటే "రోషముగానుండి"[22] (రోషము, ఆసక్తి అనే రెండును "మనలో వేడిని" పుట్టిస్తాయి). *Zeloo* మరియు దానికి సంబంధించిన పదాలు చెడ్డ భావంతో ఉపయోగించబడతాయి (ఉదాహరణకు, 1 కొరింథీయులకు 13:4 చూడు), కాని ఎల్లవేళలా కాదు. "ఆత్మ సంబంధమైన వరములను ఆసక్తితో [*zeloo*నుండి] అపేక్షించుడి" అని పౌలు కొరింథీయులకు తెలిపాడు (1 కొరింథీయులకు 14:1).

"ఆసక్తి" మరియు "రోషము" అనే పదాలకు సంబంధించి, రోమా 10:19 మరియు 11:11, 14ల్లోని ఆశతో అపేక్షించడాన్ని గూర్చి తలంచు.[23] అన్యజనులచే అనుభవింపబడుతున్న మెస్సీయ రాజ్యం (సంఘం) యొక్క ఉపకారాలను యూదులు చూచి వారు కూడ ఆ దీవెనలను అనుభవించాలనే బలీయమైన కోర్కె కలిగినవారవుతారని పౌలు నిరీక్షించాడు. వారి వాంఛ బలీయంగా ఉండి, అది వారి పరపక్ష ద్వేషాన్ని రద్దుపరచి తమ హృదయాలు యేసుకొరకు తెరుస్తారని అతడు నిరీక్షించాడు. వాంఛింపబడిన సంభవాల వరుస ఈ క్రింద చూపబడ్డాయి:

(దేవునిచే) యూదులు నిరాకరింపబడుట

↓

(దేవునిచే) అన్యజనులు అంగీకరింపబడుట

↓

(దేవునిచే) యూదులు అంగీకరింపబడుట

ఈ వరుస క్రమాన్ని మనస్సులో ఉంచుకో. యూదుల్లో విశ్వాసాన్ని రేకెత్తించడానికి అధ్యాయం 11లో దేవుడు ఈ క్రమాన్ని పలుమార్లు ఉపయోగించినట్టు పౌలు సూచించాడు. బహు చెడ్డదానిలోనుండి బహు మంచిది వచ్చేలా చేయగల దేవుడు మనకున్నాడు.

**అవకాశం (12 వచనం)**

తన తోటి యూదులు రక్షింపబడడాన్ని గూర్చి పౌలు తలంచగా, అతడు బహు ఉల్లాసంతో నింపబడ్డాడు: "వారి [యూదుల] తొట్రుపాటు లోకమునకు [ఆత్మ సంబంధమైన] ఐశ్వర్యమును, వారి [ఆత్మ సంబంధమైన] క్షీణదశ అన్యజనులకు

ఐశ్వర్యమును అయినయెడల వారి [యూదుల] పరిపూర్ణత యెంత యెక్కువగా ఐశ్వర్యకరమగును!" (11:12).

"పరిపూర్ణత" అనే మాటను మనం ఒక క్షణంసేపు వీక్షించాలి (చూడాలి). ఈ అధ్యాయం యొక్క చివరి భాగంలో (25 వచనం చూడు) యిది వివాదాస్పదమైనదైనందున కీలక పదమైయుంది. "పరిపూర్ణత" అనేది *pleroma* నుండి వచ్చింది. అది " 'సంపూర్ణతను' సూచిస్తుంది."[24] *Pleroma, pleres* కు ("నిండు, నింపబడు") మరియు *pleroo* ("నింపు, నిండించు") అని అర్థం యిస్తుంది. ఈ మాటలు రోమా పత్రికలో తరచుగా ఉపయోగింపబడ్డాయి (ఉదాహరణకు, 1:29; 8:4; 13:8, 10; 15:13, 14లను చూడు). ప్రస్తుతానికి, మనకు అక్కరగానున్న ప్రశ్న ఏమంటే "11:12లో *pleroma* అంటే అర్థం ఏమిటి?" పౌలు దాన్ని ఎలా ఉపయోగించాడో చూచి తీర్మానించడం శ్రేష్ఠమైన పద్ధతియైయుంది. "అపరాధము," "తప్పిపోవడం" అనేవాటికి భిన్నంగా దాన్ని ఉపయోగించాడు.

మరోసారి ఆ వచనంవైపు చూస్తే: "వారి తొట్రుపాటు లోకమునకు ఐశ్వర్యమును, వారి క్షీణదశ అన్యజనులకు ఐశ్వర్యమును అయినయెడల వారి పరిపూర్ణత యెంత యెక్కువగా ఐశ్వర్యకరమగును!" "తొట్రుపాటు," "క్షీణదశ" తమ కొరకైన దేవుని సంకల్పాన్ని యూదులు నిరాకరించినందున, దేవుడు వారిని నిరాకరించుటలో కలిగింది. అది వాస్తవమైయున్నందున, వారు దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చి, తత్ ఫలితంగా దేవునిచే అంగీకరించబడడంతో వారికి "పరిపూర్ణత" కలుగుతుంది. వచనం 12కు సమాంతరమైన వచనం 15 దీన్ని తేటపరచడానికి సహాయపడుతుంది.

| రోమా 11:12 | | రోమా 11:15 |
|---|---|---|
| తొట్రుపాటు, క్షీణదశ | దేవుని నిరాకరించుట | (దేవునిచే) నిరాకరింపబడుట |
| పరిపూర్ణత | దేవుని అంగీకరించుట | (దేవునిచే) అంగీకరింపబడుట |

11:12ను గూర్చి మనం మరో సంగతిని గమనించాలి: NASB ఈ వచనంలో చివరి భాగాన్ని భవిష్యత్ కాలంలో తర్జుమా చేస్తుంది: "వారి పరిపూర్ణత యెంత యెక్కువగా ఐశ్వర్యకరమగును?" "Will ... be" అనే మాటలు తర్జుమాదారులవలన సప్లై చేయబడ్డాయి. "వారి సంపూర్ణత ఎంత యెక్కువ" (KJV చూడు). రూలు ప్రకారం వచనపు భాగంలో క్రియా వాచకం లేకుంటే, దాన్ని సప్లై చేసేటప్పుడు, అంతకు ముందున్న క్రియా వాచకాలతో అంగీకరించాలి. గ్రీకు మూలంలోని 12వ వచనంలో, క్రియా వాచకాలన్నీ వర్తమాన కాలానికి చెందినవే. యూదుల "సంపూర్ణతను" గూర్చి పౌలు మాట్లాడినప్పుడు, అపొస్తలుని మనస్సులో భవిష్యత్ సంభవం ఏమీ లేదు, కాని తన దినాలలో జరుగుతున్నదే ఉంది అని R. C. H. Lenski తీర్మానించాడు:

> అతడు [పౌలు] వ్రాస్తున్నది అప్పటికి ఉన్నదే [ఆ కాలంలో] యూదుల పతనము నష్టము – లోకము యొక్క అన్యజనుల ఐశ్వర్యంగా భావించాలి. … [పౌలు] యిలా అడుగుతున్నాడు, యిది నిజమైతే [నిజమైన ఇశ్రాయేలు] యూదుల శేషము పొందిన రక్షణ యొక్క సంపూర్ణత "ఎంత యెక్కువైనదైయుండాలి" … ఆలాగే అన్యజనుల లోకము యొక్క ఐశ్వర్యము. …[25]

వచనం 12లో పౌలు యొక్క పదాలు తేటగా లేవు గాని, అతని ఆలోచన తేటగా ఉంది: దేవుడు యూదులను నిరాకరించడం అన్యజనుల అంగీకారంగా ఫలించినట్టయితే, యూదులను అంగీకరించడంతో అన్యజనులు ఎంత ఎక్కువైన ఉపకారాన్ని పొందుతారో (వారు మారుమనస్సు పొంది ఆయన యొద్దకు వచ్చినప్పుడు)! ఒక లాభమేమంటే, పేతురు, పౌలు వంటి ఎక్కువమంది ప్రసంగీకులు. యూదులు అంగీకరింపబడడం ఎక్కువమంది అన్యజనులు మార్పులోనికి వస్తారనేది గుప్తమైయుంది. ముందుగా యివ్వబడిన చార్టును పెంచవచ్చు:

(దేవునిచే) యూదులు నిరాకరింపబడుట

↓

(దేవునిచే) అన్యజనులు అంగీకరింపబడుట

↓

(దేవునిచే) యూదులు అంగీకరింపబడుట

↓

(దేవునిచే) ఎక్కువమంది అన్యజనులు అంగీకరింపబడుట

12వ వచనంలో "సంపూర్ణత" (నెరవేర్పు) (*pleroma*) అనేది ఎలా ఉపయోగింపబడిందనేదానితో ఈ ప్రాథమిక సంఘటనల పరంపరను మనస్సులో ఉంచుకో. వచనం 25లో మనం మరోసారి *pleroma*ను ఎదుర్కోబోతున్నాం.

## ముగింపు

జనాంగంగా, యూదులు యేసును నిరాకరించారు గనుక, వారు దేవుని నిరాకరించిన వారయ్యారు. తత్ ఫలితంగా, దేవుడు వారిని నిరాకరించాడు. అంటే, దేవుడు వారిని ఒదులుకున్నాడని దాని అర్థమా? తప్పకుండా కాదు. పౌలును యితర యూదులను దేవుడు అంగీకరించడం (1–10 వచనాలు) యూదులలో అందరిని, లేక ఎవనినైనా – మారుమనస్సు పొంది యేసును అంగీకరించితే – స్వీకరించడానికి దేవుడు సిద్ధంగా ఉన్నాడు. పైగా, ఆయన యూదులపై అక్కర కలిగియున్నాడనడానికి

రుజువుగా, యూదులను తన యొద్దకు వచ్చేలా ప్రేరేపించడానికి ఆయన అన్యజనులను అంగీక రించడాన్ని ఉపయోగించాడు.

దేవుడు పాపులను వదులుకోడని మనం గ్రహించడం ముఖ్యమైయుంది. మనం రోమా 1ని పఠించినప్పుడు, దేవుడు పాపులను తమ పాపానికి అప్పగించి, వారి అవిధేయతలో కొనసాగిన వారి చర్యల యొక్క పర్యవసానాన్ని అనుభవించేలా విడిచి పెడతాడని మనం గమనించాం. అయినా, అది బహు ఆలస్యం కాక ముందే, పాపులు తమ దోషాన్ని చూచేలా చేయడం యిక్కడ దేవుని ఉద్దేశమైయుంది. దేవుడు పాపులను "అప్పగించవచ్చు" కాని, "వదులుకోలేడు." తమ దేహాల్లో ప్రాణమున్నంతవరకు, వారు తిరిగి రావాలని కోరుకుంటాడు, వారిని స్వీకరించడానికి ఎల్లప్పుడు ఆత్రుత కలిగి యుంటాడు (లూకా 15:20-24 చూడు).[26]

ఎంత ప్రోత్సాహకరమైన సత్యమిది! నీవు ప్రేమించేవారు క్రీస్తునకు వెలుపల ఉంటే, యిది నిన్ను ప్రోత్సహించాలి. వారిని ప్రభువు కొరకు సంపాదించడానికి నీ ప్రయాసను రెండంతలు చేయాలి. దేవుడు వారిని వదులుకోకపోతే, నీవు కూడ వదులుకోకూడదు. నీవు దేవునితో సరిగా లేకపోతే, దేవుడు నిన్ను విడిచిపెట్టలేదని గ్రహించడం ఎంత అద్భుతం! ఈనాడైనా - ఆయన ప్రేమ, ఓర్పులు ఆయనయొద్దకు నిన్ను నడిపించాలని నా ప్రార్థన.

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

ఈ పాఠం ఉపయోగించేటప్పుడు, దేవుని యొద్దకు ఎలా రావాలో నీవు నీ శ్రోతలకు తెలుపకోరవచ్చు. ఎన్నడూ క్రైస్తవులు కానివారిని, విశ్వసించి, మారుమనస్సు పొంది, ఒప్పుకొని బాప్తిస్మం పొందాలి (మత్తయి 16:16; అపొస్తలుల కార్యములు 2:38; రోమా 10:9, 10). తప్పిపోయిన క్రైస్తవులు మారుమనస్సు పొంది, ఒప్పుకొని, ప్రార్థించాలి (అపొస్తలుల కార్యములు 8:22; 1 యోహాను 1:9; యాకోబు 5:16).

ఈ పాఠంలోని సంఘటనల క్రమం డయాగ్రాం వేయవచ్చు. దీనితో మాత్రమే గాక, రోమా 11లోని మిగిలిన పాఠమంతటితోను దీన్ని వాడవచ్చు. "పెద్ద వృత్తము చిన్న వృత్తము" అనే చార్టు నీవు 9:1-13 చర్చకు తయారు చేసినట్టయితే 11:1-12తో దాన్ని వాడుకోవచ్చు.

"దేవుడు తలుపు మూసి తాళాన్ని పడవేస్తాడా?" అనే పేరు దీనికి పెట్టవచ్చు. దానికి జవాబు: "ఈ జీవిత కాలంలో కాదు." ప్రభువు వచ్చినప్పుడు తాళం వేయబడు తుందని దీన్ని ముగించవచ్చు (మత్తయి 25:10-12 చూడు). అది బహు ఆలస్య మౌతుంది. ఇదే సమయం, దేవుని కృపను సద్వినియోగం చేసికో.

కీర్తన 69లో దావీదు తన శత్రువులను శిక్షించుమని దేవుని అడిగిన దాన్ని గూర్చి కొందరు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఈలాటి కీర్తనలను "imprecatory psalms" అంటారు. కనీసం రెండు మాటలు చెప్పాలి: మొదటిది, పగతీర్చుకునే పని దావీదు దేవుని చేతుల్లో విడిచిపెట్టాడు (రోమా 12:19 చూడు). రెండవది, ఈ కీర్తనలు "కంటికి

కన్ను" అని బోధించే నిబంధనలో భాగమైయున్నాయి (పాత నిబంధన), ఒక చెంపమీద కొడితే రెండవ చెంప త్రిప్పమన్న నిబంధనకు సంబంధించినవి కావు (క్రొత్త నిబంధన). (నిర్గమకాండము 21:24; మత్తయి 5:38, 39; రోమా 12:18–21 చూడు).

---

సూచనలు

[1]ఈ పదజాలము సెప్టూజెంట్ లేదా LXX (పాత నిబంధనకు గ్రీకు తర్జుమా అయిన కోట్ చేశాడు). [2]పౌలు యొక్క యూదత్వానికి సంబంధించిన ప్రతిపాదనను మరో రూపంగా చూడడం అపొలో తెలుపబడింది: "నేను ఇశ్రాయేలీయుడను బెన్యామీను గోత్రం ద్వారా అబ్రాహాము సంతతివాడను అనేది దేవుడు తన ప్రజలను నిరాకరించాడనడంతో ఏకీభవించదు ..." అయినా, వ్యాఖ్యాతలలో ఎక్కువ మంది ఈ పాఠంలో యివ్వబడిన వివరణతో ఏకీభవిస్తారు. [3]రోమా పుస్తకం 3లో, "ఆయన సంకల్పము చొప్పున (8:29, 30)" దేవుని భవిష్యత్ జ్ఞానము అనే చర్చను చూడు. [4]KJVలో "ఏలీయా" యొక్క గ్రీకు స్పెల్లింగ్ "Elias" అని ఉంది. [5]KJVలో "wot ye not" పాత ఇంగ్లీష్ ప్రయోగముంది "know you not." [6]గ్రీకు మూలవాక్యం "త్రవ్వి వేయబడ్డాయి" అని ఉంది (KJV చూడు). కొన్ని బలిపీఠాలు మట్టి దిబ్బలుగా రూపించబడ్డాయి. [7]పాత నిబంధన కథతో నీ శ్రోతకు పరిచయం లేకపోతే ఆ కథను వారికి చెప్పు. [8]"బయలు" పాత నిబంధనలోని కనానీయుల "దేవత." [9]"మోకాళ్లూనుట" అంటే ఆరాధించుట అని అర్థం. [10]"ఇశ్రాయేలు" ఇశ్రాయేలులోని ఉత్తర దేశాన్ని యిక్కడ సూచిస్తుంది.

[11]NASB నా ప్రతిలో నోట్సు "వేలు" అంటే అక్షరార్థంగా "పదివేలని" అర్థమట. [12]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 522. [13]రోమా 9:27లో "శేషము" అని తర్జుమా చేయబడినది *hupoleimma*నుండి. *Hupo* అంటే ("క్రింద") *leimma*తో చేర్చబడింది శేషంలో తక్కువను నొక్కి చెప్తుతుంది. [14]కంకార్డెన్స్ ఉంటే "శేషము" అనేది బైబిల్లో ఎంత తరచుగా కన్పిస్తుందో చూడు. (NASBలో 84 సార్లు ఉంది). ప్రత్యేకంగా యెషయా గ్రంథం మీద దృష్టి ఉంచు. [15]ప్రకటన 12:17లో (KJV), "శేషము" *loipos*నుండి తర్జుమా చేయబడింది. *Leimma* కుటుంబంలోనుండి వచ్చిన పదమే. రెండును "*leipo,* విడుచుట లాంటివే" (Vine, 522). కొన్నిసార్లు *loipos, leimma* పర్యాయ పదంగా ఉంటుంది. కొన్నిసార్లు ఉండదు. NASB ప్రకటన 12:17 *loipos*నుండి "మిగిలిన(వారు)" అని తర్జుమా చేస్తుంది. [16]F. F. Bruce, *The Letter of Paul to the Romans,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 201. [17]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 361. [18]9:18లో ఫరో హృదయాన్ని కఠినపరచుకున్నాడనడానికి (*skleryno*) అనే పదం వాడబడింది, కాని అర్థంలో మాత్రం *poroo* కంటె పెద్ద తేడా అయినది కాదు [11:7లో]" (Ibid., n. 1). [19]"భోజనము ఉరిగా?" అన్న సహాయక ప్రసంగాన్ని చూడు. [20]"పరిపూర్ణమైన ఏర్పాటు – అయితే ఏమయ్యింది?" అని రోమా 10:19 మీద కామెంట్స్ చూడు.

[21]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, Ltd., 1971), 181. [22]Vine, 332-33, 693. "zealous" పదం యొక్క అర్థానికి ఉదాహరణ, గలతీయులకు 4:17; KJV చూడు. [23]Ibid., 332-33. [24]Ibid., 259. [25]R. C. H. Lenski, *The Interpretation of St. Paul's Epistle to the Romans* (Minneapolis: Augsburg Publishing Co., 1963), 695. [26]విషాదకరంగా, "మారుమనస్సు పొందునట్లు వారిని నూతనపరచుట అసాధ్యమన్నట్టు" కొందరు కఠినపరచుకొంటారు (హెబ్రీయులకు 6:6). అయినా, దేవుడు అట్టివారియెడల అక్కర చూపుతాడు (2 పేతురు 3:9).

## భోజనము వారికి ఉరిగా?

"వారి భోజనము వారికి ఉరిగాను, బోనుగాను,
ఆటంకముగాను వారి క్రియలకు ప్రతిఫలముగాను ఉండును గాక.
వారు చూడకుండునట్లు వారి కన్నులకు చీకటి కమ్మును గాక.
వారి వీపును ఎల్లప్పుడును వంగిపోవునట్లు చేయుము" అని
దావీదు చెప్పుచున్నాడు (రోమా 11:9, 10).

9, 10 వచనాలలో పౌలు కీర్తన 69:22, 23ను కోట్ చేశాడు. ఈ కొటేషన్‌లో ఒక భాగం ప్రత్యేకించి బైబిలు విద్యార్థులను ఆకర్షించింది: "వారి భోజనము వారికి ఉరిగాను, బోనుగాను, ఆటంకముగాను ఉండును గాక" అనేది. "భోజనము ఉరిగాను బోనుగాను ఎట్లు మారగలదు?" అనే ప్రశ్న అడుగబడింది. ఆ యా పేరాఫ్రేజెస్‌లో కొన్ని ఊహలు తెలుపబడ్డాయి.

"వారి భోజనము ఎరగాను, ఉరిగాను మారును గాక" (CEV).

"వారి విందులలో వారు పట్టబడి యిరికించబడుదురు గాక" (TEV; యోబు 1:18, 19 చూడు).

"... వారి భోజనము మరియు యితర దీవెనలు తమకు తమ దేవునికి మధ్య మంచిగా ఉందనే ఆలోచన వారికి ఉరియగును గాక" (LB).

"తమ్మును తాము పోషించుకునే భోజనంవలన రోగులగుదురని నిరీక్షిస్తున్నాను" (MSG).

బైబిలు అంతటిలో, "బల్ల" (భోజనము) అనే మాట దీవెనలకును, సహవాసానికిని గురుతుగా ఉంది (కీర్తన 23:5 చూడు). తన శత్రువులు దేనిమీద ఆనుకున్నా, ఆదరణ పొందినా, అది వారి పతనముగా మారును గాకని దావీదు సాధారణంగా అడుగు తున్నట్టున్నాడు. తన నాటి యూదులకు పౌలు దాన్ని వర్తింపజేయనుద్దేశించాడు. ఆధారపడడానికి వారు ఉద్దేశించిన "బల్ల" (భోజనము) మోషే ధర్మశాస్త్రము ఆత్మ సంబంధమైన ఉదాహరణయై ఉంది. ధర్మశాస్త్రాన్ని వారు ఆనుకొనగోరడం వారికి ఉరిగాను, బోనుగాను మారింది. మొదటి శతాబ్దపు యూదులకు ఈ (భోజనము) "బల్ల" అనేదాన్ని వర్తింపజేసే మరో మార్గాన్ని Larry Deason యిలా సలహా యిచ్చాడు:

అమితముగా వ్యయం చేసిన భోజనాన్ని దేవుడు ఇశ్రాయేలు యెదుట పెట్టాడు – మెస్సీయాను ఉచితమైన నీతి దానమును వారి భోజనపు బల్ల దగ్గర ఉంచాడు (అయితే వారాయనను చూడ నిరాకరించారు) (అయితే వారు దాన్ని నిరాకరించారు), మరియు క్షమాపణ, సమాధానపరచబడడం (కాని వారు దాన్ని లక్ష్యపెట్టరు). మెస్సీయ సంబంధమైన విందు భోజనం వారి అవిశ్వాసంవలన తమ మీదికి దైవ తీర్పును ఉరిగా వారు తెచ్చుకున్నారు. ...[1]

---

సూచన

[1]Larry Deason, *"The Righteousness of God": An In-depth Study of Romans,* rev. (Clifton Park, N.Y.: Life Communications, 1989), 265-66.

# 49

# అతిశయకారణము లేదు

# (11:13-24)

రోమా 11:13-24లో, పౌలు తన ప్రధానమైన ఆలోచనా సరళిని విడిచి, మనోహరమైనదియు, ప్రాముఖ్యమునైన బాణీని చేపట్టాడు. దేవుడు యూదులను అంగీకరించడం అన్యజనులు అంగీకరింపబడడానికి సందర్భం ఏర్పడిందని అతడు అన్నాడు (11 వచనం). అన్యజనులు అంగీకరింపబడునట్లు యూదులు నిరాకరింపబడ్డారని కొందరు అన్యజనులు తీర్మానానికి వచ్చియుండవచ్చు (19 వచనం చూడు). శతాబ్దాలు తరబడి, యూదులు - దేవుని ప్రత్యేకమైన జనాంగమై - తామే అన్యజనులకంటే అధికులైనట్టు తలంచారు. ఇప్పుడు పరిస్థితి తిరుగబడింది, అన్యజనులే యూదులకంటే మిన్నయనే భావనకు వారు శోధింపబడుతున్నారు.

రోమీయులకు వ్రాసిన తన పత్రికలో పౌలు ఈ సమస్యను ఎందుకు చర్చించాడో మనకు తెలియదు. ఒక అవకాశమేమంటే - రోమా సంఘంలో యూదులకు, అన్యజనులకు మధ్య ఉండిన (సంఘర్షణ) రాపిడి పౌలుకు తెలిసిందేమో, ఆ పరిస్థితిని డీల్ చేయడానికి యిది వ్రాస్తుండవచ్చు.[1] మొత్తం మీద, రోములోని సంఘం యొక్క ఆత్మ సంబంధమైన స్థితి మంచిగా ఉంది (1:8 చూడు), అయితే ఏ సంఘము కూడ పరిపూర్ణమైనదై ఉండదు; పెంపొందవలసిన అనేక ప్రాంతాలు ఉండిపోతాయి. మరి యింకొక అవకాశమేమంటే, రోమా సామ్రాజ్యమంతటిలో గుండా వెళ్లుతుండగా, పౌలు ఈలాటి సమస్యను యితర స్థానిక సంఘాల్లో కనుగొన్నాడు. ఆలాటి పరిస్థితిని రోములో నిరోధించడానికి ఉపదేశాన్ని యిందులో చేర్చాడు. ఇతరులకంటే అధికులమనే తలంపుకు వ్యతిరేకంగా మన అందరికి బలమైన హెచ్చరిక అవసరమని పరిశుద్ధాత్మ ఎరిగియుండి, పౌలును ప్రేరేపించియుండవచ్చు, ఆ మాటలు మనకొరకు భద్రం చేయబడ్డాయి.

మన ప్రస్తుతపు మూల వాక్యంలో, బహు సాధారణమైన పాపములలో ఒక దానిని డీల్ చేస్తున్నాడు: గర్వము. "తక్కిన పాపములన్నియు ఎదగడానికి ఆధారంగా" ఉంటున్నట్టు గర్వము పిలువబడింది.[2] C. S. Lewis గర్వాన్ని గూర్చి ఈ మాటలంటున్నాడు:

> లోకంలోని ఏ మనుష్యుడును ఈ దుర్గణమునుండి స్వేచ్ఛగా లేదు; యితరులలో అతడు దాన్ని చూచినప్పుడు లోకంలోని ప్రతి ఒక్కడు దాన్ని అసహ్యించుకుంటాడు; క్రైస్తవులు తప్ప, దాని విషయంలో దోషులని ఏ ప్రజయైనా అంగీకరించరు. కోప గుణం గలవారైనట్టు, లేక ఆడపిల్లల విషయంలోను, త్రాగుడును గూర్చి, లేదా వారు పిరికివారని ఒప్పుకొనడంలో సిగ్గునొందినట్టు అంగీకరించినవారిని నేను విన్నాను.

> క్రైస్తవుడు కాని ఎవడును ఈ దుర్గుణం విషయంలో తన్నుతాను నిందించుకున్నవానిని నేను ఎన్నడూ వినలేదని తలంచుతాను. ... ప్రజాభిమానాన్ని పోగొట్టుకునే తప్పు, మరియు మనలో ఉన్నవారి ఏ యితర తప్పు విషయంలోను యింత స్పృహ లేకుండ ఉండం. అది మనలో ఎంత ఎక్కువగా ఉంటుందో, యితరులలో అది మనం అంత ఎక్కువగా యిష్టపడకుండా ఉంటాం.[3]

సామెతలు 16:18 మాటలతో ఎక్కువమంది పరిచయం కలిగియుంటారు: "నాశనమునకు ముందు గర్వము నడచును పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును."[4] "నాశనమునకు ముందు గర్వము నడచును" అనేదానికి మనం దాన్ని కుదించుతాం. నేను ఈ మాటలు విన్నప్పుడు, గర్వించిన కప్ప యొక్క కట్టు కథను తలంచుతాను. ఒకనాడు, అవి నివసించే కొలను ఎండిపోయింది. బాతులు నూతనమైన కొలనుకు ఎగిరిపోయాయి. అయితే వారి స్నేహితుడైన కప్ప సంగతి ఏంటి? బాతులు తమ రెండు ముక్కులతో ఒక పుల్లను పట్టుకొని ఎగురుతాయి, కప్ప ఆ పుల్లను నోటికి కరిపించుకొని ఉండేలా తీర్మానమయ్యింది. అలా అవి ఎగిరిపోతూ ఉండగా, ఒక వ్యవసాయకుడు తల ఎత్తి వాటిని చూచాడు. "ఎంత తెలివైన ఆలోచన! దాన్ని గూర్చి ఎవరు తలంచియుంటారో?" అంటూ ఆ వ్యవసాయకుడు బిగ్గరగా కేకవేశాడు. "నేను చేశాను" అని కప్ప (తన నోరు తెరచి) అంది. ... "పడిపోడానికి ముందు గర్వం నడచును."

ఎప్పుడైనా ఒకసారి, మనమందరం గర్వమనే సమస్యతో సతమతమైయుండ వచ్చు. ఈ పాఠం గుండా మనం వెళ్లుతుండగా, పౌలు దినాల్లో ఉండిన క్రైస్తవులైన అన్యజనుల మీదనే మన దృష్టి కేంద్రీకరించకుండ; మన హృదయాలను కూడా మనం పరిశీలించు కుందాం. అతిశయించడానికి మొదటి శతాబ్దపు క్రైస్తవులైన అన్యజనులకు ఏ హేతువులేదని మన మూలవాక్యం స్థాపించుతుంది – మరియు మనకు కూడ ఏమియు లేదు.

## యూదుల నిరాకరణ అంతం కాలేదు గనుక (11:13-16)

### వ్యక్తిగతమైన సందేశం

"అన్యజనులగు మీతో నేను మాటలాడుచున్నాను" అని పౌలు అనడంతో మన మూలవాక్యం ఆరంభమౌతుంది (13ఎ వచనం). ఇక్కడనుండి అధ్యాయం అంతమయ్యే వరకు, అతని మాటలు క్రైస్తవులైన అన్యజనులకు ప్రత్యేకించి సంబోధింపబడ్డాయి.

యూదుల నిరాకరణ ముగియలేదు గనుక తాము అతిశయించడానికి ఏ విధమైన హేతువు లేదని వారు తెలిసికోవాలని అతడు మొదటిగా ఆ అన్యజనులను కోరాడు. దేవుడు యింకను యూదులపట్ల అక్కర కలిగియున్నాడు వారు తమ మూర్ఖత విషయమై మారుమనస్సు పొంది యేసునందు విశ్వాసముంచియున్నట్టయితే, ఆయన వారిని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు. "నేను అన్యజనులకు అపొస్తలుడనైయున్నాను [1:1, 5; 15:16లను చూడు], గనుక ఏ విధముననైనను నా రక్తసంబంధులకు రోషము

పుట్టించి, వారిలో కొందరినైనను రక్షింపవలెనని నా పరిచర్యను ఘనపరచుచున్నాను" (11:13బి, 14) అని పౌలు అన్నాడు. "ఘనపరచుచున్నాను" అనే పదం (*doxazo*)నుండి తర్జుమా చేయబడింది అక్షరార్థంగా "మహిమపరచుచున్నాను" అనేది. పౌలు యొక్క ప్రాథమిక పరిచర్యకు సంబంధించింది, కాని అతని స్వదేశీయుల యెడల గాఢమైన అక్కర కనుపరచువాడైయున్నాడు (9:1-3; 10:1 చూడు). యూదులు కూడ మార్పు చెందునప్పుడు, అతని పరిచర్య "మహిమపరచబడినట్టు" అతడు తలంచుతాడు.

మెస్సీయ రాజ్యము యొక్క ఉపకారాలు అన్యజనులు అనుభవిస్తున్నట్టు యూదులు చూచినప్పుడు, వారు అసూయతో నింపబడి, అదే దీవెనలు కావాలని (బలీయంగా వాంఛిస్తారని) - దాన్ని బట్టి వారు యేసునందలి[5] విశ్వాసానికి నడిపింపబడతారనే నిరీక్షణను పౌలు మరల 13, 14 వచనాలలో వ్యక్తపరచుతాడు. యూదులు [టోకుగా] మార్పు పొందుతారని అతడు ఎదురు చూడలేదు గాని, "కొందరినైనా రక్షించాలని"[6] అతడు నిరీక్షించాడు (1 కొరింథీయులకు 9:20, 22తో పోల్చి చూడు).

అతడు యిలా కొనసాగించాడు, "వారిని [యూదులను] [దేవుడు] విసర్జించుట, [అన్యజనుల] లోకమును దేవునితో సమాధానపరచుట అయినయెడల, వారిని [యూదులను] చేర్చుకొనుట యేమగును? మృతులు సజీవులైనట్టే అగును గదా?" (రోమా 11:15). 14, 15 వచనాలలో, పాఠంలో గుర్తించిన సంఘటనల వరుస మరల వస్తుంది: "దేవుడు పాపులను విడిచిపెడతాడా (11:1-12)." యూదులు సువార్తను నిరాకరించి నప్పుడు, సువార్తకు విధేయులైన అన్యజనులు సమాధానపరచబడుట (రక్షింపబడుట) ఫలముగా వస్తుంది (15 వచనం). దేవునిచే అన్యజనులు అంగీ-కరింపబడినట్టు యూదులు చూడడంవలన యూదులు కూడ రక్షింపబడతారని పౌలు నిరీక్షించాడు (14 వచనం).

(దేవునిచే) యూదులు నిరాకరింపబడుట

↓

(దేవునిచే) అన్యజనులు అంగీకరింపబడుట

↓

(దేవునిచే) యూదులు అంగీకరింపబడుట

అదే సంభవించినట్టయితే, "వారు [దేవునిచే] అంగీకరింపబడడం,[7] మృతులు సజీవులైనట్టే అగునుగాక" (15బి వచనం). యూదులు రక్షింపబడడానికి కొట్ట వచ్చినట్టు కన్పించే రూపకాలంకారం "మృతులు సజీవులైనట్టే" అనేదాన్ని పౌలు వాడాడు (14 వచనం). శరీర పునరుత్థానం కాకుండ ఆత్మ సంబంధమైన పునరుత్థానము అతని మనస్సులో ఉంది (రోమా 6:4, 5 చూడు). తప్పిపోయిన కుమారుని తండ్రి నాకు గుర్తొస్తున్నాడు, తన కుమారుడు తిరిగి వచ్చినప్పుడు, "ఈ నా కుమారుడు చనిపోయి

మరల బ్రదికెను ..." అని చెప్పాడు (లూకా 15:24ఎ).

అధ్యాయం 11లోని సంభవాలు క్రీస్తు రాకడకు కొంచెం ముందుగా జరిగేవని కొందరు వ్యాఖ్యానిస్తారు. వచనం 15లో సూచింపబడే "మృతులు సజీవులైనట్టు" అనేది క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు జరుగబోయే శరీర పునరుత్థానమైనట్టు వారు తీర్మానించారు. ఏదియెలాగున్నా, "పౌలు యిక్కడ ఉపయోగించిన మాటలు సాధారణ పునరుత్థానం గూర్చి మాట్లాడిన యితర చోట్ల ఉపయోగించలేదని" Leon Morris అన్నాడు.[8] "శరీర పునరుత్థానాన్ని గూర్చి సందర్భం ఏమే చెప్పలేదు" అని Walter W. Wessel అన్నాడు.[9] William Hendriksen రోమా 11:15కు ముందు వెనుకలున్న విషయం సూచించి యిలా తీర్మానించాడు, "అది జరుగదు, గనుక, మధ్య వచ్చే రెఫరెన్సును ... వారిని చేర్చుకొనుట ... మృతులు సజీవులైనట్టే అగును అనేది లోక చరిత్ర యొక్క ముగింపులో సంభవిస్తుందని కొందరిచే ఎదురు చూడబడేది జరుగదు."[10]

పౌలు యిక్కడ లోకాంతాన్ని గూర్చి మాట్లాడడం లేదు, కాని తన నాటి కాలానికి సంబంధించిన సంగతులను గూర్చి తెలుపుతున్నాడు. తన సాటి యూదుల రక్షణను గూర్చి అతడు ఆలోచిస్తుండగా, తన మనస్సునకు వచ్చిన అలంకార రూపం "మృతులలోనుండి సజీవులమనుకునేదే." ఆలాటి పోలికకు, ఇశ్రాయేలీయుల పునరుద్ధరణకు సంబంధించిన తేటైన పోలికకు యెహెజ్కేలు చిత్రాన్ని చూడు (యెహెజ్కేలు 37:1-14).

వచనం 16కు మనం వెళ్ళక ముందు, వచనాలు 12ను, 15ను పోల్చడంలో విలువ ఉండొచ్చు. వచనం 12 యిలా అంటుంది, "వారి [యూదుల] తొట్రుపాటు లోకమునకు ఐశ్వర్యమును, వారి క్షీణదశ అన్యజనులకు ఐశ్వర్యమును అయినయెడల వారి పరిపూర్ణత యెంత యెక్కువగా ఐశ్వర్యకరమగును!" వచనం 15 యిలా అంటుంది, "వారిని [యూదులను] విసర్జించుట, లోకమును దేవునితో సమాధానపరచుట అయిన యెడల, వారిని చేర్చుకొనుట ఏమగును? మృతులు సజీవులైనట్టే అగును గదా?" వచనం 12 యూదులు ఏమి చేశారో అనేదాన్ని గూర్చి మాట్లాడుచుండగా, వారు చేసినదాని పర్యవసానాన్ని గూర్చి వచనం 15 చెప్తుతోంది. ఇప్పుడు ఆ రెండు వచనాలను కలిపి చూద్దాం: యూదుల తొట్రుపాటు (12 వచనం) దేవునిచే నిరాకరింపబడుటగా పరిణమించింది (15 వచనం), వారి "పరిపూర్ణత" (12 వచనం) దేవునిచే అంగీ-కరింపబడుటగా పరిణమిస్తుంది (15 వచనం). 11:12 చర్చలో మనం గుర్తించినట్టు, "పరిపూర్ణము" అనేది దేవుని ఉద్దేశాలను నెరవేర్చడానికి సంబంధం కలిగియున్న సందర్భమది. కొందరు ప్రతిపాదించినట్టు "పూర్ణ సంఖ్యకు" అది సంబంధించింది కాదు.[11]

(దేవునిచే) యూదులు నిరాకరింపబడుట

↓

(దేవునిచే) అన్యజనులు అంగీకరింపబడుట

↓

(దేవునిచే) యూదులు అంగీకరింపబడుట

**కోపము పుట్టించెడు రూపకాలంకారాలు**

యూదులు ప్రభువునొద్దకు తిరిగి రావడానికి సంబంధించి వచనం 16లో పౌలు రెండు రూపకాలంకారాలను ఉపయోగించాడు. మొదటిది, ఆచార సంబంధమైన ఉదాహరణ: "ముద్దలో మొదటి పిడికెడు[12] పరిశుద్ధమైనదైతే ముద్దంతయు పరిశుద్ధమే" (16ఎ వచనం). "ప్రథమ ఫలములుగా సమర్పించు పిసికిన పిండిలోని భాగము పరిశుద్ధమైనదైతే, ఆ ముద్ద అంతయు పరిశుద్ధమే" అని NIV అంది. పాత నిబంధనలో, కోత కోయబడిన మొదటి పిడికెడు పైరు (తొలి ఫలములు)నుండి చేయబడిన ముద్ద యెహోవాకు అర్పించబడేది (సంఖ్యాకాండము 15:17–21 చూడు). ఈ సమర్పణా కార్యము (పరిశుద్ధపరచబడుతుంది) ఆ అర్పణ తెచ్చినవాడు మిగిలినదానిని తనకొరకు వాడుకోవచ్చు. రోమా 11:16లోని రెండు రూపకాలంకారాలు మరియు "మొదటి ముద్దలోని భాగం," "వేరు" కూడా ఆలాటిదే. అప్పుడు "మొదటి ముద్ద" యూదుల పితరులను – ప్రత్యేకించి అబ్రాహామును సూచించవచ్చు. పితరులు పరిశుద్ధులు గనుక, వారి "నిజ" సంతానం వారి (విశ్వాసపు మాదిరిని అనుసరించినవారు) పరిశుద్ధులుగా ఉండాలి.

తరువాత పౌలు వ్యవసాయపు ఉదాహరణను ఉపయోగించాడు: "వేరు పరిశుద్ధ మైనదైతే కొమ్మలును పరిశుద్ధములే" (16బి వచనం). "వేరు" ఏది అనేదానిమీద కొంత అనంగీకారం చోటు చేసికొంది. వేరు దేవుడేయని కొందరన్నారు. దేవుని విమోచనా సంకల్పమని యితరులు నమ్ముతారు. పోలికను దాని సంపూర్ణతలో ఆలోచిస్తే (16బి–24 వచనాలు), "వేరు" "పితరులు" (28 వచనం చూడు) – ప్రత్యేకించి అబ్రాహాము అని గ్రహించుటలో ప్రధానమైన సంఘర్షణ ఏమియు లేదనుకో. అబ్రాహామునకును యితర పితరులకును దేవుడు తన ప్రశస్తమైన వాగ్దానాలిచ్చినప్పుడు, దేవుని విమోచనా పథకం బయలుపరచబడింది. ప్రాథమికంగా అబ్రాహాము పౌలు మనస్సులో ఉండినట్టయితే, వచనం 16 చివరి భాగం యిలాటి అర్థమిస్తుంది: "మరియు వేరు [అబ్రాహాము] పరిశుద్ధమైనదైతే, ['అబ్రాహాము యొక్క విశ్వాసపు అడుగు జాడలలో నడుచుకొనువారు' కూడ (4:12)] పరిశుద్ధమైనవారే."

గత భాగం ఏ సత్యంతో ముగించబడిందో, దానినే పౌలు 13నుండి 16 వచనాల వరకు నొక్కి చెప్పుతున్నాడు: యూదుల నిరాకరణ ముగియలేదు. యూదుల రక్షణకు ద్వారం యింకను తెరువబడియున్నందున, అదే ద్వారమున ప్రవేశించిన అన్యజనులు అధికులనడానికి ఏ ఆధారము లేదు.

## అన్యజనుల అంగీకారం పాత్రమైనందువలన కాదు (11:17, 18)

అన్యజనులకు అతిశయకారణం లేదు ఎందుకంటే దేవుడు వారికొరకు చేసిన దానికి వారు అర్హులు కారు; వారు అంగీకరించబడడానికి కేవలం కృపయే ఆధారం. పౌలు ఈ సత్యాన్ని తేటపరిచాడు (ఉదాహరణకు, 3:24లో), అయితే ఈసారి ఒక అసాధారణమైన పంథాను ఉపయోగించాడు - అసాధారణమైన పంథా ఎదురు చూడని మలుపుతో.

### పోలిక

వచనం 16లో "వేరు," "కొమ్మలు" అని పౌలు సూచించినది విస్తరించే పోలి-కను వాడునట్టు పౌలు ప్రేరేపింపబడ్డాడు[13] ఒలీవ కొమ్మలను అంటుగట్టే పోలిక. అతడిలా ఆరంభించాడు, "అయితే కొమ్మలలో కొన్ని విరిచివేయబడి, అడవి ఒలీవ కొమ్మవైయున్న నీవు వాటిమధ్యన అంటుకట్టబడి, ఒలీవచెట్టుయొక్క సారవంతమైన వేరులో వాటితో కలిపి పాలుపొందినయెడల, ఆ కొమ్మలపైన నీవు అతిశయింపకుము" (11:17). పౌలు పాఠకులు ఒలీవ చెట్లతో పరిచయం గలవారు, అయితే మనలో అనేకులకు అవి తెలియవు. తన ఉదాహరణను అర్థం చేసికొనడానికి, ఒలీవ చెట్టు అంటుగట్టడాన్ని గూర్చి మనం కొంత తెలిసికోవలసియుంటుంది. మధ్యధరా సముద్ర ప్రాంతం, ఒలీవ చెట్టు ఆకులతో పచ్చగా ఉంటుంది. వంటకు, వైద్యానికి యింకా యితర పనులకు ఒలీవ నూనే ప్రాథమికంగా వాడబడుతుంది. సాగు చేయబడే ఒలీవ చెట్లకంటే అడవి ఒలీవ చెట్లు గట్టిగా ఉంటాయి. అయితే సాగు చేయబడే ఒలీవ చెట్లు ఎక్కువగా ఒలీవలు కాస్తాయి.

రెండు రకాలైన చెట్లను జతచేయడానికి అంటుగట్టడమనే పద్ధతిని వాడతారు. మాదిరికరమైన పద్ధతిలో, చెట్టు కొమ్మను కొన్ని అంగుళాలు వదలి కొట్టివేసి మొద్దుకు ఉంచుతారు. మిగిల్చిన మొద్దును మధ్యకు చీల్చిన తరువాత మరొక చిన్న కొమ్మ వేరొక చెట్టునుండి నరికి, కొమ్మ యొక్క వెనుక భాగం మధ్యన కోనుగా చెక్కుతారు. చెక్కిన దీనిని గాడికోసిన అసలు చెట్టు కొమ్మ గాడిలోనికి దూర్చి ఆ రెండును కలిసి ఏకముగా ఎదుగునట్లు వాటిని కలిపి గట్టిగా కట్టుతారు. అంటు గట్టడం ఎల్లప్పుడును ఆరోగ్యకరమైన కొమ్మగా ఫలించదు; కాని సరిగ్గా చేయబడినట్టయితే, తరచుగా విజయవంతంగా ఉంటుంది.



1. కత్తిరించబడిన కొమ్మ 2. చీల్చబడినది 3. కొమ్మ లోపల చొప్పించబడింది 4. కలిపి కట్టబడింది

ఒలీవ చెట్లకు సంబంధించి, అడవి ఒలీవ చెట్టు యొక్క బలమువలన బలపరచ బడునట్టు సాధారణంగా సాగు చేయబడే ఒలీవ చెట్టు కొమ్మలను అడవి ఒలీవ చెట్టుతో అంటుగట్టతారు. అడవి ఒలీవ చెట్టు కొమ్మను సాగుచేయబడే చెట్టుతో[14] అరుదుగా అంటుగట్టతారు. ఏది కాకపోయినా, పౌలు ఉద్దేశం కొరకు బాగుగా సరిపోయే విధానం "ప్రకృతికి విరుద్ధమైనదాన్ని" వ్రాశాడు (24 వచనం).

మూలవాక్యం గుండా మనం వెళ్లుతుండగా, సాగుచేయబడే ఒలీవ చెట్టును నీ మనస్సులో ఉంచుకో. ఆ చెట్టు దేవుని ప్రజలను సూచిస్తుంది. ప్రత్యేకించి, అది ఇశ్రాయేలుకు బదులుగా నిలిచింది. వారు దేవునికి ప్రత్యేకమైన ప్రజలుగా ఉండేవారు. పాత నిబంధనలో, ఒలీవ చెట్టు ఇశ్రాయేలుకు గురుతుగా ఉంది (యిర్మీయా 11:16, 17; హోషేయ 14:4–6 చూడు). దేవుడు ఇశ్రాయేలును "సాగుచేశాడు" – ఆ దేశానికి ప్రత్యేకమైన శ్రద్ధ చూపాడు – మెస్సీయను ఈ లోకానికి తెచ్చుటలో ఆయన తన ఏర్పాటును వారితో కొనసాగించాడు.

రోమా 11:17 యిలా ఆరంభమౌతుంది, "అయితే కొమ్మలలో కొన్ని విరిచి వేయబడి" (17ఎ వచనం). ఆ విరిచివేయబడిన కొమ్మలు యూదులు, "వారు అవిశ్వాసమును బట్టి విరిచివేయబడ్డారు" (20 వచనం). ("కొందరు" అనేది తెలుగులో లేదు.) వారు యేసునందు విశ్వాసముంచ నిరాకరించినందున యూదులు "కొమ్మలు" అనేకములు విరిచివేయబడ్డాయి.

"అడవి ఒలీవ కొమ్మయైయున్న నీవు వాటిమధ్యన అంటుకట్టబడియున్న" వన్నట్టు వచనం 17 కొనసాగింది (17బి వచనం). "నీవు" అనేది క్రైస్తవుడైన అన్యజనుని సూచిస్తుంది (13 వచనం). వారి మూలము యింకను "అడవి ఒలీవ చెట్టుగా" పిలువ బడింది (24 వచనం). ఎందుకంటే, పాత నిబంధన కాలంలో, యూదులు పొందిన మిక్కటమైన శ్రద్ధను అన్యజనులు పొందలేదు. ఇప్పుడైతే, దేవుని కడపటి ఉద్దేశాలకు ఏర్పాట్లలో అన్యజనులకు పాలుపొందే అవకాశం కలిగింది. ప్రభువైన యేసును ఆయన మార్గాన్ని అంగీకరించిన అన్యజనులు విశ్వసించిన యూదుల మధ్య "అంటుగట్టబడ్డారు."

వచనం 17 యిలా ముగిస్తుంది, "ఒలీవ చెట్టుయొక్క సారవంతమైన వేరులో వాటితో [విశ్వసించిన యూదులతో] పాలుపొందినయెడల ..." (17సి వచనం). వచనం 16లో వలె, "వేరు" పితరులుగా, ప్రత్యేకించి దేవుని వాగ్దానాలు ఎవరితో చేయబడ్డాయో ఆ అబ్రాహాముగా ఆలోచించవచ్చు. "సారవంతమైన వేరు" అని గ్రీకు మూలంలో ఉంది (KJV చూడు). ముందు మొద్దులోనికి ఆ తరువాత కొమ్మలలోనికి వేరునుండి ప్రవహించే "పోషణార్థమైన సారము" అని NIV అంటుంది.

## వర్తింపు

వర్తింపజేయడానికి పౌలు సిద్ధంగా ఉన్నాడు. అన్యజనులైన తన పాఠకులను అతడిలా అంటున్నాడు, "ఆ కొమ్మలపైన నీవు అతిశయపడకుము" (17డి వచనం). "అతిశయపడకుము" అనేది *katakauchaomai*నుండి వచ్చింది (*kauchaomai* అంటే "అతిశయించుట" అని అర్థం, *kata* చే బలపరచబడింది). "అతిశయపడకుము" అని

KJV అంది. "కొమ్మలు" "అవిశ్వాసమును బట్టి విరిచి వేయబడిన" యూదులు అనే అర్థం కావచ్చు (20 వచనం), కాని సాధారణంగా యూదులు "స్వాభావికమైన కొమ్మలతో" చేర్చి (21 వచనం) యిక్కడ సూచింపబడి యుండవచ్చు, అంటే యూదుల్లోనుండి క్రైస్తవులై యింకను "చెట్టులో" నిలిచియున్నవారు. పరిచయంలో గుర్తింపబడినట్టు, గతంలో యూదులు అన్యజనుల పట్ల గర్వంగా ఉండేవారు; యిప్పుడైతే, పరిస్థితి తిరగబడింది. "దేవుడు నిన్ను నిరాకరించి మమ్మును అంగీకరించాడు" అని అతిశయించే అన్యజనుడు యూదునితో అనడం ఊహించ కష్టం కాదు!

తాను కొనసాగించుతూ అన్యజనుని గర్వానికి పౌలు తూట్లు పొడుస్తున్నాడు, "నీవు అతిశయించితివా, వేరు నిన్ను భరించుచున్నదిగాని నీవు వేరును భరించుట లేదు" (18 వచనం). సారము కొమ్మలనుండి వేళ్లకు పోదు, కాని వేళ్లనుండి కొమ్మలకు వెళ్లుతుంది. "మీ గతంలోనుండి యూదులు ఏ విధమైన మేలు పొందడం లేదు. అయితే యూదులకు భౌతిక పితరులకు పూర్వ కాలము చేయబడిన వాగ్దానాలనుండి మీరు మేలు పొందుతున్నారు" అని పౌలు అన్యజనులలోనుండి క్రైస్తవులైనవారికి తెలుపుతున్నాడు. వారు అనుభవించే ఆత్మ సంబంధమైన ఆశీర్వాదాలు యూదుల నేరంలో వేరుపారినవేయని అన్యజనులలోనుండి వచ్చిన క్రైస్తవులు గుర్తించవలసియుంది. "రక్షణ యూదులలో నుండియే కలుగుచున్నది" అని ప్రభువైన యేసు సమరయ స్త్రీకి తెలియజేశారు (యోహాను 4:22).

రోమీయులకు ఈ భాగం వ్రాయడంలో, అన్యజనులలోనుండి వచ్చినవారిని అణచడానికి పౌలు వెదుకుతున్నాడు. వారు అనుభవించే దీవెనలు అపాత్రమైనవి, అనర్హమైనవి. యూదా జనాంగం ద్వారా పనిచేయబడిన ఉద్దేశాలు ఏర్పాట్లులోని భాగంగా కృపచేత వారు "అంటుగట్టబడ్డారు." అతిశయించడానికి అన్యజనులలోనుండి వచ్చిన క్రైస్తవులకు కారణమే లేదు.

## అన్యజనుల అంగీకారం తిప్పివేయటానికి వీలుగానిదేమీ కాదు గనుక (11:19-22)

**ఫిర్యాదు (19, 20ఎ వచనాలు)**

అన్యజనులలోనుండి క్రైస్తవులైనవారి యొద్దనుండి పౌలు ఒక ఆక్షేపణను ఎదురుచూస్తున్నాడు: " 'నేను అంటుకట్టబడు నిమిత్తము కొమ్మలు విరిచివేయబడినవని' నీవు చెప్పుదువు" (19 వచనం). యూదులు "విరిచివేయబడడానికి" కారణం అన్యజనులకు స్థానం కల్పించడానికని కొందరు అన్యజనులు తలంచినట్టు ఆక్షేపణలోని మాటలు సూచిస్తున్నాయి. అది నిజం కాదు. విశ్వసించడంలో తప్పిపోయినందుననే యూదులు విరిచివేయబడ్డారు (20 వచనం). యూదుల్లో ప్రతి ఒక్కడు విశ్వసించినా, విశ్వసించే అన్యజనులకు "చెట్టులో" ఖాళీ ఉండేదే.

అది వాస్తవమైనందున, వచనం 20లో పౌలు యొక్క ప్రత్యుత్తరం వ్యతిరేకంగానే, అనుకూలంగా మనం ఎదురుచూడం - అయితే క్రియా వాచకం *kalos*తో

ఆరంభ మౌతుంది; అంటే, ప్రాథమికంగా "మంచిది" అని అర్థం (KJV చూడు). *kalos*ను NASB "చాలా బాగుంది" అని అంటుంది; "వారు అవిశ్వాసమునుబట్టి విరిచివేయబడిరి, నీవైతే విశ్వాసమునుబట్టి నిలిచియున్నావు" (20ఎ వచనం). మనం NASB పదజాలాన్ని ఉపయోగించినట్టయితే, "చాలా బాగుంది" అని పౌలు అనడంలో పరిహాసపు తాకుడును చిత్రించవచ్చు.[15] ముందటి ప్రతిపాదనలో అతడు సగంవరకు మాత్రమే అంగీకరించి యుండవచ్చు: యూదులు విరిచివేయబడి, అన్యజనులు అంటుగట్టబడ్డారనే వాస్తవంతోనే అంగీకారం. వచనం 20 తొలి భాగాన్ని అది యిలా చదివేలా చేస్తుంది: "కొమ్మలు విరిచివేయబడిన మాట నిజమే, కాని అది మీరు అంటుగట్టబడడానికి కాదు. అయితే, అవి విరిచివేయబడింది వారు నమ్మలేదు గనుక" (SEB చూడు).

యూదులు "వారి అవిశ్వాసమునుబట్టి విరిచివేయబడ్డారు," అయితే అన్యజనులు వారి విశ్వాసమువలన "నిలిచియున్నారు." విశ్వాసమనేది కీలకమైనది. వారి విశ్వాసమును బట్టి, సాగుచేయబడిన ఒలీవ చెట్టులోనికి అన్యజనులు అంటుగట్టబడి విశ్వాసమందు వారు కొనసాగిన కారణాన యిప్పుడు వారు చెట్టులో భాగంగా నిలిచియున్నారు. "విశ్వాసమువలన నీవు నీ స్థలాన్ని పట్టుకొనియున్నావు" అని NEB అంది.

**హెచ్చరిక (20బి–22 వచనాలు)**

మన పాఠం యొక్క చర్చనీయాంశానికి యిది మనలను తిరిగి తెస్తుంది. "గర్వపడక భయపడుము" (20బి వచనం) అని పౌలు అన్నాడు. "హెచ్చువాటియందు మనస్సు పెట్టకు" అని గ్రీకు అంటుంది. (*Hupselos* అనేది "హెచ్చు" లేక "ఉన్నతమైన"[16] దాన్ని సూచిస్తుంది; KJV చూడు.) తరువాత అధ్యాయంలో పౌలు క్రైస్తవులందరికి బుద్ధి చెప్పాడు, "తన్నుతాను ఎంచుకొన తగినదానికంటే ఎక్కువగా[17] ఎంచుకొనక, దేవుడు ఒక్కొక్కనికి విభజించి యిచ్చిన విశ్వాస పరిమాణము ప్రకారము … తన్నుతాను ఎంచుకొనవలెను …" (12:3). ఇక్కడ నొక్కి చెప్పబడిన భాషలో, తన అన్యజనుల పాఠకులకు పౌలు చెప్పేదేమంటే "గర్వపడక భయపడుము" (11:20).

"భయము" (*phobeo* నుండి) అచలత్వమైన భయం గుప్తం చేయబడలేదు, కాని బలీయమైన అవిశ్వాసానికి ఫలితాల ఆరోగ్యకరమైన భయం.[18] పౌలు యిలా కొనసాగించాడు, "దేవుడు స్వాభావికమైన కొమ్మలను [యూదులను] విడిచిపెట్టనియెడల నిన్నును [అన్యజనులను] విడిచిపెట్టడు" (21 వచనం). వారు నమ్మనందున దేవుడు యూదులను "విరిచివేశాడు." అది వాస్తవమైనందున, అన్యజనులు విశ్వాసమందు కొనసాగుటలో తప్పిపోయినట్టయితే, వారిని "విరిచివేయడానికి" దేవుడు వెనుకాడడు.

దేవుని శీలము యొక్క యిరువైపుల గల ప్రామాణిక వర్ణనతో తరువాత వచనం ఆరంభమౌతుంది: "కాబట్టి దేవుని అనుగ్రహమును కాఠిన్యమును …" (22ఎ వచనం).[19] "దేవుని గూర్చిన సరిపోయిన సిద్ధాంతమేదైనా ఈ రెండు మూల లక్షణాలను చేర్చునదై యుండాలి. మనమాయన దయను అలక్ష్యం చేసినప్పుడు, దేవుడు కఠినుడైన నియంతగా కన్పిస్తాడు; ఆయన కాఠిన్యాన్ని మనం అలక్ష్యం చేసినప్పుడు ఆయన పిచ్చి

ప్రేమను కనుపరచు తండ్రిగా కన్పిస్తాడు” అని Wassel వ్రాశాడు.[20]

పౌలు యిలా అంటున్నాడు, “కాబట్టి దేవుని అనుగ్రహమును కాఠిన్యమును అనగా పడిపోయిన వారిమీద కాఠిన్యమును, నీవు [నమ్మియున్న అన్యజనులు] అనుగ్రహ ప్రాప్తుడవై నిలిచియున్నయెడల” (22ఎ, బి వచనం). అటు తరువాత అతడు ఈ మాటలు చేర్చాడు: “నీ మీద ఉన్న దేవుని అనుగ్రహము చూడుము; అట్లు నిలువని యెడల నీవును నరికివేయ బడుదువు” (22సి వచనం; నొక్కి చెప్పింది నాది). “ఆయన అనుగ్రహమందు నిలిచి యుండుము” అంటే దేవుని దయ ప్రసాదించే దీవెనలు అనుభవించడంలో కొనసాగడానికి నమ్మకంగా ఉండిపో. (సాధారణంగా “విశ్వాసము” అనేది అనేక విషయాలతో కూడిన పదమైయుంది. అందులో హృదయపూర్వకమైన విధేయత చేర్చబడింది [రోమా 6:17; 1:5; 16:26 చూడు].)

మనం ఆలోచిస్తూ వస్తున్న వచనాలు “విశ్వాసమందు కొనసాగించుటను గూర్చి మిక్కిలి తీవ్రమైన క్రొత్త నిబంధన హెచ్చరికలలో ఒకటిగా రూపొందుతాయని” Douglas J. Moo వ్రాశాడు.[21] క్రైస్తవులైన అన్యజనులకు అతిశయ కారణం లేదు ఎందుకంటే వారు అంగీకరించబడడం త్రిప్పివేయబడనిదేమీ కాదు. “[దేవుని] దయయందు వారు కొనసాగింపక” పోయినట్టయితే, అవిశ్వాసులైన యూదులు ఎలాగో ఆలాగే వీరును “తుంచివేయబడతారు.” “నీవు చచ్చిన కొమ్మవైన క్షణంలో నీవు అక్కడ ఉండవు” అని Peterson పేరాఫ్రేజ్‌నిచ్చాడు (MSG).

## యూదుల అంగీకారం యింకను సాధ్యమే గనుక (11:23, 24)

### మానవ శక్యమైనది

పాత నిబంధన కాలాల్లో, దేవుని కృపకు సంబంధించి యూదులు “లోపల” ఉన్నారు, అనేకులైన అన్యజనులు “వెలుపట” ఉన్నారు (ఎఫెసీయులకు 2:12 చూడు). రోమా పత్రిక వ్రాయబడే కాలంలో అనేకమంది అన్యజనులు “లోపల” ఉన్నారు, యూదులు “వెలుపట” ఉన్నారు. ఏదియెలాగున్నా, ఆ పరిస్థితి మరల తిప్పివేయబడవచ్చు. విశ్వాసమందు నిలకడగా ఉండకపోతే నీవును “నరికివేయబడుదువు” అని అన్యజనులలో నుండి క్రైస్తవులైనవారిని హెచ్చరించిన మీదట పౌలు యిలా అన్నాడు, “వారును (యూదులు) తమ అవిశ్వాసములో నిలువకపోయిన యెడల అంటుకట్టబడుదురు” (23ఎ వచనం). యూదుల పట్ల బలీయంగా దేవుడు తలుపును మూసి మరెన్నడూ వారు లోనికి రాకూడదన్నట్టు ఆయన తాళం వేయలేదు.[22]

వచనం 23లోని “యెడల” అనే మాట క్రింద గీతగియ్యి. “వారు తమ అవిశ్వాస మందు నిలువకపోయినప్పుడు” అని పౌలు అనలేదు, “వారు తమ అవిశ్వాసములో నిలువపోయిన యెడల” అని అన్నాడు. “అవిశ్వాసులైన యూదులెల్లరు ఒకనాడు తమ సొంత ఒలీవ చెట్టులోనికి అంటుకట్టబడినవారై, రక్షింపబడబోతున్నారని అపొస్తలుడు అనలేదు సరిగదా అలాగని గుప్తం చేయలేదు” అని Hendriksen వ్యాఖ్యా

నించాడు.[23] మనం వచనం 26 చదువునప్పుడు, వచనం 23లో ఉన్న తేటైన ఉపదేశాన్ని వ్యతిరేకించనేమియు లేదని మనం గమనిస్తాం. మనందరివలెనే, యూదులు కూడ స్వతంత్రులైన వ్యక్తులే - వారు నమ్మ కోరవచ్చు లేక నమ్మకపోవచ్చు.

"భ్రష్టత్వం అసాధ్యమని" ప్రకటించేవారు దేవుని బిడ్డ పాపం చేసి పడిపోవచ్చు అని ఉపదేశించేవారిని కొన్నిసార్లు పోటీకి పిలుస్తారు. "విశ్వాసి నశించిపోగలడని నీవు అంటున్నావా?" అని వారు అపహసిస్తారు. మనం చదువుతున్న వచనంలో పౌలు ఏమంటున్నాడో వారు జాగ్రత్తగా గమనించవలసియుంటుంది. అవిశ్వాసి విశ్వాసియై రక్షింపబడడానికి సాధ్యమౌతుందని అపొస్తలుడు తేటపరచాడు (23 వచనం) - మరియు విశ్వాసి అవిశ్వాసిగా మారి నశించిపోయే అవకాశముంది (20-22 వచనాలు).




నేను ముందుగా చెప్పినట్టే, మనం క్రైస్తవులమైన తరువాత కూడా, మనం స్వతంత్రులమైన నీతి కర్తలమైయుంటాం. మనం "దేవుని దయలో కొనసాగవచ్చు" లేదా ఆయన నియమించినట్టు జీవించకుండడానికి మనం తీర్మానించుకోవచ్చు. గర్వము అనే మన అంశానికి యిది ఎలా సంబంధం కలిగియుంటుంది? దైవ కృపమీద మనం ఆధారపడాలనే విషయాన్ని గర్వ స్వభావం మరిపించి, దేవునియందలి విశ్వాసాన్ని తనయందు తాను నమ్ముకునేలా మార్చివేయ వచ్చునని F. F. Bruce వ్రాశాడు. అదే సంభవించినట్టయితే మనం కూడ "విరిచివేయబడతాం."[24] "మీరు విశ్వాసము గలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూడుడి; మిమ్మును మీరే పరీక్షించుకొనుడి!" అని పౌలు మనలో ప్రతి ఒక్కరిని హెచ్చరించాడు (2 కొరింథీయులకు 13:5ఎ).

## దైవ శక్తి

"వారును తమ అవిశ్వాసములో నిలువక పోయినయెడల" దేవుడు యూదులను తిరిగి అంటుకట్టతాడని అన్న తరువాత పౌలు యిలా చెప్పాడు,

> ... దేవుడు వారిని మరల అంటు కట్టుటకు శక్తిగలవాడు. ఎట్లనగా నీవు స్వాభావికమైన అడవి ఒలీవ చెట్టునుండి కోయబడి స్వభావ విరుద్ధముగా మంచి ఒలీవ చెట్టున అంట్టు కట్టబడినయెడల స్వాభావికమైన కొమ్మలగువారు మరి నిశ్చయముగా తమ సొంత ఒలీవ చెట్టున అంటుకట్టబడరా? (రోమా 11:23బి, 24).

"వేరైన" (అడవి) కొమ్మలను (అన్యజనులను) అంటుకట్టడం కంటే "స్వాభావికమైన" కొమ్మలను (యూదులను) అంటుగట్టడం సులభమని రీజనింగ్ మనకు తెలుపుతుంది.

మూలవాక్యంలోని యిచ్చోట కొంతమంది రచయితలు ఆందోళన చేశారు. తోటమాలి కొమ్మ పనికిమాలినదని కొట్టివేసి (యోహాను 15:2 చూడు) దాన్నే తిరిగి అంటుకట్ట ప్రయత్నించడాన్ని వారు ఆక్షేపించారు. మొద్దులోనుండి కొమ్మ కొట్టివేయబడిన తరువాత అది త్వరగా ఎండిపోతుంది అది పొయ్యిలోనికి మాత్రమే పనికివస్తుంది అని వారు గుర్తించారు (యోహాను 15:6 చూడు); తోట పని తెలియని పట్టణపు బాలునిగా వారు పౌలును ఎంచారు. వీరికి నేను మొదటిగా చెప్పేదేమంటే, "అంతగా ఎగిరిపడనవసరం లేదు. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే." పౌలు ఉద్దేశం దైవ సత్యాలను ఉపదేశించడమే గాని, తోట పనిమీద ఉపన్యాసం యివ్వడం కాదు. కోట్లకొలది రూపాయల అప్పును ఒక యజమానుడు తన బానిసను క్షమించిన ఉదంతాన్ని ప్రభువైన యేసు ఒకసారి చెప్పారు (మత్తయి 18:23-27), అది సహజంగా జరిగేది కాదు! తన దినాల్లో ఉండిన యజమానుడు/బానిస అనే సంబంధం ఎరుగనివారని దాని అర్థమా? లేదు, అది కేవలం ఉదాహరణ మాత్రమే.

రెండవది, "నరుడు వారిని తిరిగి అంటుకట్టగలడని" కాదు, కాని "దేవుడు వారిని తిరిగి అంటుకట్టగలడు." మత్తయి 19:26లోని మాటలు తగినవైయున్నట్టు కన్పిస్తాయి: "ఇది మనుష్యులకు అసాధ్యమేగాని దేవునికి సమస్తము సాధ్యము." దేవుడు మృతులను సయితము లేపగలవాడైయున్నందున (రోమా 11:15), తిరిగి ఆయన దాన్ని మరల అంటుకట్టునట్టు ఎండిన కొమ్మను పునర్జీవింపజేయగలడు.

యూదులలో అనేకులు నిరాకరింపబడగా, తాము అంగీకరింపబడినందుకు అన్యజనులలోనుండి వచ్చిన క్రైస్తవులకు అతిశయ కారణమేదైనా ఉందా? లేదు. ఎందుకంటే ఆ పరిస్థితి సులభంగా త్రిప్పివేయబడవచ్చు. యూదులు తమ అవిశ్వాసము నుండి తిరిగి రాగలిగితే, యూదులు యింకను అంగీకరింపబడవచ్చు.

## ముగింపు

అన్యజనులకు అతిశయ కారణమేదీ లేదని ఈ పాఠంలో మనం నొక్కి చెప్పాం - అతిశయించడానికి మనకు కూడ ఏ కారణమూ లేదు. మనం కేవలం మరణ పాత్రులమైన పాపులం (రోమా 3:23; 6:23). దేవుని కృపవలన మనం రక్షింపబడ్డాం. వ్యక్తిగతమైన యోగ్యతను బట్టికాదు. Isaac Watts యిలా రాశాడు,

> అద్భుతమైన సిలువను నేను అవలోకించినప్పుడు
> దానిపై మహిమగల అధిపతి మరణించారు
> నా మహా గొప్ప ఐశ్వర్యాన్ని నష్టంగా నేనెంచుకొని
> నా గర్వమంతటి మీద తిరస్కారాన్ని కుమ్మరించాను.[25]

పేతురు యిలా వ్రాశాడు, "దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి" (1 పేతురు 5:5, 6).

ముగిస్తుండగా, దేవునితో సరియైన సంబంధం లేనివారికి నా వద్ద సందేశముంది. దేవునికి నీ జీవితం ఎన్నడూ సమర్పించుకొనకపోతే, నిన్ను నీవు తగ్గించుకొని నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది యజమానుని ఆజ్ఞలకు నిన్ను నీవు తగ్గించుకొనుట కష్టంగా నీవు కనుగొనవచ్చు (అపొస్తలుల కార్యములు 17:30; మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38). నీవు త్రోవ తప్పిన క్రైస్తవుడవైతే, నీ పాపములు ఒప్పుకొని, మారుమనస్సుపొంది, నీ కొరకు ప్రార్థించుటకు యితరులను నీవు అడగడం కష్టం కావచ్చు (1 యోహాను 1:9; అపొస్తలుల కార్యములు 8:22; యాకోబు 5:16). గర్వం పరలోకంనుండి నిన్ను దూరంగా ఉంచనీయవద్దని నేను నిన్ను వేడుకొంటున్నా!

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

"గర్వం యొక్క సమస్యలు," "అహంబావము యొక్క అపాయములు," "అతిశయించు విషయమై జాగ్రత్త," "అతిశయ కారణము లేదు" అంటూ అనేక వేరైన పేర్లను ఈ పాఠానికి పెట్టవచ్చు.

పౌలు యొక్క ఒలీవ చెట్టు ఉదాహరణ కొట్టవచ్చినట్టు ఉంది. నీకు చేతనైతే చెట్టు బొమ్మ కొమ్మలు, భూమిలోనికి పాతుకుపోయిన వ్రేళ్లు వేయి. పాఠం ముందుకు సాగుతూ ఉండగా, నీవు కొన్ని కొమ్మలను తుడిచివేయవచ్చు, మరల గీయవచ్చు, నేలమీద పడవేసినట్టు చూపవచ్చు. చెట్టులోనికి క్రొత్త కొమ్మలు అంటుకట్టబడినట్టు చూపవచ్చు.

గర్వం యొక్క సమస్యను మాట్లాడడంలో కాలం గడుపవచ్చు. నీకు కంకార్డెన్స్ ఉంటే, "గర్వము," "అహంబావము," "అతిశయము," వాటికి సంబంధించిన పదాలను చూడు. ఆరంభించడానికి యిక్కడ కొన్ని లేఖన భాగాలు యివ్వబడ్డాయి: 1 కొరింథీయులకు 13:4; 1 తిమోతి 3:6; 2 తిమోతి 3:2; 1 యోహాను 2:16.

పాపభరితమైన అతిశయముంది, న్యాయసమ్మతమైన అతిశయముంది. మన మూల వాక్యంలో, "ఘనపరచుచున్నాను" (*doxazo*) అని వచనం 13లో ఉన్నదాన్ని ("దానియందు అతిశయింతును" అని Weymouth) తర్జుమా చేయవచ్చు. మనం కలుసుకొనే ప్రజలను మంచి ప్రభావితులనుగా చేయుటకు కొంతవరకు మనం "అతిశయించవచ్చు." మన పనియందు మనం "అతిశయపడి" మన శ్రేష్ఠమైనదాన్ని జరిగించవచ్చు. ఇతరులు సాధించిన వాటిపై అతిశయించడంలో తప్పు కాదు (2 కొరింథీయులకు 1:14 చూడు). తాము యితరులకంటే శ్రేష్ఠులము అని తలంచే గర్వాన్ని/అతిశయాన్ని/అహంకారాన్ని పౌలు ఖండించాడు.[26] (ఈ తలంపులు నీ సమాచారం కొరకు. నీ పాఠంలో/చర్చలో వాడుకొనదానికి అవసరమో కాదో నీవే తీర్మానించుకో.)

## సూచనలు

[1]పత్రిక వ్రాయడంలో యిది పౌలు యొక్క ప్రాథమిక ఉద్దేశమైనట్టు కొందరు అభిప్రాయపడ్డారు. [2]William Barclay; quoted in Robert J. Morgan, *Nelson's Complete Book of Stories, Illustrations, & Quotes* (Nashville: Thomas Nelson Publishers, 2000), 633. [3]C. S. Lewis, *Mere Christianity* (New York: Macmillan Co., 1952), 108-9. [4]"నాశనమునకు ముందు గర్వము నడచును పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును" అన్నట్టు NASBలో ఉంది. [5]"పాపుల పట్ల దేవుడు ఆశ వదులుకుంటాడా? (11:1–12)" మీద చర్చను చూడు. [6]11:25, 26కు వచ్చేటప్పుడు ఈ విషయం జ్ఞాపకముంచుకో. [7]వచనం 15లో క్రియా వాచకం లేదు, తర్జుమాదారులు క్రియావాచకాలను సప్లై చేశారు. కొందరు యూదులు భవిష్యత్ కాలములో మారుతారని జోస్యం చెప్పడానికి ఉపయోగించే క్రియా వాచకాన్ని వాడుతారు. [8]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 411. Morris ఈ సూచనను చేర్చాడు: "పౌలు ζωη εκ νεκρων ని ఆఖరి పునరుత్థానమును తెలిపే αναστασιζ νεκρων (1 కొరింథీయులకు 15:12 etc.) నకు" బదులుగా ఉపయోగించాడు. [9]Walter W. Wessel, notes on Romans, *The NIV Study Bible,* ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 1723. [10]William Hendriksen, *Exposition of Paul's Epistle to the Romans,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1982), 370.

[11]11:25, 26 స్టడీలో యిది వివరంగా చర్చించబడుతుంది. [12]"ముద్దంతయు" అని అర్థమిచ్చే పద ప్రయోగం వాడబడినది. [13]కొందరు రచయితలు దీన్ని "ఉపమానమని," యితరులు "రూపకాలంకారమని" అంటారు. [14]సాగు చేయబడే చెట్టును పునర్జీవింపజేయడానికి అప్పుడప్పుడు యిది చేయబడుతుందని ప్రాచీన రచయితలు అంటారు. [15]Morris, 414. [16]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, 1971), 421. [17]హెచ్చరిక ఒకటేయైన రోమా 11:20కంటే రోమా 12:3లో "ఎక్కువగా" అనే వేరైన పదం ఉపయోగించబడింది. [18]మంటలో మన చేతులు పెట్టకుండ ఉండునట్లు బలమైన, ఆరోగ్యమైన భయం అగ్ని అంటే ఉండాలి – మంట దగ్గరకు రావడానికి నిరాకరించే అంతటి బలమైన అనారోగ్యమైన భయముండకూడదు. [19]దేవుడు (న్యాయాన్ని) కాఠిన్యాన్ని సంతుష్టిపరచుతూ సిలువ దేవుని (ప్రేమ) దయను వ్యక్తపరుస్తుంది. ఇది "మూడు చిన్న పదాలు (3:24బి–26)" పాఠంలో చర్చించబడింది. [20]Wessel, 1723.

[21]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 368. [22]ఇంటి ద్వారం గుండా లోపలికి ప్రవేశించుటకు ముందుగా ప్రవేశించువారి పాదములను శుభ్రము చేసికొని లోనికి ప్రవేశించుటకు ఉంచబడిన మ్యాట్‌పై ఆహ్వాన రాతలతో ఉన్నవాటిని చూస్తాం. [23]Hendriksen, 376. [24]Adapted from F. F. Bruce, *The Letter of Paul to the Romans,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 205. [25]Isaac Watts, "When I Survey the Wondrous Cross," *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [26]Adapted from Encarta World English Dictionary, Microsoft Word Ver. 10, Microsoft Corporation, Redmond, Wash., 1999.

# 50

# “ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురా”? (11:25-26ఎ)

రోమా 11:25-36ను పూర్తిగా పఠించడానికి ముందు, అది దిగ్భ్రమమైన భాషతో మొదలైన విషయాన్ని మనం శ్రద్ధతో గమనించాలి:

> సహోదరులారా, మీదృష్టికి మీరే బుద్ధిమంతులమని అనుకొనకుండునట్లు ఈ మర్మము మీరు తెలిసికొనగోరుచున్నాను. అదేమనగా, అన్యజనుల ప్రవేశము సంపూర్ణమగువరకు ఇశ్రాయేలునకు కఠిన మనస్సు కొంతమట్టుకు కలిగెను ... ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురు (25, 27 వచనాలు).

నేను కొంత సంశయాస్పదంగా ఈ లేఖన భాగాన్ని ప్రవేశిస్తున్నాను. నేను కాలేజీనుండి పట్టభద్రుడనైన తరువాత ఓక్లహోమా మహా నగర గ్రామీణ ప్రాంతంలోని స్థానిక సంఘంలో ప్రసంగించుటకు ప్రారంభించాను. ఆ ప్రాంతంలోని సువార్తికులందరు నెలకొకసారి చర్చకును, సహవాసానికిని కూడుకునేవారం. ఆ సభలలో నేను అందరికంటే బాగా చిన్నవాడిని. రాబోయే సభలో నీవు రోమా 11:25, 26 మీద మాట్లాడాలి అని నాకు అప్పగించారు. అనుభవశాలులైన సువార్తికుల యెదుట నేను మాట్లాడడానికి జంకుతున్నా. కష్టపడి చదివాను ఎక్కువసేపు ప్రార్థించాను. ఆ ప్రసంగాన్ని గూర్చి నాకు జ్ఞాపకమున్న విషయమేమంటే, నేను చెప్పినదానితో అక్కడున్నవారిలో చాలామంది అంగీకరించలేదు. దానినుండి తేరుకోడానికి నాకు కొంత సమయం పట్టింది - మరియు యిప్పుడు కష్టమైన, వివాదాస్పదమైన లేఖన భాగాన్ని మరల ఎదుర్కొంటున్నాను!

రోమా 11:25, 26 సందర్భంలో, “అన్యజనుల ప్రవేశము సంపూర్ణమగువరకు” అనే ప్రయోగాన్ని మత ప్రపంచంలో అనేకులు “అన్యజనుల పూర్తి సంఖ్య” అని వ్యాఖ్యానిస్తారు. అన్యజనులలో యింత సంఖ్య అని దేవుని మనస్సులో ఉన్నట్టు వారు నమ్ముతారు. అప్పుడు, ఆ ప్రత్యేకమైన సంఖ్యకు వచ్చి చేరుకున్న మీదట, యూదులందరు సంపూర్ణంగా మార్పు చెందుతారని (“ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడతారని”) వారు ఎదురు చూస్తారు. ఈ అద్భుతమైన సంఘటన రెండవ రాకడ సమీప కాలంలో జరుగుతుందని అనేకులు నమ్ముతారు.

ఈ పాఠానికి నేను సిద్ధపడినప్పుడు, ఈ వ్యాఖ్యానం ఎంతగా విస్తరించిందో తెలిసి

ఆశ్చర్యపోయాను. "అంత్య కాలాలను" గూర్చిన వెయ్యేండ్ల పరిపాలనావాదుల ఉపదేశ వృత్తాంతములో వారు దీన్ని ఉపయోగించినట్లు నేనెరుగుదును. ప్రభువు సంఘ సభ్యుల పాత వ్యాఖ్యానాల్లో ఈ భావాల్లోనివి కొన్ని ప్రతిఫలించినట్టును ఎరుగుదును.[1] కాని యిటీవల వెలసిన వ్యాఖ్యానాలలో – వెయ్యేండ్ల పరిపాలనావాదులతో సంబంధం లేనివారు సహితం – యింతకు ముందు ఎన్నడూ బయలుపరచబడని ("రహస్యాన్ని") పౌలు 25, 26 వచనాల్లో పంచుకున్నట్టు నమ్ముతారు: ప్రభువు రాకడకు ముందు, యూదులు సామూహికంగా మార్పు చెందుతారని నమ్ముతారు.

Abilene Christian College లోని నా ఉపాధ్యాయులలో ఒకరు కష్టమైన లేఖన భాగాన్ని గూర్చి చెప్పిందేమంటే, "నేను మీకు 'కొయ్య దిమ్మ' చూపించాను. మీరు దాని చుట్టూ దున్నబోతారో లేక దాన్ని పెరికివేయబోతారో మీరు నిర్ణయించుకొండి." "అతిశయానికి హేతువేమియు లేదు (11:13–24)" అనే పాఠంలో, రోమా 11:25, 26లో "కొయ్య దిమ్మను" గూర్చిన ఒక చూపును మీకిచ్చాను. దాని విషయంలో ఏమి చేయాలో ఆ సమయం ఆసన్నమయ్యింది.

## నిరాకరించవలసిన సిద్ధాంతాలు

**సిద్ధాంతం: "పౌలు క్రొత్త అంశాన్ని పరిచయం చేశాడు" అనేది.**

మన సిద్ధాంతాలను అపార్థం చేసికొనడానికి సంబంధించిన కొన్ని మూల స్థానాలను సూచించడంతో ఆరంభించుదాం. ఇక్కడ పౌలు ఏదోయొక క్రొత్త అంశాన్ని ప్రారంభించినట్టు, 11వ అధ్యాయం చివరి భాగాన్ని మిగిలిన అధ్యాయమునుండి వేరు చేసి దానిని క్రొత్త అధ్యాయంగా పరిచయం చేయడంతో సమస్య ఆరంభమౌతుంది. వచనం 25 ఆలాటి భావనను ఎగురగొట్టుతుంది. ఎందుకంటే అది "for" (*gar*) అనే పదంతో ఆరంభమౌతూ, జరిగిపోయిన దానిని జరగబోతున్నదానితో ముడివేస్తుంది. "సహోదరులారా" అని తాను సంబోధిస్తుంది 25 వచనం యింతకు ముందు ఎవరితో మాట్లాడుతున్నాడో అదే అన్యజనులలోనుండి క్రైస్తవులైనవారితో (13 వచనం). "అతిశయించ వద్దు" (18 వచనం), "గర్వింపకు" (20 వచనం) అని విన్నవించుకున్న అన్యజనులనే "మీదృష్టికి మీరే బుద్ధిమంతులమని అనుకొనకుండ" జాగ్రత్తపడమని అపొస్తలుడు కోరుతున్నాడు (25 వచనం).

25, 26 వచనాల వెంట వచ్చే వచనాలను ఒక్కసారి చూడు, ఈ అధ్యాయం మొదటి భాగంలో పరిచయం చేసిన ఆలోచననే పౌలు కొనసాగిస్తున్నట్టు నీవు కనుగొంటావు (11–14 వచనాలను చూడు). (దేవునిచే) యూదులు నిరాకరింపబడడం, (దేవునిచే) అన్యజనులు అంగీకరింపబడేలా పరిణమించింది. యూదులు యేసును అంగీకరించునట్లు ప్రేరేపించడానికి అది ఉద్దేశింపబడింది. ఈ ఆలోచనా విధానమే అధ్యాయం చివరి భాగంలో కొనసాగింది. ఈ క్రమాన్ని అవి ఎలా వ్యక్తపరచు తున్నాయో, ఉదాహరణకు, వచనాలు 30, 31 చదివి చూడు:

యూదుల అవిధేయత
(దేవుడు యూదులను నిరాకరించేలా పరిణమించింది)

↓

అన్యజనులకు కనికరము చూపబడింది
(దేవునిచే అన్యజనులు అంగీకరింపబడ్డారు)

↓

యూదులకు కనికరం చూపబడింది
(యూదులు దేవునిచే అంగీకరింపబడతారు)

**సిద్ధాంతం: " 'మర్మము' అంటే యింతకు ముందు ఎన్నడూ బయలుపరచబడని రహస్యం."**

"మర్మము" అనే మాటకు సంబంధించిన సమస్యతో తికమక కొనసాగుతుంది. "మర్మము" అనేది (*musterion*) అనే గ్రీకు పదంనుండి వచ్చింది. *Musterion* అనే బైబిలు పదప్రయోగం, తెలియబడని దాన్ని సూచించేది కాదు. దేవునిచే బయలుపరచబడకుంటే తెలిసికోలేమని అర్థమిస్తుంది (1 కొరింథీయులకు 2:7; ఎఫెసీయులకు 3:9లను చూడు). " 'మర్మము' అనే పదానికి సాధారణమైన అర్థం, తెలియపరచని (తెలివి) జ్ఞానమని గుప్తం చేయబడిందని; దాని లేఖనానుసారమైన ప్రాధాన్యత బయలుపరచబడిన సత్యమని" W. E. Vine రాశాడు.[2] క్రొత్త నిబంధనలో "మర్మమనేది" బహు తరచుగా దేవుడు క్రీస్తును ఈ లోకానికి పంపించడంతోను, ఈ ఏర్పాటుతో సంబంధం కలిగిన దాన్ని బయలుపరచడంతోను పొత్తు కలిగియుంది (కొలొస్సయులకు 1:27; 2:2; 1 తిమోతి 3:16 చూడు). పౌలు రోమీయులకు ఈ పత్రికను ముగించుతూ యిలా అన్నాడు,

> సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు, అనాదినుండి రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్షపరచబడిన మర్మము, నిత్యదేవుని ఆజ్ఞ ప్రకారము ప్రవక్తల లేఖనములద్వారా వారికి తెలుపబడియున్నది. ఈ మర్మమును అనుసరించియున్న నా సువార్త ప్రకారముగాను, యేసుక్రీస్తును గూర్చిన ప్రకటన ప్రకారముగాను, మిమ్మును స్థిరపరచుటకు శక్తిమంతుడును అద్వితీయ జ్ఞానవంతుడునైన దేవునికి, యేసుక్రీస్తు ద్వారా, నిరంతరము మహిమ కలుగును గాక. ఆమేన్ (16:25, 27; నొక్కి చెప్పింది నాది).

*Musterion* అనే పదం యొక్క ప్రాథమిక భావం అనేకమంది రచయితలు ఎరిగేయున్నారు. అయినా, రోమా 11:25లో మాత్రం, పౌలు తన పాఠకులతో ఏదోయొక రహస్యాన్ని పంచుకోబోతున్నట్టి అర్థాన్ని వారు సూచించగోరతారు. ఈ మర్మం – యింతకు ముందు ఎన్నడూ బయలుపరచనిదియు, లేఖనాల్లో మరి ఎన్నడూ సూచింపబడనిదియునై ఉంది – యూదులు సామూహికంగా మార్పు చెందడం.

మన మూల వాక్యంలో, *musterion* అనేది అంత రహస్యమైనదేమీ కాదని నేనంటాను. ముందుగానే గుర్తించినట్టు, పౌలు క్రొత్త అంశాన్నేమీ ప్రవేశపెట్టలేదు. కాని, అతడు తన ప్రధాన ఆలోచనా విధానాన్ని కొనసాగిస్తున్నాడు. అన్యజనులను అంగీకరించ డంవలన, వారికి రోషం పుట్టించి యూదులను రక్షించే దేవుని అమోఘమైన ఏర్పాటు యొక్క ప్రత్యక్షతను *musterion* సూచిస్తుందని నేను నమ్ముతాను. ఇంతకుముందే పలుమార్లు మనం చర్చించిన క్రమమైన సంఘటనలోనికి వచనాలు 25, 26 ఎలా సరిపోతున్నాయో ఆలోచించు:

ఇశ్రాయేలుకు కఠిన మనస్సు కొంతమట్టుకు కలిగెను
(యూదులు దేవునిచే నిరాకరింపబడ్డారు)

↓

అన్యజనుల ప్రవేశము సంపూర్ణమగువరకు
(అన్యజనులు దేవునిచే అంగీకరింపబడ్డారు)

↓

ఇశ్రాయేలు జనులందరు రక్షింపబడుదురు
(దేవునిచే యూదులు అంగీకరింపబడడం)

రోమా 11:26కు సంబంధించి, కొందరి ఆక్షేపణ ఏమంటే, పౌలు *musterion* అనే పదం ఉపయోగించడం ఏదో కొంత నూతన సత్యాన్ని గాక, ముందుగానే బయలు పరచబడిన విషయాన్నే అది సూచిస్తుంది అని. క్రొత్త నిబంధనలో *musterion* అని ఉపయోగించిన లేఖన భాగాలను తనిఖీ చేయి, క్రీస్తును సూచించడానికి తరచుగా పౌలు వాడినట్టు మనం కనుగొనగలం; తన పాఠకులకు క్రీస్తు నిశ్చయంగా "క్రొత్త అంశం" కానేకారు.

ఇతరులు చెప్పే ఆక్షేపణ ఏమంటే, *musterion* అనే పదానికి రోమా 11:25, 26లో నా పంథా అంత ఆసక్తిని, ఉత్సాహాన్ని రేకెత్తించేదిగా లేదని. సంఘానికిని, క్రీస్తునకును గల సంబంధంవంటి "ఉత్సాహం రేకెత్తించని" పలు అంశాలను సూచించ డానికి పౌలు *musterion* అనే పదాన్ని ఉపయోగించాడు (ఎఫెసీయులకు 5:32). నిజానికి, దేవుని ఆంతర్యాన్ని కనిపెట్టేలా ఆత్మచే ప్రేరేపింపబడిన పౌలు – యూదుల నిరాకరణ అన్యజనుల అంగీకారంగాను (మరల అటుది యిటు) యిటుది అటు ఎలా తేబడుతుందో చూడడం అద్భుతంగా ఉంటుంది! William Hendriksen యిలా రాశాడు, "అది యిప్పుడు కేవలం మాటలకందని అద్భుతం కాదా? ... అన్యజనుల యొక్కయు ఇశ్రాయేలు యొక్కయు రక్షణ ఒకదానిమీద ఒకటి ఆధారపడి దైవికమైన 'మర్మ' విషయమైయున్నది."[3]

**సిద్ధాంతం: "యూదులు యింకను 'దేవుని ఏర్పరచబడిన జనులే.' "**

ఇశ్రాయేలు దేశంతో ప్రస్తుతపు దేవుని సంబంధాన్ని అపార్థం చేసికొనడంవలన సమస్య యింకను హెచ్చింపబడింది. యూదులు యింకను "దేవుని ఏర్పాటులో ఉన్న ప్రజలుగా" ఉన్నట్టు ధ్రువీకరించుటకు రోమా 11:28బి, 29 తీసికొనబడింది. "దేవుడు మరియు ఇశ్రాయేలు" అనే వ్యాసంలో ఇశ్రాయేలుతో దేవుని సంబంధము అనే సాధారణమైన అంశం చర్చించబడింది. మరియు 28, 29 వచనాలు "దేవునికి మహిమ కలుగును గాక! (11:25–36)" అనే పాఠంలో చర్చించబడింది. మన స్టడీస్‌లో మాటి మాటికి యూదులకు దేవునిపై ఏ క్లెయిమ్ ఇకను ఏమియు లేదని నొక్కి చెప్పబడింది. దేశముగా, వారు యిక ఏ మాత్రం ఆయన "ప్రత్యేకమైన ప్రజలు" కారు.

## కాదనవలసిన స్థితులు

**వెయ్యేండ్ల పరిపాలన స్థితి**

రోమా 11:25, 26 లేఖన భాగానికి సంబంధించి, అది ఏమి చెప్తుతుంది అది ఏమి చెప్పడం లేదో అన్న విషయంపై ఒక వ్యక్తి బహు నిశ్చయంగా ఉండవచ్చు. వెయ్యేండ్ల పరిపాలనావాదులు అది ఏమి బోధిస్తుందని అంటున్నారో అది కాదని మొదట నేను స్థాపించుతాను.

వెయ్యేండ్ల పరిపాలనావాదులలోని ఒక భావన ఈ విధంగా వెళ్లుతుంది:[4] యేసు భూమిమీదికి వచ్చినప్పుడు, యెరూషలేములో భౌతిక రాజ్యం స్థాపించడం ఆయన ఉద్దేశం – అయితే యూదులు ఆయనను రాజుగా అంగీకరించడం మీద అది ఆధారపడి ఉంది. యూదులు యేసును అంగీకరిస్తారని ప్రవచింపబడింది, కాని యేసును రాజుగా వారు నిరాకరించి దేవుని ఏర్పాటును వారు అడ్డిగించారు (పాడు చేశారు). యూదులు ఆయనను అంగీకరించేవరకు సంఘము ఒక తాత్కాలిక ఏర్పాటుగా స్థాపించబడింది. ఇక్కడికి మన లేఖన భాగం వస్తుంది. ఒక రోజు యూదులు అంగీకరిస్తారు అని వెయ్యేండ్ల పరిపాలనావాదులు అంటారు. (యూదులందరు మృతులలోనుండి లేపబడి మూర్ఛిల్లు తారని కొందరు వెయ్యేండ్ల పరిపాలనావాదులు నమ్ముతారు. నూతనమైన ఈ యూదుల మార్పు బలీయమైన సువార్త సైన్యంగా రూపొందుతారని కూడ వారిలో కొందరు ఉపదేశిస్తారు.) ఈ యూదుల ఉజ్జీవం, క్రీస్తు భూమిమీదికి వచ్చేదానికి దోహదం చేస్తుంది. ఆ సమయంలో ఆయన భౌతిక రాజ్యం స్థాపిస్తాడని వారు చెప్పుతారు.

సంకీర్ణమైన ఈ కథ చుట్టు బలహీనత ఆవరించింది.[5] యేసు భౌతిక రాజ్యాన్ని స్థాపించడానికి రాలేదు (యోహాను 18:36 చూడు). యూదులు యేసును భౌతిక రాజుగా అంగీకరించడానికి యిష్టపడ్డారు (యోహాను 6:15 చూడు), కాని వారాయనను తమ ఆత్మ సంబంధమైన రాజు అని అంగీకరించడానికి యిష్టపడలేదు. (రోమా 9:32, 33 మీద కామెంట్స్ చూడు.) సంఘ స్థాపన తరువాత వచ్చిన ఆలోచన గాని, అది "తాత్కాలికమైన ఏర్పాటు గాని కాదు" (ఎఫెసీయులకు 3:10, 11 చూడు); పైగా, యేసు స్థాపింప వచ్చిన

రాజ్యము సంఘమే. ("సంఘము," "రాజ్యము" అనేవి పర్యాయ పదాలుగా వాడబడ్డాయి మత్తయి 16:18, 19లో.) ఏదో ఒక రోజు యూదులందరు యేసును అంగీకరించడానికి సంబంధించి ఒక ప్రశ్న అడుగవలసియుంటుంది: (వెయ్యేండ్ల పరిపాలనావాదుల ఉపదేశం ప్రకారం) యేసును అంగీకరించక పోవడంచేత ఒకప్పుడు దేవుని ఉద్దేశాన్ని భంగపరచిన యూదులు, భవిష్యత్తులో మరల యేసు నిరాకరించడం వలన దేవుని ఉద్దేశానికి విఘాతం కలిగించరని ఎలా నిశ్చయంగా చెప్పగలం?

రోమా 11:25, 26ను వెయ్యేండ్ల పరిపాలనావాదులు ఉపయోగించడానికి సంబంధించి యితరమైన బలహీనతలను ప్రస్తావించవచ్చు. ఉదాహరణకు, వారి సామూహిక మార్పు అనంతరం (కొందరు ఉపదేశిస్తున్నట్టు) వారు గొప్ప సువార్త చేయు సైన్యంగా రూపొందితే, అప్పటికే అన్యజనుల "సంఖ్య సంపూర్ణమైనప్పుడు," వారు యింకా ఎవరికి సువార్త ప్రకటించబోతారు? అన్నిటికి మించిన అత్యంత గొప్ప బలహీనత ఏమంటే, బోధిస్తుందని వారు చెప్పేది అది బోధించడం లేదు. దీనినే మనం తరువాత చర్చిస్తాం.

## ప్రసిద్ధికెక్కిన పరిస్థితి

ఈ పాఠంలో పరిచయమందు నేను సూచించినట్టు, వెయ్యేండ్ల పరిపాలనావాదులతో సంబంధం లేని అనేకమంది రచయితలు – యూదుల సామూహిక మార్పునందు నమ్మిక యుంచుతారు. ఏదో ఒక భవిష్యత్తు కాలంలో సంభవించుతుందని వారు ఎదురు చూస్తారు (ప్రభువు రెండవ రాకడకు కొంచెం ముందు అది జరుగవచ్చుననేది వారి భావన) అంటే, ముందుగా నియమించబడిన అన్యజనుల సంఖ్య పూర్తి అయినప్పుడని – క్రైస్తవులైనప్పుడు. అనేక పరిస్థితులలో, ప్రతి యూదుడు యేసు వద్దకు వచ్చుట కష్టం గనుక, ఈ ప్రయోగాన్ని అనేకమంది రచయితలు "ఇశ్రాయేలీయులందరు" అని వాడతారు. "ప్రముఖమైన సంఖ్యను" గూర్చి వారు మాట్లాడుతారు, "ఇశ్రాయేలు ఎల్లరు" లేక "యూదుల పెద్ద సమూహమును" గూర్చి వారు చెప్పుతారు.

ఈలాటి మహా అద్భుతకరమైన సంభవం నిజంగా ఎలా జరుగుతుందో తేటగా ఉండలేదు. ఇది విశ్వాసం మీదనే ఆధారపడియుండాలని అనేకులు అంటారు (రోమా 3:30), కాని వేల సంవత్సరాల అవిశ్వాసం తరువాత యూదులందరు యేసునందు విశ్వాసముంచడానికి ఒకేసారి వారికి ఉద్దేశం కలిగించేది ఏమై ఉంటుందో కొందరు ఊహించడానికి యిష్టపడతారు. మెస్సీయాకొరకు శతాబ్దాల తరబడి ఎదురు చూడడంవలన విసుగుచెందిన యూదులు యేసువైపు సరిక్రొత్తగా చూస్తారని ఒక వ్యాఖ్యానకర్త అభిప్రాయపడ్డాడు. "ఎలా" అనేది "మర్మంలో" భాగమైయున్నదని అనేకమంది రచయితలు అంటారు.

"సంపూర్ణమగుట" అంటే "నిండు సంఖ్య" అనేదట! దీనికి సంబంధించి, సర్వజ్ఞుడైన దేవుడు అలా కోరుకుంటే, అన్యజనులలో ఎంతమంది రక్షింపబడతారో ఆ సంఖ్యను ఆయన తెలుసుకోగలుగుతాడు. పైగా, యేసువారి అనేకమంది అనుచరులవలె, యూదులు పెద్ద సంఖ్యలో క్రైస్తవులైతే నేనును ఉల్లసిస్తాను. ఏదియెలాగున్నా, ఈ రెండింటిలో

ఏ ఒక్క భావనయు రోమా 11:25, 26లో ఉపదేశింపబడినట్లు నేను నమ్మను. ఈ తీర్మానానికి రావడంలో పలు కారణాలను పంచుకోనిమ్ము.

(1) సత్యాన్ని స్థాపించేది ఒకసారి ఉపయోగింపబడిన పద ప్రయోగంవలన కాదు. ప్రఖ్యాతి వ్యాఖ్యానం ప్రకారం, పౌలు 25, 26 వచనాల్లో బయలుపరచలేదు. అయితే లేఖనాలు సత్యాన్ని స్థాపించేది అలా కాదు. ప్రాథమిక బైబిలు సత్యాలు పలు విధములైన మూల వాక్యపు సెట్టింగ్స్‌లో దైవ ప్రేరేపితం మరల మరల జరిగి స్థాపించబడతాయి.

స్పష్టం కాని మూల వాక్యంలో ఒక లేఖన భాగాన్ని ఒంటరిగా తీసి దానికి నిరంకుశమైన భావాన్ని యివ్వడంవలన అనేక తప్పుడు సిద్ధాంతాలు ఉద్భవించాయి. ఉదాహరణకు, వెయ్యేండ్ల పరిపాలనావాదులు అధికంగా అలంకారమయమైన గ్రంథంలోనుండి "వెయ్యి సంవత్సరములు" అనే ప్రయోగాన్ని ఒక్క లేఖన భాగంనుండి గ్రహించారు (ప్రకటన 20:1–5) మరియు అలంకారమైన ఆ భాష చుట్టు మహా విశాలమైన దైవతత్వ శాస్త్రాన్నే నిర్మించారు. అలాగే, "మృతుల కొరకై బాప్తిస్మము" అనే ఒక క్లుప్త ప్రయోగాన్ని చేపట్టి (1 కొరింథీయులకు 15:29) మృతులైనవారిని గూర్చిన సమాచారాన్ని సేకరించి, వారిలో ఒకరికి బదులు మరియొకనికి బాప్తిస్మమిస్తూ నమ్మలేనంత సంయుక్త విధానాన్ని ఒక గుంపు రూపొందించింది. సత్యాన్ని స్థాపించడం యిలా కాదని నేను మరోసారి నొక్కి చెప్పుతున్నాను.

(2) సందర్భం ఆలాటి ఉద్దేశాన్ని కనుపరచుటలేదు. రెండవది, ఏదో ఒక దినాన దేవుడు యూదులందరిని రక్షిస్తాడనే సూచన తరువాత వచనాలలో చెప్పబడలేదని నేను అంటున్నా. Hendriksen యిలా కామెంట్ చేశాడు,

> ఇశ్రాయేలీయులు సామూహికపు మార్పు అనే ఉద్దేశంకొరకు పాఠకుడు సిద్ధపరచబడలేదు. మార్గమంతటిలో పౌలు దానికి వ్యతిరేకమైనదాన్ని నొక్కి చెప్పాడు, అంటే – ఏ తరములోనైనా (గతం, ప్రస్తుతం, భవిష్యత్తు)లోని శేషము యొక్క రక్షణ ... రోమా 11:26 యూదుల సామూహిక మార్పును ఉపదేశించినట్లయితే, "గతంలో నేను చెప్పినదంతా మరచిపోండి" అని పౌలు చెప్పినట్లు కన్పించదా?[6]

రోమా 9–11లో పౌలు యూదులను గూర్చి ఏమి చెప్పుతున్నాడో మరోసారి చదువు. "నాకు బహు దుఃఖమును నా హృదయములో మానని వేదనయు కలవు," "ఇశ్రాయేలీయులు రక్షణ పొందవలెనని" తన హృదయాభిలాషయు, తాను దేవునికి చేయు ప్రార్థనయైయున్నట్లు అపొస్తలుడు తెలిపాడు (9:1–3; 10:1). వారిలో "కొందరినైనా రక్షించాలనే" తాత్పర్యం అతడు కలిగియున్నాడు (11:14). వారు అవిశ్వాసమందు కొనసాగించనట్లయితే, వారు తిరిగి దేవుని సంకల్పంలోను ఏర్పాటులోను చేర్చబడతారని అతడు నొక్కి చెప్పాడు ("అంటుకట్టినట్లు"; 11:23). భవిష్యత్తులో యూదులెల్లరు తమ అవిశ్వాసాన్ని త్రోసి వేస్తారనే ఏ చిన్న సూచన కూడా అతడెన్నడు యివ్వలేదు.

(3) "యూదుల సమస్యకు" ఈ ఉపదేశం ఏ పరిష్కారాన్ని ప్రసాదించలేదు.

"యూదుల సమస్య" అని మనం పిలిచేదాన్ని రోమా 11:25, 26 పైనున్న ప్రసిద్ధికెక్కిన (వ్యాఖ్యానపు) స్థితి నిజంగా డీల్ చేయదు – ఇశ్రాయేలు దేశముపై ఆయన వాగ్దానాల మీద దేవుడు విసర్జించాడా లేదా అనే విషయం. దీన్ని అవలంభించేవారు క్రీస్తు రాకడకు కొంచెం ముందుగా ఉన్న తరములోని యూదులనందరిని (లేక "గొప్ప సంఖ్యను") ఆయన రక్షించును ఎందుకంటే దేవుడు నమ్మదగినవాడు అని నొక్కి చెప్పుతారు. ఏదియెలాగున్నా, ఆ తరానికి ముందు అవిశ్వాసంతో చనిపోయిన అసంఖ్యాకులగు యూదుల సంగతి ఏమి? " 'ఇశ్రాయేలీయులందరు' అనేది క్రీస్తుకు వెలుపల మరణించిన అనేక తరాల తరువాత, చివరి తరంలో ఉన్న ఎక్కువమందిని సూచించడం వింతగా ఉంటుంది."[7] "యూదుల సమస్యకు సంబంధించి," Jim McGuiggan యిలా రాశాడు,

> "యిప్పటినుండి కొన్నివేల సంవత్సరాల అనంతరం యూదుల ఒక తరమంతటిలో ఎక్కువమందిని విశ్వాసానికి తత్ఫలితంగా రక్షణకు దేవుడు తెస్తాడనేది నీ సమస్యకు జవాబు" అని అతడు [పౌలు] చెప్పలేదు. ఆలాటిది జవాబైయుండనేరదు ... ఆ తరానికి ముందున్న యూదుల సమస్యకు ఆలాటి ప్రత్యుత్తరం పరిష్కారం కాదు.[8]

రోమా 9–11లో చర్చించబడిన "యూదుల సమస్య" నేరుగా పౌలు దినాల్లో ఉన్న యూదులకు సంబంధించినది. దేవుడు యూదులకు న్యాయం చేశాడా చేయలేదా అనేది మండుతున్న ప్రశ్నయైయుంది. వేల సంవత్సరాల అనంతరం భవిష్యత్తులో దేవుడు ఏమి చేస్తాడు, చేయడు అనేది వారికి సంబంధం లేనిదైయుంది.

(4) మరోచోట ఉన్న తేటైన బైబిలు ఉపదేశానికి సామూహికమైన యూదుల మార్పు అనే భావన వ్యతిరేకమైయుంది. బైబిలు వ్యాఖ్యానం యొక్క ప్రాథమిక సూత్రమేమంటే, స్పష్టంగా లేని లేఖన భాగాన్ని తీసికొని వేరొక చోట స్పష్టంగానున్న లేఖన భాగాన్ని ఖండించునట్టు భాష్యం చెప్పకూడదు. ముందుగానే సూచించినట్టు, దేవుడు యూదుల శేషమును రక్షించుననే తేటైన పౌలు ఉపదేశం (9:27; 11:5), ఏదో ఒక దినాన యూదులందరు (లేక అధిక సంఖ్యాకులు) రక్షింపబడతారనేది వ్యతిరేకమయ్యింది.

పైగా, ఈ క్రిందిదాన్ని ఆలోచించు: యూదుల పరిపూర్ణత (*pleroma*) (11:12) యేసు తిరిగి రాకముందు యూదులనేకులు రక్షింపబడడాన్ని సూచించినట్టయితే, "అన్యజనుల పరిపూర్ణత [*pleroma*]" (25 వచనం) యూదులనేకులు రక్షింపబడక ముందు అనేకులైన అన్యజనులు రక్షింపబడుటను సూచిస్తుంది. "అయినను మనుష్య కుమారుడు వచ్చునప్పుడు ఆయన భూమిమీద విశ్వాసము కనుగొనునా?" అని లూకా 18:8బి లోని ప్రశ్నకు ఆలాటి తీర్మానం అర్థ రహితమైనదైయుంటుంది.

భూమిమీదనున్న జనాభాలో (యూదులు మరియు/లేక అన్యజనులు) ఎక్కువమంది రక్షింపబడతారనే విషయం తప్పక మనకందరికి ఆనందం కలిగిస్తుంది – అయితే అలా జరుగదని యేసువారు చెప్పారు. "పిలువబడినవారు అనేకులు, ఏర్పరచబడినవారు కొందరేయని" ఆయన అన్నారు (మత్తయి 22:14; నొక్కి చెప్పింది నాది).

కొండమీద ప్రసంగంలో, ఆయన రెండు మార్గాలను గూర్చి బోధించి, జీవ మార్గాన్ని కొందరే వెంటాడతారని ఆయన సూచించారు:

> "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునైయున్నది, దాని కనుగొనువారు కొందరే" (మత్తయి 7:13, 14; నొక్కి చెప్పింది నాది).

ప్రసిద్ధికెక్కిన స్థితిని నిరాకరించడానికి యితర కారణాలను చూపవచ్చు. ఉదాహరణకు, రోమా 11:25, 26 యొక్క ఈ దృష్టి జాతీయ రక్షణను గూర్చి ఉపదేశిస్తున్నట్టు తీసికోవచ్చు. రక్షణకు సంబంధించి, దేవుడు ఎన్నడూ మానవాళిని జాతీయంగా గాని, లేక గుంపుగా గాని డీల్ చేయలేదు, అది ఎల్లవేళలా వ్యక్తిగతమైనది గానే డీల్ చేయబడింది. గనుక, క్రీస్తు రెండవ రాకడకు ముందు "ఇశ్రాయేలీయులందరు" రక్షింపబడు దురని రోమా 11:25, 26 ఉపదేశిస్తున్న ఆలోచనను మనం నిరాకరించాలి.

## వక్రమైన స్థితి

ప్రసిద్ధికెక్కిన స్థితిలో సమస్య స్వభావ సిద్ధంగా ఉన్నట్టు ఎక్కువమంది రచయితలు చూచారు: యూదుల సామూహిక మార్పు ఎలా జరుగుతుంది? ముందుగానే గుర్తించినట్టు, "ఎలాగు" అనేదాన్ని అనేకుల "మర్మంలో" చేర్చుతారు. ఏదియెలాగున్నా, ఇటీవల సంవత్సరాలలో, యేసునందు విశ్వాసముంచకయే ధర్మశాస్త్రాన్ని వెంటాడినట్టయితే, యూదులు రక్షింపబడతారని చెప్పి, మతశాఖల రచయితలలో ఎక్కువమంది సమస్యను "పరిష్కరించ" జూస్తున్నారు. "అన్యజనులు రక్షింపబడే దారిని," "యూదులు రక్షింపబడే దారిని" గూర్చి వారు మాట్లాడతారు. అన్యజనులకు "క్రీస్తు నిబంధనయు," యూదులకు "తోరా నిబంధనయు" ఉన్నట్టు వారు అంటారు. "ఈ విధంగా," "ఇశ్రాయేలు అంతా రక్షింపబడతారని" వారు వక్కాణిస్తారు.

సందేహాస్పదమైన ఈ స్థితిని నీవు ఎరుగగలుగునట్లు యింతకు ముందే దీనిని ప్రస్తావించాను. ట్రూత్ ఫర్ టుడే ప్రపంచ మిషన్ స్కూలు విద్యార్థులకు యిది ఎలాటి వక్ర స్థితియో తెలుసు. యూదులు, అన్యజనులు యిరు పక్షాలవారు ఒకే విధంగా నశించిపోయారు, ఒకే విధానంలో రక్షింపబడినట్టును రోమా పత్రికలో అపొస్తలుడు స్థాపించాడు. రెండు రక్షణ మార్గాలను దేవుడు మనకు యివ్వలేదు, కాని ఒకే మార్గాన్ని ఆయన దయచేశాడు. "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని ప్రభువైన యేసు అన్నారు (యోహాను 14:6). 11:25, 26 యొక్క వెనువెంట సందర్భంలో, దేవుడు దీవించే రెండు "ఒలీవా చెట్లను" కాదు, ఒక్క దానినే మనం కనుగొంటాం (ఒకటి యూదులకు, మరొకటి అన్యజనులకు).

## ఆలోచించవలసిన అవకాశాలు

మూల వాక్యం ఏమి చెప్పడం లేదో ఆలోచించాం. అది ఏమి చెప్పిందో ఆలోచించే సమయం ఆసన్నమయ్యింది.

**జవాబివ్వవలసిన ప్రశ్న**

మన వ్యాఖ్యానాన్ని ప్రభావితం చేసే ప్రశ్న యిది: "వచనం 26లో 'ఇశ్రాయేలు' అని సూచిస్తుందెవరిని?" గత కాలంలో, ఎక్కువ ప్రసిద్ధికెక్కిన వ్యాఖ్యానాలలో ఒకటేమంటే, వచనం 26లోని "ఇశ్రాయేలు" అంటే, ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు – అంటే సంఘం.[9] ఇది కావచ్చు. వేరే స్థలంలో, సంఘాన్ని "ఇశ్రాయేలని" పౌలు సూచించాడు (గలతీయులకు 6:16 చూడు), మరియు ఇది యితర స్థలాల్లో ఉన్న బైబిలు ఉపదేశాన్ని వ్యతిరేకించదు. అయినా, ఈ స్థితిలో కూడ ప్రాథమిక బలహీనత ఉంది. ఈ భాగంలో పౌలు మాటి మాటికి ఇశ్రాయేలు అని ఉపయోగించాడు, అతడు ఉపయోగించిన ప్రతిసారి భౌతికమైన ఇశ్రాయేలే అతని మనస్సులో ఉన్నారు. పైగా, వచనం 25లో – అపొస్తలుడు భౌతిక ఇశ్రాయేలునే సూచిస్తున్నాడు – మరియు ముందుగా ఆరంభించిన వాక్యానికి, వచనం 26 కొనసాగింపైయుంది. గనుక వచనం 26లోని "ఇశ్రాయేలు" భౌతిక ఇశ్రాయేలని వ్యాఖ్యానించడం సహజంగా గోచరిస్తుంది.

అయినప్పటికిని, పౌలు మనస్సులో భౌతికమైన ఇశ్రాయేలు అనే పెద్ద వృత్తం ఉందా లేక అందులోని చిన్న వృత్తమైన ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు ఉందా అనే ప్రశ్న యింకను వెంటాడుతుంది (మీరు గుండ్రని వలయాలతో ఛార్ట్‌ను తయారు చేసుకుంటే దానిని మీరు ఇక్కడ ఉపయోగించుకోవచ్చు[10]) "ఇశ్రాయేలులోని ఇశ్రాయేలు" (9:6 చూడు). వచనం 25లో, భౌతికమైన ఇశ్రాయేలు అందరు పౌలు మనస్సులో ఉన్నట్టు కన్పిస్తుంది. "మరియు రక్షింపబడినవారందరు రక్షింపబడుదురు" అని చెప్పడం కూడ అత్యధికంగా చెప్పడమే ఔతుంది.

రోమా 11:26లోని "ఇశ్రాయేలును" గుర్తుపట్టడానికి సంబంధించి మూడు అవకాశాలున్నాయి: (1) ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు (సంఘం), (2) సాధారణంగా భౌతిక ఇశ్రాయేలు, మరియు (3) "ఇశ్రాయేలులోని ఇశ్రాయేలు" ("నిజ ఇశ్రాయేలు," యేసును మెస్సీయగా అంగీకరించిన యూదులు). నేను కోరుకునేది రెండవ దృశ్యం. ఏదియెలాగున్నా, ఈ మూడు భావాలు న్యాయ సమ్మతంగానే ఉండి, మరియొక చోటులోని దైవప్రేరేపిత ఉపదేశాన్ని ఏదియు అతిక్రమించేది కానందున, పౌలు మనస్సులో ఏముందో అనేదాని విషయమై మొండిగా ఉండకూడదు. కొంచెంగా వేరైన మార్గాలవలన – ఒకే ప్రాథమిక తీర్మానానికి వచ్చి చేరుకోడానికి ఈ భావాలు ఉపయోగింపబడవచ్చు.

**ఆలోచించవలసిన వివరణ**

చెప్పబడిన సమాచారాన్ని మనస్సులో ఉంచుకొని, అధ్యాయం 11లోని మొత్తం యొక్క భావంతోను, వెనువెంట సందర్భంతోను ఏకీభవించే రోమా 11:25, 26

వ్యాఖ్యానాన్ని చెప్పడానికి ప్రయత్నిస్తాం. “సహోదరులారా, ఈ మర్మము మీరు తెలిసికొనగోరు చున్నాను” అంటూ పౌలు ఆరంభించాడు (25ఎ వచనం). (అన్యజనులు) ఇంతకు ముందే సూచించినట్టు, ఇశ్రాయేలు తన యొద్దకు తిరిగేలా బుద్ధి పుట్టించడానికి దేవుడు అన్యజనులను అంగీకరిస్తున్నాడనేది “మర్మం.” గనుక “[అన్యజనులైన] మీరు బుద్ధి మంతులైనట్టు [అతిశయపడవద్దు, మోసపోవద్దు,] మీకు మీరే బుద్ధిమంతులైనట్టు తలంచవద్దు” (18, 20, 25బి వచనాలు).

పౌలు తన ప్రధాన ఆలోచనను తిరిగి ప్రారంభించాడు: “ఈ మర్మము ... ఇశ్రాయేలుకు పాక్షికంగా కాఠిన్యం కలుగడం” (25 వచనం). “ఇశ్రాయేలు” అంటే భౌతిక ఇశ్రాయేలు, (పెద్ద వృత్తం). “పాక్షికమైన కఠిన చిత్తం” అనగానే ఏదో యొక ఇశ్రాయేలీయునికి అది కలిగినట్టు ఆలోచించకు. ఇశ్రాయేలు జనాంగంలో ఒక భాగం కఠినపరచబడినట్టు ఆలోచించు. “ఇశ్రాయేలులో ఒక భాగమునకు కఠిన హృదయం కలిగినట్టు” RSV అంది. వచనం 7లో పౌలు యిలా అన్నాడు, “ఇశ్రాయేలు [పెద్ద వృత్తం] వెదకునదేదో [దేవునితో సరియైన సంబంధం] అది వారికి దొరకలేదు, ఏర్పాటు నొందినవారికి అది దొరికెను [చిన్న వృత్తం]; తక్కినవారు [చిన్న వృత్తం తప్ప పెద్ద వృత్తంలో ఉన్నవారందరు] కఠిన చిత్తులైరి.”

“పాక్షిక కాఠిన్యం” “అన్యజనుల ప్రవేశము సంపూర్ణమగువరకు ఇశ్రాయేలుకు కఠిన మనస్సు కొంతమట్టుకు కలిగెను” (25డి వచనం). “సంపూర్ణత” అన్నా, “నెరవేర్పు” అన్నా వచనం 12లో అదే గ్రీకు పదంనుండి వచ్చాయి (*pleroma*).[11] 12వ వచనంలో ఉన్న *pleroma* కంటె 25వ వచనంలోని *pleroma*కు ఎంతమంది రచయితలు, పండితులు, తర్జుమాదారులు వేర్వేరు అర్థాలను యిచ్చారో చూస్తే ఆశ్చర్యంగా ఉంటుంది. వీటిలో ఎక్కువగా *pleroma* అంటే “సంపూర్ణత” అనే 25వ వచనంలో సమర్థించారు.

గ్రీకు పదాలకు వేర్వేరు సెట్టింగ్స్‌లో వేర్వేరు అర్థాలుండడం సాధ్యమే. అయినా, ఒక పదాన్ని వేరుగా భాష్యం చెప్పడానికి బలీయమైన లేకుంటే, ఒకే సందర్భ పరిధిలో ప్రతిసారి ఆ పదానికి అదే అర్థం ఆరోపించడం వాడుకయైయుంది. *Pleroma* అనే పదానికి 12వ వచనంలో దానికంటే 25వ వచనంలో ఉన్నదానికి వేరైన అర్థం చెప్పడానికి బలవంత పెట్టే ఏ హేతువును నేనెరుగను. మనం వచనం 12ను చదివినప్పుడు, *pleroma* (“నెరవేర్పు”) అనేది “అపరాధము” మరియు “తప్పిపోవుట” అనేవాటికి తారతమ్యం చూపబడినట్టు గమనించాం. వచనం 12, వచనం 15కు సమాంతరంగా ఉన్నట్టు గమనించాం, అది అపరాధము, తప్పిపోవడం (“దేవునిచే నిరాకరింపబడడం”)లోను “నెరవేర్పు” అనేది (“దేవునిచే అంగీకరింపబడడంలోను”) పరిణమించాయి.

| రోమా 11:12 | | రోమా 11:15 |
|---|---|---|
| తొట్రుపాటు, క్షీణదశ | దేవుని నిరాకరించుట | (దేవునిచే) నిరాకరింపబడుట |
| పరిపూర్ణత | దేవుని అంగీకరించుట | (దేవునిచే) అంగీకరింపబడుట |

వచనం 12లో "నెరవేర్పు" అంటే, యూదులు దేవుని ఉద్దేశాలను నెరవేర్చుట, అది దేవునిచే వారి అంగీకరింపబడుటయందు ఫలిస్తుంది. ప్రాథమికమైన యిదే అర్థం వచనం 25లో కూడ సరిపోతుంది: "అన్యజనుల ప్రవేశము సంపూర్ణమగువరకు ఇశ్రాయేలునకు కఠిన మనస్సు కొంతమట్టుకు కలిగెను." అధ్యాయం 11లోని పౌలు యొక్క ప్రాథమిక రీజనింగ్ లైన్ వెలుగులో తిరిగి వచనం 25ను చూడు:

(దేవునిచే) యూదులు నిరాకరింపబడడం
("కఠినపరచబడడం")

↓

(దేవునిచే) అన్యజనులు అంగీకరించబడడం
("పరిపూర్ణత")

రక్షణకు సంబంధించి యూదులకును అన్యజనులకును మధ్యగల పరస్పర సంబంధాన్ని పౌలు తిరిగి నొక్కి చెప్పినట్టయితే, అతని తరువాత పాయింటు ఏమై యుండాలి? ఏదో ఒక విధంగా, ఈ అన్యజనుల "పరిపూర్ణత" యూదులయందు రోషం పుట్టించి, యేసును మెస్సీయగా అంగీకరించి రక్షింపబడ ఉద్దేశింపబడినదైయుంది. పౌలు అలా చేశాడా? మూల వాక్యంలో కొనసాగుదాం.

వచనం 26 యిలా ఆరంభిస్తుంది, "And so ..." (26ఎ వచనం). "So" అనే పదం *outos* నుండి తర్జుమా చేయబడింది. "So" అనే ఆంగ్ల పదంవలెనే, *outos* అనేది విధానం యొక్క క్రియా విశేషణమైయుంది, అంటే, "ఈ విధముగా"[12] లేక "ఈ మార్గములో."[13] "And so" – ఈ విధముగా (దేవుడు అన్యజనులను అంగీకరించడం వలన) – "ఇశ్రాయేలీయులందరు [అసూయ, రోషముచే యేసును అంగీకరింపబడుటకు కదిలింపబడినవారై అందునుబట్టి] రక్షింపబడుదురు."

(దేవునిచే) యూదులు నిరాకరించబడడం
("కఠినపరచబడడం")

↓

(దేవునిచే) అన్యజనులు అంగీకరించబడడం
("సంపూర్ణత")

↓

(దేవునిచే) యూదులు అంగీకరించబడడం
("ఇశ్రాయేలు అంతా రక్షింపబడుట")

నేను ఒక ప్రశ్నను ఎదురు చూస్తున్నాను: " 'అందరు' అనే మాటను నీవు డీల్ చేయలేదు. ఎట్టకేలకు యూదులందరు (కనీసం ఎక్కువమంది) యేసును అంగీకరిస్తారని అది చెప్పడం లేదా?" తప్పక కానవసరం లేదు. "ప్రతి ఒక్కడు నమ్మి, మారుమనస్సు పొంది, ఒప్పుకొని, బాప్తిస్మం పొందవలెనని దేవుడు ఆజ్ఞాపించాడు; ప్రజలందరు రక్షింపబడవలసిన విధానమదేనని" నేను చెప్పితే ఏమౌతుంది? దీనికి "జనులందరు రక్షింపబడతారని నీవు తీర్మానిస్తావా?" లేదు, దేవుడు ఏమి ఆజ్ఞాపించాడో దాన్ని చేయడం వలననే ఎవడైనా రక్షింపబడగలడని నీవు అర్థం చేసికొనగలవు.

కొందరు ఆక్షేపించవచ్చు, "రోమా 11:25, 26 యొక్క నీ భాష్యం – పౌలు వేరే మాటల్లో తన్ను రిపీట్ చేసికొంటున్నట్టు చేశావు." రోమా పత్రిక పఠనంలో, కీలమైన పాయింట్లను పౌలు మరల, మరల తిరిగి చెప్పినట్టు గ్రహించకుండ నీవు యింత దూరం తప్పక వచ్చియుండవు. కీలకమైన ఆలోచనను 11:25, 26లో పౌలు తిరిగి చెప్పాడనడంలో నేను ఏ సమస్యను చూడడం లేదు.

## ముగింపు

రోమా 11:25, 26 యొక్క "మొద్దును" నేను యిలా డీల్ చేస్తున్నాను. దేవుడు అన్యజనులను అంగీకరించడంవలన, క్రీస్తును యూదులు అంగీకరించేలా కదిలించి రక్షించబడేలా చేయడమైయుంది. అంటే, ఇశ్రాయేలీయులు, అన్యజనులు సువార్తను "అంగీకరించడంవలన" కదిలింపబడినవారై, మరోమారు సువార్తవైపు తేరి చూచి ఈ విధంగానైనా క్రైస్తవులౌతారు. నేనేమి చెప్పానో ఆలోచించు, అది మూల వాక్యం యొక్క డిమాండ్లను మీటౌతుందో లేదో చూడు. తరువాత చదువుతూ, ప్రార్థించుతూ, నీ సొంత తీర్మానాలకు చేరుకో.

మరోసారి, రోమా పత్రికలోని కష్టమైన లేఖన భాగాన్ని పరిష్కరిద్దాం. ఒక లేఖన భాగం ఎంత కష్టమయ్యిందైతే, అది మన వ్యక్తిగత రక్షణ మీద తన ప్రభావం అంత తక్కువగా ఉండవచ్చు. నీవు నేను ఎలా రక్షింపబడాలి, ఎలా క్రైస్తవ జీవితాన్ని జీవించాలి అని మనం తెలిసికొనవలసిన లేఖన భాగాలు ఎక్కువ తేటగాను, యథార్థ హృదయాలు గ్రహించేవిగాను ఉంటాయి. అందులకు దేవునికి స్తోత్రములు!

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

*Pleroma* అనే మాటమీద కొన్ని ఆలోచనలు నీకు సహాయపడవచ్చు. రోమా పత్రిక అంతటిలో *pleroma* యొక్క నామ వాచక, క్రియా వాచక రూపాలు ఉపయోగించబడ్డాయి (ఉదాహరణకు, 1:29; 8:4; 13:8, 10; 15:13, 14, 29). వీటిలో దేనియందును ఒక నిశ్చయమైన సంఖ్య, లేక నిర్దిష్టమైన సంఖ్య గుప్తమైయుండలేదు. అయినా, రక్షింపబడేవారి సంపూర్ణ సంఖ్య అనే అర్థం కొందరు రచయితలు యిచ్చి, "ఎవరు రక్షింపబడాలో ఆ ప్రతి ఒక్కరిని దేవుడు రక్షిస్తాడు, ఏ ఒక్కనిని పోగొట్టుకోడు" అనే మాటలతో *pleroma*ను నొక్కి చెప్పారు. *Pleroma* అనే పదానికి ఈలాటి సాధారణమైన, వివాద రహితమైన పంథా విషయమై నాకు ఏ అభ్యంతరం లేదు.

---

సూచనలు

[1]USలో తొలి పునరుత్థాన ఉద్యమం త్వరగా వ్యాపించడంలో అధికమైన ఉత్సాహం కలిగింది. ఎక్కువ కాలం కాకముందే అనేకులు యూదులు అన్యజనుల మధ్య ఎక్కువ మంది విశ్వాసులౌతారని తేలికగా నమ్మగలిగారు. [2]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 424. [3]William Hendriksen, *Exposition of Paul's Epistle to the Romans,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1982), 378. [4]"వెయ్యేండ్ల పరిపాలనా భావన" చార్టు చూడు. [5]వెయ్యేండ్ల పరిపాలనావాదులను గూర్చి నీవు ఎక్కువగా చదవగోరితే, ప్రకటన, 1వ పుస్తకంలోని డేవిడ్ రోపర్ గారి "మంచిగా ఆరంభిస్తే సగం జరిగించినట్టే" అనే పాఠంలో చూడు. [6]Hendriksen, 379. [7]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 418; Hendriksen, 379. [8]Jim McGuiggan, *The Book of Romans,* Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1982), 286-87. [9]మతశాఖల, మతశాఖలు కాని వ్యాఖ్యానాల్లో యిది నిజమే. [10]"యూదుల సమస్య (9:1–13)" అనే పాఠానికి నీవు చార్టు తయారు చేసియుంటే, దాన్ని దీనికి కూడ వాడుకోవచ్చు.

[11]అటు రోమా 11:12లోను, యిటు 11:25లోను కొద్ది తర్జుమాల్లో "full number" అని ఉంది, ఇది కేవలం మినహాయింపే గాని, రూలు కాదు. [12]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph Henry Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 468; Hendriksen, 379. "అది ఎలాగు ..." అని NCV అంది, SEB మరియు McCord ఈ విధంగా అన్నాడు, "ఈ మార్గంలో." [13]F. F. Bruce, *The Letter of Paul to the Romans,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 209; Morris, 420.

## వెయ్యేండ్ల పరిపాలనావాదుల భావన



## 51

# దేవునికి మహిమ కలుగును గాక!

## (11:25-36)

మనం రోమా పత్రికను స్థూలంగా అనుసరించినప్పుడు, "అభ్యాసం" అనే మొదటి విభాగం చివరకు చేరుకుంటాం: "వివరణ" విభాగం. (రోమా పత్రిక అవుట్‌లైన్ చూడు.) "యూదుల సమస్య" అని మనం పిలుస్తున్న చర్చను (25-32 వచనాలు) పౌలు రోమా 11:25-36లో ముగించుతున్నాడు. తరువాత అతడు తమ ప్రభువును ఘనపరచడానికి మళ్ళాడు (33-36 వచనాలు). "యుగములవరకు ఆయనకు మహిమ కలుగును గాక" అనే ఈ పాఠం పేరు 36వ వచనంనుండి తీయబడింది.

మన మూల వాక్యం యొక్క తొలి పలుకులవలన ఈ పాఠంలోని ప్రధానాంశాలు తీయబడ్డాయి: "సహోదరులారా ... ఈ మర్మము మీకు తెలియకుండుట నాకు యిష్టము లేదు" (25ఎ వచనం) (మీరు తెలిసికొనగోరుచున్నాను). "మీరు ఎరుగనివారైయుండుట నాకు యిష్టం లేదు" అని NIV అంది. రక్షణను గూర్చియు, దేవుని గూర్చినట్టియు కొన్ని సత్యాలను పౌలు పలికాడు. మనం ఎరుగలేని కొన్ని సంగతులను సహా అతడు ప్రస్తావించాడు.

### రక్షణను గూర్చి మనం ఏమి తెలిసికోగలం (11:25-32)

**దేవునికి ఒక ఏర్పాటుంది (25-27 వచనాలు)**

మొదటిగా, ఇశ్రాయేలును రక్షించాలనే ఏర్పాటు దేవునికుంది. మన మూల వాక్యం యిలా ప్రారంభమౌతుంది,

> "[అన్యజనులైన] సహోదరులారా, మీదృష్టికి మీరే బుద్ధిమంతులమని అనుకొన కుండునట్లు ఈ మర్మము మీరు తెలిసికొనగోరుచున్నాను. అదేమనగా, అన్యజనుల ప్రవేశము సంపూర్ణమగువరకు ఇశ్రాయేలునకు కఠిన మనస్సు కొంతమట్టుకు కలిగెను. ... ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురు" (25, 26ఎ వచనాలు).

" 'ఇశ్రాయేలు జనులందరు రక్షింపబడుదురు' (11:25, 26)"లో గుర్తించినట్టు, "మర్మము" అనేది యిదివరకు తెలియబడకయుండి తరువాత దేవునిచే బయలుపరచ బడిన దాన్ని సూచిస్తుంది. మన మూల వాక్యానికి సంబంధించిన అద్భుతమైన "మర్మము" యొక్క భాగం, యూదులను విశ్వాసానికి పురికొల్పడానికి దేవుడు అన్యజనులను అంగీకరించడం ఆయన ఏర్పాటైయున్నది:

> ... కొంత కాఠిన్యం [దేవుడు నిరాకరించుటవలన కలిగినది] అన్యజనులు పూర్తిగా లోనికి వచ్చునంతవకు [భౌతికంగా] ఇశ్రాయేలుకు కలిగింది. [అన్యజనులు దేవుని ఆజ్ఞను పూర్తిగా నెరవేర్చి దేవునిచే అనుగ్రహింపబడునంతవరకు]; ఇశ్రాయేలీయు లందరు రక్షింపబడుదురు [అన్యజనుల అంగీకారంతో అసూయతో రేకెత్తించడంవల్ల]. ...

పౌలు తరచుగా చేస్తున్నట్టుగా, అతని ప్రతిపాదనను లేఖనాలచే బలపరచుకొంటాడు: " 'విమోచకుడు సీయోనులోనుండి వచ్చి యాకోబులోనుండి భక్తిహీనతను తొలగించును; నేను వారి పాపములను పరిహరించినప్పుడు నావలన వారికి కలుగు నిబంధన ఇదియే' అని వ్రాయబడియున్నది" (26బి, 27 వచనాలు). ఈ కొటేషన్ పాత నిబంధన లేఖన భాగముల మిశ్రమమైయున్నది. దీని ప్రాథమిక రెఫరెన్సు యెషయా 59:20, 21. ఆ లేఖన భాగంలో యెషయా ఇశ్రాయేలు పునరుద్ధరణను గూర్చి ప్రవచించాడు. యూదులు దేవుని యొద్దకు తిరిగి వచ్చేందుకు అనువుగా చెప్పిన యేసు మాటలను పౌలు వర్తింపజేశాడు. యెషయా 27:9నుండి కూడా ఒక లైన్ ఉండవచ్చు. దీని అంతము యిర్మీయా యొక్క "క్రొత్త నిబంధన" వాగ్దానాన్ని గుర్తుచేస్తుంది. రోమా పత్రికలోని మూల వాక్యాన్ని పాత నిబంధనతో పోల్చి చూడు:

| రోమా 11:26బి, 27 | పాత నిబంధన |
| --- | --- |
| " 'విమోచకుడు సీయోను [యెరూషలేము]నుండి వస్తాడు.' " | " 'సీయోనునొద్దకు ... విమోచకుడు వచ్చును' " (యెషయా 59:20ఎ). |
| " 'యాకోబు [ఇశ్రాయేలు]నుండి భక్తిహీనతను తొలగించును.' " | "... యాకోబు దోషమునకు ఈలాగు ప్రాయశ్చిత్తము చేయబడును" (యెషయా 27:9ఎ). |
| " 'ఇది వారి పాపములను పరిహరించినప్పుడు నావలన వారికి కలుగు నిబంధన యిదియే.' " | " 'నేను వారితో చేయబోవు నిబంధన యిది' " (యెషయా 59:21బి). |
| " 'వారి పాపములను పరిహరించినప్పుడు.' " | " 'వారి అతిక్రమము విషయమై దయకలిగి వారి పాపమును ఎన్నడు జ్ఞాపకము చేసికొనను ...' " (యిర్మీయా 31:31-34). |

పాత నిబంధన రెఫరెన్సుల్లోను, పౌలు కొటేషన్‌లోను ఉన్న ప్రధానమైన వ్యత్యాస మేమంటే – "విమోచకుడు సీయోనుకు వచ్చునని" యెషయా అనగా, "సీయోనులో నుండి విమోచకుడు వచ్చునని" పౌలు అన్నాడు. దైవప్రేరేపితుడైన

పౌలు ఎందుకు ఆ పదం మార్పిడి చేశాడో మనం నిశ్చయంగా చెప్పలేం. వారి విమోచకుడు యూదులలో నుండి వచ్చినట్లు అన్యజనులకు గుర్తు చేయాలని కాబోలు. “యెరూషలేమునుండి” “యెహోవా వాక్కు [సువార్త] బయలువెళ్లుననే” యెషయా ప్రవచనంచేత పౌలు ప్రభావితం చేయబడియుండవచ్చు (యెషయా 2:3; లూకా 24:47 చూడు; నొక్కి చెప్పింది నాది).

రోమా 11:25-27 (క్రైస్తవ) యుగాంతపు సంభవాలను గూర్చి మాట్లాడుతున్నట్టు నమ్మేవారు, పౌలు యొక్క పాత నిబంధన కొటేషన్ క్రీస్తు రెండవ రాకడతో సంబంధం కలిగియున్నట్టు తలంచుతారు. ఈలాటి వ్యాఖ్యానాన్ని నిరాకరించడానికి అనేక కారణాలున్నాయి. (1) John R. W. Stott సూచించినట్టు, “యెషయాలోని ఈ [లేఖన భాగము] అసలు క్రీస్తు యొక్క మొదటి రాకకు రెఫరెన్సు అయ్యింది.”[1] (2) క్రీస్తు మొదటి రాక యొక్క ఉద్దేశం “యాకోబు [ఇశ్రాయేలు]నుండి భక్తిహీనతను తొలిగింప” ప్రయత్నించడం (మత్తయి 15:24 చూడు), “వారి పాపమును తీసివేయుటకు” – అంటే, నశించినవారిని రక్షించడానికి (లూకా 19:10 చూడు). రెండవసారి క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు, పాపమును తీసివేయుటకు కాదు, తీర్పు తీర్చడానికే (మత్తయి 25:31-33 చూడు). (3) రోమా 11:26బి, 27ను యిర్మీయాలోని క్రొత్త నిబంధన వాగ్దానంనుండి వేరుచేయడం కష్టమౌతుంది, ఆ “క్రొత్త నిబంధన” అప్పటికే స్థాపింపబడియుంది (హెబ్రీయులకు 8:8-12 చూడు) గనుక, రోమా 11:26బి, 27 క్రీస్తు యొక్క తొలి రాకకే సంబంధించిందని – అంటే, ఆయన “సశరీరుడుగా ప్రత్యక్షమవ్వడానికి” సంబంధించిందని (యోహాను 1:14) – ఆయన రెండవ రాకడకు సంబంధించింది కాదని నేను తీర్మానిస్తున్నాను.

26, 27 వచనాల్లోని కొటేషన్‌లోని విషయం – విమోచకుడు (క్రీస్తు) ఇశ్రాయేలును రక్షించడానికి (దేవుని ఏర్పాట్లకు, ఆయన ఉద్దేశాలకు వారిని తెచ్చుటకు) వస్తాడని ప్రవక్తలు ప్రవచించినదాన్ని సూచించడమే. దేవుడు అన్యజనులను అంగీకరించడంవలన యూదులు అసూయతో కదిలింపబడినందున సంభవించుతుంది. యూదులను రక్షించడానికి క్రీస్తునందు కేంద్రీకరించబడిన ఏర్పాటు దేవునికి ఉంది.

**యూదులు రక్షింపబడాలని దేవుడు కోరుతున్నాడు (28, 29 వచనాలు).**

రెండవది, రక్షణకు సంబంధించి, యూదులు యింకను రక్షింపబడాలని దేవుడు కోరుతున్నట్టు మనం ఎరుగగలం. 28, 29 వచనాలలో పౌలు యిలా అన్నాడు, “సువార్త విషయమైతే వారు [యూదులు] మిమ్మును [అన్యజనులను] బట్టి శత్రువులు గాని, యేర్పాటు విషయమైతే పితరులనుబట్టి ప్రియులైయున్నారు. ఏలయనగా, దేవుడు తన కృపావరముల విషయములోను, పిలుపు విషయములోను పశ్చాత్తాపపడడు.” ఒక దృష్టిలో, యూదులు “శత్రువులు”; అయితే మరొక దృష్టిలో వారు “ప్రియులైయున్నారు.”

భౌతికమైన యూదులు యింకను “దేవుని ఏర్పరచబడిన జనులని” నమ్మేవారు వారి స్థితిని ఈ రెండు వచనాలు స్థిరపరచుతాయని ఒప్పింపబడతారు. అయినా, భౌతికమైన ఇశ్రాయేలు యికనేమాత్రమును ఏర్పరచబడిన దేవుని ప్రజలు కారని యింతకు

ముందే స్థాపించాం. ("దేవుడు మరియు ఇశ్రాయేలు" అనే పాఠాన్ని రివ్యూ చేయి.) "ఇశ్రాయేలు యొక్క జాతీయ ఆధిక్యతలు ఏవైనా అవి రద్దు చేయబడ్డాయి."[2] అది వాస్తవమైనందున, పౌలు 28, 29 వచనాలలో ఏమి చెప్పుతున్నాడు? మారుమనస్సు పొంది తన యొద్దకు ఇశ్రాయేలు తిరిగి వచ్చునట్లు యూదులకు దేవుడు అవకాశాన్ని యిస్తూ ఎందుకు కొనసాగిస్తున్నాడో అతడు వివరిస్తున్నాడని నేను నమ్ముతున్నా.

వచనం 28 యిలా ఆరంభమౌతుంది, "సువార్త విషయమైతే వారు [యూదులు] మిమ్మునుబట్టి శత్రువులు." యూదా మత నాయకులచే నడిపింపబడిన యూదుల మూక, క్రీస్తును సిలువ వేయించారు. సంఘం స్థాపింపబడిన తరువాత, యేసు యొక్క కథను ప్రసంగింపబడడాన్ని వ్యతిరేకించారు (ఉదాహరణకు, అపొస్తలుల కార్యములు 17:5, 13 చూడు). వారిలో కొందరు తమ మార్గాన్ని కొనసాగించియుండినట్టయితే, ప్రతి సువార్తికుడు నోరు మూయించబడేవాడే, దానితో సువార్తను వినే అవకాశ భాగ్యము ఎవరికే ఉండేది కాదు. "సువార్త యొక్క ఆ దృక్పథంనుండి," యూదులు నిశ్చయంగా "శత్రువులే."

పౌలు యిలా చేర్చాడు, "[అన్యజనులైన] మిమ్మునుబట్టి" (28బి వచనం). అధ్యాయం 11లో చెప్పబడిన వాస్తవాన్ని తిరిగి స్థాపించడమైయుంటుంది: యూదులు సువార్తను నిరాకరించడం, అన్యజనులు సువార్తను విని రక్షింపబడే అవకాశాన్ని ప్రసాదించింది.

యూదులు సువార్తకు శత్రువులనే వాస్తవంనుండి ఏ తీర్మానానికి మనం వచ్చి చేరుకోవచ్చు? అందునుబట్టి సువార్తను యిచ్చినవానికి శత్రువులనియే గదా? వచనం 28 యొక్క తొలి భాగాన్ని యిలా విస్తరింపజేయవచ్చు: "సువార్త యొక్క దృష్టినుండి వారు శత్రువులు [గనుక వారు కేవలం శిక్షకు పాత్రులు]."

యేసును చంపించడంలోను, సంఘాన్ని, సువార్తను, మరియు క్రైస్తవులను లయపరచ ప్రయత్నించడంలో, లోకంలోనుండి దేవుడు వారిని కేవలం ఎందుకు తుడిచివేయడు? ఇది మనలను వచనం 28 చివరి భాగానికి తెస్తుంది: "యేర్పాటు విషయమైతే పితరులను బట్టి ప్రియులైయున్నారు." ఆయన "తన ఏర్పాటును" నెరవేర్చే జనముగా దేవుడు ఇశ్రాయేలును కోరుకున్నట్టు యిది సూచిస్తుంది. ఇశ్రాయేలు పౌరులు ప్రేమింపదగిన వారైనందుననో లేదా వారు ఎల్లప్పుడు దేవుని కొరకు ప్రేమను కనుపరచినవారైనందుననో వారు "ప్రియులై" ఉన్నారా? లేదు. గాని ఇశ్రాయేలు "పితరులను బట్టి ప్రియులైయుండిరి." "తండ్రులు" అంటే పితరులు (NIV చూడు) – ప్రత్యేకించి, "దేవుని స్నేహితుడైన"(యాకోబు 2:23; 2 దినవృత్తాంతములు 20:7; యెషయా 41:8 చూడు) అబ్రాహామును బట్టి (రోమా 4 చూడు).

దేవుడు అబ్రాహాముకు కొన్ని వాగ్దానాలు చేశాడు, మరియు ఆయన వాటి విషయంలో వెనుకకు వెళ్లలేదు – "ఏలయనగా, దేవుడు తన కృపావరముల విషయములోను, పిలుపు విషయములోను పశ్చాత్తాపపడడు" (రోమా 11:29; సంఖ్యాకాండము 23:19 చూడు). "మార్చ నశక్యము" అనే పదానికి గ్రీకు రూపం "పశ్చాత్తాపపడు," alph(*a*) వ్యతిరేకార్థ మిస్తుంది (KJV చూడు). "Repent" అంటే

ప్రాథమికంగా "మనస్సు మార్చుకొను" అని అర్థమిస్తుంది. అబ్రాహాము సంతతివారు ఏమైయుండాలో అలా ఉండనందున దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానాల విషయంలో తన మనస్సు మార్చుకోలేదు. మన స్టడీలో ముందుగా గుర్తించినట్టు, యూదులకు చేసిన ప్రతి వాగ్దానాన్ని దేవుడు నెరవేర్చాడు.

28వ వచనంలో తొలి భాగాన్ని యిలా పెంచవచ్చని నా సలహా: "సువార్త విషయమైతే వారు [యూదులు] శత్రువులై [కేవలం శిక్షకే పాత్రులై]యున్నారు." 28వ వచనం తరువాత భాగం యిలా పెంచబడవచ్చు: "దేవుని యేర్పాటు విషయములోనైతే వారు [యూదులు] పితరులను బట్టి ప్రియులైయున్నారు గనుక [సువార్త విని అంగీకరించుటకు] దేవుడు వారికి మరియొక తరుణం అనుగ్రహించుచున్నాడు." వారు తుచ్ఛమైన కార్యములు చేసియుండినప్పటికిని, యూదులు యింకను రక్షింపబడాలని దేవుడు కోరుతున్నాడు.

**దేవుడు కనికరము చూపగోరుచున్నాడు (30–32 వచనాలు)**

మూడవది, రక్షణకు సంబంధించి, దేవుడు కనికరము చూపగోరుతున్నాడని మనం ఎరుగగలం. 9నుండి 11 అధ్యాయాలవరకు "కనికరము" అనేది కీలక పదం (9:15, 16, 18, 23 చూడు). 11:30–32లో ఆ పదం నాలుగుసార్లు కన్పిస్తుంది. "కనికరము" (*eleos*) "కృప" (*charis*) సన్నిహిత సంబంధం కలిగియున్నాయి. ఆ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని కనుగొనడం కష్టం. "కృప" అంటే, మనం దేనికి పాత్రులమో (శిక్ష) దేవుడు దాని నివ్వ కుండడం అయ్యుండంగా, "కనికరం" అంటే మనం దేనికి పాత్రులము కామో (దీవెన) దానిని దేవుడు ప్రసాదించడం అని చెప్పడానికి Dale Hartman ఆశపడతాడు. "కనికరము" "దౌర్భాగ్యులకు సహాయము చేయునట్లు దేవుడు కలిగించే లక్షణమై యుండగా," "కృప" అనేది మన దోషమును క్షమించునట్టు దేవుని కదిలించేదైయుంది" అని ఒకతను రాశాడు.[3] "కనికరమునకు" చిన్న సాధారణమైన నిర్వచనం "వ్యక్తపరచబడిన కృప." "కనికరమును" నీవు ఎలా నిర్వచించినా, దేవుడు "అందరియెడల కరుణ చూపవలెనని" కోరుతున్నట్టు మూల వాక్యం ప్రకటిస్తుంది (32 వచనం; నొక్కి చెప్పింది నాది) – యూదులకు అన్యజనులకు – మరియు అది మనలను చేర్చుతుంది!

దేవుడు అందరికి కనికరం చూపుతాడని పౌలు మాటలాడడానికి ముందు, యిప్పటికి మనకు బాగుగా తెలిసిన విషయాన్ని (చివరిసారిగా) మరల చెప్పబూనాడు. యూదులను దేవుడు నిరాకరించడం, దేవునిచే అన్యజనులు అంగీకరింపబడడానికి సందర్భాన్ని ఏర్పరచింది. అన్యజనులలోనుండి క్రైస్తవులైనవారు అనుభవించే ఆత్మ సంబంధమైన దీవెనలకొరకు హృదయపూర్వకంగా వాంఛించునట్లు యూదులను ప్రేరేపించ యిది ఉద్దేశింపబడింది. అది తిరిగి వారు సువార్తకు లోబడి దేవునిచే అంగీకరింపబడుట దాని గమ్యమైయుంది. 30, 31 వచనాల్లో పౌలు ఈ క్రమాన్ని యిలా చూపాడు:

> మీరు [అన్యజనులు] గతకాలమందు దేవునికి అవిధేయులైయుండి,[4] యిప్పుడు వారి

> [యూదుల] అవిధేయతనుబట్టి కరుణింపబడితిరి. అటువలెనే మీ [అన్యజనుల] యెడల చూపబడిన కరుణనుబట్టి వారును [యూదులు] ఇప్పుడు కరుణపొందు నిమిత్తము, ఇప్పుడు వారు [యూదులు] అవిధేయులైయున్నారు.

ఈ రెండు వచనాలలో పౌలు యొక్క ప్రధాన ఆలోచనా విధానాన్ని చూడడం సులభమే:

యూదుల అవిధేయత
(దేవునిచే యూదులు నిరాకరింపబడుటయందు ఫలించింది)

↓

అన్యజనులకు చూపబడిన కనికరం
(అన్యజనులు దేవునిచే అంగీకరింపబడ్డారు)

↓

యూదులకు చూపబడిన కనికరం
(యూదులు దేవునిచే అంగీకరింపబడతారు)

"అందరియెడల కరుణ చూపవలెనని, దేవుడు అందరిని అవిధేయతా స్థితిలో మూసివేసి బంధించియున్నాడు" (32 వచనం) అంటూ పౌలు ఈ భాగపు చర్చను ముగించుతున్నాడు. గ్రీకులో "మూసివేసి" అనేది *sugkleio*. (*Kleio* ["మూయుట"]కు ముందు *sun* ["తో, కలిసి ఏకంగా"].) "దేవుడు ప్రతి ఒక్కరిని అవిధేయతలో ఖైదు చేశాడు" అని ఈ వచనాన్ని McCord తర్జుమా చేశాడు. నిరంకుశత్వంతో దేవుడు దీనిని మనకు చేసింది కాదు; అది మన సొంత పాపభూయిష్టత యొక్క ఫలితమే. ఎందుకంటే, మన పాపమునుబట్టి, మనమందరం పాపముచే చెరపట్టబడ్డాం. "పరిస్థితి బహు దారుణ మయ్యింది: పాపము కలతపరచుతోంది, ధర్మశాస్త్రం శిక్ష విధిస్తుంది, మనస్సాక్షి భీతిల్లుతుంది, చివరి తీర్పు భయపెడుతుంది. ... [అయితే అప్పుడు,] తటాలున అంధకారము తొలిగించబడింది. దేవుడు తానే స్వయంగా చెరసాల తలుపులు తెరచి, లోపల వెలుగు ప్రకాశింపనిచ్చాడు."[5] మనమందరం అవిధేయులమైయుండినందున, మనలో ఎవడు రక్షింపబడడానికైనా ఒకే ఆధారము దేవుని కనికరం లేక కృప.

సార్వత్రిక రక్షణను ఉపదేశించడానికి కొందరు వచనం 32ను ఉపయోగించారు. "ప్రతి ఒక్కడు అవిధేయుడన్నది సత్యమే, కాని చివరికి దేవుడు ప్రతి ఒక్కనికి కనికరం చూపుతాడని ఈ లేఖన భాగం ఉపదేశిస్తుంది" అని వారంటారు. ఈ తప్పుడు బోధకు సంబంధించి Stott యిలా రాశాడు,

> ఈ వచనం మీద కొందరు వారి సార్వత్రికమైన కలలను నిర్మించారు. రోమా పత్రికలోని దాని సందర్భంనుండి వేరుచేసి, అంతంలో సార్వత్రిక రక్షణ

వాగ్దానంగా దీన్ని అర్థం చేసికోవచ్చు. అయితే రోమా పత్రిక ఈలాటి వ్యాఖ్యానానికి అనుమతించదు ఎందుకంటే "దేవుని ఉగ్రత దినము" ఉందని పౌలు యిందులో ప్రకటించాడు (2:5), అప్పుడు కొందరు "ఉగ్రతయు రౌద్రమును," "శ్రమయు, వేదనయు" పొందుతారు (2:8f).[6]

వచనం 32లో పౌలు సందేశమేమంటే, మనమందరం అవిధేయులమై కేలవం శిక్షావిధికే పాత్రులమైయున్నా, దేవుడు యింకను కనికరం చూపగోరుతున్నాడు - యూదులైనా లేక అన్యజనులైనా, యువకులైనా లేక వృద్ధులైనా, స్త్రీలైనా లేక పురుషులైనా, విద్యావంతులైనా లేక విద్యావిహీనులైనా, "మంచివారైనా" లేక "చెడ్డవారైనా" (లోకంలో మనుషులు ఆలోచించినట్టు). దేవుడు ఎల్లరికి కనికరం యింకను చూపగోరుతున్నాడు. దేవుడు మనకు – నీకును, నాకును కనికరము చూపగోరుతున్నాడు. అందుకై దేవునికి స్తోత్రం!

## దేవుని గూర్చి మనమేమి తెలిసికొనగలం (11:33-36)

ఇశ్రాయేలును విమోచించుటకైన దేవుని ఏర్పాటును, ఎల్లరికి ఆయన కనికరము చూపగోరుటను గూర్చి పౌలు తలంచుతూ ఉండగా, తటాలున అతడు ఆయనను స్తుతించ వెళ్లాడు. 9నుండి 11 అధ్యాయాలవరకు "యూదుల సమస్యపై" దృష్టి నిలుపబడిందని మనం అనుకున్నాం; లోతైన భావంలో, ఈ భాగం ఇశ్రాయేలును[7] గూర్చి కాదు, దేవుని గూర్చియే. లోతైన అనుభవంలో. దేవునియందు నమ్మికయుంచినా లేకున్నా, దేవుని నమ్ముకోవచ్చు (9:6 చూడు). దేవుని నమ్మకత్వాన్ని ఆయన విశ్వాస్యతను స్థాపించిన తరువాత, దేవుడు ఎంత ఆశ్చర్యకరమైనవాడో వ్యక్తపరచుతూ పౌలు ఈ భాగాన్ని ముగిస్తున్నాడు. అధ్యాయం 11కు, అధ్యాయాలు 9నుండి 11వరకు, మరియు యిక్కడి వరకు చెప్పినదానంతటికి రోమా 11:33–36 బహుగా తగిన శిఖరాగ్రమై యున్నది.

వచనాలు 33నుండి 36వరకు బిగ్గరగా – పలుమార్లు చదువు. దాన్ని విడదీసే దానికంటె చవిచూడడానికి ఈ లేఖన భాగము యోగ్యమయినది. అయినా, పౌలు యొక్క పదజాలాన్ని దగ్గరగా చూడడంలో కొంత విలువ ఉంటుంది. ఈ లేఖన భాగంలో అపొస్తలుడు దేవుని గూర్చి పలు ప్రతిపాదనలను చేశాడు.

### దేవుని గూర్చి ప్రతిదాన్ని మనం ఎరుగలేం (33, 34 వచనాలు)

అధ్యాయం 11లో, దేవుని మనస్సులోనికి, పద్ధతిలోనికి అరుదైన ఒక చూపును పౌలు యిచ్చాడు: యూదుల అవిధేయత రక్షింపబడడానికి అన్యజనులకు ఎలా అవకాశంగాను, మరియు అన్యజనుల విధేయత యూదుల విధేయతను రేకెత్తించునదిగా ఎలా ఆయన వాడుకున్నాడో పౌలు సూచించాడు. దేవుని అద్భుతమైన జ్ఞానాన్ని బట్టి ఆయనను పౌలు స్తుతించనారంభించాడు: "ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల[8] బాహుళ్యము ఎంతో గంభీరము!" (33ఎ వచనం). కొందరికి తెలివి ఉంటుంది; దేవునికైతే బుద్ధి, జ్ఞానం రెండును ఉంటాయి!

33వ వచనం మొదటి భాగంలోని కీలక పదం “బాహుళ్యం” (*bathos*). దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యం ఎంత “లోతైనదంటే” దాన్ని మనం గ్రహించడానికే ఆరంభించలేం. “ఆయన తీర్పులు శోధింపనెంతో అశక్యములు, ఆయన మార్గములెంతో అగమ్యములు” అంటూ పౌలు కొనసాగించాడు (33బి వచనం). “ఆయన ఉద్దేశాలలో గుండా దూసికొని పోవడం, లేదా ఆయన పద్ధతులను గ్రహించడం ఎంతో అసాధ్యం” అని JB అంది. యెషయా 55:8, 9 నాకు గుర్తుకొస్తుంది: “ ‘నా తలంపులు మీ తలంపుల వంటివి కావు మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు’ ఇదే యెహోవా వాక్కు. ‘ఆకాశములు భూమికిపైన ఎంత యెత్తుగా ఉన్నవో మీ మార్గములకంటే నా మార్గములు మీ తలంపుల కంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి.’ ”

అతని ప్రతిపాదనల నాణ్యతను పెంచడానికి పౌలు పాత నిబంధననుండి కోట్ చేశాడు, అయితే అతని కొటేషన్‌లో పలు లేఖన భాగాలు యిమడ్చబడ్డాయి (యోబు 15:8: యెషయా 40:13; యిర్మీయా 23:18లను చూడు). “ప్రభువు మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు ఆలోచన చెప్పినవాడెవడు?” (రోమా 11:34). “ఆలోచన చెప్పినవాడు” అనేది *sumboulos* నుండి వచ్చింది (*boule* అంటే [“సలహా యిచ్చు, ఆలోచన చెప్పు”] + *sun* అంటే [“కలిసి, తో”]). McCordలో, “adviser” అని ఉంది. సలహా కొరకు దేవుడు ఎవరిని అడిగాడు? 34వ వచనంలోని రెండు ప్రశ్నలకు “ఎవనినే అడగలేదు” అనేదే జవాబు!

దేవుని గూర్చి మనం ఎరుగగల మొదటి వాస్తవం ఏమంటే, దేవుని గూర్చి సమస్తము మనమెరుగలేమనేదేనన్నట్టు పౌలు చెప్పాడు. ఒక కప్పు (cup) సముద్రాన్ని ఎలా నింపుకోలేదో, ఆలాగే అల్పమైన మన మనస్సులు దేవుని అనంత బుద్ధి జ్ఞానముల బాహుళ్యాన్ని పట్టజాలదు. దేవుడు చేసిన లోకాన్ని గ్రహించ ప్రయత్నించేవారిని ఈ సత్యం దీనులనుగా చేయాలి. ఆయన వాక్యాన్ని గ్రహించ ప్రయాసపడే మనలను కూడ ఈ భావన దీనులుగా చేయాలి. మనం ఎంతగా తెలిసికొంటామో, అంతగా మనం ఎరుగనివారమైనట్టు గ్రహించుతాము. “తెలివి అనే ద్వీపము ఎంతగా ఎదుగుతుంటుందో, అజ్ఞానమనే తీరం కూడ అంతగానే ఎదుగుతుంటుందని” ఎవరో అన్నారు.

“దేవుని గూర్చి మనకు ఏమి తెలియదో దాని చేతనేగాని ... మనకు ఏమి తెలుసో అనే దానిపై” పౌలు స్తుతి ప్రేరేపింపబడలేదని Leon Morris అభిప్రాయపడ్డాడు.[9] జవాబులన్నీ పౌలు దగ్గర లేవు. అతని “వివరణలు” ఎన్నింటికి జవాబులిచ్చాయో అన్ని ప్రశ్నలను అవి తిరిగి రేపాయి. చివరికి, సంతృప్తి కలిగించే ఒకే “జవాబు” ఏమంటే – జీవిత సమస్యలకు సర్వజ్ఞానియైన, సర్వమెరిగిన, కనికరముగల దేవునియందు నమ్మిక యుంచడమే.

### దేవుని మనకు రుణస్థునిగా చేసికోలేం (35 వచనం)

దేవుని గూర్చి మనం ఎరుగగల రెండవ వాస్తవం దేవుని మనకు ఎన్నడూ రుణస్థునిగా చేసికోలేము – అనేది. యోబు 41:11 యొక్క సారాన్ని పౌలు 35వ వచనంలో

యిచ్చాడు: "ముందుగా ఆయనకిచ్చి, ప్రతిఫలము పొందగలవాడెవడు?" మరల, విదితమైన జవాబు, "ఎవడూ లేడు." మనకు కలిగినదంతయు ఆయన యొద్దనుండి వచ్చినదై, ఆయనకు సొంతమైయుంటుంది, ఆయన మనకు యిచ్చినదానికి మనం కేవలం గృహ నిర్వాహకులమే. దేవాలయ నిర్మాణం నిమిత్తం రాజైన దావీదు సమర్పించిన సందర్భంలో అతడు దేవునికి యిలా ప్రార్థించాడు, "ఈ ప్రకారము మనఃపూర్వకముగా ఇచ్చు సామర్థ్యము మాకుండుటకు నేనెంతమాత్రపువాడను? నా జనులెంతమాత్రపువారు? సమస్తమును నీవలననే కలిగెను గదా? నీ స్వసంపాద్యములో కొంత మేము నీకిచ్చి యున్నాము" (1 దినవృత్తాంతములు 29:14; KJV).

భౌతిక విషయాల్లో దేవుని మనకు రుణస్థునిగా చేసికోలేమన్న మాట వాస్తవమై యుండగా, ఆత్మ సంబంధమైన విషయాల్లో అది రెండంతలు సత్యం. దేవుని ఆజ్ఞలకు లోబడుట బహు ప్రాముఖ్యం – మన రక్షణకు అత్యవసరం కూడా – మన విధేయత దేవుని ఎన్నడూ మనకు అచ్చియున్నట్టు చేయనేరవని మనం యింకను అర్థం చేసికోవాలి. మనం కృపవలన రక్షింపబడనట్టయితే, మనం రక్షింపబడనే లేదు.

## మన దేవుడు అద్భుతమైనవాడు (36 వచనం)

చివరిగా, మన దేవుడు మాటలకు అతీతంగా అద్భుతమైనవాడని మనం తెలిసికోవాలి. పౌలు యిలా అన్నాడు, "ఆయన మూలమునను, ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తమును కలిగియున్నవి" (36ఎ వచనం). భౌతికమైన సృష్టి విషయంలో యిది నిజమైయున్నది. "ఎందుకంటే ఆయననుండి ప్రతిదీ వస్తుంది, ఆయన ద్వారా ప్రతిదీ ఉనికి కలిగియుంది; మరియు ఆయనయందు ప్రతిదీ అంతమౌతుంది" అని Goodspeed అంటుంది. "దేవుడు, ఉత్పన్నం చేయువాడు, నిలబెట్టువాడు, మరియు సమస్త సృష్టికి గమ్యమైయున్నాడు" అని Morris రాశాడు.[10] ఏదియెలాగున్నా, మాటలు భౌతికమైనవాటికి పరిమితి చేయనొల్లపడదు; సందర్భము ఆత్మ సంబంధమైన విషయాలను గూర్చి మాట్లాడుతుంది. మన విమోచన సహితము "ఆయననుండి, ఆయన ద్వారా మరియు ఆయనకు." ఆయన మన రక్షణ యొక్క మూలమును, బలమును, ఉద్దేశమునై యున్నాడు.

ఇదంతా మనస్సులో ఉంచుకొని, "యుగములవరకు ఆయనకు మహిమ కలుగును గాక. ఆమేన్" అని పౌలు తీర్మానించాడు (36బి వచనం; నొక్కి చెప్పింది నాది). దేవునికి చెందవలసిన మహిమను మరి ఏ వ్యక్తికిని ఎన్నడూ యివ్వకుండునట్లు జాగ్రత్తపడదాం. "యెహోవాయే నా బలము నా గానము ఆయన నాకు రక్షణయు ఆయెను. ఆయన నా దేవుడు ఆయనను వర్ణించెదను" (నిర్గమకాండము 15:2ఎ). "ఆమేన్" (రోమా 11:36సి)!

ఈలాగున రోమా పత్రిక యొక్క కఠినమైన భాగం అంతమౌతుంది (9నుండి 11 అధ్యాయాలవరకు). చర్చించబడిన దిగ్భ్రమ కలిగించే ప్రశ్నలన్నింటికి పౌలు సాధారణమైన జవాబులు యివ్వలేదు. సరిగదా, ప్రశ్నలు ప్రాముఖ్యం కావని కూడ అతడు సూచించ లేదు. దానికి బదులు, కొంత అంతర్ దృష్టిని మనకిచ్చి, "దేవుని వద్ద జవాబులున్నాయి.

ఆయనయందు నమ్మికయుంచండి” అని చెప్పాడు. ఈ భాగం నమ్మికయనే నోటుతో ముగిస్తుంది.

## ముగింపు

ఈ పాఠాన్ని నేను సిద్ధం చేసేటప్పుడు, ద్వితీయోపదేశకాండము 29:29 గుర్తుకు వచ్చింది: “రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మశాస్త్ర వాక్యములన్నిటిననుసరించి నడుచుకొనునట్లు బయలుపరచబడినవి యెల్లప్పుడు మనవియు మన సంతతివారివియునగునని చెప్పుదురు.” మనం ఎరుగలేని అనేక సంగతులున్నాయి: “రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును.” అయినా, కొన్ని సత్యాలను మనకు బయలుపరచుట తగినట్టు దేవుడు చూచాడు. మన పాఠంలో మనం “బయలుపరచబడిన కొన్ని సంగతులను” చూచాం:

- యూదులు అన్యజనులిరువురి కొరకు దేవునికి రక్షణ ఏర్పాటుంది.
- అందరు రక్షింపబడాలని దేవుడు కోరుతున్నాడు.
- అందరికి కనికరము చూప దేవుడు ఆశపడుతున్నాడు.
- దేవుడు ఎన్నడూ మనకు రుణస్థుడైయుండడు; మనము ఆయన కృప, కనికరముల మీద ఆధారపడియుండాలి.
- దేవుడు మన మాటలకు మించి అద్భుతమైనవాడైయున్నాడు.

ట్రూత్ ఫర్ టుడే పేజీలు నింపునట్లు ఈ సత్యాలు నాకు బయలుపరచబడలేదు.[11] కాని, క్రీస్తు యొక్క క్రొత్త నిబంధనలోని “మాటలననుసరించి” నడుచుకొను ఉద్దేశం కలిగించునట్లు యివి బయలుపరచబడ్డాయి!

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

ఈ ప్రసంగాన్ని ఉపయోగించేటప్పుడు, ప్రభువైన యేసు మాటలననుసరించి నడుచు కొనడంలో ఏమి యిమిడియుందో నీవు నీ శ్రోతలకు చెప్పాలి - రక్షణకు సంబంధించిన మాటలో (యోహాను 3:16; లూకా 13:3; మత్తయి 10:32; మార్కు 16:16 లున్నాయి).

“ఎల్లప్పుడు నిరీక్షణ ఉంది” అని మరో పేరు దీనికి పెట్టవచ్చు! రెండు పాయింట్లు చెప్పవచ్చు: (1) దేవుడు నిన్ను రక్షింపగోరుతున్నాడు గనుక నిరీక్షణ ఉంది (25-32 వచనాలు), (2) దేవుడు దేవుడైయున్నాడు గనుక నిరీక్షణ ఉంది (33-36 వచనాలు).

పౌలు స్తుతికి సంబంధించిన దానిని నీవు వివరించవచ్చు (33-36 వచనాలు). దీనికి తోడుగా “I Stand in Awe” అనే పాట అనువుగా ఉంటుంది. “ఆయన మూలమునను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి”

అనేదానిమీద మూల వాక్య ప్రసంగం చేయవచ్చు (36ఎ వచనం).

---

సూచనలు

[1]John R. W. Stott, *The Letters of John: An Introduction and Commentary* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 304 (emphasis mine). [2]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 385. [3]Ronald F. Youngblood, ed., *Nelson's New Illustrated Bible Dictionary* (Nashville: Nelson, 1995, 1986), 822. [4]30, 31లలో పౌలు "అవిశ్వాసము," "విధేయత" అనే పదాలను వాడాడు (KJV), గ్రీకు పాఠంలో "అవిధేయత" అని ఉంది. రోమా 11 మొదట్లో, పౌలు, యూదులు దేవుని ఆశీస్సులను అవిశ్వాసమువలన (20 వచనం గమనించు) కోల్పోయారని నొక్కి చెప్పాడు. అపొస్తలుడు అది అవిధేయతవలననే జరిగిందని అన్నాడు. మరొకసారి పౌలు ఆ పదాలను పర్యాయంగా ఉపయోగించాడు. [5]William Hendriksen, *Exposition of Paul's Epistle to the Romans,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1982), 385. [6]Stott, 307. [7]Moo, 291. [8]"జ్ఞానము," "తెలివికి" మధ్య వ్యత్యాసం ఎంతో రాశారు. "జ్ఞానం" అంటే విషయాన్ని తెలుసుకోడం, "తెలివి" అంటే "లోక జ్ఞానం" అని మనం అర్థం చేసుకోవచ్చు. [9]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 427. (Emphasis mine.) [10]Ibid., 429.

[11]తరగతిలో కాని సేవా సమయంలో కాని ఇలా నేను అనుకున్నాను, "నేను నా పాఠాన్ని కొన్ని నిముషాలు పట్టేటట్టు" చూచుకోవాలి.

# 52

# రూపాంతరము (మార్పు) పొందిన జీవితం

## (12:1, 2)

రోమా పత్రికలోని తొలి 8 అధ్యాయాలు, మన రక్షణపై పౌలు యొక్క కామెంట్లను చదవాలి, తరువాత 3 అధ్యాయాలు "యూదుల సమస్య" గాను ఆలోచించాం. ఆ తరువాత పౌలు చెప్పినదంతా అభ్యాస సంబంధమైన వర్తింపుపై కేంద్రీకరింపబడింది. (రోమా పత్రిక యొక్క అవుట్‌లైన్ చూడు.) దైవతత్వ శాస్త్రం యొక్క ఆలోచనలో మనోహరమైన ఉన్నతికి పౌలు దూసికొనిపోతున్నాడు. కాని తన కాళ్ళను నేలమీద స్థిరంగా నిలిపాడు. అతడు విశ్వాసము, ప్రవర్తన విషయమై అక్కర కలిగియున్నాడు.[1] కేవలం నేర్చుకొనుటయందు మాత్రమే గాక, జీవించుటయందును అతడు దృష్టి నిలిపాడు - సిద్ధాంతమందు మాత్రమే కాదు, బాధ్యతయందు కూడ.[2] రోమా పత్రికలోని ముందటి అధ్యాయాలు "వేరు" గాను, తరువాత అధ్యాయాలు "ఫలము" గాను R. C. Bell వర్ణించాడు.[3]

లేఖనాల్లో ఉన్న గొప్ప అధ్యాయాలలో ఒకటితో వర్తింపు ఆరంభమౌతుంది: రోమా 12. బైబిలులో రోమా 8 నా ప్రియమైన అధ్యాయమని నేను ముందుగా ప్రస్తావించాను. రోమా 12 మా తల్లి గారికి ప్రియమైన అధ్యాయమైయుంది. ఆమె తన జీవితంలోని తుది మాసాలలో, ఆరాధనకు చర్చి బిల్డింగుకు వెళ్లలేకపోయేది. ఆదివారంనాడు కొన్నిసార్లు మా తండ్రిగారు ఆరాధనకు హాజరవ్వడానికి వీలుగా నేను మా తల్లితో ఇంటి దగ్గరే ఉండిపోయేవాడిని. అప్పుడప్పుడు మా అమ్మ నేను కలిసి ప్రభురాత్రి భోజనంలో పాలుపంచుకునేవాళ్లం. ఆ డివోషనల్ సమయంలో, ఏ అధ్యాయం చదువగోరమంటావని ఆమెను అడిగితే, "రోమా 12" అని ఆమె తప్పకుండా చెప్పేది. రోమా 12 అంటే ఇష్టపడేది మా అమ్మ ఒక్కతే కాదు, అది అనేకులకు ప్రియమైన అధ్యాయమే. J. D. Thomas యిలా అన్నాడు, "క్రైస్తవ జీవితం యొక్క సంగ్రహం బైబిల్లో ఎక్కడైనా యింతకంటే శ్రేష్ఠంగా నీవు కనుగొనలేవు."[4]

ఈ పాఠం రోమా 12:1, 2 మీదనే. అధ్యాయాలు 12నుండి 16వరకు గల హెచ్చరికలన్నింటికి ఈ వచనాలు వేదికను ఏర్పరచతాయి. రోమా 12:1, 2లో పౌలు క్రైస్తవులను కోరినవాటిని మనం చేసినట్టయితే, 12:3–16:27వరకు కోరబడినట్టు కనబడే దేనినైనా నెరవేర్చడం కష్టమైయుండదు.

## వెలుపల రూపాంతరం పొందుట (12:1)

**పౌలు విధానం (1ఎ–సి వచనం)**

మన మూల వాక్యము "కాబట్టి" (*oun*) అనేదానితో ఆరంభమౌతుంది. "కాబట్టి" అనే మాటతో పౌలు తరచుగా క్రొత్త భాగాన్ని ఆరంభిస్తాడు (1:24; 2:1; 5:1, 12: 6:12, 7:4, 13, 8:1 చూడు). తాను అప్పుడే ముగించిన దానితో తాను చెప్పబోతున్న ఆలోచనను కలపడానికి దీన్ని ఉపయోగించేవాడు. 12:1లో "కాబట్టి" అనేది రోమా పత్రికలోని తొలి భాగంతో వర్తింపు భాగాన్ని కలుపుతుంది. క్రైస్తవులు విశ్వాసమువలన నీతిమంతులుగా తీర్చబడ్డారని ముందుగా పౌలు నొక్కి చెప్పాడు. ఇక్కడైతే, విశ్వాసంవలన నీతిమంతులుగా తీర్చబడిన వ్యక్తి ఎలా జీవించాలో యిప్పుడు వివరిస్తున్నాడు.

పౌలు యిలా అన్నాడు, "గనుక ... బతిమాలుకొనుచున్నాను" (12:1ఎ). KJV "గనుక నేను కోరుతున్నాను" అని అంది. "నేను వేడుకొంటున్నాను అంటూ" NEB అంది. "నేను మిమ్మును అర్థించుతున్నాను" అన్నట్టు పలు తర్జుమాలన్నాయి (Phillips; McCord; JB). తన పాఠకులకు ఆజ్ఞాపించడానికి మారుగా, పౌలు వారిని బతిమాలాడు, వేడుకున్నాడు, అర్థించాడు, కోరాడు. దేవుడు బలవంతపు అర్పణ కాకుండ యిష్టపూర్వకమైన త్యాగము కావాలని కోరినందుకే యిలా అనడం జరిగియుండవచ్చు.

(ప్రేరేపించు) "కోరు" అనేది *parakaleo*నుండి తర్జుమా చేయబడింది. అక్షరార్థంగా "ఒకనివైపుకు రమ్మని పిలుచు"[5] (*kaleo* ["పిలుచు"] ప్లస్ *para* ["వైపుకు"]), స్నేహితుని తనవైపుకు రమ్మని పిలుచుట అనేది పోలిక, తన భుజముల మీద చేయివేసి, కన్నులలోనికి చూచి, "ఇది చేయునట్లు నా శక్తి అంతటితో నిన్ను ప్రోత్సహించనిమ్ము" అని అన్నట్టు. Dale Hartman యిలా వ్యాఖ్యానించాడు, "నొక్కి చెప్పడానికి పౌలు క్రింద గీతను ఉపయోగించినట్టయితే, ఈ మాటలను వాటి వెనువెంట వచ్చినవాటికిని క్రింద గీత పెట్టియుండేవాడు."[6] రోమా పత్రిక చదివినదానికి ఫలితంగా ఒక వ్యక్తి ఏమి చేయాలో అపొస్తలుడు బయలుపరచబోతున్నాడు.

ప్రేమతో కూడిన అతని వ్యక్తిగత విధానాన్ని "సహోదరులారా" అనే మాటతో కొనసాగించాడు (1బి వచనం). ఇక్కడనుండి ఉత్తరం ముగియువరకు, యూదులేగాని, అన్యజనులే గాని, రోములో ఉన్న తన సోదరీ, సోదరులను అతడు సంబోధించాడు.

"దేవుని వాత్సల్యమును[7] బట్టి" [*oiktirmos*[8]] పౌలు తన సహోదరులను బతిమాలుతున్నాడు (1సి వచనం). "దేవుని వాత్సల్యము" గత అధ్యాయాల్లో అనేక విధాలుగా వ్యక్తపరచబడింది: ఆయన వాత్సల్యం మనలను రక్షించడంలోను, క్రైస్తవ జీవితాన్ని జీవించ సహాయపడడంలోను, వగైరాల్లో వ్యక్తపరచబడింది. ఆయన వాత్సల్యపు "దృష్టిలో" (NIV) ఆయన మనలను అడిగిన దేనినైనా చేయ బద్ధులమైయున్నాం. "ఆయన నీ కొరకు ఏమి చేశాడో దాన్ని నీవు ఆలోచించినప్పుడు, యిది ఎక్కువగా అడగడం ఔతుందా?" (NLT).

**పౌలు విన్నపం (1డి వచనం)**

క్రీస్తునందలి తన సోదరీ, సోదరులను ఏమి చేయుడని పౌలు కోరాడు? "పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని" అతడు వారిని మొదటిగా అడిగాడు (1డి వచనం). మనలో అనేకులకంటెను, మొదటి శతాబ్దపు పాఠకులకు అధికంగా గ్రాహ్యమౌతుంది. శతాబ్దాల తరబడి, యూదులు జంతు బలులను దేవాలయము వద్దకు కొని తెచ్చేవారే. అన్య ఆరాధనలో బలులు కేంద్రంగా ఉండేవి. జంతు బలులకు ప్రత్యేకంగా యూదా మత సంబంధమైనవాటికి సమానంగానూ, భిన్నంగానూ ఉన్నట్టు పౌలు క్రైస్తవులకు సవాలు చేస్తున్నాడు. ఆశ్చర్యం కలిగించే ఆ తేడాలను, పోలికలను చూద్దాం.

- "సమర్పించు" – "సమర్పించు" అనేది *paristemi*నుండి వచ్చింది. ప్రాథమికంగా "ప్రక్కనే ఉంచు" (*histemi* ["ఉంచు"] ప్లస్ *para* ["ప్రక్కనే"]). అర్పణను ప్రభువు ఎదుట ఉంచుటయని అది సూచిస్తుంది. "లేవీయులు వధించేవాటిని, అర్పించేవాటిని తెలపడానికి అది సాంకేతిక పదమైయుంది."[9]
- "మీ శరీరములను" – నిన్ను నీవే అర్పించుకోవాలి. ఏ జంతువును దేవాలయములోనికి చొచ్చుకొని వచ్చి "నేను వచ్చాను! నన్ను వధించు!" అని ఎప్పుడూ అనదు. అయినా, ఒక విధంగా క్రైస్తవుడు అదే పని చేస్తున్నాడు. ఈ విషయంలో, క్రైస్తవుడు అటు యాజుకుడును, యిటు బలియునైయున్నాడు.
- "మీ శరీరములను": జంతు బలులు యిచ్చే దానికి బదులు, క్రైస్తవులు తమ శరీరములను, తమ జీవితాలను దేవునికి సమర్పించుకోవలసి యుంటుంది.
- "సజీవయాగముగా" – చనిపోయిన జంతువులను అర్పించడానికి మారుగా, క్రైస్తవులు సజీవయాగముగా సమర్పించవలసినవారై యుంటారు.[10]
- "పరిశుద్ధమును" – దేవునికి అర్పించే బలులు పరిశుద్ధమైనవైయుండాలి (ఆయన కొరకని వేరుచేయబడినవై) నిష్కళంకమైనవైయుండాలి (లేవీయకాండము 1:3; 1 పేతురు 1:19; మలాకీ 1:8 చూడు). క్రైస్తవులు ఎల్లప్పుడు తమ శ్రేష్ఠమైనవాటిని దేవునికి అర్పించాలి.
- "యాగముగా" – "క్రీస్తు యొక్క ఆత్మార్పణవలన గత కాలంనుండి జంతు బలులు వాడుకలో లేకుండపోయాయి గాని, విధేయతా హృదయములవలన జరిగే ఆరాధనకు ఎల్లవేళలా చోటు ఉంది."[11] పేతురు క్రైస్తవులకు యిలా రాశాడు, "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:5).

యేసును వెంబడించే ప్రతివానికి హెబ్రీ పత్రిక యొక్క రచయిత యిలా హెచ్చరించాడు: "కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము. ఉపకారమును ధర్మమును చేయ మరచిపోకుడి, అట్టి యాగములు దేవునికిష్టమైనవి" (హెబ్రీయులకు 13:15, 16).

- "దేవునికి అనుకూలము" (అంగీకారము) – ఈ పదము "అంగీకారము" (*euarestos*) అని తర్జుమా చేయబడింది అక్షరార్థంగా "బహు యింపుగా" అని అర్థం. (*Eu* ["బహు"] ప్లస్ *arestos* ["యింపుగా"].) పాత నిబంధన కాలంలో, దేవుడు సూచించినట్టు జంతు బలులు జరిగినప్పుడు, ఆ ధూపము "యెహోవాకు ఇంపైన సువాసనగా" విరజిమ్ముతోంది (సంఖ్యాకాండము 15:3; NIV). ఆలాగే, మనం చర్చించే ఆత్మ సంబంధమైన బలులు ఆయనకు అంగీకారంగా ఉండి దేవుని సంతోషపరచుతాయి.

తమ పాఠకులు పోటీ పడునట్లు ముందుగా రోమా పత్రికలో, "శరీరము" (*soma*), "సమర్పించుట" (*paristemi*) అనే పదాలను పౌలు ఉపయోగించాడు.

> మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి, అయితే మృతులలోనుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి, మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించుడి (6:13; నొక్కి చెప్పింది నాది).

"శరీరములని" 12:1లోని పదాన్ని అనేకమంది రచయితలు, తర్జుమాదారులు "మనలను మనమే సంపూర్ణంగా" అని వ్యాఖ్యానించారు. మనమేమైయున్నామో, మనకేమి కలిగి ఉన్నదో అదంతా దేవునికి అర్పించవలసినవారమైయున్నాం, అయితే "శరీరములని" పౌలు ఉపయోగించడానికి కారణముండవచ్చు. రోమా పత్రిక అంతటిలో, ఆత్మ సంబంధమైన శోకములన్నిటికిని భౌతిక దేహము మూలమైనట్టు పౌలు నొక్కి చెప్పాడు. శరీరము యొక్క బలహీనతను బట్టి, పాప నియమాన్ని మనం సేవిస్తాం (7:25). మన ఇష్ట ప్రకారం నడుచుకుంటే, మాంసయుక్తమైన శరీర వాంఛలు మనను లాగి పడవేస్తాయి (7:5, 18, 23, 24). ఏదియెలాగున్నా, దేవుని ఆత్మవలన "శరీర క్రియలను" మనం చంపి వేయవచ్చునని పౌలు ప్రకటించాడు (8:13). ఈ శరీరము మరోసారి నీతికి సాధనముగా ఉండుటకు సిద్ధముగా ఉండి, "పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా సమర్పింపబడగలదని" అతడంటున్నాడు.

శరీరానికి దాని మర్యాదను, గౌరవాన్ని యిచ్చే ఒకే మతంగా క్రైస్తవ్యం గుర్తింపబడుతుంది.[12] "గ్రీసు దేశస్తునికి దేహము కేవలం కారాగార గృహమైయుంది; తృణీకరించ బడే మరియు అవమానకరంగా భావింపబడేదైయుంది."[13] దీనికి భిన్నంగా, దేహము "పరిశుద్ధాత్మకు ఆలయముగానున్నట్టు" క్రైస్తవుడు అర్థం చేసి

కొంటాడు (1 కొరింథీయులకు 6:19). తన దేహమందు దేవుని మహిమపరచి, క్రీస్తును ఘనపరచగలవాడైయున్నాడు (1 కొరింథీయులకు 6:20; ఫిలిప్పీయులకు 1:20).

శరీరాన్ని సజీవ యాగముగా దేవునికి సమర్పించుకొనడంలో యిమిడి ఉన్నదేమి?[14] దేవుని స్తుతించుట, మేలు చేయుట, ధర్మము చేయుట అనేవాటిని గూర్చి హెబ్రీయులకు 13:15, 16 సూచించింది. ఇవి దేవునికి యిష్టమును ప్రీతికరమునైన బలియాగములే. ఆయన మహిమ కొరకు మన భౌతిక సామర్థ్యాలను, తలాంతులను ఉపయోగించడానికి మన శరీరాలను సమర్పించవలసియుంటుంది. John R. W. Stott మన దేహాలను ప్రభువునకు అర్పించినప్పుడు ఏమి జరుగుతుందో యిలా వర్ణించాడు:

> అప్పుడు మన కాళ్లు ఆయన త్రోవల్లో నడుస్తాయి, మన పెదవులు సత్యాన్ని పలుకుతూ సువార్తను ప్రకటిస్తూ ఉంటాయి, మన నాలుకలు స్వస్థతను తెస్తాయి, మన చేతులు పడిపోయినవారిని లేవనెత్తుతాయి, వంట చేయటం, శుభ్రం చేయడం, టైపు చేయడం, బాగు చేయడంవంటి అనేక భౌతిక కార్యాలను చేస్తాయి. మన కరములు వంటరిగాళ్లను ప్రేమించబడనివారిని కౌగలించుకుంటాయి; యిబ్బందిలో ఉన్నవారి కేకలను మన చెవులు వింటాయి, మన కండ్లు వినయంగాను ఓపికగాను దేవునివైపు తేరి చూస్తాయి.[15]

"ఇది ఆరాధన యొక్క ఆత్మ సంబంధమైన మీ సేవయై యున్నది" అని శరీరాన్ని సమర్పించడాన్ని గూర్చి పౌలు చెప్పాడు (రోమా 12:1, 2). ఈ ప్రయోగంలో తేట గా లేని రెండు పదాలున్నాయి. మొదటిది, "ఆత్మ సంబంధమైన": *logikos*. *Logikos* అనేది *logos* ("వాక్యము") అనేదానినుండి వచ్చింది. *logikos* "రీజనింగ్ సామర్థ్యానికి" సంబంధించినదైనట్టు W. E. Vine అంటున్నాడు, అంటే, "న్యాయమైన" లేక "హేతు బద్ధమైన."[16] ఎక్కువమంది నవీన తర్జుమాదారులు "ఆత్మ సంబంధమైన" అనే పదాన్ని వచనం 1లో యిష్టపడతారు. అయితే "ఆత్మ సంబంధమైన" అనేదానికి ప్రత్యేకంగా అర్థమిచ్చే వేరొక పదముంది (*pneumatikos*). ఈ ప్రత్యేకమైన వచనంలో *logikos*కు "యుక్తమైన" లేక "హేతుబద్ధమైన" అనేది ఎక్కువ సాధారణమైన అర్థమైయుంటుంది.

ఏ మార్గము లేక మార్గాలలో మన దేహాలను సమర్పించడం దేవునికి "యుక్తమైన" సేవయై యుంటుంది? (1) దేవుడు మనకు చేసిన దానినంతటిని ఆలోచించినప్పుడు యిది న్యాయమైన విన్నపమైయుంటుంది. (2) దేవుని ప్రేమకు మనం న్యాయమైన, హేతుబద్ధమైన ప్రత్యుత్తరం యిచ్చినవారమౌతాం. (3) ఈ బలిని మనం అర్పిస్తుండగా, బుద్ధిపూర్వకంగా, ఆలోచనాపూర్వకంగా చేయువారమౌతాం.

ఇప్పుడే యివ్వబడిన మూడవ ఆలోచనకు సంబంధించి, ప్రభువుకు మనం చేసే ఏ పనియైనా ఆయనతో కూడినదైయుండాలి. ఏదో ఒక కర్మకాండగా గాని, యథాలాపంగా గాని ఆయనను మనమెన్నడు సేవించకూడదు. Abilene, Texas కాలేజీలో ఉండగా, రాష్ట్రానికి పశ్చిమ భాగంలో ఉన్న Knott, Texasలోని ఒక చిన్న స్థానిక సంఘానికి నేను ప్రసంగించుతూ ఉండేవాడిని. ఆదివారం రాత్రుల్లో Abileneకు తిరిగి రావడానికి

మూడు గంటల ప్రయాణం ప్రతిసారి ఆలస్యం అవుతుండేది, నేను సాధారణంగా అలసిపోయేవాడిని. ఒకటికంటే ఎక్కువ పర్యాయాలు, దానికి ముందు రాబోయే ఊరేదో కూడ చూడక మైకం కమ్మినట్టుగా కారు నడిపేవాడిని, అలా కారు తోలడం అపాయకరం – దేవుని ఆలాటి భ్రమలో సేవించడం దానికి రెండంతలు అపాయకరం. మనం దేవుని ఆరాధించేటప్పుడు, మన మనస్సులు ఆయన మీద కేంద్రీకరించవలసియుంటుంది. మనం ఏమి చేస్తున్నామో దానిమీద కూడ మనస్సు పెట్టవలసియుంటుంది. ప్రభువునకు మనం చేసే సేవయంతటిలోను అదే సత్యమైయుంటుంది.

తేటగా లేని మరో పదాన్ని NASB "service of worship": *latreia. Latreuein* అనే క్రియావాచకానికి *latreia* అనేది నామవాచక రూపమైయుంది.

> అసలుకి *latreuein* కూలికి, లేక బాడుగకు పని చేయుట అని అర్థం. అటు తరువాత సేవించుటకు అను సాధారణ అర్థానికి అది వచ్చి చేరుకుంది. ఎట్టకేలకు, దేవతల సేవకు ప్రత్యేకించి వాడబడే పదంగా రూపొందింది. బైబిల్లో మాత్రం అది ఎన్నడూ మానవ సేవ అని అర్థం కాదు; అది ఎల్లవేళలా దేవుని సేవకును, ఆరాధనకును వాడబడింది.[17]

*Latreia* అనేది "సేవ" మరియు "ఆరాధన" అని న్యాయ సమ్మతంగా తర్జుమా చేయబడే మార్గాలే. పలు తర్జుమాలలో "సేవ" అని ఉంది, KJVతో చేర్చి. యితర అనేకమైనవాటిలో "ఆరాధన" అని NIV అంది. ఈ రెండింటిలో ఏదో ఒక పదాన్ని ఎన్ను కోకుండ తర్జుమాదారులు "ఆరాధన యొక్క సేవ" అని చేర్చారు NASB. ముందుగా, రోమా 9:4లో, *latreia*ని NASB "సేవ" అని తర్జుమాచేసింది, దానికి ముందు "దేవాలయము" అనే మాట చేర్చింది. (దానికి సంబంధించిన పదం *leito-urgia* దానిలో నుండి "listurgy" వచ్చింది – కొన్ని మతశాఖలచే చేయబడే ఆరాధన ఆచారకాండను సూచించడానికి అది వాడబడుతుంది.)

*Latreia* అనే పదాన్ని వ్యాఖ్యానించడానికి రచయితలు కొనలకు వెళ్లిపోయారు. దేవునికి సాధారణంగా చేసే సేవయేగాని ఆరాధన కాదని కొందరు వక్కాణించారు. రోమా 12:1లోని *latreia*నుండి ఆరాధన అనే మూల సూత్రాన్ని ఎత్తివేయడం అమితంగా మాట్లాడడమే ఔతుంది.[18] సజీవయాగముగా మీ శరీరములను దేవునికి సమర్పించుకొనుడి అని అనడంలో పౌలు ఆరాధనా భాషను ఉపయోగిస్తున్నాడు.

"జీవితమంతా ఆరాధనయేనని" రోమా 12:1 ఉపదేశిస్తున్నట్టు కొందరు ఊహించి, "ఆరాధనా కార్యక్రమాలను" గూర్చి అవసరములేని (ఆధారములేని) తీర్మానాలను చేశారు. ఉదాహరణకు, "జీవితమంతా ఆరాధనయే అయినప్పుడు," ఆరాధనకొరకు ప్రత్యేకంగా కూడవలసిన అవసరమే లేదని కొందరు తీర్మానించారు. ఈ తీర్మానం హెబ్రీయులకు 10:25ను ఖండించుతుంది.

తన అనుదిన జీవితంలో ఫలాని పని చేయడం యుక్తమైయున్నట్టయితే, "సంఘ మంతయు ఆరాధనకొరకు కూడివచ్చినప్పుడు" (1 కొరింథీయులకు 14:23) అది చేయడం అంగీకారమేయని కొందరు నొక్కి చెప్పుతారు. ఈలాటి ఊహ చాలా తప్పు.

ఉదాహరణకు, అనుదినపు సెట్టింగులో స్త్రీలు దర్శించడం గాని, మాట్లాడడం గాని తప్పులేదు, కాని "సంఘ [కూడికలలో] వారు మౌనముగా ఉండవలసియుంటారు. సంఘ [కూడికలో] స్త్రీ మాటలాడడం అవమానకరం" (1 కొరింథీయులకు 14:34, 35). మరల, మామూలు భోజన సమయాల్లో ఒక వ్యక్తి కాఫీ, ద్రాక్షల రసము రెండును తీసికోవచ్చు. అయితే ప్రభురాత్రి భోజనాన్ని ఆచరించేటప్పుడు, ద్రాక్షల రసంతో కాఫీని కూడ తీసికొనడం, జ్ఞాపకార్థ విందును అపవిత్రపరచడమే ఔతుంది. "బహిరంగ ఆరాధన" (ఆరాధించడానికి సంఘం కూడి రావడం)కును, మన వ్యక్తిగతమైన వంటరిగా చేసే దేవుని సేవకును కొంత వ్యత్యాసం చూపాలి.

పైన చెప్పిన రెండు విపరీతాలకు మధ్య ఎక్కడో ఒక చోట రోమా 12:1లోని సందేశం వస్తుంది. మన శరీరములను దేవునికి సజీవ యాగముగా సమర్పించే మన సేవ దేవునికి యుక్తమైనది అనే పౌలు ప్రతిపాదననుండి మనం ఏమి నేర్చుకున్నాం? ఈ క్రిందివాటితోపాటు మనం అనేక విషయాలను నేర్చుకొన బద్ధులమైయున్నాం.

(1) "పవిత్రమైన" "మత సంబంధం కాని" అనేవాటి మధ్య బహు సున్నితమైన వ్యత్యాసాన్ని చేయ ప్రయత్నించవద్దు. ప్రసంగాన్ని సిద్ధపరచటం ఎంత పవిత్రమయ్యిందో, పిల్లలను "ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను పెంచడం" (ఎఫెసీయులకు 6:4) అంతే పవిత్రమైన బాధ్యతయైయుంటుంది. ఆత్మ సంబంధమైన ఒక వ్యాసం వ్రాయడం ఎంత పవిత్రమయ్యిందో, "మనుష్యులకు చేసినట్టు కాక, ప్రభువునకు చేసినట్టే" అనుదిన ఉద్యోగ బాధ్యతలను నెరవేర్చుట అంతే పవిత్రమైనది (కొలొస్సయులకు 3:23).

(2) మనం ఏమి చేసినా నిరంతరం మనం దేవుని సముఖంలో ఉన్నామనే అవగాహన కలిగియుండాలి – దాని ప్రకారం మనం ప్రవర్తించాలి. ఆదివారం కంటే సోమవారంనుండి శనివారంవరకు ఒకడు వ్యత్యాసమైన వ్యక్తిగా జీవించియుంటే, ఆదివారమున అతడు "ఆత్మతోను, సత్యంతోను" ఆరాధించలేడు.

(3) మనం పిల్లలను పెంచడం కానివ్వండి, ప్రసంగాన్ని సిద్ధపరచుకొనడమో, దైనిక ఉద్యోగంలోను కానివ్వండి, ఆత్మ సంబంధమైన వ్యాసాన్ని సిద్ధపరచడమే కానివ్వండి, మరి మనం యింకా ఏమి చేసినాసరే, మనం చేసే ప్రతి పనిలో దేవుని మహిమపరచడానికి స్పృహతో ప్రయాసపడాలి. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న దేవుని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" అని ప్రభువైన యేసు అన్నారు (మత్తయి 5:16). "మీరేమి చేసినను, సమస్తము దేవుని మహిమ కొరకు చేయుడి" (1 కొరింథీయులకు 10:31) అని పౌలు వ్రాశాడు.

## అంతరంగమందు రూపాంతరము చెందుట (12:2)

**పౌలు హెచ్చరిక (2ఎ, బి వచనం)**

"మరియు" అంటూ రెండవ వచనం ఆరంభించి ముందు వచనంతో ముడివేస్తుంది. ప్రభువుకు సమర్పించుకొనడమనే చర్చను పౌలు కొనసాగిస్తున్నాడు. "సజీవయాగంతో

ఉన్న సమస్య ఏమంటే, బలిపీఠం మీదనుండి అది జారుకుంటూ ఉంటుంది" అని ఒక వ్యక్తి అన్నాడు.[19] దేవునికి సమర్పించబడిన జీవితానికి తిరిగి బలీయంగా విన్నపం చేయవలసిన అవసరతను పౌలు గుర్తించాడు.

(1) వ్యతిరేకమైనది. పౌలు తొలిగా ఒక వ్యతిరేకమైన ఆజ్ఞనిచ్చాడు: "ఈలోక మర్యాదను అనుసరింపక" (2ఎ వచనం). "అనుసరించు" అనేది *suschematizo* నుండి తర్జుమా చేయబడింది. ఈ దీర్ఘమైన మాటకు నడుమ *schema* అనే పదముంది, "నుండి"[20] అనేది అర్థం. దీనికి ముందు *sun* ("తో") అనేది ఉంది. "లోకము" అనేది *aion* నుండి తర్జుమా చేయబడింది. అది "యుగమునకు" వాడే పదం. *Aion* అనేది ప్రకృతి సంబంధమైన (బండలు, చెట్లు, పూలకు సంబంధమైన) దాన్ని సూచించదు. ఇంకో చోట పౌలు దీన్ని "ప్రస్తుత దుష్ట కాలమని [*aion*]" అన్నాడు (గలతీయులకు 1:4). పౌలు యొక్క ఈ హెచ్చరిక ఆయా తర్జుమాలు యిలా అన్నాయి:

> ఈ ప్రస్తుత లోక విధానాన్ని నీవు ఏ మాత్రము అనుసరింపక (NEB).
>
> ఈ లోకపు ఆచారములను ప్రవర్తనను నకిలీ చేయక (NLT).
>
> నీ చుట్టునున్న లోకము నిన్ను తన నమూనాలోనికి పిండుకొనక (Phillips).
>
> కనీసం ఆలోచించకుండ నీ నాగరికతకు సరిగా సర్దుకొనునట్టు దానియందు అతుకబడక (MSG).

తన ప్రమాణాలలోనికి అనుకూలంగా మార్చడానికి లోకం అదే పనిగా ఒత్తిడి చేస్తుంది.[21] ఈ ఒత్తిడి మనకు ప్రజలనుండి వస్తుంది: స్నేహితులు, కుటుంబ సభ్యులు, పొరుగువారు, జతపనివారు, లేక పాఠశాల జతగాండ్రవలన కలుగుతుంది. అది సమాచారం మార్గంనుండియైనా రావచ్చు. వార్తా పత్రికలు, మేగజైన్స్, పుస్తకాలు, సంగీతము, రేడియో, టెలివిజన్, సినిమాలు, ఎడ్‌వెర్‌టైజ్‌మెంట్స్‌నుండి రావచ్చు. ఆలాటి ఒత్తిడి ఆగేదీ కాదు, మానేదీ కాదు. అది యుక్తిగా కూడ ఉండవచ్చు. జీవిత గమ్యం వ్యక్తిగత సంతోషమేయని లోకము మన చెవులలో గుసగుసలాడవచ్చు. మరియు మనం సంతోషంగా ఉండాలంటే మనం ఆలోచించాలి, పని చేయాలి, మాట్లాడాలి, యితరులున్నట్టు ఉండాలి. దాన్ని గ్రహించకుండగనే లోకపు విలువల విధానం, జీవితపు నడకను అంగీకరించుట సులభం. ప్రజలు అనుకరించు స్వభావంగలవారు. అనుకరించడానికి లభ్యమయ్యేది రెండు ప్రాథమిక విలువ విధానాలు మాత్రమే. వాటిలో ఒకటి, "ప్రస్తుత దుష్ట కాలము." రెండవది, "దేవుని చిత్తమందు" కన్పించేది (2డి వచనం). "ఈలోక మర్యాదననుసరింపక" అని పౌలు బతిమాలాడు (నొక్కి చెప్పింది నాది).

"ఈలోక మర్యాదను అనుసరింపక" అనేదానిలో హెచ్చరిక అవసరమనిపిస్తుంది. లోకానికి వేరుగా ఉండాలనే ఉద్దేశంతోనే వేరుగా ఉండడమని దాని అర్థం కాదు. Halford Luccock యిలా రాశాడు,

కేవలం వేరుగా ఉండడం కొరకే అనుగుణంగా ఉండకపోవడంలో విలువ ఉండదు. అది పరిపక్వం కాని మనస్సు యొక్క స్వభావం, తరచుగా ఏదో ప్రదర్శించాలనేవాని తత్వం కావచ్చు. ఉపయుక్తమైన సమాజంలో అనుగుణంగా ఉండడం అనేక విషయాలలో అవసరమైయుంటుంది.[22]

సాధ్యమైనంతవరకు భిన్నంగాను, వింతగాను కనబడడంలోను, నటించడంలోను అతిశయించే ప్రజలను మనమందరం ఎరుగుదుము. సువార్త వ్యాపింపజేయ ప్రయత్నించే మనలను ఆలాటి ప్రవర్తన దూరం చేస్తుంది. దేవుని చిత్తానికి భిన్నంగా ఈ లోకపు లక్షణాలకు అనుగణంగా మనం ఉండకూడదు. అంతేకాని, మనం ఎవరికైతే ఉపదేశం చేస్తున్నామో వారికి విరోధంగా ఉండే మార్గంలో మనం వెళ్లకూడదు.

(2) అనుకూలమైనది. పౌలు వ్యతిరేకమైనదానితోనే ఆగలేదు; అనుకూల విషయాన్ని కూడ అతడు అందులో చేర్చాడు: కాని "రూపాంతరం పొందుడి" (2బి వచనం). "రూపాంతరము పొందుడి" అనేది *metamorphoo* యొక్క తర్జుమా అయ్యింది. ఈ పదంలో ప్రాముఖ్యమైనది *morphe* ("పోలిక" అనేదానికి వేరొక పదం). దీనికి ముందు *meta* అనేది ఉంది ("తో" అనేదానికి వేరొక పదమైయుంది). దీనినుండి మనకు "metamorphosis" అనేది వచ్చింది. అది మార్పును సూచిస్తుంది – తరచుగా ఆసక్తిని రేకెత్తించు మార్పును సూచిస్తుంది.[23] తరచుగా ఉపయోగించే ఉదాహరణ – గొంగళి పురుగునుండి సీతాకోకచిలుకగా మార్పు చెందడం.[24] భౌతిక మార్పు ఎంత ఆశ్చర్యకరమైనదైనా, క్రీస్తునందున్నవానిలో జరిగే ఆత్మ సంబంధమైన మార్పు యింకను ఎంతో అద్భుతకరమైనదై ఉంటుంది. కొన్ని నెలల క్రిందట, సంవత్సరాంతపు ఆరాధనా కార్యక్రమంలో, క్రీస్తు తన జీవితాన్ని ఎలా మార్చుకున్నారో ఒక మనిషి చెప్పగా నేను విన్నాను. "ఇరవై సంవత్సరాల క్రిందట, నేను త్రాగుబోతును!" అని అతడు చెప్పాడు! ఇప్పుడు అతడు ప్రభువు సంఘంలో ప్రయోజనకరమైన నమ్మదగిన పెద్దయైయున్నాడు![25]

ఎందుకో గాని నాకు అర్థం కానిదేమిటంటే, "రూపాంతరము పొందుడి" అనేది కర్మార్థకములో ఉందని అనేకమంది రచయితలు అంటారు. అది ఏదో మనం చేసేదానికంటే మనకు చేయబడేదిగా ఉంటుంది. "దేవుడు నిన్ను రూపాంతరం చేయనిమ్ము" అనే అనేకమంది తర్జుమా చేశారు (TEV; CEV; NLT; Phillips). ఇది ఈలాటి నొక్కి చెప్పడం ఎందుకు పొందిందో నాకు తెలియదని మరల అంటున్నా. "ఈలోక మర్యాదననుసరింపక" అనేదానిలోను "రూపాంతరం పొందుడి" అనేదానిలోను ఒకే అంతం గ్రీకులో ఉంది. " 'ఈలోక మార్యాదననుసరింపక' అనేది మనం చేసేది కాదు మనకు చేయబడేదని" ఏ వ్యాఖ్యానకర్తయు చెప్పినట్టు నేను కనుగొనలేదు. ఈ రెండు పదాల అంతం కర్మార్థకమైనదైనా అయ్యుండాలి. (అంటే మనకు చేయబడేదై యుండాలి) లేదా మనకు మనం చేసికొనేదైనా అయ్యుండాలి.[26] "సహోదరులారా, నేను బతిమాలుతున్నాను" అంటూ ఈ భాగాన్ని పౌలు ఆరంభించాడు; మనం ఏమి చేయాలో దాన్ని అతడు నొక్కి చెప్పాడు. ఏది కానప్పటికిని, ఆ రెండు ఆజ్ఞలలో దేనికి లోబడలేమని మనం గుర్తుంచుకొనడం ప్రాముఖ్యం – లోకానికి "అనుగుణంగా ఉండకుండాలన్నా," లేక "రూపాంతరం పొందాలన్నా" దేవుని సహాయం లేకుంటే

కుదరదు. అధ్యాయాలు 7, 8 దీన్ని తేటపరచుతుంది. ప్రభువు లేకుండ మనం నిస్సహాయులమైయుంటాం.

**పౌలు యొక్క విభజన (2సి, డి వచనం)**

(1) ఎలా? మనం ఎలా "రూపాంతరం పొందగలం?" మనకు తెలియజెప్పడానికి పౌలు ముందుకు సాగాడు: "... నూతనమగుటవలన [*kainos* నుండి ("నూతనమైన") దీనికి ముందు *ana* ("మరల")]. మీ మనస్సులు" (2సి వచనం). రూపాంతరం లోపలనుండి కలుగుతుంది. లోపల మార్పు చెందకుండ వెలుపల మార్చుకొనడం అనేది బురదగుంట లో ఆటలాడిన బాలుడు శుద్ధమైన దుస్తులు ధరించుకున్నట్టుంటుంది. వెలుపలిది మనం మార్చుకోవాలంటే, లోపలిది మార్చుకోవలసియుంటుంది. "తన అంతరంగములో యోచించుకొనుట మీద ఒకని వ్యక్తిత్వం ఆధారపడియుంటుంది" (సామెతలు 23:7).

Lone Wolf, Oklahoma హై స్కూలు సైన్సు క్లాసునుండి నాకు ఒక చిన్న ప్రదర్శన గుర్తుకొస్తుంది. ఉపాధ్యాయుడు ఒక గాలన్ పట్టే ఖాళీ లోహపు డబ్బాను తీసికొన్నాడు. ఆ డబ్బామీద మూత తీసివేశాడు, కొద్దిగా నీళ్ల దానిలో పోసి, Bunsen burner మీద పెట్టాడు. త్వరలోనే నీరు మరగసాగింది. ఉపాధ్యాయుడు గ్లోవ్స్ తొడుగుకొని, తిరిగి దానిపై మూతపెట్టాడు, గట్టిగా స్క్రూ తిప్పాడు, డబ్బాను మంట లోంచి తీసివేశాడు. కొద్ది క్షణాలు ఏమీ జరుగలేదు. అప్పుడు, తటాలున – రాక్షసుడు అదృశ్య హస్తాలతో నొక్కినట్లు – ఆ డబ్బా యొక్క ప్రక్కలు అతుక్కుపోయాయి. నేను ముగ్దుడనయ్యాను!

ఉపాధ్యాయుడు యిలా వివరించాడు వేడి చేయడంవలన డబ్బాలోని గాలి వ్యాకోచించి బయటికి వెళ్లిపోయింది. తత్‌ఫలితంగా, మూత బిగించబడిన డబ్బా చల్లబడి పోయినప్పుడు, డబ్బాలోని గాలి ఒత్తిడి డబ్బా వెలుపలనున్న గాలి ఒత్తిడి కంటే తక్కువై పోయింది. అందువలన వెలుపటి ఒత్తిడి డబ్బా పక్కలను ఒత్తివేసింది. మనలో అనేకులకు వాయుపీడనం గూర్చి తెలియదు, కాని అది ఉంది. సముద్రపు మట్టానికి ఒక చదరపు అంగుళానికి 15 పౌన్లు దాదాపు ఒత్తిడి ఉంటుంది![27] (మన దేహాలు అలా ముడుచుకుపోవు ఎందుకంటే లోపల ఒత్తిడి ఎంతో వెలుపల ఒత్తిడి అంతే ఉంటుంది.)

సంవత్సరాల తదుపరి, నేను రోమా 12:1, 2 చదివేటప్పుడు, వాయుపీడనం యొక్క ప్రదర్శనను నేను జ్ఞాపకం చేసికొన్నా. "లోకం యొక్క జీవిత విధానానికి అనుగుణంగా మనలను మల్చే ఒత్తిడి లోకంలో ఉన్నట్టు అనేకమంది జనులు గ్రహించ కుండా ఉన్నారు. ఆ ఒత్తిడిని తట్టుకొనడానికి వారిలో ఏమియు లేని కారణాన ఆ ఒత్తిడికి వారు లొంగిపోతారు." "తన రూపులోనికి మనలను పిండివేయకుండ" లోకం యొక్క ఒత్తిడిని మనం దూరంగా ఉంచడానికి గాను మన మనస్సు మారియుండడం అవసరమన్నట్టు పౌలు చెప్పుతున్నాడు.

(దేవుని సహాయముతో) మన మనస్సులు నూతనపరచబడడానికి మనమేమి చేయగలం? మనలను క్రిందికి దిగజార్చేదానికి బదులుగా మనం చేయవలసిన

మిక్కిలి ప్రాముఖ్యమైన కార్యం మనం లేవనెత్తబడేలా మన మనస్సులను నింపుకొనుటయే. మన మనస్సులు ఎడతెగక అవినీతికి, అర్థరహితమైనవాటికి, లోకం యొక్క స్వార్థపరమైనవాటికి పరుగుతీస్తుంటే, మన మనస్సులు నూతనపరచబడడం దాదాపుగా అసాధ్యమే. వేరొక చోట పౌలు యిలా రాశాడు: "... యే యోగ్యతయైనను మెప్పైనను ఉండినయెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, వాటిమీద ధ్యానముంచుడి" (ఫిలిప్పీయులకు 4:8; 1977 NASB; నొక్కి చెప్పింది నాది).

మన మనస్సులను మనం దేవుని వాక్యముతో నింపుకోవాలి. ఇది మనం బైబిలు పఠనం ద్వారా జరిగించాలి.[28] మన తలంపులు దేవుని మీద కేంద్రీకరించాలి. ధ్యానము, ప్రార్థన ద్వారా దీనిని మనం సాధించగలం. దేవుడు సృజించిన అద్భుతమైన లోకాన్ని ఆలోచించడంవలన (రోమా 1:20 చూడు) చేయగలం. ఆత్మ సంబంధమైనవాటియందు శ్రద్ధగల జనులతో మనం కలిసియుండవలసియుంది. ఇది మనం క్రైస్తవ ఆరాధన సహవాసంవలన పొందగలం. అన్నిటికి మించి, మన కన్నులు యేసుమీద ఉండ కృషి చేయవలసియుంటుంది. "మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు **ఆత్మ**చేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరింథీయులకు 3:18). ఈ విధంగా అంతరంగ పురుషుడు దినదినము నూతనపరచబడుతూ ఉంటాడు (2 కొరింథీయులకు 4:16). మనం బహిరంగంగా (దేహమందు) అంతరంగం (మనస్సు) లోను మనం రూపాంతరం పొందుతుంటాం.

(2) ఎందుకు? మన మనస్సులు ఎందుకు నూతనం కావాలి? వచనం 2 చివరిలో, పౌలు ఒక కారణమిచ్చాడు (లేక పలు కారణాలిచ్చాడు): "ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు"[29] (రోమా 12:2డి). "ఉత్తమము" (*agathos*), అనుకూలమును (*euarestos*); సంపూర్ణమునైయున్న (*teleios*) ఇవన్నీ దేవుని చిత్తానికి తగిన వర్ణనలే. మన ఆలోచనను సవాలు చేసే మన మూల వాక్యంలోని పదం "పరీక్షించి" అనేది (*dokimazo*).

*Dokimazo* లోహాలను పరీక్షించడానికి ఉపయోగించబడుతుంది. దానికి "పరీక్షించు" "to prove"[30] లేక "అంగీకారముపొందు" అని కూడా అర్థం వస్తుంది. (విజయవంతమైన పరీక్షకు ఫలితంగా). NIV తర్జుమాలో భావాలన్నీ చేర్చబడ్డాయి: "దేవుని చిత్తమేదో పరీక్షించి అప్పుడు నీవు అంగీకారం పొందుతావు" (నొక్కి చెప్పింది నాది). ఇంతకు ప్రశ్న ఏమంటే, వచనం 2లో *dokimazo*ను ఉపయోగించడంలో పౌలు యొక్క ప్రాథమిక ఉద్దేశమేమైయుంటుంది?

ఏ పరిస్థితిలోనైనా దేవుని చిత్తం ఏమైయుంటుందో మనం తెలిసికోగలుగుతామని పౌలు మనస్సులో ఉన్నట్టు అనేకమంది రచయితలు అభిప్రాయపడ్డారు. "దేవుని ఉత్తమమును అంగీకారమును సంపూర్ణమునైయున్న చిత్తమేదో నీవు కనుగొనవచ్చునని" Mc-

Cord అన్నాడు. "దేవుని చిత్తాన్ని కనుగొనడానికిని, ఏది ఉత్తమమైనదో, దేవుడు ఏమి కోరుతున్నాడో, చేయవలసిన సంపూర్ణమైనదేదో తెలిసికొనడానికిని యిది మాత్రమే మార్గమైయుంది" అని JB అంది. ఇవ్వబడిన పరిస్థితిలో దేవుడు ఏమి కోరుతున్నాడో తీర్మానించుకొనడానికి ఆత్మ సంబంధమైన వివేచన కలిగియుండుటకు సహాయపడుటకును మరియు మనస్సు నూతనమవ్వడానికిని దేవుని వాక్య జ్ఞానము మనకు ప్రసాదించడానికిని ఆత్మ సంబంధమైన వ్యాయామం సూచించబడింది.

ఇతర రచయితలు "పరీక్షించుట" లేక "రుజువుపరచుట" అనేదానిమీద ఎక్కువ ప్రాముఖ్యత ఉంచుతారు. "నీ సొంత జీవితంలో, దేవుని చిత్తము ఉత్తమమును, బహు ఆనంద దాయకమును పరిపూర్ణమునైయున్నట్టు నీవు రుజువు చేయవచ్చునని" William Barclay అన్నాడు. అది నీకు నీవే రుజువు చేసికొంటావు; "అవును, దేవుని చిత్తము ఉత్తమమైనదని నేను నమ్మిక కలిగియున్నానని" నీవు చెప్పగలవు. తరువాత, దేవుని చిత్తాన్ని నీ జీవితంలో నీవు ప్రదర్శిస్తుండగా, అది నిజముగా ఉత్తమమైనదని నీవు యితరులకు కూడా రుజువు చేస్తావు.

## ముగింపు

నీవు రూపాంతరం పొందిన జీవితాన్ని జీవిస్తున్నావా? రూపాంతరము మార్పుకు సంబంధించినది, మరియు మార్పు అనేది అంత సులభమైనదేమీ కాదు. జీవితాంతము వరకు ఉండే ప్రవర్తన యొక్క లోతు, లోతైన బండి చక్రపు గాడులలో అది కష్టమై యుంటుంది – అయితే దేవుని సహాయంతో మనం మారగలం. ఆయన మీద ఆనుకొని పౌలు సవాలును మనం ఎదుర్కోగలం:

> ... పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొను చున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసి కొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి.

పశ్చాత్తాపపడిన విశ్వాసివిగా బాప్తిస్మము పొంది, "నూతన జీవము పొందిన జీవితంలో నడుస్తుండగా" ఈ రూపాంతరం ఆరంభమౌతుంది (రోమా 6:4; నొక్కి చెప్పింది నాది). తరువాత అది "శరీర సంబంధమైనవాటినుండి" "ఆత్మ సంబంధమైనవాటి మీదికి" మనస్సు మరల్చుటయందు కొనసాగింపబడుతోంది (8:5). మనం ముగించేటప్పుడు ఒక ప్రశ్న అడుగుతాను: "క్రీస్తు నీ జీవితంలో వ్యత్యాసాన్ని చేశాడా?"[31] లేనట్టయితే, నేడే విషయాలను చక్కపరచుకోమని నిన్ను బతిమాలుతున్నాను.

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

"క్రైస్తవ జీవితానికి పునాది" అని రోమా 12:1, 2పై తన కామెంట్సుకు రిచర్డ్ రోజర్స్ పేరు పెట్టాడు. "చివరి భాగంలో పౌలు చెప్పబోయే ప్రతిదానికి ఈ రెండు వచనాలే పునాదిగా రూపొందుతాయని అతడన్నాడు."[32]

మన మూల వాక్యానికి వచనం 3 చేర్చి Prentice Meador "మార్పుకు నాల్గు మెట్లను" పేర్కొన్నాడు: (1) సమర్పణ (1 వచనం), (2) వ్యత్యాసము (2ఎ వచనం), (3) రూపాంతరము (2బి వచనం), మరియు (4) విలువ కట్టుట (3 వచనం).[33]

ఈ మూల వాక్యాన్ని ఉపదేశించడానికి మరొక చర్చనీయాంశమేమంటే, "బ్యాలెన్స్ యొక్క అవసరత" మూల వాక్యం యొక్క ప్రతి ప్రయోగానికి జనులు అమితమైన కొనలకు వెళ్లతారు.

మన మూల వాక్యంలోని భాగాలను మూల వాక్యపు లేదా అంశపు పాఠాలుగా ఉపయోగింపవచ్చు. ఉదాహరణకు, మన శరీరములను ఆత్మ సంబంధమైన బలిగా సమర్పించడాన్ని గూర్చి ఆలోచించు. లేవీయకాండము 4; 5 అధ్యాయాల్లో పాపానికి, దోషానికి పాత నిబంధన పరిహారార్థ బలిని కోరింది. సిలువపై యేసు బలి ముందటి బలులను తొలిగించింది. దీనికి తోడు, లేవీయకాండము 1–3లో ఉన్న దహనబలి, నైవేద్యాన్ని సమాధానబలి వగైరాలను కూడ తీసివేసింది. మనకున్నదంతా, మనం చేసేదంతా, మనమేమైయున్నామో అదంతా క్రొత్త నిబంధన సమానత్వం చేసింది.

వేరొక విధానం రోమా 12ను మత్తయి 5–7తో పోల్చడం. William Barclay యిలా అన్నాడు, "రోమా 12వ అధ్యాయం ఎంత గొప్ప నీతిశాస్త్ర ప్రతిపాదనయై ఉందంటే, అది ఎల్లవేళలా కొండమీద ప్రసంగం ప్రక్కనే ఉంచవచ్చు."[34] నీ ప్రసంగాన్ని "యేసు, పౌలు, నీవు" అని పిలువవచ్చు.

---

సూచనలు

[1]John R. W. Stott, *The Message of Romans, God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 317. [2]Warren W. Wiersbe, *The Bible Exposition Commentary,* vol. 2 (Wheaton, Ill.: Victor Books, 1989), 553. [3]R. C. Bell, *Studies in Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1957), 133. [4]J. D. Thomas, Class Notes, *Romans,* Abilene Christian College (1955). [5]W. E. Vine, Merrill F. Unger, and William White Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 62. [6]Dale Hartman, sermon preached at Eastside church of Christ, Midwest City, Oklahoma, c. 2004. [7]కొన్ని తర్జుమాలలో "mercy" (ఏకవచనం) అని ఉంది, కాని ఈ పదం గ్రీకులో బహువచనమైయుంది. [8]"Mercies" (*eleos* నుండి) అనేదానికి యిది మామూలు పదం కాదు. "Compassion" అనేదానికది గ్రీకు పదం. "దయ" "కనికరములు" అనేవి కొన్నిసార్లు పర్యాయ పదాలుగా వాడబడతాయి (రోమా 9:15 చూడు). [9]Marvin R. Vincent, *Word Studies in the New Testament,* vol. 3, *The Epistles of Paul* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co.,), 153. [10]"Living" అనే పదం క్రైస్తవులు ఆత్మ సంబంధంగా సజీవులైయున్నదాన్ని సూచిస్తున్నట్టు కొందరు రచయితలు భావించారు. బాప్తిస్మమందు "నూతన జీవం పొంది" నడుచు కొనడానికి మనం లేపబడ్డాం (రోమా 6:4).

[11]F. F. Bruce, *The Letter of Paul to the Romans,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 212. [12]Thomas. [13]William Barclay, *The Letter to the Romans,* rev. ed., the Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 156. [14]నీవు ఈ పాఠాన్ని తరగతిలో ఉపయోగించదలచుకుంటే నీవు ఆ పాఠాన్ని నిలిపి ప్రశ్నను గురించి చర్చించు. ఒక్కొక్కరిగా భౌతిక దేహాన్ని (చేతులు, కాళ్ళు, అవయవాలు) "ఈ భౌతిక దేహం సభ్యుడు దేవుని సేవకు ఎలా ఉపయోగపడతాడని" అడుగు. [15]Stott, 322. [16]Vine, 509. [17]Barclay, 156-57. [18]"*Latreia"* అనేది "ఆరాధనకు" ప్రాథమిక క్రొత్త నిబంధన పదం కాదు. అయితే ఆరాధన దీనినుండి తీసివేయబడింది కాదు. [19]Quoted in Bruce Barton, David Veerman, and Neil Wilson, *Romans,* Life Application Bible Commentary (Wheaton, Ill.: Tyndale House Publishers, 1992), 232. [20]రోమా 12:2లో పౌలు "form" అన్నదానికి రెండు వేర్వేరు పదాలను ఉపయోగించాడు: *schema* in "comformed" and *morphe* in "transformed."

[21]ఈ వాక్య భాగాన్ని మీరు నివసించే సంఘానికి అన్వయించండి. [22]Halford E. Luccock, *Preaching Values in the Epistles of Paul,* vol. 1, *Romans and First Corinthians* (New York: Harper & Brothers, 1959), 77. [23]Metamorphoo నుండి "రూపాంతరము పొందెను" అని తర్జుమా చేయబడింది మత్తయి 17:2; మార్కు 9:2. క్రీస్తు రూపం అద్భుతంగా మారిపోయింది ఆయన దేవత్వం శరీరంలో గుండా ప్రకాశించింది. [24]మీ ప్రేక్షకులకు పరిచయం ఉన్న వివరణను ఇవ్వండి – ఉదాహరణకు టాడ్‌పోల్ కప్పగా మారడం, లేక ఆలాంటిదే మరొక ప్రకృతి సహజమైన మార్పును చూపండి. [25]మీ సభ్యులకు పరిచయమున్న వివరణను ఇవ్వండి వారికి ఇబ్బందిని మాత్రం కలిగించవద్దు. [26]ఆంగ్లంలో active and passive అనే రెండు voices మాత్రమే ఉన్నాయి. గ్రీకులో మూడవ middle voice కూడ ఉంది (అది మనకు మనం చేసికొనేది). [27]University of Illinois, Urbana-Champaign, "Atmospheric Pressure" (http: / / www.2010.atmos.uiuc. edu/(GH)/guides/mtr/fw/prs/def.rxml; Internet; accessed 10 May 2006). [28]మన మనస్సులు "నూతనపరచుకొనడం" అనేది 11 అధ్యాయాల తరువాత పౌలు ఉపదేశం యిప్పుడే చదువుతున్నాం. [29]"Is" అనే పదం మూల పాఠంలో కనిపించదు. దానిని అనువాదకులు చేర్చారు. [30]Vine, 53.

[31]Jimmy Allen, *Survey of Romans,* 4th ed., rev. (Searcy, Ark.: By the author, 1973), 103. [32]Richard Rogers, *Paid in Full: A Commentary on Romans* (Lubbock, Tex.: Sunset Institute Press, 2002), 167. [33]Prentice Meador, Sermon preached at Preston Road church of Christ, Dallas, Texas, n.d., cassette. [34]Barclay, 6.

## వెలుపటి భిన్నంగా లోపలి "రూపాలు"?

"రూపానికి" పౌలు రెండు వ్యత్యాసమైన పదాలను ఉపయోగించాడు. "అనుగుణంగా" మరియు "రూపాంతరం." అనుగుణం అనేది *schema* అనే పదం, మానక మార్పు చెందే వెలుపటి రూపానికి సంబంధించింది. "రూపాంతరమనేది" *morphe* అనే పదం, ఒక వస్తువు యొక్క తప్పనిసరియైన స్వభావం. వాటి తారతమ్యాన్ని చూపడానికి పౌలు కావాలని ఆ పదాలను వాడినట్టు కొందరు తలంచారు. ఈ దృష్టికి సంబంధించిన ఉదాహరణను TEV యిస్తుంది: "బాహ్యంగా లోకపు ప్రమాణాలకు అనుగుణంగా నడవద్దు, దేవుడు అంతరంగంలో నిన్ను మార్పు చేయనిమ్ము ..." (నొక్కి చెప్పింది నాది). పౌలు వాటిని పర్యాయ పదాలుగా ఉపయోగించాడని, నేటి రచయితలు అంటున్నట్టు వేర్వేరు పద ప్రయోగాలేయని యితర రచయితలు నమ్ముతారు. రెండు రకాల వ్యాఖ్యానాలు సాధ్యమే. ఏది ఉపయోగించినా పౌలు యొక్క ప్రాథమిక సందేశం ఒకటిగానే నిలిచి ఉంటుంది.

# 53

# నీవు ప్రత్యేకమైనవాడవు!

## (12:3-8)

నీ యెదుట టేబుల్ మీద ఒక కాగితపు ముక్క పడియుందనుకో. "ఒక వ్యక్తిని ప్రత్యేకమైనవానిగా దిద్దే విషయాల ప్రక్కనే రైటు గీత పెట్టు" అనే మాటలు దాని పై భాగంలో ఉన్నాయి. దాని క్రింద ఉదహరించిన జాబితా ఉంది[1] అందులో యివి చేర్చబడ్డాయి:

సౌందర్యవతి లేక అందగాడివైయుండుట.
ఎక్కువ డబ్బు మరియు ఎక్కువైన సొత్తు కలిగియుండుట.
ప్రజాభిమానం కలిగి; ప్రతివానికి యిష్టుడైయుండుట.
ఇతరులపై అధికారమును పెత్తనమును కలిగియుండుట.
వినోదం కలిగించే లేక రాజకీయ వ్యక్తిత్వం కలిగియుండుట.
నీ పటం వార్తాపత్రికల్లోను వార, మాస పత్రికల్లో రావడం.

ఆ జాబితా అంతటి క్రింద కడాపటిగా:

దేవుని బిడ్డవైయుండుట.

వీటిలో దేని ప్రక్కన నీ అంగీకారపు ముద్ర వేస్తావు? లోక సంబంధమైన మనస్సు గల వ్యక్తికి ఏది "ప్రత్యేకంగా" కన్పిస్తుందో ఆలోచించు. మనం శ్రద్ధ చూపకుంటే, లోకరీతిని విలువలను గ్రహించకుండానే అంగీకరించే ప్రమాదం ఉందని మనం గత పాఠంలో గుర్తించాం. "నూతనపరచబడిన" మనస్సు కలిగియుండాలని (రోమా 12:2), ప్రతిదానిని మనం నూతనంగా చూడవలసియుందని పౌలు మనలను పోటీకి పిలిచాడు.

నీవు దేవుని బిడ్డవైతే, నీవు ప్రత్యేకమైన వ్యక్తివని ఈ మూల వాక్యంలో పౌలు చెప్పాడు. నీవు ప్రత్యేకమైన వ్యక్తివని రుజువు చేయడానికి పౌలు అనేక రుజువులను చూపియుండేవాడే. దేవుడు నిన్ను నిర్మించాడని నీవు ప్రత్యేకమైనవాడవనే వాస్తవాన్ని అతడు చెప్పియుండేవాడే. "సృష్టికి నకిలీలు లేవు."[2] నీకు ఎంత ప్రత్యేకత ఉందంటే, క్రీస్తు నీ కొరకు చనిపోయారు. దేవుని కుమారుడు "నన్ను ప్రేమించి నా కొరకు తన్నుతాను అర్పించుకున్నారని" నీవు పౌలుతో కలిసి చెప్పవచ్చు (గలతీయులకు 2:20; నొక్కి చెప్పింది నాది). ఏదియెలాగున్నా, పౌలు మాటల్లోనుండి మనం గ్రహించే

రుజువేమంటే, నీవు ప్రత్యేకమైనవాడవనడానికి సంఘం పనికి అవసరమైన ప్రత్యేక వరాన్ని దేవుడు నీకు అనుగ్రహించాడు.

## దేవుడు నీకొక ప్రత్యేకమైన వరమనుగ్రహించాడు ... (12:3-6బి)

**ఉపదేశం (3 వచనం)**

పౌలు యిలా ఆరంభించాడు, "తన్నుతాను ఎంచుకొన తగినదానికంటె ఎక్కువగా ఎంచుకొనక, దేవుడు ఒక్కొక్కనికి విభజించి యిచ్చిన విశ్వాస పరిమాణప్రకారము, తాను స్వస్థబుద్ధిగలవాడగుటకై తగినరీతిగా తన్ను ఎంచుకొనవలెనని, నాకు అనుగ్రహింపబడిన కృపనుబట్టి మీలోనున్న ప్రతివానితోను చెప్పుచున్నాను" (3 వచనం). "నాకు అనుగ్రహింపబడిన కృపనుబట్టి" అనే ప్రయోగం పౌలు యొక్క అపొస్తలత్వాన్ని సూచిస్తుంది. అది అతనిమీద కృపవలన అనుగ్రహింపబడింది (రోమా 1:5; 15:15, 16; గలతీయులకు 2:7-9 చూడు). వ్యక్తిగత యోగ్యతనుబట్టి తాను అపొస్తలుడు కాడని, దేవుని మహా కృపనుబట్టియే అది తనకు లభించిందని పౌలు గ్రహించాడు.

(1) ఎక్కువగా ఎంచుకొనక. కృపవలననే అపొస్తలుడైనందున, "తన్నుతాను ఎంచుకొన తగినదానికంటె ఎక్కువగా ఎంచుకొనక; స్వస్థబుద్ధిగలవారైయుండాలని" పౌలు తన పాఠకులను కోరాడు (రోమా 12:3బి). పౌలు ఆంగ్లంలో అంత స్పష్టంగా లేని మాటలతో గారడీ చేసాడు. ఇప్పుడు కోట్ చేయబడిన భాగంలో "ఎంచుకొనుట" (*phroneo*) అనే పద రూపాలు నాలుగుసార్లు కన్పిస్తాయి. *Phroneo* అనేది రెండుసార్లు ఉపయోగింపబడింది. దానికి తోడు, *huperphroneo phroneo* అనేదానికి ముందు *huper* ["పైగా" లేక "ఎత్తుగా"], అంటే "తన్నుగూర్చి గొప్పగా తలంచుట" అని అర్థం. చివరిగా, అతడు *sophroneo* (*phroneo*కు ముందు *sozo* ["రక్షించుటకు"]) "స్వస్థ బుద్ధి కలిగియుండుట" అనే అర్థం యిస్తుంది, దానివలన "ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుంది."[3] ఈ మూల వాక్య భాగాన్ని యిలా తర్జుమా చేయవచ్చు, "[నిన్నుగూర్చి నీవు] గొప్ప తలంపులు తలంచకు. అయితే [నిన్నుగూర్చి నీవు] ఆరోగ్యకరమైన తలంపులు తలంచు." "నీ సొంత ప్రాముఖ్యతను గూర్చి అతిశయ భావాలు కలిగియుండవద్దని నేను నీకు చెప్పుతున్నాను. దానికి బదులు, ఆరోగ్యకరమైన అంచనా నిన్నుగూర్చి నీవు పెంపొందించుకో" అని CJB అంటుంది.

దేవుడు మనలను విజయంతో దీవించితే, గర్వంతో నింపబడే అపాయాన్ని మనం ఎదుర్కోవచ్చు. మన వరాలను ఉపయోగించడంలో యితరులకంటే "ఎక్కువ శ్రద్ధ గలవారమై" ఉన్నామనే గర్వంతో సహా మనం నింపబడవచ్చు. మనలను గూర్చి మనం అధికంగా ఆలోచించకుండునట్లు దైవికమైన ఏ జాగ్రత్త మనకు సహాయం చేయగలదు? "విశ్వాస పరిమాణాన్ని దేవుడే ఒకొక్కనికి విభజించి యిచ్చాడని" మనం గ్రహించవలసియుంది (3సి వచనం; నొక్కి చెప్పింది నాది). దేవుడు మహిమకు పాత్రుడు; మనం కాదు.

"విశ్వాస పరిమాణమనేది" కొంతవరకు తేటగా లేని ప్రయోగమైయుంది. "పరిమాణమనేది" *metron* నుండి వచ్చింది. "కొలతవేసే పరికరాన్ని" లేక "కొలతవేసిన ఒక భాగాన్ని సూచించవచ్చు."[4] మొదటి నిర్వచనం పౌలు మనస్సులో ఉన్నట్టు, ప్రమాణం అని కొందరు తలంచుతారు. దేవుడు మనకు విశ్వాస ప్రమాణాన్ని ప్రసాదించాడు, దానివలన మనలను మనమే కొలుచుకోవచ్చు. ఆ కొలపరిమాణాన్ని ఉపయోగించి, మనలను మనమే కొలిచి చూచుకొన్నప్పుడు, మనం ఎంత లోటుపడియున్నామో చూచు కుంటాం. అప్పుడు గర్వం మాయమైపోతుంది. అయినా, కొందరు రెండవ నిర్వచనాన్ని నమ్ముతారు – ఒక భాగం – ఆ సందర్భంలో యిది బాగా పెనవేసుకుంటుంది. దేవుడు ప్రతి క్రైస్తవునికి దీవెనలలో వాని వంతును వానికనుగ్రహించాడు. ఇది వచనం 6తో సరిపోతుంది: "మన కనుగ్రహింపబడిన కృపచొప్పున వెవ్వేరు కృపావరములు కలిగినవారమైయున్నాము."

అప్పుడు "విశ్వాసము" (*pistis*) అనే పదముంది. ఈ పదం పత్రికలో ప్రాధాన్యత కలిగియుంది, అయితే యిక్కడ అది కొంచెం వ్యత్యాసంగా ఉపయోగించబడింది. ఈ లేఖన భాగంలోని "విశ్వాసమనేది" సువార్తకు, మన వ్యక్తిగత విధేయతకు సంబంధించింది కాదు (రోమా 1:16; 10:17) దేవుని కృపను యిది వ్యక్తపరచుటయై ఉంది. దేవుని వరములు విశ్వాసంవలన ఉపయోగింపబడియున్నందున, వచనం 3లో సూచింపబడిన "విశ్వాసము" (వాక్యంతో చేర్చి) మనకు అవసరమైన దేనినైనా దేవుడు సరఫరా చేయునట్లు మనం తలంచవచ్చు. ఆలాగే ఆత్మ సంబంధమైన వరముల జాబితాను పేతురు యిచ్చినప్పుడు, అతడిలా అన్నాడు, "ఒకడు ఉపచారము చేసినయెడల దేవుడనుగ్రహించు సామర్థ్యమునొంది చేయవలెను" (1 పేతురు 4:11బి; నొక్కి చెప్పింది నాది).

"విశ్వాస పరిమాణమనే" ప్రయోగం యొక్క అర్థంతో వణకిపోవద్దు. దానివలన పౌలు అర్థం ఏమైయున్నా, దేవుడు దీనిని మనకు విభజించి యిస్తాడు. గనుక వ్యక్తిగత అతిశయానికి తావులేదు. పౌలు చేసినంతగా మరెవ్వరూ రాజ్యంకొరకు అంతగా సాధించి యుండకపోవచ్చు; అయితే అతడిలా అన్నాడు, "అయినను నేనేమైయున్నానో అది దేవుని కృపవలననే అయియున్నాను" (1 కొరింథీయులకు 15:10ఎ).

(2) అంత హీనంగా కూడ కాదు. క్రైస్తవులు తమ్మును గూర్చి అతిగా తలంచ కూడదనేది వచనం 3లో పౌలు యొక్క ప్రత్యేకమైన అక్కరయైయుంది. "స్వస్థ బుద్ధిగల వాడగుటకై తగినరీతిగా [తన్ను] ఎంచుకొనవలెననే" హెచ్చరికలో, దానికి వ్యతిరేకమైన కడకు కూడా వెళ్లవద్దనే భావమైయుంది. క్రైస్తవుడు తన్నుగూర్చి తాను హీనంగా కూడ తలంచకూడదు. ఇతరులకంటె తాను శ్రేష్ఠుడని ఎవడును తలంచకూడదు. అయితే, క్రైస్తవుడు పనికిమాలినవాడైయున్నట్టు తన్నుగూర్చి తలంచకూడదు. "దేవుడు ప్రతివానికి విశ్వాస పరిమాణాన్ని వేరుగా యిచ్చినట్టు" పౌలు చెప్పాడు. దేవుడు ఎవనినే విడిచి పెట్టలేదు. తన పిల్లలందరికి ఆయన వరములనిచ్చియున్నాడు. కానరాని అతిశయం విషయమై మనం జాగ్రత్తగా ఉండాలి. ఆగే సమయంలో మనకు అనుగ్రహింపబడిన వరములను ఉపయోగించుటకు ఆటంకం కలిగించే తప్పుడు అణకువను కూడ మనం

తొలిగించవలసియుంటుంది.

**ఉదాహరణ (4-6బి వచనాలు)**

పౌలు తన ఉపదేశాన్ని తాను తరచుగా ఉపయోగించే ఉదాహరణతో వెంటాడుతున్నాడు. 4, 5 వచనాలలో సంఘాన్ని అతడు మానవ దేహంతో పోల్చాడు:

> ఒక్క [భౌతిక] శరీరములో మనకు అనేక అవయవములుండినను, ఈ అవయవములన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో,[5] ఆలాగే అనేకులమైన మనము [క్రైస్తవులం] క్రీస్తులో [ఆత్మ సంబంధమైన] ఒక్క శరీరము [సంఘము; ఎఫెసీయులకు 1:22]గా ఉండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములమైయున్నాము (1 కొరింథీయులకు 12:27; కొలొస్సయులకు 1:18, 24 చూడు).

ఈ పోలికనుండి అనేక వర్తింపులు చేయవచ్చు (1 కొరింథీయులకు 12:12-27[6] చూడు). ఉదాహరణకు, మనము మన వరములను శరీరము/సంఘము సందర్భంలో అభ్యాసం చేస్తామని పౌలు తేటపరచాడు. ఇది చేయడానికి గాను, మనము స్థానిక సంఘంలో చురుకుగా ఉండాలి. మన మూల వాక్యంలో చెప్పబడిన లేక గుప్తం చేయబడిన యితరమైన పలు వర్తింపులను పేర్కొంటాను. నేను వీటిని ప్రస్తావించుచుండగా, మానవ శరీరాన్ని నీ మనస్సులో చిత్రించుకో.[7]

(1) శరీరములో ప్రతి అవయవానికి ఒకటో లేక ఎక్కువో వరాలు (పనులు) ఉంటాయి; ఏదియు విడిచిపెట్టబడదు. వచనం 6 యిలా అంటుంది, "మన కనుగ్రహింపబడిన కృపచొప్పున వెవ్వేరు కృపావరములు కలిగినవారమై యున్నాము." అయితే ఈ వరములేమిటి? దేవుడు మనకు అనుగ్రహించిన తలాంతులు మరియు సామర్థ్యాలను ఎక్కువమంది తలంచుతారు. పౌలు మనస్సులో ప్రాథమికంగా యిది ఉండియుండవచ్చు. బహుశ, దేవుడు మనకు అనుగ్రహించిన తలాంతులు, సామర్థ్యాలు ప్లస్ వాటిని ఉపయోగించుటకు అవసరమైనవన్ని ఆయన కృపావరాలే అని మనం తలంచాలి.

(2) వరములు/పనులు అన్నీ ఒక్కటే కాదు. వచనం 6 వైపు మరోసారి చూడు: "మనకనుగ్రహింపబడిన కృపచొప్పున వెవ్వేరు కృపావరములు కలిగినవారమై యున్నాము" (నొక్కి చెప్పింది నాది). కంటి పనికి, చెవి పనికి వ్యత్యాసముంది; చెయ్యి పని, పాదము యొక్క పని ఒక్కటే కాదు.

సంఘంలోని "వివిధమైన" విశ్వాసాలను మరియు "యితరుల భావాలపట్ల" సహనం కలిగియుండడాన్ని గూర్చి మాట్లాడడానికి మన మూల వాక్యంలోని ఈ భాగాన్ని అనేకమంది రచయితలు ఉపయోగించారు. పౌలు వివిధములైన విశ్వాసాలను గూర్చి మాట్లాడలేదు, గాని వివిధములైను పనులను గూర్చి మాత్రమే మాట్లాడుతున్నాడు. అధ్యాయాలు 14, 15ల్లో ఒకరి అభిప్రాయాలను ఒకరు సహించాలని అతడు నొక్కి చెప్పాడే గాని, విశ్వాసానికి సంబంధించిన విషయమేమి? దోషాన్ని సంహించమనేదాన్ని పౌలు నమ్మాడా? 16:17లో అతడిలా అంటున్నాడు, "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగజేయువారిని కనిపెట్టి

యుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి."

మన చర్చకు తిరిగి వద్దాం: సంఘంలోని సభ్యులకందరికి ఒక్కటే వరము/పని లేదు. కన్నును వాసన చూడమని గాని, చెవిని చూడమని గాని ఎదురు చూడం. మనలో ఎక్కువమంది కాళ్లతో వస్తువులు తీసికొనడం గాని, చేతులతో నడవడం గాని చేయం. అయినా, సంఘంలో ఉన్నవారినందరిని ఒకే పని చేయాలని మనం కొన్నిసార్లు ఎదురు చూస్తూ ఉంటాం. "చెవియైన" సభ్యుని సరిగా "చూడనందుకు" కొన్నిసార్లు మనం శిక్షిస్తాం. వివిధ కార్యములను మనం గుర్తించవలసియుంటుంది.

(3) ప్రతి వరము/కార్యము ప్రాముఖ్యమైనది. మానవ దేహంలోని కొన్ని భాగాలు తక్కినవాటికంటె ఎక్కువ శ్రద్ధను పొందుతాయి, కాని దేహ క్షేమం కొరకు, సౌఖ్యం కొరకు అన్నియు అవసరమైనవే. తన భౌతిక దేహంనుండి ఒక అవయవము తుంచివేయబడిన వ్యక్తిని నీవు ఎరుగుదువా? తన దేహంలో కొన్ని అవయవాలు పని చేయక రోగ శయ్యమీద పరుండిన మనిషిని నీవు ఎరుగుదువా? అప్పుడు నా భావమేమో నీవు గ్రహించుకోగలవు.

మా కుటుంబం ఆస్ట్రేలియాలో నివసిస్తూ పని చేస్తున్నప్పుడు, నా సహోదరుడు Coy ఒక సంవత్సరంపాటు USలో గడిపాడు. ఆ సంవత్సరం Macquarie School of Preachingను నేను డైరెక్ట్ చేస్తూ, Coy చెప్పిన ప్రీచింగ్ క్లాసు నేను ఉపదేశించాను. Visual aids ఉపయోగించి ప్రసంగం చేయడమనే ఎసైన్‌మెంట్ (పనిని) నేను విద్యార్థులకిచ్చాను. ఎక్కువమంది విద్యార్థులు చార్టులు, మరియు యితర టీచింగ్ ఎయిడ్స్ తయారు చేశారు. Don Males కనబడే ఏ ఎయిడ్ లేకుండ క్లాసుకు వచ్చాడు. రోమా 12 మరియు 1 కొరింథీయులకు 12లను మూల వాక్యంగా ఎంచుకొని మానవ దేహము యొక్క అవయవాలను గూర్చి మాట్లాడాడు. "ప్రతి అవయవము ముఖ్యమైనదే" అని అతడన్నాడు. అప్పుడు తన చెయ్యి పైకెత్తి, అతడిలా అన్నాడు, "ఉదాహరణకు, నా చేతిలో ఉన్న ప్రతి వ్రేలు ముఖ్యమైనదే. బొటనవ్రేలు, మధ్యవ్రేలు ముఖ్యమైనవే. వస్తువులను పట్టి తీసికొనడానికి అవి సహాయం చేస్తాయి. మూడవ వ్రేలిపై ఉంగరం పెట్టుకుంటాం." తరువాత అతడు తన చిటికెన వ్రేలును పైకెత్తాడు. "ఈ చిటికెన వ్రేలు సంగతి ఏమిటి? ఇది దేనికి పనికి వస్తుంది?" అని అతడు కొంతసేపు ఆగి, "నీ చెవి ఎప్పుడైనా దురదగా ఉండిందా?" అని అడిగి తన చిటికెన వ్రేలును చెవిలో పెట్టి త్రిప్పి చూపాడు. ఒక నిట్టూర్పు విడిచినట్టు విడిచి, "అవును, ప్రతి అవయవము ముఖ్యమైనదే!" అని అన్నాడు.

"ఒకరికొకరము ప్రత్యేకముగా అవయవములమైయున్నాము" అంటూ పౌలు వచనం 5ను ముగిస్తున్నాడు. "ఒకరికొకరము భాగములమైయున్నాము – [ఒకరి మీద ఒకరం పరస్పరం ఆధారపడియున్నాము]" అని AB అంది. నా దేహంలోని ఒక అవయవానికి నా దేహంలోని అన్ని అవయవాలు ఎలా అవసరమైయున్నాయో, ఆలాగే ఆత్మ సంబంధమైన దేహానికి (సంఘానికి) ఆ దేహంలోని తక్కిన అవయవములన్నియు అవసరమైయున్నాయి. ముఖ్యం కాని అవయవములు లేవు, ముఖ్యం కాని వరములు లేవు.

(4) మనకు ప్రసాదింపబడిన ప్రతి వరము ఉపయోగించవలసి ఉంది. వచనం

6 మరోసారి చదువు: "కృపావరములు కలిగినవారమైయున్నాము గనుక ... మనలో ప్రతి ఒక్కరము పని కలిగియుందము." దీన్ని గూర్చి తరువాత ఎక్కువగా మాట్లాడుదాం.

## ... గనుక దాని కనుగొను ... (12:6సి-8)

"దేవుడు నాకు వరము అనుగ్రహించియున్నట్టయితే, అది ఏమైయుంటుంది? నా వరమేదో నేనెలా కనుగొనగలను?" అని యిప్పటికే నీవు తలంచుతుండవచ్చు.

**ఒక జాబితా**

వచనాలు 6నుండి 8వరకు, ఏడు వరముల జాబితాను పౌలు యిచ్చాడు: ప్రవచించుట, పరిచర్య, ఉపదేశించుట, హెచ్చరించుట, పంచిపెట్టుట, పై విచారణ చేయుట, కరుణించుట. బైబిలులోని అనేక జాబితాలవలె, యిది కూడా అన్ని వివరములు కలిగినది కాదు. "అసాధారణమైన" (అద్భుతమైన) "సాధారణమైన" (అద్భుతములు కాని) వరములు 1 కొరింథీయులకు 12:8–10, 28; ఎఫెసీయులకు 4:11; మరియు 1 పేతురు 4:11వంటి యితర జాబితాలున్నాయి. రోమా 12లో కన్పించే పదాల్లో కొన్ని ("పరిచర్య" వంటివి) 6నుండి 8 వచనాల్లో దేవుడు మనకు అనుగ్రహించినలాంటివి సాధారణంగా మనకు కనిపిస్తాయి.

12:6–8ల్లోని ఏడు వరాలను మనం చర్చించక ముందు, ఈ వరముల యొక్క స్వభావాన్ని మనం ఆలోచించవలసియుంటుంది. మొదటిది ("ప్రవచించడం") "అసాధారణమైన" (అద్భుతమైన) వరం. తక్కినవి "సాధారణమైన" (అద్భుతములు కాని) రకానికి చెందినవి కావచ్చు.[8] సమస్తమును దేవునివలననైనవైయున్నందున, మొదటి శతాబ్దపు రచయితలు ఈ రెండింటి మధ్య సాధారణంగా తేటైన విభజన చేయనట్లున్నారు. సహజమైన తలాంతులు గలవారికి ఆ విషయంలో దేవుడు అద్భుత శక్తులను యిచ్చియుండ వచ్చునని R. C. Bell అభిప్రాయపడ్డాడు. సంపూర్ణంగా వాక్యం వచ్చినప్పుడు, అద్భుత శక్తులు లేకుండ సంఘం యొక్క పనిని యథావిధిగా కొనసాగించారు.[9] మనం అద్భుతాలు జరిగే కాలంలో లేం, అయితే అద్భుతం కాని మన వరములు దేవునినుండి కలిగినవేయని మనం గుర్తించవలసియుంటుంది (యాకోబు 1:17). ఇప్పుడు ఏడు వరములను క్లుప్తంగా చూద్దాం.

(1) ప్రవచించు వరం. "ప్రవక్త" (*prophetes*) అంటే "మరొకనికొరకు మాట్లాడే వాడు" అని అర్థం *phemi* ["చెప్పుట"] అనేదానికి ముందు *pro* ["ఎదుట"]).[10] క్రొత్త నిబంధన (రచనా) కాలంలో, ప్రవక్తలు ప్రేరేపింపబడినవారై దేవుని కొరకు మాట్లాడారు (అపొస్తలుల కార్యములు 11:27; 13:1; 15:32; 1 కొరింథీయులకు 12:28; ఎఫెసీయులకు 2:20; 4:11 చూడు). వారి సందేశాన్ని "ప్రవచనము" (*propheteia*) అని అన్నారు. నేడు మనకు ప్రేరేపించబడిన ప్రవక్తలు లేరు. అయితే వారి సందేశంలో అవసరమైన భాగాన్ని దేవుడు క్రొత్త నిబంధనలో భద్రపరచాడు.

ప్రవచించు వరానికి సంబంధించి నేడు వర్తింపజేసే ఒక అవకాశమేమంటే,

కొందరికి వాక్యాన్ని బహిరంగంగా ప్రసంగించగల శక్తిని దేవుడు ప్రసాదించాడు – అంటే ఒక రకంగా "దేవుని కొరకు మాట్లాడడం." (ప్రతివానికి ఈ సామర్థ్యం లేదు. శరీరమనే ఉదాహరణను మనం ఉపయోగించితే, ప్రతివానిని నోరుగా ఉండేలా దేవుడు చేయలేదు.)

(2) పరిచర్య చేసే వరం. పౌలు యొక్క తరువాత పదం *diakonia* నుండి వచ్చింది, అంటే "సేవ" లేక "పరిచర్య." సంబంధించిన పదాలలో *diakonia* ("పరిచారకుడు" లేక "సేవకుడు") మరియు *diakoneo* ("పరిచర్య చేయడం" లేక "సేవ చేయడం"). సంఘంలోని ప్రత్యేక పరిచర్యలకు కొన్నిసార్లు ఈ పదాలు సూచించబడతాయి, పరిచారకుల పనివంటి దాన్ని (1 తిమోతి 3:10, 13) లేక ప్రసంగీకులు (1 తిమోతి 4:6; 2 తిమోతి 4:5). ఎలాగైనా, ఎక్కువసార్లు, మరొకరికి చేసే ఏ సేవనైనా అవి సూచిస్తాయి (అపొస్తలుల కార్యములు 19:22; రోమా 15:25; 2 తిమోతి 1:18; ఫిలేమోను 13; హెబ్రీయులకు 6:10). 1 కొరింథీయులకు 12:5 యొక్క భాషను అప్పు తెచ్చుకుంటే, "పరిచర్యలు నానావిధములుగా ఉన్నవి" (NIV). (అది ఏదైనా సరే) ఒక విషయం ఎలా చేయాలో అనే నేర్పు కొందరికి ఉంటుంది.

(3) ఉపదేశించు వరం. "ఉపదేశించు" అనేది *didasko* అనే క్రియా రూపం నుండి వచ్చింది – అంటే "ఉపదేశం యిచ్చుట"[11] ఇతరులకు సందేశం అందించ డంలో కొందరు సామర్థ్యం కలిగియుంటారు.

(4) హెచ్చరించు వరము. "హెచ్చరించు" అనేది *parakaleo* నుండి వచ్చింది ఇది భావగర్భితమై ఉంది. ఇది మిశ్రిత పదమైయుంది *para* ("ప్రక్కనే") *kaleo* ("పిలుచు") అనేదానితో మిశ్రితమైయుంది. సహాయముకొరకు[12] "ప్రక్కకు రమ్మని మరొకని పిలుచుట" అనేది భావం. *Parakaleo*ను "హెచ్చరించు," "ప్రోత్సహించు," "ఆలోచన చెప్పు" లేదా "బలపరచు" అని కూడ తర్జుమా చేయవచ్చు. ప్రోత్సహించి, యితరులకు ఉద్దేశం కలిగించే తలాంతు కొందరికి ఉంటుంది.

(5) ఇచ్చు వరము. తరువాత పౌలు "యిచ్చువానిని గూర్చి" మాట్లాడాడు. అతడు యిక్కడ ఉపయోగించిన పదం *metadidomi* (*didomi* ["ఇచ్చుట"] దానికి ముందు *meta* ["తో"]). "పంచుకొను"[13] అని దాని అర్థం. "ఇతరుల అక్కరల నిమిత్తము సమర్పించుట" అని NIV అంది. ఇచ్చుట వరము అంటే వింతగా తోచవచ్చు, కాని అలా చేయుటకు దేవుడు సామర్థ్యం కలిగించాడని జ్ఞాపకముంచుకో. నీవు యివ్వ గలిగావంటే, ముందుగా నీకు డబ్బును లేక సొత్తును యిచ్చాడని దాని అర్థం. ఇవ్వడమనే వరం డబ్బు సంపాదించగల సామర్థ్యాన్ని ముందు ఊహిస్తుంది. కొందరికి డబ్బు సంపాదించే తలాంతు ఉంటుంది, కొందరికి ఉండదు. అతి ముఖ్యమైనవాటిని అలక్ష్యం చేయనంతవరకు, స్వార్థపరమైన విలాసాలకు వాడనంతమట్టుకు డబ్బును సంపాదించ డంలో తప్పేమీలేదు (1 తిమోతి 6:9, 10, 17–19తో పోల్చి చూడు).

(6) నడిపించు వరము. "నడిపించుట" అనడానికి గ్రీకు పదం *proiste-mi,* అంటే, "ఎదుట నిలబడుట" (*histemi* ["నిలుచుట"], దీనికి ముందు *pro* ["ముందు"]). *Proistemi* "నడిపించు," "ఏలు," "మేనేజ్." తమ్మును వెంబడించేలా

జనులను పురికొల్పడానికి కొందరికి సహజమైన తలాంతు ఉంటుంది. "అతడు సహజ సిద్ధమైన నాయకుడు" అనే మాటలు మా ప్రాంతంలో వాడతారు. ప్రాథమికంగా సంఘ నాయకులు పౌలు మనస్సులో ఉండియుండవచ్చు (1 తిమోతి 5:17 చూడు). ఒకని మనం నాయకునిగా చేయడానికి ఏరుకోము; అతనిని తన పదవిలో పెట్టక ముందు గుర్తింపబడిన నాయకుడైయుండాలి. ఏదియెలాగున్నా, నడిపించడం అనే పౌలు ఉద్దేశానికి విశాలమైన వర్తింపు ఉండి ఉండవచ్చు. *Proistemi* తండ్రి తన కుటుంబాన్ని నడిపించడాన్ని వర్ణించడానికి ఉపయోగించబడింది (1 తిమోతి 3:4, 12).

(7) కనికరం చూపే వరం. "కనికరము చూపడానికి" వాడబడిన పదం *eleeo*, "ఒకని పట్ల దయ చూపుటయు," అది తిరిగి కార్యములో వ్యక్తపరచుటయునైయుంది.[14] ఇది బహుముఖమైన వరం: ప్రజలకు సహాయం ఎప్పుడు కావలెనో, సరిగా ఎలాటి సహాయం ఎక్కువ ప్రయోజనంగా ఉంటుందో ఎరిగి ఎక్కువ అలజడి లేకుండ అవసరతలను తీర్చుటయైయుంటుంది. దీనికంటె ఎక్కువ మేలు చేసే వరములు బహు తక్కువగా ఉంటాయి, అయినా యిది తరచుగా అత్యల్పమైన గుర్తింపు పొందుతుంది.

జాబితాన్ని మరోసారి వీక్షించు. కొన్ని వరాలు ప్రత్యేకించి మాటలాడడానికి సంబంధించినవే (ప్రవచించడం, ఉపదేశించడం, హెచ్చరించడం) మిగిలినవి పరిచర్య చేయడానికి సంబంధించినవి (సేవ చేయడం, ఇవ్వడం, నడిపించడం, కనికరం చూపడం). ఈ జాబితాగుండా వెళ్లుతుంటే, విదితంగా వ్యత్యాసమైన వరాలు కలిగియున్న ప్రజల యొక్క బైబిలు ఉదాహరణలను నీవు తలంచవచ్చు – వ్యక్తిగతంగా ఈ సామర్థ్యాలు గల ప్రజలను నీవు ఎరిగియుండవచ్చు.[15] వరాలను గూర్చి నేను చదివేటప్పుడు నా మనస్సుకు వచ్చే కొందరు యిక్కడ ఉన్నారు:

- ప్రవచన వరము – అగబు (అపొస్తలుల కార్యములు 11:28; 21:10, 11).
- ఇచ్చు వరము – యేసును ఆయన అపొస్తలులను ఆదుకొన్న స్త్రీలు (లూకా 8:1–3).
- హెచ్చరించు వరము – బర్నబా, "హెచ్చరిక పుత్రుడు" (అపొస్తలుల కార్యములు 4:36).
- పరిచర్య వరము – తరచుగా పౌలుకు సహాయం చేసిన ఫీబే (రోమా 16:1, 2).
- కనికరము చూపు వరము – దొర్కా, విధవరాండ్ర కొరకు దుస్తులు చేసినది (అపొస్తలుల కార్యములు 9:36, 39).

నాకు తెలిసినంతమట్టుకు, ప్రభువువారికి ఈ వరాలన్నీ ఉన్నాయి. మనకు వాటిలో

ఒకటో లేక కొన్ని మాత్రమే ఉంటాయి (మత్తయి 25:15తో పోల్చి చూడు).

**ఒక సవాలు**

వరాలను మనం పేర్కొంటుండగా, "ఒకవేళ దేవుడు ఈ వరము నాకు ప్రసాదించి యుండవచ్చునని" నీవు అన్నావా? సంఘంలోని ప్రతి సభ్యుడు (సభ్యురాలు) తన తలాంతు ఏదో తీర్మానించుకొని, దాన్ని ఉపయోగించడం కన్న ఎక్కువ ప్రాముఖ్యమైనవి కొన్నే. తాను చేయగలదానిని చేయడంలో ప్రతి ఒక్కరు బిజీగా ఉన్న స్థానిక సంఘాన్ని నీవు ఊహించగలవా? మంచికి ఆ స్థానిక సంఘం ఎంత బలీయంగా ఉంటుందో!

"దేవుడు నాకు ఏ వరము అనుగ్రహించాడో నేనెట్లు తెలిసికొనగలను?" అని యింతలో ఎవరో అడుగుతున్నట్టుంది. పలు రకాలైన సలహాలు యివ్వబడ్డాయి. సాధ్యమయ్యే ఒక విధానాన్ని James Baird అవుట్‌లైన్ చేశాడు:[16]

- నీవు చేయగలవాటిని వ్రాయి, చేయడంలో నేర్పు, చేయనిష్టపడడం.
- స్థానిక సంఘంలో చేయనవసరమైనవి వ్రాయి: ఆరాధనలో, పరిచర్య కార్యాల్లో, కొనసాగే అవసరతలలో, అవసరతలో ఉన్న సాటి సభ్యులకు, వగైరాలు.
- రెండు జాబితాలను పోల్చి చూడు. నీ తలాంతులు, సామర్థ్యాలు ఎక్కడ ఉపయుక్తంగా ఉంటాయో చూడ ప్రయత్నించు. అయినా, ప్రస్తుతం నీవు ఏమి చేయగలవో దానికే పరిమితి చేసికో. "నేను ఏ సామర్థ్యాలను పెంచుకొన గలను?" అని నిన్ను నీవే అడుగుకో.
- మార్గదర్శకత్వం కొరకు ప్రార్థించు. (ప్రతి విషయంలో ఈ పని జరగాలి.)
- ఇతరుల సలహాలను తీసికో: పెద్దలు, పరిచారకులు, సువార్తికులు, ఎదిగిన క్రైస్తవుల వద్ద.
- ఆలోచించడానికి సమయం తీసికో.
- చివరిగా, నీవు చేయగలదాని విషయంలో నిర్ణయం తీసికో. దానికి సమర్పించుకో, చేయనారంభించు.

ఒక విషయం జాగ్రత్త. "నాకు ఉపదేశించే వరముంది, కనుక నేను కనికరమును చూపనవసరం లేదు," లేదా, "నాకు హెచ్చరించే వరముంది, కనుక నేను యివ్వనవసరం లేదు" అని కొందరు ఊహించుకునే అవకాశముంది. బైబిలు ఆజ్ఞాపించినట్టుగా మనలో ప్రతి ఒక్కరు ఈ ఏడు వరములను ఉపయోగించుకోవలసిన అవసరత కొంతవరకైనా ఉంటుంది:

- సువార్త ప్రచారం, దేవుని పక్షంగా "మాట్లాడుట" (మత్తయి 28:19, 20; మార్కు 16:15, 16).

- పరిచర్య చేయుట (గలతీయులకు 5:13; రోమా 12:11).
- ఉపదేశించుట (హెబ్రీయులకు 5:12).
- హెచ్చరించుట (హెబ్రీయులకు 3:13; 10:24, 25).
- ఇచ్చుట (లూకా 6:38; రోమా 12:13; 1 కొరింథీయులకు 16:1, 2; 2 కొరింథీయులకు 8; 9).
- నడిపించుట (1 తిమోతి 3:4, 12). (సంఘ నాయకత్వం పురుషులకు పరిమితి చేయబడింది.)
- కనికరము చూపుట (లూకా 10:37; కొలొస్సయులకు 3:12).

క్రైస్తవులుగా మనం ఏమి చేయాలని నిర్ణయించడం, మన వరమేదో కనుగొనడం మీద ఆధారపడనవసరం లేదు. దీని విషయంలో బైబిలు అనేక సంగతులను తెలుపుతోంది. మన క్రైస్తవ పరిచర్య మీద నొక్కి చెప్పబడడం తీర్మానించబడాలి. నేను కాలేజీకి వెళ్లినప్పుడు, కృతార్థుడనవ్వడానికి పలు అంశాలు చదువవలసి వచ్చింది - వాటిలో ఇంగ్లీషు, చరిత్ర, సైన్సు అనేవి కూడ ఉన్నాయి. అయినా, బైబిలు, బైబిలుకు సంబంధించిన విషయాలు ఎక్కువగా చదివేవాడిని. కాలేజీలో ఉపయోగించిన భాష ప్రకారం "బైబిలు" అనేదే నా "ప్రధానాంశం." దీన్ని మన అంశంలో వర్తింపజేస్తే, మన వరము లేక వరములు మన ఆత్మ సంబంధమైన "ప్రధానాంశాన్ని" తీర్మానించవలసియుంటుంది.

దేవుడు మనకు వరాలను అనుగ్రహించాడు. వాటిని వాడునట్లు ఆయన మననుండి ఎదురు చూస్తాడు. నీ వరములేవో గుర్తించి, వాటిని ఉపయోగించడంలో ఎంతో గొప్ప ఫలితాలు కలుగుతాయి. క్రైస్తవుడిగా అది నిన్ను సంతోషపెడుతోంది. ("చివరిగా, సంఘంలో నా స్థానమేమో కనుగొన్నాను!" అని అంటున్నవారి ముఖాలలో చిరునవ్వును నేను నా మనస్సులో చూస్తున్నాను!) అది నిన్ను ప్రభువునకు నమ్మకస్థునిగా నిలుపుతోంది. అట్టిది సంఘాన్ని కట్టుతుంది (ఎఫెసీయులకు 4:12 చూడు). అది యితరుల జీవితాలను దీవిస్తుంది, మరియు అది దేవుని మహిమపరచుతోంది (1 పేతురు 4:11 చూడు).

## ... అప్పుడు దాన్ని ఉపయోగించు. (12:3-8)

**అది ఎందుకు వాడబడాలి?**

ఈ పాఠమంతటిలో, ఉపయోగించడానికి దేవుడు మనకు వరములనుగ్రహించాడని నేను అన్నాను. వచనం 6లో మనం యిలా చదువుతాం, "వెవ్వేరు కృపావరములు కలిగినవారమైయున్నాము ... పని కలిగియున్నాము" (6ఎ, బి వచనం). నా వద్దనున్న NASB ప్రతిలో, "అలాగుననే మనలో ప్రతి ఒక్కరు ఉపయోగించవలసియుంది" అనే తర్జుమాదారులచే చేర్చబడినట్టు ఇటాలిక్స్‌లో ఉన్నాయి. ఇంత దీర్ఘమైన ప్రయోగం వారు ఎందుకు చేర్చవలసియుంది? మన వరములు ఉపయోగించవలసిన అవసరత ఆ

మూల వాక్యమంతటిలో వ్యాపించియుంది. మన వరములను అనుగ్రహించింది దేవుడే అనే విషయాన్ని మరచిపోవద్దు (3, 6 వచనాలు). నీవు ఎవనికైనా ఒక బహుమానాన్ని యిచ్చావు, అది అతడు ఎన్నడూ వాడినట్టు కన్పించకపోతే, నీవు ఎలా ఫీలౌతావు?

మరల, శరీరంలోని సాటి "అవయవములమైయున్నట్టు" మనం మరచిపోకూడదు (4, 5 వచనాలు): "కండ్లు," "చెవులు," "చేతులు," "కాళ్లు," వగైరాలు. కన్ను చూడక పోయినట్టయితే, దాని ఉనికి యొక్క ఉద్దేశాన్ని అది కోల్పయింది; చెవి వినకపోయి నట్టయితే, దాని ఉనికి యొక్క ఉద్దేశాన్ని పోగొట్టుకున్నదైయుంది. పైగా, మన మూల వాక్యంలోని చివరి మూడు వచనాల్లో, మనం పలు రకాలైన వరములు కలిగియున్నది వాటిని ఉపయోగించడానికేనని నొక్కి చెప్పబడింది.

**అది ఎలా ఉపయోగింపబడగలదు?**

మన వరాలు కేవలం ఉపయోగించడం కాదు; అవి ఫలాని మార్గంలో అభ్యాసం చేయబడాలి. వరములలో కొన్ని ఉపయోగించడాన్ని గూర్చి పౌలు నోట్సు చేర్చాడు (ఈ పాఠంలో ముందుగా 1, 5, 6, మరియు 7 అంకెలను యివ్వబడినవాటిని చూడు).

(1) ప్రవచన వరము. "ప్రవచన వరమైతే విశ్వాస పరిమాణముచొప్పున ప్రవచింతము" అని పౌలు అన్నాడు (6సి వచనం). "పరిమాణము" అనేది *analogia* నుండి తర్జుమా చేయబడింది. (*Logos* ["వాక్యము"] అనేదానికి ముందు *ana* ["మీద," "పైన," లేక "మీదికి"].) దీనినుండే మనకు "analogy" అనే పదం వచ్చింది. *Analogia* అంటే, "పోలిక, నిష్పత్తి, భాగము" అని అర్థం.[17] "అతని విశ్వాసము" (నిజముగా "విశ్వాసమే") అది వచనం 3ను సూచిస్తుంది: దేవునిచే ప్రతి క్రైస్తవునికి కేటాయించబడిన "విశ్వాస ప్రమాణం." W. E. Vine యిలా వ్రాశాడు, "దేవుడు ఏది అనుగ్రహించాడో దాన్ని దాటి వెళ్లేదానికి వ్యతిరేకముగా హెచ్చరిక."[18] ప్రవక్త దేవుడు తనకు ప్రసాదించిన సందేశాన్ని మాత్రమే మాట్లాడాలి. పేతురు యిలా అన్నాడు, "ఎవడైనా మాట్లాడితే అతడు దేవోక్తులు బోధించినట్టు బోధించాలి" (1 పేతురు 4:11).[19]

(5) ఇచ్చు వరము. పౌలు యిలా అన్నాడు, "ఇచ్చువాడు ఔదార్యముతో" (8బి వచనం). "ఔదార్యము" (*haplotes*) అనేది *haplous*, అంటే "ఒంటరి." *Haplotes* "ఏకాగ్రతను సూచిస్తుంది," దానికి ఫలితము ఔదార్యము.[20] ఈ పదం యొక్క ప్రాథమిక అర్థాన్ని KJV ప్రత్యేకంగా చూపుతోంది: "ఇచ్చువాడు, నిష్కాపట్యంగా చేయనిమ్ము." దాన్ని నేను యిష్టపడతాను. నీవు యిచ్చేటప్పుడు, దాన్ని ఆడంబరంగా చేయకు (మత్తయి 6:2తో పోల్చి చూడు). దాని అంతిమ ఫలితాన్ని NASB నొక్కి చెప్తుతోంది: "ఔదార్యముతో." CJB రెండు భావనలను చేర్చుతుంది: "నిష్కపటంగాను, ఉదారంగాను చేయుము" అంటుంది.

(6) నడిపించే వరము. "నడిపించువాడు శ్రద్ధతో చేయాలి" అని పౌలు అంటున్నాడు (8సి వచనం). "శ్రద్ధ" అనేది *spoude* నుండి తర్జుమా చేయబడింది, "మనఃపూర్వకము, ఆసక్తి"[21] అని అర్థం. కొంత కాలానికి నాయకులు అలసిపోయినవారై తమ బాధ్యతలను నెరవేర్చడంలో అలక్ష్యాన్ని చూపవచ్చు. అటు స్థానిక సంఘాన్ని

నడిపించే పెద్దలేగాని, యిటు కుటుంబాన్ని నడిపించే తండ్రులేగాని, వారు తమ "బాధ్యతలను సీరియస్‌గా తీసికోవాలి" (NLT).

(7) కనికరమును చూపు వరము. చివరిగా, పౌలు యిలా అన్నాడు, "కరుణించువాడు సంతోషముతో పని జరిగింపవలెను" (8డి వచనం). "సంతోషము" అనేది *hilarotes* నుండి వచ్చింది, దీనినుండి "hilarity" మరియు "hilarious" అనే పదాలను మనం పొందాం. "సిద్ధమనస్సు ఆనందంతో దేనినైనా త్వరగా చేయ కోరేదాన్ని" *hilarotes* సూచిస్తుంది.[22] సణుగుకొంటూ లేక ముఖం మీద కోపంతో మండిపడినట్టుగా ఉండేది. మంచికంటె ఎక్కువ చెడ్డనే చేస్తుంది. Peterson పౌలు ఉపదేశాన్ని ఈ విధంగా విస్తరింప జేస్తున్నాడు: "దీనస్థితిలోనివారితో నీవు పని చేసినట్టయితే, వారియెడల విసుగుచెందకు, లేదా వారివలన నిరాశపరచబడకు. నీ ముఖం మీద చిరునవ్వుతో ఉంచుకో" (MSG). D. Stuart Briscoe యిలా రాశాడు, "కనికరము చూపు సామర్థ్యంతో ప్రత్యేకించి కలిగినవారు వారి రమ్యమైన వరము తెలియబడినప్పుడు, వారి సమయము బలముమీద హెచ్చుగా భారం పడడంవలన గర్వభంగమైనట్టు తలంచకూడదు."[23]

ప్రతి వరము ఉపయోగింపబడే విధానాన్ని వివరించడంలో పౌలు సమయాన్ని గడపలేదు. కాని మన సామర్థ్యాలను అభ్యాసం చేస్తూ ఉండగా అవసరమైన స్వభావ లక్షణాలపై అతడు కేంద్రీకరించాడు. వరములలో నాల్గింటిని గూర్చిన పౌలు ఉపదేశం ఏ వరమునైనా ఉపయోగించడానికి అవసరమైన మంచి సలహాతో కూడియుంది:

- నీ వరము ఏదైయున్నా, దేవుని వాక్యంతో నిలిచి, అది కలిగియున్న పరిమితులను అంగీకరించు.
- ప్రదర్శించడానికి, మనుష్యుల శ్లాఘ్యాన్ని పొందడానికి గాని నీ వరాన్ని ఉపయోగించకు.
- నీ వరాన్ని వాడడంలో ఆసక్తి కలిగియుండు.
- నీ వరమును గూర్చి సంతోషించు, సంతోషంతో దాన్ని ఉపయోగించు.

దేవుడు మనకు ప్రసాదించిన వేర్వేరు వరములపై నేను చివరి మాట చెప్పాలి. ఏ కార్య కలాపాలను స్థానిక సంఘం ప్లాన్ చేయాలో అనేదానిమీద వివిధ వరములు కలిగిన మనుష్యుల మధ్య విభేదాలు రావచ్చు. ఉపదేశించే వరం కలిగినవాడు, విద్యా ప్రోగ్రామే అంతా ప్రాముఖ్యమయ్యిందని తలంచవచ్చు; కనికరమును చూపు వరము గలవారు యితరులకు సహాయం చేయడం సంఘం యొక్క ప్రధాన కార్యక్రమమై ఉండాలని తలంచవచ్చు. అందరికి ఒకే వరము ఉండదనే వాస్తవాన్ని గుర్తుంచుకో. అన్ని వరములు ముఖ్యమైనవే. ప్రేమయు, ఐక్యతయు కలిగి, ప్రతి ఒక్కరు తనకు కలిగిన దానిని ఉపయోగించుతూ ఉండ నేర్చుకుందాం.

## ముగింపు

"ఒకనిని ప్రత్యేకమైనవానిగా చేసేదేమి?" అని అంటూ, నేను ఈ పాఠాన్ని ఆరంభించాను. లోకంలో ధనికులై, (పవర్‌ఫుల్) అధికారం గలవారై, టేలెంట్‌గలవారై యుండడంవలన ప్రత్యేకమైనవారైయుంటారు. అయినా, నీ ఆస్తి, అంతస్థు, టేలెంట్ మీద నీ విలువ ఆధారపడని స్థలం ఒకటి ఉంది. అది సంఘం, క్రీస్తు శరీరమైయుంది. అందులో, ప్రతి వ్యక్తియు అవసరమై, ప్రతి సభ్యుడును ముఖ్యమైనవాడైయుంటాడు.[24] నీవు యింకను క్రీస్తు శరీరములో అవయవముగా ఉండకపోయినట్టయితే, క్రీస్తునందు నమ్మికయుంచి బాప్తిస్మం పొందుమని నేను నిన్ను ప్రోత్సహిస్తున్నాను. ప్రభువు నిన్ను తన సంఘానికి చేర్చుకుంటారు (అపొస్తలుల కార్యములు 2:38, 47; KJV; 1 కొరింథీయులకు 12:13). తరువాత దేవుడు నీకు ప్రసాదించిన వరాన్ని కనుగొని, నిన్ను ప్రేమించు నీ ప్రభువును మహిమపరచడానికి ఉపయోగించు. ఇక్కడ భూమిమీద సంతోషంగా ఉండడానికిని, నిత్యత్వంలో దేవునితో ఉండడానికిని యిదియే మార్గం.

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

ఈ పాఠానికి మరో పేరు: "సంఘంలో నీ స్థానాన్ని కనుగొనుట." ఈ పాఠంలో ప్రతి పాయింటుకు, ప్రత్యేకమైన స్టడీ వ్రాయాలని శోధింపబడ్డాను. మూల వాక్యానికి అనేకమైన వర్తింపులు చేయవచ్చు! కొన్నింటిని మాత్రమే నేను చూపించాను. నీ శ్రోతలకు అవసరమైనవాటిని నీవు ఏరుకోవచ్చు. నీవు పని చేసే చోట పనికి వచ్చే నీ ఆలోచనలను పెంచు.

"పని కొరకు పరిశుద్ధులను సన్నద్ధులుగా చేయడంకంటే" ముఖ్యమైన కార్యాలు కొద్దిగానే ఉంటాయి (ఎఫెసీయులకు 4:12). ఈ పాఠం యొక్క అభ్యాస సంబంధమైన వర్తింపుగా, ప్రతి వ్యక్తి తన వరాన్ని కనుగొనేలా స్థానిక సంఘ నాయకులు కొంత కాలం ప్రజలతో గడపవచ్చు.

---

సూచనలు

[1]నీవు నివసించే సమాజానికి ఈ జాబితాను వర్తింపజేసికో. [2]Joe Barnett, "You Are Someone Special" (tract) (N.p., n.d.), 6. [3]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 583. [4]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph Henry Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 408. [5]"Function"కు బదులు KJVలో office అని ఉంది. నేడు ఆ పదం మరొక అర్థంలో వాడబడుతుంది. యిప్పుడు NKJVలో "function" అని ఉంది. [6]రోమా 12లోని చెప్పబడిన సందర్భంలో 1 కొరింథీయులకు 12, యింకా అనేక లేఖన భాగాలను కోట్ చేయవచ్చు. [7]నీవు నీ శ్రోతల యెదుట నిలిచినప్పుడు, నీవే "దృశ్య సాధనమైయుంటావు." నీ దేహంలో ఆయా అవయవములను చూపవచ్చు. [8]ఈ జాబితాలో అద్భుతమైన, అద్భుతము కాని వరములు చేర్చబడినట్టు అనేకమంది రచయితలు

అంగీకరిస్తారు. కాని ఏవి అద్భుతమైనవి, ఏవి అద్భుతమైనవి కావు అనే విషయంలోనే తేటైన వ్యత్యాసముంది. [9]R. C. Bell, *Studies in Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1957), 136. [10]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, 1971), 354.

[11]Vine, 619. [12]"నేను వేడుకొంటున్నాను" *(parakaleo)* అని తర్జుమా చేయబడిన పదం "రూపాంతరము పొందిన జీవితం (12:1, 2)" అనే పాఠంలో చర్చించబడింది. [13]*The Analytical Greek Lexicon,* 265. [14]Vine, 404. [15]మీ స్వంత ఉదాహరణలను వాడండి. మీరు స్థానిక క్రైస్తవులను ఇలాంటి వరములను కొన్నింటిని పొందినవాళ్ళను కొందరిని చేర్చండి. [16]James O. Baird, "Going to Heaven from the Pew," sermon preached at Macquarie church of Christ, Sydney, Australia, July 1976. [17]*The Analytical Greek Lexicon,* 23 [18]Vine, 494. [19]రోమా 12:6సి కి సంబంధించి, " 'విశ్వాసానికి అనుకూలంగా ఈ ప్రయోగాన్ని తర్జుమా చేయాలని' John R. W. Stott అభిప్రాయపడ్డాడు. అంటే, 'తన సందేశం క్రైస్తవ విశ్వాసాన్ని ఏ విధంగాను ఖండించకుండునట్టు ప్రవక్త నిశ్చయం కలిగియుండాలి' " (John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series [Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994], 327). [20]O. Bauernfeind, *"haplotes,"* in Geoffrey W. Bromiley, *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel and Gerhard Friedrich, trans. Geoffrey W. Bromiley, abr. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 65.

[21]Vine, 169. [22]Ibid., 98. [23]D. Stuart Briscoe, *Mastering the New Testament: Romans,* The Communicator's Commentary Series (Dallas: Word Publishing, 1982), 222. [24]Barnett, 9-10.

## 54

# ప్రేమించడానికి సవాలు

# (12:9-13)

"ప్రేమించుటకు దేవుని పిలుపు" అనే తన ప్రసంగాన్ని Luke Hartman పరిచయం చేస్తుండగా, అతడు తన మూల వాక్యాన్ని చదివి, "బైబిలులో ఈ లేఖన భాగమందు ప్రేమకు అత్యుత్తమమైన నిర్వచనముంది" అని అన్నాడు.[1] అతడు ఏ లేఖన భాగాన్ని గూర్చి యిది చెప్పియుంటాడని నీవు తలంచుతావు? 1 కొరింథీయులకు 13, "బైబిల్లో ప్రేమ అధ్యాయమా?" లేదు, సహోదరుడు Hartman రోమా 12:9-16ను సూచించాడు, అది ఈ మాటలతో ఆరంభమౌతుంది: "మీ ప్రేమ నిష్కపటమైనదైయుండ వలెను" (9ఎ వచనం). రోమా 12:9-16ను నేను పఠించడంలో, తరువాత వచ్చే వచనాలకు ఈ మాటలు పరిచయంగా ఉన్నాయని అనేక రచయితలు అనడం నా మీద గాఢమైన ముద్ర వేసింది.

బైబిలు పండితులు ప్రేమను నిర్వచింప ప్రయత్నించారు, పౌలును, దైవప్రేరేపితులైన యితర రచయితలును ప్రేమను నిర్వచింపలేదు దాన్ని వర్ణించారు. ప్రేమ ఏమి చేస్తుందో, ఆయా పరిస్థితులలో ప్రేమ ఎలా పని చేస్తుందో వారు చెప్పారు. 1 కొరింథీయులకు 13లో పౌలు అదే చేశాడు; రోమా 12:9-16లో కూడా పౌలు ఆలాగే చేశాడు. "ప్రేమించడానికి సవాలు" అనేదానిలో మొదటి అయిదు వచనాలను మనం ఆలోచించుదాం.

## ప్రేమ నిష్కపటమైనది[2] (12:9)

### ప్రేమ నిజమైనది

మన మూల వాక్యం యిలా ఆరంభమౌతుంది, "ప్రేమ వేషధారణ లేనిదై యుండనిమ్ము" (9ఎ వచనం). "ప్రేమకు" యిక్కడ వాడిన పదం *agape*. *Agape* అతి శ్రేష్ఠమైన ప్రేమయైయుంది. ప్రేమించబడినవారి శ్రేయస్సును కోరునదైయుంది. ఇది దేవుని ప్రేమను తెలుపునదైయుంది (1 యోహాను 4:8). రోమా పత్రికలో యింతవరకు, *agape* దేవుని ప్రేమను మనకు వర్తింపజేసినదైయుంది (5:5, 8; 8:35, 39). ఒకరికొకరం ఆలాటి ప్రేమనే కలిగియుండాలని పౌలు యిక్కడ అన్నాడు. Anders Nygren యిలా రాశాడు, "క్రీస్తు శరీరములో ప్రేమ రక్త ప్రసరణవంటిది. దాని ద్వారా దాని భాగములు అవయవములు ఒకదానితో ఒకటి కలసి ఒకటిగా జోడింపబడ్డాయి."[3]

*Agape* ప్రేమ ఎలాటిది? అది "వేషధారణ లేనిదైయుండాలని" పౌలు మొదటిగా చెప్పాడు.[4] గ్రీకు మూలంలో, "వేషధారణ లేని" (*anupokrisis* నుండి) "వేషధారణకు" *(hupokrisis)* (*a* plus *n*) అనే వ్యతిరేక పదం ముందు వచ్చింది. పౌలు దినాల్లో *hupokrisis* అనే పదం వేదిక మీద నటన చేసేవాడిని సూచించేది. ముఖానికి ముసుకు వేసికొని వేరొక వ్యక్తిలా నడుస్తాడు – (తాను ఫలాని వ్యక్తి కానట్టు నటిస్తాడు).[5] "నీ ప్రేమ నటనగా ఉండనీయకుము" అని JB అంటుంది. "నటించే ప్రేమను" గూర్చి నేను తలంచేటప్పుడు నా మనస్సు యూదా వద్దకు వెళ్లుతుంది, ఒక ముద్దుతో అతడు యేసును అప్పగించాడు (లూకా 22:47, 48). ప్రేమించేవారుగా కనబడాలని కొందరు కోరుకుంటారు. వారి హృదయాలు తాకబడకున్నను ప్రేమ అనే "ముసుగును వారు వేసుకొంటారు." అలా ఉండకూడదని పౌలు తన పాఠకులను కోరాడు. "నీ ప్రేమ కేవలం బయటికి కన్పించేదిగా ఉండనీయ్యకు" (CJB).

**వివేచించు ప్రేమ**

నిజమైన ప్రేమ కలిగియుండడమంటే ఏమిటి? పౌలు 9బి వచనంలో ఒక ఉదాహరణనిచ్చాడు: "చెడ్డదాని నసహ్యించుకొని; మంచిదానిని హత్తుకొనియుండుడి." "కీడును ద్వేషించి, మేలును ప్రేమించుడని" ఆమోసు ఎన్నో సంవత్సరాలకు ముందు వ్రాశాడు (ఆమోసు 5:15ఎ). ద్వేషించు అనే ఆజ్ఞతో పౌలు ప్రేమించుమనే హెచ్చరిక చేయడం కొందరిని ఆశ్చర్యపరచింది. అయినా, కొందరు అన్నట్టు, నిజమైన ప్రేమ అనేది "కేవలం కరుణా రసాన్ని ఒలకపోయడం కాదు." దానికి వ్యతిరేకమైనదాన్ని ద్వేషింపకుండ ఒకదాన్ని మనం ప్రేమించలేం. నిష్కపటమైన ప్రేమ చెడ్డదానిని అసహ్యించు కొంటూ, మంచిని హత్తుకొనియుంటుంది.

"అసహ్యించుకొనుట," "హత్తుకొనియుండుట" అనే రెండును బలీయమైన గ్రీకు పదములనుండి తర్జుమా చేయబడ్డాయి. "అసహ్యించుకొనుట" అనేది *apostugeo* నుండి, "ద్వేషము" (*stugeo*) *apo* చే అధికం చేయబడింది.[6] *Apostugeo* అంటే, "ద్వేషించు, తృణీకరించు, అసహ్యించు, విసుగుతో దానినుండి తొలగిపోవు" అని అర్థం. "పరిశుద్ధమైన ద్వేషము" మరియు "దైవికమైన విసుగు" అనే ప్రయోగాలను Jim McGuiggan ఉపయోగించాడు.[7] దానివలన మనం దిగ్భ్రమ కలుగనంతగా మనకు పరిచయమయ్యే వీలుంది. "ఆలాటిది మీకు సంభవింపకుండ జాగ్రత్తపడుడి!" అన్నట్టు పౌలు అన్నాడు.[8]

మనం కీడును ఎందుకు ద్వేషించాలి? ఎందుకంటే కీడు అనేది దేవునికిని ఆయన చిత్తమునకును వ్యతిరేకమయ్యింది; ఎందుకంటే కీడు లెక్కలేనన్ని మేళ్లను నాశనపరచుతోంది; ఎందుకంటే కీడు జనసమూహాలను నరకానికి పంపుతుంది. ఈ తలంపు నేను చేర్చవలసియుండవచ్చు: కీడును ద్వేషించు, జనులను ద్వేషింపకు. "మీ శత్రువులను ప్రేమించుడి మిమ్మును హింసించువారికొరకు ప్రార్థన చేయుడి" అని యేసు చెప్పారు (మత్తయి 5:44). డాక్టరు క్యాన్సరును ద్వేషిస్తాడు గాని, క్యాన్సర్ ఉన్న రోగిని ద్వేషించడు.

పైగా, "మంచి దానిని హత్తుకొనియుండుడి." "హత్తుకొనియుండుడి" అనేది *kollao* నుండి వచ్చింది, "కలిసి అతికి కూడియుండు, అంటుకొను, సిమెంట్ ... (*kol-la* 'బంక')."[9] "మేలైన ప్రతిదానితో గట్టిగా అతికియుండు" అని CEV అంది (నొక్కి చెప్పింది నాది). చెడ్డదానిని అసహ్యించుకొని, మంచి దానిని హత్తుకొనియుండుడి అనేది ఒక నాణెపు యిరువైపులయై ఉంది. మరల, దానిని వ్యతిరేకించి నశింపజేయుదాన్ని మనం ద్వేషించక పోయినట్టయితే, మనం నిజంగా దాన్ని ప్రేమించడం లేదని నేను నొక్కి చెప్తుతున్నాను.

మా ప్రాంతంలో, "ప్రేమ గుడ్డిదని" మేము తరచుగా అంటాం. ఎవరు ప్రేమించ బడుతున్నారో వారి దోషాలను పట్టించుకొనక పోవడం అనే విషయంలో ప్రేమ గుడ్డిదే కావచ్చు (1 పేతురు 4:8), కాని నిజమైన ప్రేమ ఏది మేలు, ఏది కీడు అనేవాటి విషయంలో గుడ్డిదైయుండదు. రైటు, తప్పు అనేవాటి మధ్య వ్యత్యాసాన్ని లోకం తుడిచి వేయడానికి ప్రయత్నిస్తుంది, కాని *agape* అలా చేయదు. చెడ్డదానిని అది తీవ్రంగా వ్యతిరేకిస్తుంది, మంచిదానిని అది గట్టిగా హత్తుకొనియుంటుంది.

## ప్రేమ స్వార్థ రహితమైనది (12:10)

వచనం 10లో, ప్రేమ యితర క్రైస్తవులతో ఎలా సంబంధం కలిగియుంటుందో చూపుతున్నాడు: "సహోదర ప్రేమ విషయములో ఒకనియందొకడు అనురాగముగలవారై, ఘనతవిషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి." స్వార్థపరులైయుండక యితరులను కేంద్రంగా ఉంచుకోవాలని దేవుడు కోరుతున్నాడు.

### గాఢమైన ప్రేమ

క్రొత్త నిబంధనలో "ప్రేమకు" కనుపరచే మూడు పదాలకు 9, 10 వచనాలు షోకేస్ లాటివి:[10] *agape, philia* మరియు *storge. Agape* వచనం 9లో కన్పిస్తుంది. 10వ వచనంలో *philia* మరియు *storge* అనేవి మిశ్రమ పదాలుగా కన్పిస్తాయి. *Philia* మమకారాన్ని సూచిస్తుంది, *storge* అనురాగాన్ని (కుటుంబ సభ్యులకు కనుపరచే ప్రేమను) సూచిస్తుంది.[11] (రోమా 1:31లో *storge*కి వ్యతిరేక రూపాన్ని చూచాం, "అనురాగ రహితులు" ["సహజ ప్రేమ లేనివారు"] అని KJV తర్జుమా చేస్తుంది. NASB "ప్రేమ లేనివారు" అని ఆ వచనంలో అంటుంది.)

10వ వచనంలో, "be devoted" అనేది *philostorgos*నుండి వచ్చింది: *Philia* (*philos*) plus *storge.*[12] ఈ పదం "సహోదర ప్రేమ" *philadelphia* నుండి వచ్చింది: *phileo* (*philia* అనే దానికి క్రియారూపం) plus *adelphos* ("సహోదరుడు"). ఈ రెండు పదాలు సంఘం యొక్క కుటుంబ భావాన్ని కనుపరచుతాయి: దేవుడు మన తండ్రి, మనము సోదర సోదరీమణులము. ఇతర మతాల్లో ఒక విశ్వాసాన్ని వెంబడించే వారిని "సహోదరులని" సూచిస్తారు; కాని, నాకు తెలిసినంతమట్టుకు, క్రైస్తవ్యంలో మాత్రమే ఒకరినొకరు ప్రేమించుకోవలసినదిగా ఆజ్ఞాపించబడ్డారు. దీనినంతటిని పౌలు రోమీయులకు వ్రాసిన సందర్భంలో పెట్టుదాం: యూదులలో నుండియు,

అన్యజనులలోనుండియు వచ్చిన క్రైస్తవులు ఒకరికొకరు ఒక కుటుంబంగా ఉండాలని పౌలు కోరుతున్నాడు: క్రీస్తునందు సోదరీ సోదరులుగా వారు ఒకరికొకరు అత్యంత శ్రద్ధకలిగి యుండాలి; ఒకరికొకరు శ్రేష్ఠమైనవాటిని కోరవలసినవారై ఉన్నారు. "మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైనయెడల దీనినిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురని" ప్రభువు అన్నారు (యోహాను 13:35).

### స్వార్థ రహితమైన ప్రేమ

తన మనస్సులో ఉన్న ప్రేమ, భక్తి తత్వం ఎలాటిదైయుండాలో ఉదాహరణకు పౌలు యిలా అన్నాడు, "ఘనతవిషయములో ఒకరికొకరు గొప్పగా ఎంచుకొనుడి" (రోమా 12:10బి). ఒకరి పట్ల ఒకరికి గల ప్రేమను ఒకరినొకరు ఘనపరచుకొనే రూపంలో వ్యక్తపరచుకోవాలి. "ఘనత" అనేది *time* నుండి వచ్చింది (దాన్ని "టిమే" అని ఉచ్చరించాలి); అది "ప్రాథమికంగా 'విలువ యివ్వడం.' "[13] యితరుల పట్ల గౌరవం, అభినందనకు సంబంధించినది – ఆ అభినందనను వ్యక్తపరచడం జరగాలి. "Preference" అనేది *proegeomai* అంటే, "ముందుగా వెళ్లుట నాయకత్వం [వహించడం]"[14] ఫిలిప్పీయులకు 2:3లో పౌలు యిలా రాశాడు, "… వినయమైన మనస్సుగలవారై యొకని నొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు."

William Barclay యిలా అభిప్రాయపడ్డాడు, "సంఘాల్లో సగంకంటె ఎక్కువ సమస్యలు హక్కులు, ఆధిక్యతలు మరియు గౌరవాలకు సంబంధించినవైయుంటాయి."[15] పౌలు ప్రకారం, ఘనపరచబడుటయందు మనం అక్కర కలిగియుండకూడదు; ఘనపరచుట యందు అక్కర కలిగియుండాలి. ఈ రకమైన ప్రేమను J. B. Philips యిలా వ్యక్తపరచాడు: "ఎదుటి మనిషికి మెప్పు కలగడానికి యిష్టపడడం." ప్రేమ "ఆత్మ గౌరవంలో" కనబడదు, "అన్యులను గౌరవించుటలో" పట్టుబడుతుంది.

## ప్రేమ అత్యుత్సాహవంతమైనది (12:11)

ప్రభువు సేవను ఎలా ప్రభావితం చేస్తుందో వచనం 11లో పౌలు తెలుపుతున్నాడు. "ఆసక్తి విషయములో మాంద్యులు కాక, ఆత్మయందు తీవ్రతగలవారై ప్రభువును సేవించుడి" అని అతడు అన్నాడు. అత్యాసక్తి అనేది *agape* ప్రేమలో మూడవ లక్షణమైయున్నట్టు యిది తెలుపుతోంది.

### శ్రద్ధగల ప్రేమ

"మాంద్యులు" అనేది గ్రీకులో *okneros* నుండి వచ్చింది – అంటే, "నెమ్మదిగా, సోమరితనము, బద్ధకము, పనిచేయని" అని అర్థం.[16] *Okneros*ను సాధారణ వాడుకలో పెడితే, అది సోమరితనాన్ని సూచిస్తుంది. తన తలాంతును భూమిలో దాచిపెట్టిన ఒక్క తలాంతు మనిషి "సోమరియైన చెడ్డ దాసుడా" అని పిలువబడ్డాడు (మత్తయి 25:18, 26; నొక్కి చెప్పింది నాది). "సోమరియైన క్రైస్తవుడనేది" పరస్పర విరుద్ధ పదములైయున్నట్టు చెప్పబడింది.

మనం శ్రద్ధగలవారమైయుండాలే గాని, సోమరులమై ఉండకూడదు. "శ్రద్ధ" అనేది *spoude* నుండి వచ్చింది, అంటే, "మనఃపూర్వకమైన, ఆసక్తి" అని అర్థం.[17] యజమాని పని విషయంలో క్రైస్తవుడు సోమరివాడైయుండ కూడదు; అయితే, అతడు అత్యాసక్తి గలవాడైయుండాలి. "సోమరిగా ఉండకు, కష్టపడి పనిచేయి" అని NCV అంటుంది. మన నిమిత్తం అంతగా చేసిన ప్రభువును మనం ప్రేమించకుండా ఇంకొక విధంగా ఎలా ఉండగలం?

## మనఃపూర్వకమైన ప్రేమ

"ఆత్మయందు తీవ్రత గలవారై" అంటూ పౌలు కొనసాగించాడు (11బి వచనం). "తీవ్రత" అనేది *zeo* యొక్క రూపంనుండి తర్జుమా చేయబడింది, అంటే "ఆవేశవంతమైన, తీవ్రమైన."[18] "మీ ఆత్మను ఉద్రిక్త స్థాయిలో నిలుపుడి" అని Barclay తర్జుమా అంటుంది.[19]

"ఆత్మ" అనేది చిన్న "s" అక్షరంతో ఉండాలా లేక పెద్ద "S" అక్షరంతో ఉండాలా అనేదాని విషయంలో సందిగ్ధ పరిస్థితి నెలకొన్నది. ప్రధాన తర్జుమాలలో "S" పెద్ద అక్షరమున్న ఒకే తర్జుమా RSV,[20] "ఆత్మతో కాంతిగలవారై యుండుడి" అని వేరైన తర్జుమా చేయబడింది. ఈ అధ్యాయంలో పౌలు నొక్కి చెప్తుతుంది దేవుడు మనకు ఏమి చేశాడు అని కాదు మనం దేవునికి ఏమి చేస్తున్నాం అనేది గనుక "s" చిన్నదే కోరదగినదైయుంటుంది. "ఆత్మయందు తీవ్రత గలవారైయుండుడి" అనేదాన్ని పలు తర్జుమాలు యిలా వ్యక్తపరచుతున్నాయి:

> ఆత్మ సంబంధమైన నీ తీవ్రతను నిలబెట్టుకో (NIV).
>
> ఆత్మ సంబంధంగా ఉత్సాహముగలవారై యుండుడి (McCord).
>
> మండుతున్న ఆత్మ అగ్నిని నిలుపుకో (Phillips).

దేవునికిని, ఆయన ఆత్మకును మనం సన్నిహితంగా ఉండకపోతే, మన తీవ్రత చల్లబడి పోతుంది. మరుగుతున్న నీటి పాత్రను పొయ్యిమీదనుండి దించు, అది మరగడం మానుతుంది. బైబిలు స్టడీ, ప్రార్థన, ప్రేమగల, ఆసక్తిగల క్రైస్తవుల సహవాసం ద్వారా ప్రభువుతో మనం సన్నిహితంగా ఉండినంత కాలం మన ప్రేమ ఆసక్తికరంగా ఉండి పోతుంది.

## సేవించే ప్రేమ

ప్రేమ దేని విషయమై ఆసక్తి కలిగియుండాలి? "ప్రభువును సేవించుడి" అనే మాటలతో ఆ వచనం ముగించబడుతుంది (11సి వచనం). డబ్బు సంపాదనలో, చేయబోయే ప్రయాణంలో, క్రీడలలో సహితం ఆసక్తిని కనుపరచిన వ్యక్తులను నేనెరుగుదును.[21] అయినా, ప్రభువును సేవించడంలో ఎక్కువ మందికి ఆసక్తి ఉండదు. మురికి, రోత పనులను ఎక్కువ గంటలు చేయడంలో జనులు ఆసక్తిని కనుపరచరు.

ప్రేమ అత్యుత్సాహవంతంగా ఉండగలదు ఎందుకంటె అది ప్రభువును సేవించుటయై ఉంది – మనలను ప్రేమించు ఆయనను, తన్నుతాను మనకొరకు అప్పగించుకున్న ఆయనను, అనుదినము మనలను బలపరచు ప్రభువును సేవించుటయై ఉంది.

## ప్రేమ నిలకడగా ఉంటుంది (12:12)

కష్ట కాలం వచ్చినప్పటి సంగతి ఏమిటి? (అవి వస్తాయి.) సమస్తము సజావుగా పోయినప్పుడు ఉత్సాహంతో ఉండడం సులభమే; ఏదియు మంచిగా ఉండనప్పుడు చాల కష్టంగా ఉంటుంది. వచనం 12లో *agape* ప్రేమకు మూడు లక్షణాలను పౌలు పేర్కొన్నాడు. అవి సుఖంలోను, కష్టంలోను, సూర్య ప్రకాశంలోను, నీడలోను నిలకడగా ఉండడానికి సహాయపడతాయి.

### నిరీక్షణతో కూడిన ప్రేమ

మొదటిగా, ఏమి సంభవించినా సరే, ప్రేమ నిరీక్షణ కలిగియుంటుంది. 12వ వచనం యిలా ఆరంభమౌతుంది, "నిరీక్షణగలవారై సంతోషించుడి." ఈ రోజు చెడ్డగా ఉన్నప్పటికిని, రేపు క్షేమంగా ఉంటుందనే (నమ్మికతో కూడిన ఎదురు చూపు[22]) ఉంటుంది. "మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమయెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని" పౌలు అధ్యాయం 8లో చెప్పాడు (18 వచనం). ప్రేమకు ఎల్లప్పుడూ ఆనందించడానికి తగిన హేతువుంటుంది. Leon Morris యిలా వ్రాశాడు,

> ఈ లోకాన్ని గురించి ఆశించడానికి ఆది క్రైస్తవులకు చాలా కొద్ది అవకాశం ఉండేది, కాని వారు ప్రభువునందు నిత్యము ఆనందించారు (ఫిలిప్పీయులకు 4:4) మరియు వారియందున్న క్రీస్తు మహిమ నిరీక్షణయైయున్నట్టు వారెరుగుదురు (కొలొస్సయులకు 1:27). ... నిరీక్షణ [క్రైస్తవుని] ప్రస్తుత క్లిష్ట పరిస్థితులనుండి లేవనెత్తి తప్పనిసరియైన ఫలితమునందు ఆనందింపజేస్తుంది.[23]

### పట్టువీడని ప్రేమ

నిరీక్షణయందు ప్రేమ ఆనందించునది గనుక, "శ్రమయందు ఓర్పుగలవారై" (12బి వచనం). "శ్రమ" అని తర్జుమా చేయబడిన (*thlipsis*) ప్రాథమిక అర్థం, "ఒత్తిడి," "ఆత్మకు భారముగా చేసే ఒత్తిడి."[24] పౌలు దినాల్లో, క్రైస్తవులు సమాజంలో ఒక చిన్న భాగమై, ప్రభుత్వ శాసనములకు లోనగునదై మతపరమైన శత్రువులకు సులభమైన గురి చూపులుగా మారింది. క్రైస్తవులకు శ్రమ జీవితపు వాస్తవమై నిలిచింది (అపొస్తలుల కార్యములు 14:22 చూడు). ఈలాటి శ్రమానుభవము మధ్య, ప్రేమయే వారిని పట్టువీడనీయక నిలిపింది. "పట్టు విడువక" అనేది (*hupomone* నుండి) వచ్చింది; అంటే "క్రింద నిలిచియుండు" అని అర్థం. (*hupo* ["క్రింద"] + *meno* ["నిలిచియుండు"]).[25] ప్రేమ మానదు; జీవితపు ఒత్తిడి ముంచివేసేదిగా గోచరించునప్పుడు, ప్రేమ మన విశ్వాసాన్ని మానకుండ నిలుపుతుంది.

### ప్రార్థనాపూర్వకమైన ప్రేమ

నిరీక్షణతో నింపబడియుండడానికి గల ఒక ముఖ్యమైన విషయం పట్టుదలతో ప్రార్థించుటయందున్నది. ప్రార్థన సృష్టికర్తతో సజీవ సంబంధమైయుంది. ప్రార్థనయందు పట్టుదల కలిగియుండునట్టు ప్రార్థన కల్పిస్తుంది (12సి వచనం). "Devoted" అనేది *proskartereo* నుండి తర్జుమా చేయబడింది, "బలీయముగానుండు" లేక "సహించు" (*kartereo*) అనేది *pros* చే తీవ్రం చేయబడింది.[26] అంటే, నిలకడగానుండు, పట్టుదలగా ఉండు.[27] ప్రార్థన ప్రేమకు, యిష్టా యిష్టాలకు సంబంధించింది కాదు; అది అవసరత (తప్పని సరియైనదైయుంది). "ఎడతెగక ప్రార్థన చేయుడి" అని పౌలు మరో చోట అన్నాడు (1 థెస్సలొనీకయులకు 5:17).

## ప్రేమ సహాయము చేయునదైయుంది (12:13)

"సహోదర ప్రేమ విషయములో ... పట్టుదల గలిగియుండునట్లు" 10వ వచనంలో పౌలు క్రైస్తవులకు చెప్పాడు. సహోదర ప్రేమ వ్యక్తపరచడానికి 13వ వచనంలో అతడు రెండు మార్గాలను పేర్కొన్నాడు.

### పంచుకొను ప్రేమ

"పరిశుద్ధుల అవసరములలో పాలుపొందుచు" అని పౌలు మొదట అన్నాడు (13ఎ వచనం). "పాలుపొందుచు" అనేది (*koinoneo* నుండి), యిది *koinonia* అనే కుటుంబపు పదాలనుండి వచ్చింది, అంటే "సహవాసము, పాలుపొంపులు పొందుట" అని అర్థం. *Koinoneo* "తో పాలుపొందుట" అనేది భావం.[28] అవసరతలోనున్న (తోటి క్రైస్తవులకు[29]) "పరిశుద్ధులకు" ఈ లేఖన భాగం చెందుతుంది. ప్రేమ ప్రతి ఒక్కరి పట్ల శ్రద్ధ కలిగి యుంటుంది, కాని క్రీస్తులో ఉన్న సోదరీల సోదరుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కలిగి యుంటుంది. "కాబట్టి మనకు సమయము దొరకినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారియెడలను మేలు చేయుదము" (గలతీయులకు 6:10; నొక్కి చెప్పింది నాది). 13ఎ వచనంలో, "అవసరతలో ఉన్న దేవుని ప్రజలతో పాలు కలిగియుండుడి" అని ఉంది (NIV). "పరిశుద్ధుల అవసరతలో [బహువచనం *chreia*]" కోర్కెలలో కాదు, ఈ విషయం గుర్తుంచుకో. "అవసరతలలో," ఆహారము, వస్త్రములు, నివాసము అనేవి ప్రేమలో చేర్చబడియుంటాయి.

భూసంబంధమైన నిర్వహణలకంటే సంఘము అనేక విధానాలలో వ్యత్యాసమైనదై ఉంది. వ్యత్యాసమైన ఒక మార్గమేమంటే, భూసంబంధమైన నిర్వహణలకు సంబంధించిన వారు యితరుల యొద్దనుండి ఎంతైనా రాబట్టజూస్తారు. సంఘంగా రూపొందిన ప్రేమగల క్రైస్తవులు యితరులకొరకు తాము ఏమి చేయగలరో దాన్నిగూర్చి ఆలోచిస్తారు. "మన ఖర్చుతో యితరుల మేలును వెదకుట క్రైస్తవ ప్రేమ లక్షణమైయుందని" Luke Hartman అన్నాడు.[30]

**ఆతిథ్యము చేయు ప్రేమ**

ప్రేమగల క్రైస్తవులు “ఒకరియెడల ఒకరు అక్కరగలవారైయున్నారనడానికి” పౌలు యిచ్చిన రెండవ విధానం: “అభ్యాస సంబంధమైన ఆతిథ్యం” (13బి వచనం). “ఆతిథ్యం” అనేది *philoxenia* నుండి వచ్చింది, అంటే “తెలియనివారిని ప్రేమించుడి” *(philos* [“ప్రేమ”] + *xenos* [“తెలియనివాడు”]).[31] “ఆతిథ్యమంటే” సన్నిహితమైన స్నేహితులు సరదాగా కలసి గడిపే సాయంత్రాలకు ఇంటికి వచ్చుట అని అర్థం కాదు. తన గృహాన్ని తెలియని వారికొరకు తెరుచుటయైయుంది. *Philoxenia* హెబ్రీయులకు 13:2లో కన్పిస్తుంది, అక్కడ, “ఆతిథ్యము చేయ మరవకుడి; దానివలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యము చేసిరి” అని హెచ్చరింపబడ్డారు.

సందర్భంలో, మనకు బాగా తెలియని లేక ముందు ఎన్నడూ కలిసికోని పరిశుద్ధులకు (క్రైస్తవులకు) చూపే ఆతిథ్యంపై నొక్కి చెప్పడం జరిగింది. J. B. Phillips 13వ వచనాన్ని యిలా అన్నాడు: “అక్కరలో తోటి క్రైస్తవులకు భోజనం గాని, అవసరతలో ఉన్నప్పుడు పడకగాని యివ్వడానికి ఎన్నడూ సణుగుకొనకుండా ధారాళముగా యివ్వండి.” క్రొత్త నిబంధన యివ్వబడుతున్న దినాల్లో ఆతిథ్యం అవసరమైయుంది. పూటకూళ్ల యిల్లు తక్కువగాను, దూరంగాను ఉండేవి. ఉన్నవి కూడ మురికిగాను, అపాయకరంగాను ఉండేవి. ఆ పరిస్థితి లోకంలోని అనేక ప్రాంతాల్లో మారిపోయింది. అయినా, “ఆతిథ్యము” అనే పదంలో యిమిడియున్న ప్రేమపూరితమైన అక్కర యింకను అవసరమైయుంది. అతిథి ప్రియులు అనేది పెద్దల లక్షణాలలో ఒకటైయుంది (1 తిమోతి 3:2; తీతు 1:8). అనేక సంవత్సరాలుగా నేను నా కుటుంబం ఈ ప్రపంచమంతట ఉన్న క్రైస్తవుల అతిథ్యమును అనుభవించాం – ముందెప్పుడూ కలుసుకోని సోదరీ సోదరుల ఆతిథ్యం పొందగలిగాం.

మనం ఆతిథ్యాన్ని “అభ్యసించాలనే” విషయాన్ని గుర్తుంచుకో. “అభ్యసించడమనేది” *dioko*నుండి వచ్చింది. రోమా 9:30, 31లో “వెంటాడు” అని ఉంది. రోమా 12:13లో “ఆతిథ్యమను అభ్యాసాన్ని వెంటాడు” అని AB అంది. *dioko* అనే పదంలో ఆసక్తి కలిగి వెంబడించు అనేది గుప్తమైయుంది.[32] ఆతిథ్యాన్ని కనుపరచే అవకాశాల కొరకు ప్రేమ వేచియుండదు; అవకాశాల కొరకు ఆసక్తితో వెదకుతోంది.

## ముగింపు

“ ‘క్రైస్తవుడు ఎలా కన్పిస్తాడు?’ (12:14–16)” అనే పాఠంలో ప్రేమను గూర్చిన పఠనాన్ని కొనసాగించుదాం. ఈ మూల వాక్యంలోని చివరి మూడు వచనాలు ప్రేమ కనికరముగలదని (14 వచనం), దయకలిగినదని (15 వచనం), మరియు వినయము గలదని (16 వచనం). ముగిస్తుండగా, స్వపరీక్షకు యిది సమమైయుంది:

- ప్రేమ నిష్కపటమైనది. నేనలాగున్నానా?
- ప్రేమ స్వార్థ రహితమైనది. నేనలాగున్నానా?
- ప్రేమ అత్యాసక్తిగలదై ఉంటుంది. నేనలాగున్నానా?

- ప్రేమ నిలకడగా ఉంటుంది. నేనలాగున్నానా?
- ప్రేమ నిరీక్షణగలదైయుంటుంది. నేనలాగున్నానా?

"ఎక్కువ ప్రేమించే వ్యక్తిగానుండుటకు దేవా నాకు సహాయం చేయుమని" మనమందరం ప్రార్థించవలసియుండవచ్చు!

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

నీవు ఈ ప్రసంగాన్ని ఉపయోగించేటప్పుడు, యితరులపట్ల మనకుండే ప్రేమ దేవుని పట్ల మనకున్న ప్రేమకు దగ్గర సంబంధం కలిగియున్నట్టు నొక్కి చెప్పు (1 యోహాను 4:20), దేవునిపట్ల మన ప్రేమను వ్యక్తపరచే ఒక విధానం ఆయన అడిగిన దానిని జరిగించడమే (యోహాను 14:15; 1 యోహాను 5:3). (ఎన్నడే క్రైస్తవులు కానివారికి) దేవుడు ఏమి చేయమన్నాడో దూరస్థులైన పాపులకు (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38), త్రోవ తప్పిన క్రైస్తవులకు (అపొస్తలుల కార్యములు 8:22; యాకోబు 5:16) చేయుమని చెప్పు.

రోమా 12:9–16లో ప్రేమకు 12నుండి 20 గుణగణాలున్నట్టు అనేకమంది రచయితలు పేర్కొంటారు. ప్రతి వచనాన్ని ఒక పదంతో నేను సంగ్రహం చేయ కోరుకున్నాను.

"నీవు ప్రత్యేకమైనవాడివి! (12:3–8)"తో వలె నేను వచనంలోని ప్రతి వాక్యం వద్ద ఆగిపోయి, ఒక ప్రత్యేకమైన పాఠాన్ని రాసాను. నా వ్యాఖ్యానాలు సంగ్రహమైనవి. నీ శ్రోతలకు అవసరమైన సత్యాలను మూల వాక్యంనుండి ఎన్నుకొని వాటిని విస్తరింపజేసి వర్తింపజేయి.

రోమా 12:14–21లోని రెండు పాఠాలను ఏకం చేసి, "ప్రేమించ పోటీపడు" లేదా "క్రైస్తవుడు ఎలా కన్పిస్తాడు?" అని పేర్లు పెట్టవచ్చు. ప్రేమ అనే చర్చనీయాంశాన్ని నీవు ఉపయోగించినట్టయితే, ఈ పాఠంలోని ముగింపులో వాటిలోని మూడు పాయింట్లను తీసికోవచ్చు: ప్రేమ కనికరము గలది (14 వచనం), దయగలది (15 వచనం), వినయమైనది (16 వచనం).

రోమా 12:9–21ను "మేలు, కీడు" అనే పేరుతో D. Stuart Briscoe సంధించాడు. ("Good and Evil" అనేవి ఎన్నిసార్లు ఆ మూల వాక్యంలో ఉపయోగించబడ్డాయో చూడు.) Briscoe యిచ్చిన మూడు ప్రధాన పాయింట్లు: (1) మేలు, కీడు, సహవాసము (9–12 వచనాలు); (2) మేలు, కీడు, గృహనిర్వాహకత్వం (13–16 వచనాలు); (3) మేలు, కీడు, కష్టము (17–21 వచనాలు).[33]

---

సూచనలు

[1]Luke Hartman, "God's Call to Love," sermon preached at Eastside church of Christ,

Midwest City, Oklahoma, 17 July 2005. [2]ఈ పాఠంలో వాడబడిన మెయిన్ పాయింట్స్ 1 కొరింథీయులకు 13తో సరితూగుతాయి. నీవు వాటిని ఉపయోగించవచ్చు. [3]Anders Nygren, *Commentary on Romans* (Philadelphia: Fortress Press, 1949), 424. [4]Instead of "hypocrisy," the KJV has "dissimulation." "Dissimulation" means "pretense," but that word is not in common use today. The NKJV has "hypocrisy." [5]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 316. [6]Ibid., 1. [7]Jim McGuiggan, *The Book of Romans,* Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1982), 367. [8]చెడుగును ద్వేషించడానికి లేఖన భాగాలు కీర్తనలు 97:10; 119:104; సామెతలు 8:13; హెబ్రీయులకు 1:9 చూడు. [9]Vine, 104. The KJV has "cleave." అదే గ్రీకు పదం మత్తయి 19:5లో భార్య భర్తల బాంధవ్యాన్ని సూచించడానికి వాడబడింది. [10]"ప్రేమకు" నాల్గవ గ్రీకు పదం *eros* లేఖనానుసారమైన వివాహం సరియైనది (1 కొరింథీయులకు 7:2, 3; హెబ్రీయులకు 13:4) … కాని '*eros*'కు అనేక చెడు పర్యాయాలు ఉన్నాయి. కనుక దానిని కొత్తనిబంధన లేఖకులు విడిచారు.

[11]A detailed study of these three words can be found in David Roper, *Getting Serious About Love* (Searcy, Ark.: Resource Publications, 1992), 13-30. [12]Vine, 16. [13]Ibid., 310. [14]Ibid., 483. [15]William Barclay, *The Letter to the Romans,* rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 164. [16]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, 1971), 286. [17]Vine, 169. [18]Ibid., 233. [19]Barclay, 163. [20]Of the translations I checked, only two others had a capital "S": the CEV and the AB.

[21]ఈ వాక్యాన్ని మీరున్న స్థలానికి అనువుగా మలుచుకోండి. [22]రోమా 4:18; 5:4లో "నిరీక్షణ" మీద కన్పించే చర్చను రివ్యూ చేయి. ("అబ్రాహాము అడుగుజాడలను వెంబడించుట [4:17బి–25]" మరియు "మీ పిల్లలకు ఉపదేశించ వలసిన మూడు సత్యాలు [5:1–8]" ఈ పాఠాలను రోమా పుస్తకం, 2లో చూడు.) [23]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 447. [24]Vine, 17. మనం "ట్రిబ్యులేషన్" అనే పదాన్ని అనేకసార్లు రోమన్‌లలో ఎదుర్కున్నాం. ఆ వ్యాఖ్యానాలను పునరవలోకించండి. [25]Ibid, 462. "తీర్పు దినం కొరకు నీవు సిద్ధంగా ఉన్నావా? (2:1–16)" రోమా పుస్తకం 1లో "పట్టువీడని" అనేదాని మీద కామెంట్సు చూడు. [26]NASBలో 10, 12 వచనాలలో "devoted" అనే ఆంగ్ల పదం ఉంది, వచనం 10లో ఉన్న దానికంటే వచనం 12లో వేరే గ్రీకు పదం వాడబడింది. [27]Vine, 44; W. Grundmann, "*kartereo*," in Geoffrey W. Bromiley, *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel and Gerhard Friedrich, trans. Geoffrey W. Bromiley, abr. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 417. [28]Vine, 177, 233. [29]"Saint" అనేది తెలుగులో పరిశుద్ధుడు, "మీకు ఉత్తరం వచ్చింది! (1:1–7)" రోమా పుస్తకం, 1లో చూడు. [30]Hartman.

[31]Adapted from Vine, 312. [32]A. Oepke, *"dioko,"* in Geoffrey W. Bromiley, *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel and Gerhard Friedrich, trans. Geoffrey W. Bromiley, abr. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 177. [33]D. Stuart Briscoe, *Mastering the New Testament: Romans,* The Communicator's Commentary Series (Dallas: Word Publishing, 1982), 223-230.

# 55

# "క్రైస్తవుడు ఎలా కన్పిస్తాడు?"

## (12:14-16)

తరగతులలోను, ప్రసంగాలలోను "క్రైస్తవుడు" అనే పదాన్ని ఉపయోగించడం ఒక చిన్న పిల్లవాడు అనేకసార్లు విన్నాడు, గాని దాని అర్థమేమో వానికి నిశ్చయంగా తెలియకపోయింది. "డాడీ, క్రైస్తవుడంటే ఏమి?" అని ఆ బాలుడు తన తండ్రిని అడిగాడు. క్రైస్తవుడంటే క్రీస్తుకు చెందినవాడు అని చెప్పి, ఒకడు ఎలా క్రైస్తవుడైయుంటాడో అతడు ఆ బాలునికి వివరించాడు. ఆ బాలుడు యింకను ఆశ్చర్యపడుతునే ఉండగా, వానికి అతడు యిలా చెప్పాడు, "క్రైస్తవుడంటే ఫలాని విధంగా జీవించాలి. నేను రోమా 12 చదువుతున్నాను, విభిన్నమైన పరిస్థితులలో క్రైస్తవుడు ఎలా నడుచుకోవాలో మంచి సంగ్రహము ఆ అధ్యాయంలో కన్పిస్తుంటుంది." రోమా 12:9–16వరకు అతని నోట్సు తీసికొని చదివి, "క్రైస్తవుడు ప్రేమించువాడు, స్వార్థ రహితుడు, ఉత్సాహముతో కూడినవాడు, క్రమమైనవాడు, సహాయం చేసేవాడు, కృపగలవాడు, దయగలవాడు, మరియు వినయశీలి."[1] ఆ బాలుడు తన తండ్రి మాటలను యోచించి, "నేనెప్పుడైనా క్రైస్తవుని చూచానా?" అని అతనిని అడిగాడు.

ప్రతి క్రైస్తవుడు రూపాంతరము పొందిన జీవితాన్ని జీవించాలని పౌలు రోమా 12:2లో కోరాడు. 9నుండి 16 వచనాలవరకు, రూపాంతరము పొందిన జీవితపు ఉదాహరణలను – అంటే, క్రైస్తవుడు ఎలా కన్పిస్తాడో ఆ విధానాన్ని అతడు చూపాడు. "ప్రేమించడానికి సవాలు" అంటూ మనం 9నుండి 13 వచనాలు చదివాం. ఈ పాఠంలో మిగిలిన మూడు వచనాలను చర్చించుదాం. పౌలు జాబితాలో ఏ క్రొత్తదనం లేదు. వీటివంటి హెచ్చరికలను అతని పాఠకులు తరచుగానే వినియుంటారు, కాని విశ్వాసము వలన నీతిమంతులుగా తీర్చబడినవారి జీవితంలో యిది సహజమైన ఫలితమైయుండాలని పౌలు వారిని కోరుతున్నాడు.

మొదటి శతాబ్దంలో ఎలాగో నేడును పౌలు హెచ్చరికలు అంతే పట్టింపుగలవై ఉన్నాయి. R. C. Bell యిలా రాశాడు, "మన కష్టం అర్థం చేసికొనడంలో కాదుగాని, ఈ లేఖన భాగం కోరేవాటికి లోబడడమే అయ్యుంది."[2] ఇతరులతో మన సంబంధాలను గూర్చి – సాటి క్రైస్తవులతో, మన పొరుగువారితో, స్నేహితులతో, కడకు మన శత్రువులతో సహా – ఉండవలసిన సంబంధాన్ని ఈ లేఖన భాగం నొక్కి చెప్పుతుంది. మూల వాక్యాన్ని మనం చదివేటప్పుడు, ప్రత్యేకింపబడిన పరిస్థితులలో "క్రైస్తవుడు ఎలా కన్పించాలనేది" మనం కనుగొంటాం. "నన్ను ఎరిగినవారు 'క్రైస్తవుని ఎప్పుడైనా చూచియుంటారా?' " అనే మన ప్రశ్నను ప్రతి ఒక్కరు వేసుకోవాలి.

## క్రైస్తవుడు కృపగలవాడైయుంటాడు
## (12:14)

తన వ్యక్తిగత పరిచర్య కాలంలో, తన అనుచరులను ఈ లోకం ఎలా చూస్తుందో అనేదానికి సంబంధించి దిగ్భ్రమ కలిగించే ప్రతిపాదనలను ప్రభువు చేశారు. "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డ మాట లెల్ల పలుకుదురు" (మత్తయి 5:11) అని తన శిష్యులతో చెప్పారు. మరల, "మిమ్మును ద్వేషించి వెలివేసి నిందించి మీ పేరు చెడ్డదని కొట్టివేతురు" అని ఆయన తెలిపారు (లూకా 6:22). ఆలాటి పరిస్థితులలో క్రైస్తవుడు తన్నుతాను కనుగొనినప్పుడు క్రైస్తవుడు "ఎలా కన్పించాలి?" ఆ విధంగా దేవుని బిడ్డ చూడబడినప్పుడు, అతడు కృపగలవాడుగా ఉండాలి: "మిమ్మును హింసించువారిని దీవించుడి[3]; దీవించుడి గాని శపింపవద్దు." ఈ అధ్యాయం చివరి అయిదు వచనాలలో (రోమా 12:17-21), వివరించబోయే ఒక అంశాన్ని ఈ వచనాలు పరిచయం చేస్తాయి.

"దీవించు" అనేది *eulogeo* నుండి వచ్చింది. "Eulogy" అని మనం అనే పదానికి క్రియా రూపం, "మంచి మాట" అనేది దాని అక్షరార్థం. (*eu* నుండి ["మంచి" లేక "మేలైన"] + *logos* ["వాక్యము"])[4] "eulogize" ఒకడు తన పక్షంగా "ఒక మంచి మాట పలుకుట." ఈ సందర్భంలో, *eulogeo* మనపై చెడ్డ మాటలు పలుకువారికి దేవుని పక్షంగా "మంచి మాట పలుకుట." "శాపము" (*ara* ["శపించుట"] అది *kata* చే తీవ్రం చేయబడింది) "శాప వచనాలను" పలకడాన్ని అది సూచించదు[5] అది "దీవించుటకు" వ్యతిరేకమైనదాన్ని సూచిస్తుంది: మనలను హింసించినవారి మీద దేవుని శాపాలను పలుకుటను సూచిస్తుంది. CEV 14వ వచనాన్ని యిలా తర్జుమా చేస్తుంది: "నిన్ను హింసించు ప్రతి ఒక్కరి మీద దీవించుమని దేవుని అడుగు. ఆయన వారిని దీవించుమని అడుగు గాని వారిని శపింప గోరకు." ఈ వచనం క్రీస్తు బోధను ప్రతిధ్వనిస్తుంది: "మిమ్మును శపించువారిని దీవించుడి, మిమ్మును బాధించువారికొరకు ప్రార్థనచేయుడి" (లూకా 6:28; మత్తయి 5:44 చూడు).

ఆక్షేపణను నేను యిక్కడ ఎదురు చూస్తున్నాను: "అయితే అది అసాధ్యం!" అది కష్టమన్న మాట వాస్తవమే గాని అది అసాధ్యమైనది కాదు. "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము" అని ఆయన పలికినప్పుడు, సిలువపై యేసు చేసింది అదియే (లూకా 23:34). స్తెఫను చేసింది కూడా అదియే. రాళ్లు రువ్వి చంపబడుతుండగా, "ప్రభువా, వారిమీద ఈ పాపము మోపకుమని" గొప్ప శబ్దముతో పలికాడు (అపొస్తలుల కార్యములు 7:60). పౌలు అదే చేశాడు. కొరింథీయులకు అతడు యిలా తెలిపాడు, "నిందింపబడియు దీవించుచున్నాను" (1 కొరింథీయులకు 4:12).

దేవుని బిడ్డయైనందుకు ప్రాథమికంగా హింసింపబడుతున్న దానిపై రోమా 12:14 దృష్టి నిలిపింది, కాని హింసింపబడే యితర పరిస్థితులకు కూడ దీన్ని వర్తింపజేయవచ్చు. ప్రజలు ఎల్లప్పుడు యితరులకు దయ చూపని ప్రజల మధ్య

జీవించుతున్న కారణాన కూడ క్రైస్తవులు కొన్నిసార్లు చెడ్డగా ట్రీట్ చేయబడతారు. ఆలాటి పరిస్థితుల్లో, అవిశ్వాసులు తరచుగా శపిస్తారు – కాని క్రైస్తవుడు దీవిస్తాడు. (దాని మూలం ఎక్కడనుండియైనా) హింస వచ్చినప్పుడు, "క్రైస్తవుడు ఎలా కన్పిస్తాడు?" క్రైస్తవుడు కృపగలవాడైయుంటాడు.

## క్రైస్తవుడు సహానుభవము గలవాడైయుంటాడు (12:15)

క్రీస్తును వెంబడించేవాని మరొక లక్షణమేమంటే, అతను సహానుభవముగలవాడై ఉండాలి (స్వభావ తుల్యత). "సంతోషించువారితో సంతోషించుడి; ఏడ్చువారితో ఏడువుడి" (15 వచనం) అని పౌలు వ్రాశాడు. సాటి క్రైస్తవులతో ఉండవలసిన సంబంధంతో ప్రత్యేక వర్తింపు ఈ హెచ్చరిక కలిగియుంది. రోమా 12లోని తొలి భాగమందు, "[ఆత్మ సంబంధమైన] శరీరమను [సంఘమందు] సభ్యులు ఒకరికొకరు అవయవములైయుండి నట్టు" పౌలు నొక్కి చెప్పాడు (4, 5 వచనాలు). కొరింథీయులకు వ్రాస్తూ, "కాగా ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవములన్నియు దానితో కూడ శ్రమపడును; ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవములన్నియు దానితో కూడ సంతోషించును" అని పౌలు చెప్పాడు (1 కొరింథీయులకు 12:26).

రోమా 12:15 సంఘ సభ్యుల మధ్య సన్నిహితత్వాన్ని ముందుగా ఊహిస్తుంది. ప్రతివారము యితర క్రైస్తవులతో చేరి కేవలం ప్రభురాత్రి భోజనం చేయడంవలన ఈ సన్నిహితత్వం సాధించ వీలుపడదు. బైబిలు తరగతులకును, ఆరాధనా కార్యక్రమాలకు ముందును తరువాతను క్రైస్తవులు ఒకరితో నొకరు మాట్లాడుకొనడంవలన అది రాదు. ఇవన్నీ ముఖ్యమైనవే, కాని 15వ వచనం యింకా అధికంగా కోరుతుంది. ఓక్లహోమా క్రైస్తవ విశ్వవిద్యాలయంలోని ఒక ఉపాధ్యాయుడు తనకు తాను తన్నుగురించి ఆలోచించు కొనేవాడనని అంగీకరిస్తాడు, అయినా అతడు తన విద్యార్థులకు యిలా చెప్పుతాడు: "స్వాభావికంగా మనం బయటికి పోవువారం అయినా కాకపోయినా, ప్రజల జీవితాల్లో మనం గాఢంగా పనిని చేయడానికి మనం పిలువబడ్డాం."[6] జీవితంలోని ఆలాటి సంఘటనలలో ఒకరితోనొకరం పాలుపొందుతుండగా – జన్మలు, వివాహాలు, మరియు చావులు, నవ్వును, కన్నీటిని మనకు తెస్తుంటాయి.

క్రీస్తు శరీరములో వాస్తవానికి ఈలాటి సన్నిహిత సంబంధాలను ఎలా పెట్టుకోగలం? కీలకమైన మాటలు "లక్ష్యపెట్టు" మరియు "పంచిపెట్టు" అనేవే. క్రీస్తునందున్న మన సోదర సోదరీల జీవితంలో ఏమి సంభవించుతుందో మనం లక్ష్యపెట్టాలి. అప్పుడు మన జీవితాలలోనికి మంచి, చెడ్డ అనే రెండింటిని మనతోటి క్రైస్తవులతో పంచుకోవలసి ఉంటుంది.

15వ వచనంలోని సందర్భం కేవలం దేవుని ప్రజలతో మనకుండవలసిన సంబంధాన్ని ప్రాథమికంగా సూచిస్తున్నా, ఆ లేఖన భాగానికి విశాలమైన వర్తింపు చేయబడవచ్చు. ఎవరితో సంబంధం కలిగియుండడానికి క్రైస్తవుడు వస్తాడో వారి జీవితాలయందు క్రైస్తవుడు ఆసక్తి, అభిలాషగలవాడైయుండాలి, వారినందరిని తాను

చేసిన మేలుతో ప్రభావితులను చేయాలి. ఇతరులకు మేలు చేయడం మంచిది కనుక ఆతడలా చేస్తాడు. కొన్నిసార్లు అలా చేయడంవల్ల జనులు తమకు సుఖదుఃఖాలు కలిగే సున్నిత క్షణాల్లో సువార్తకు అధిక విధేయతను చూపుతారు. వారి జీవితాల్లో ఆ సంఘటనలు కన్నీళ్ళను, ఆనందాన్ని తెస్తాయి.

వచనం 15లోని పౌలు ఉపదేశము మరి ఎక్కువ సవాలుగా చేయనిమ్ము. నీకు చెడ్డ విషయాలే సంభవించుతున్నట్టున్న కాలంలో, మరొకనికి మేలు సంభవిస్తుంటే ఏమౌతుంది?[7] ఆలాటివానితో నీవు ఆనందించగలవా? ఒకడు నీకు కీడు చేస్తునే ఉన్నాడు, అతని జీవితం తటాలున విపత్తుతో నింపబడినట్టయితే ఏమౌతుంది? అతనితో నీవు ఏడ్వగలవా లేక "తగిన శాస్తి వానికి జరిగిందని" నీవు తలంచుతావా? "నీవు వర్ణించిన పరిస్థితుల క్రింద ఒకనితో సంతోషించుటయైనా లేక ఏడ్వడమైనా అసహజమని" నీవు ఆక్షేపించవచ్చు. అది నిజమే. అది స్వాభావికమే, అయితే దేవుని సహాయముతో శరీరము యొక్క సహజమైన అపేక్షలకు పైగా నిలిచియుండాలని క్రైస్తవులకు సవాలు చేయబడింది.

ఒక క్రైస్తవుడు ఎవనితోనైనా పాడగలడు, బాధననుభవింపగలడు. క్రైస్తవుడు సహానుభవముగలవాడైయుంటాడు.

## క్రైస్తవుడు వినయంగలవాడైయుంటాడు (12:16)

16వ వచనంలో యితరులకంటే తాము శ్రేష్ఠులమని తలంచేవారితో పౌలు మాట్లాడు తున్నాడు: ఎందుకంటే వారికి ఎక్కువైన ధనమో లేక అధికారమో ఉంది; వారు ఎక్కువ నేర్పుగలవారు లేక ఎక్కువ విద్యగలవారు; లేదా యితర అనేక కారణాలను బట్టి ఘనులుగా భావించేవారు. ఎక్కువ కాలం క్రైస్తవులైనందున కూడ యితర సభ్యులకంటే స్థానిక సంఘంలో అధికులనుకునేవారికి కూడ దీన్ని వర్తింపజేయవచ్చు; లేక బైబిల్లో ఎక్కువ జ్ఞానమున్నందుకు, సంఘపు పనిలో చురుకుగా ఉన్నందుకు, ఎక్కువ భక్తిగా జీవించుతున్నందుకు అధికులనే భావం తగదు.

### స్వభావం (వైఖరి)

పౌలు యిలా ఆరంభించాడు, "ఒకనితో నొకడు మనస్సుకలిసి యుండుడి" (16ఎ వచనం). మనం నమ్మి ఉపదేశించేవాటియందు "ఏక మనస్సు కలిగియుండుడి" అని మరో చోట సవాలు చేయబడ్డాం (1 కొరింథీయులకు 1:10). ఇక్కడ, "అందరియెడల ఒకే విధముగా మసలుకొనడం; యిష్టుడు అనే ఆటలాడకండి" అని అన్నట్టు గోచరిస్తుంది. "ప్రతి ఒక్కరిని సమానమైన దయతో భావించుడి" అని JB అంటుంది.

### సహవాసం

"హెచ్చువాటియందు[8] మనస్సుంచక తగ్గువాటియందు ఆసక్తులైయుండుడి" అంటూ మూల వాక్యం కొనసాగింది (రోమా 12:16బి). నేటివలెనే పౌలు దినాల్లో

కూడ స్వపక్షమందలి దురభిమానం ఉండేది. సంఘ కూడికల్లో ఒక పేదవాడు, ఒక ధనికుడు ఎలా వేరుగా చూడబడేవారో యాకోబు చిత్రించాడు (యాకోబు 2:1-9 చూడు). మురికిగాను, చినిగిపోయిన దుస్తులతో సంపదగల సంఘపు ఆరాధనా కార్యక్రమానికి హాజరయ్యిన కథ ఒకటి చెప్పబడింది. అతడు వచ్చి ఎవరి వస్త్రాలు, ఆభరణాలు ఐశ్వర్యాన్ని చాటుతున్నాయో ఆమె ప్రక్కన క్రింద కూర్చున్నాడట. వచ్చిన ఆ సందర్శకుని నుండి ఎంత దూరం జరగగలదో అంత దూరం జరిగింది. అంతలో చర్చి బిల్డింగ్ లోనికి వచ్చేవారికి స్థలం చూపే ఒకడు ఆమె ప్రక్కగా వెళ్లుతుండగా, "నాకు కొట్టే వాసన నీకు కూడా కొడుతుందా?" అని బిగ్గరగా గుసగుసలాండిందట. అతడు గాలిని వాసన చూచి, "అవును, అహం - ప్రాధాన్యత అనే వాసన కొట్టుతుందని" అతడు బదులిచ్చాడు.

క్రైస్తవ్యం గొప్పగా సమానత్వం చేసేదైయుంది (గలతీయులకు 3:28). క్రీస్తు, హోదా వ్యత్యాసాన్ని గాని లేక కుల విధానాలను గాని చూచేవారు కారు. Abilene Christian College (now University) అబిలీన్ క్రైస్తవ కళాశాలకు నేను వెళ్లినప్పుడు, ఆ కళాశాల అధ్యక్షుడు, కళాశాల క్రీస్తు సంఘం యొక్క పెద్దలలో ఒకడు. ఆ కళాశాల ద్వార పాలకుడు కూడా పెద్దలలో ఒకడైయున్నాడు - ఆ యిద్దరు పెద్దల మీటింగులో కూర్చున్నప్పుడు, ఒకరి అభిప్రాయమెలాగో రెండవవాని అభిప్రాయం కూడ అంతే ప్రాముఖ్యంగా ఉండేది.

పౌలునాటి పరిస్థితికి తిరిగి వచ్చినప్పుడు, అనేక స్థానిక సంఘాలలో అధిక శాతం పేదలే సభ్యులుగా ఉండేవారు (1 కొరింథీయులకు 1:26-28). పైగా, యజమానులు, బానిసలు కూడ క్రైస్తవులైనవారు ఉండేవారు (ఎఫెసీయులకు 6:5-9 చూడు). తొలిసారిగా యజమానుడును అతని బానిసయు ఒకని ప్రక్కన ఒకడు కూర్చుండి సంఘ కూడికలలో ప్రభురాత్రి భోజనం చేసేటప్పుడు ఎలాటి వ్యక్తిగతమైన ఉద్వేగాలు పైకి లేచియుంటాయో నీవు ఊహించగలవా?

ప్రజలందరి యెడల క్రైస్తవులుగా మసలుకొనడానికి దేవుడు మనకు సహాయము చేయును గాక. దాదాపు ప్రతి స్థానిక సంఘంలోను, కనీసం ఒక్కరైనా దానికి చెందినవారు కానట్టు లేదా సిగ్గుతో బాధాకరంగా ఉన్నట్టుంటారు. ఆలాటి వ్యక్తులను క్రైస్తవులు వెదకి, వారిని దర్శించుతూ, సహాయం చేస్తూ, వారి ప్రేమను, అంగీకారమును వారికి పంచుతుంటారు.

16వ వచనంలోని ఈ భాగాన్ని నేను విడువక ముందు, "lowly" అనేది "దీనులైన [ప్రజలకు]" బదులు, "తక్కువ [వాటియందు]" అని తలంచుతారని ప్రస్తావించవలసియుంది. TEV "వినయమైన బాధ్యతలు" అని అంది. "హీనమైన పనిచేయ నిష్టపడుట" అని NIV footnoteలో ఉంది. పౌలు చెప్పనుద్దేశించినది యిదో కాదో, ఈ సత్యము ఆలోచింప దగినదైయుంది. అల్పమైన పనులు చేయలేని "ఉత్తములుగా" మనలను మనం ఎంచుకో కూడదు. తన శిష్యుల పాదాలను కడిగినప్పుడు ప్రభువైన యేసు బానిసవాని పనిని చేశారు (యోహాను 13:5-17). తన స్వహస్తములతో పనిచేసి, అపొస్తలుడైన పౌలు తన్ను తాను పోషించుకున్నాడు (1 కొరింథీయులకు 4:12;

అపొస్తలుల కార్యములు 18:3). లోకమంతటిలో క్రైస్తవులు "లోక సంబంధమైన ఉద్యోగాలు" చేసికొంటూ, ఆదివారములలో క్రీస్తు సువార్తను ప్రకటించేవారున్నారు.

**హితోపదేశం**

రోమా 12:16ను పౌలు ఈ హితోపదేశంతో ముగిస్తున్నాడు: "మీకు మీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దు" (16సి వచనం; సామెతలు 3:7 చూడు). "అంతా తనకే తెలుసు" అన్నట్టు నటించే ఎవనినైనా నీవు ఎరిగియున్నావా? అది ఏ అంశమైనా సరే, ఆ అంశం మీద తనదే "అధికారమైయున్నట్టు" ఒప్పించ ప్రయత్నిస్తాడు. సాధారణంగా మనం ఆలాటి ప్రజలను దూరం చేసికొంటాం. Leon Morris యిలా రాశాడు, "తన దృష్టిలో తానే జ్ఞానిననుకునేవాడు, అరుదుగా యితరుల దృష్టిలో అలా కన్పిస్తాడు."[9] అయినా యితరులవైపు మన వ్రేలిని చూపడం పౌలు ఉద్దేశం కాదు, కాని మనలను మనం పరీక్షించుకొనడమే అయ్యుంది. బైబిలు సంబంధమైన జ్ఞానంలోనే గాని, లేక "సాధారణమైన జ్ఞానంలోనే గాని," నిజముగా జ్ఞానులైనవారు తమకు తెలియనివి తాము గ్రహించనివి ఎన్నో ఉన్నట్టు గుర్తెరుగుతారు.

"క్రైస్తవుడు ఎలా కన్పిస్తాడు"? అతడు వినయముగా ఉంటాడు. అతడు ఇతర క్రైస్తవులతో డీల్ చేసేటప్పుడుగాని, లోకంలో ఉన్నవారితో డీల్ చేసేటప్పుడు గాని యిది నిజమైయుంటుంది. ప్రతివానిని అతడు గౌరవించి అంగీకరిస్తాడు, అతడు యితరులకంటే శ్రేష్ఠుడనే భావాన్ని కనుపరచడు. "కొన్ని రకాలైన అతిశయం ఎదుటి వానిని తక్కువగా చూచేవానికంటే హీనమైనది" అని John R. W. Stott అన్నాడు.[10]

ఇక్కడ నేనొక విషయాన్ని చెప్పాలి. "అంగీకారమంటే అనుమతినివ్వడం కాదు."[11] వారి విశ్వాసాలను జీవిత విధానాలకు సమ్మతించకుండ యితరులకు మనం గౌరవం చూపవచ్చు. యేసు "పాపుల స్నేహితుడని ..." పిలువబడ్డారు (మత్తయి 11:19), అయితే వారికి ఆయన సందేశమేమంటే, "ఇకను పాపము చేయకుము" (యోహాను 8:11).

మరొక వర్తింపును ఆలోచించుదాం. మనం "అప్పర్ క్లాస్" అని పిలిచేవారికి పౌలు ప్రత్యేకించి అడ్రస్ చేస్తున్నాడు, కాని, వారి జీవితపు అంతస్థులు ఎలాటివైనా, రోమా 12:16 సందేశం ప్రజలందరికి అవసరమైయుంటుందని నా అనుభవం అంటుంది. డబ్బులేనివారు కలవారిని గూర్చి ఒక విధంగా మాట్లాడడాన్ని నేను విన్నాను. విద్యలేనివారు పెద్ద డిగ్రీలు గలవారిని గూర్చి తమాషాగా మాట్లాడడాన్ని నేను విన్నాను. ఏదో యొక కారణాన్ని బట్టి, యితరులకంటే మనం శ్రేష్ఠులమని ఆలోచించే స్వాభావికమైన కోర్కె ఒకటి ఉంటుంది: మనం ఎక్కడ నివసిస్తున్నామో, దేహపు రంగునుబట్టి, రాజకీయ సంబంధాలను బట్టి ఇలాటి తలంపులొస్తాయి – నీవు జాబితాకు సంగతులను చేర్చవచ్చు. ఈలాటి విషయాలు క్రైస్తవునికి ముఖ్యమైనవైయుండవు. అతడు ప్రజలందరిని ప్రేమిస్తాడు, వినయంగా ఉంటాడు.

## ముగింపు

రోమా 12:9-16కు మనం రెండు పాఠాలను ఉపయోగించాం. మనం లోకానికి భిన్నంగా ఉండాలని క్రీస్తు కోరుతున్నట్టు ఈ వచనాలు తేటపరుస్తున్నాయి. క్రైస్తవులెల్లరు ప్రేమగలవారుగాను, స్వార్థ రహితులుగాను, ఉత్సాహకరంగాను, పొందికగాను, సహాయకరంగాను, కృపగలవారుగాను, సహానుభవము గలవారుగాను, వినయముగాను ఉండడానికి అతడు పిలుపునిచ్చాడు. నీవు వ్యక్తిగతమైన వర్తింపుచేసికొంటున్నావని నేను నిరీక్షిస్తున్నా: "క్రైస్తవుడెలాటివాడో నా చుట్టునున్న జనులు చూచి ఉంటారా?"

రోమా 12:9-16లో, లోకము యొక్క మాదురులకును, ప్రమాణములకును మించినవారుగా మనం ఉండాలని ప్రభువు పోటీపడమంటున్నారు. ఆయన సహాయముతో మనం ఈ పని చేయగలమని ఆయన చెప్పారు. సవాలును అంగీకరించి, క్రైస్తవుడు ఎలా జీవించాలో అలా జీవించడానికి ప్రయాసపడదామా లేక మన జీవితాలను మార్చుకోకుండగనే పౌలు మాటలు విందామా?

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

ఈ ప్రసంగం చేసినప్పుడు, ఒకడు ఎలా క్రైస్తవుడు కావాలో నీ శ్రోతలకు చెప్పు (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38). త్రోవ తప్పిన క్రైస్తవుడు తిరిగి ఎలా పునరుద్ధరింపబడవచ్చో చెప్పు (అపొస్తలుల కార్యములు 8:22; 1 యోహాను 1:9). పాఠంలో ఉన్నట్టు "ప్రేమించుటకు పిలుపునిమ్ము (12:9-13)," నేను ఒక వచనానికి ఒకే హెడ్డింగ్ యిచ్చాను; గాని నీవు 3వ వచనంతో ఎక్కువ హెడ్డింగ్స్ యివ్వవచ్చు.

---

సూచనలు

[1]రోమా 12:9-16ను ఒకే స్టడీగా చేయగోరితే, ఈ అంశాలనే నీ మెయిన్ పాయింట్స్‌గా చేసికోవచ్చు- (వచనానికి ఒకటి చొప్పున) ప్రేమ యొక్క తొలి అయిదు లక్షణాలను "ప్రేమించుటకు పోటీ (12:9-13)" అనే పాఠంలో మనం చూడవచ్చు. [2]R. C. Bell, *Studies in Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1957), 138. [3]"You" అనే దానికైన గ్రీకు పదం కొన్ని ప్రాచీన ప్రతులలో లేదు. ... [4]Adapted from W. E. Vine, Merril F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 69. [5]ఈలాటి భాష వేరొక చోట ఖండించబడింది. ఉదాహరణకు, కొలొస్సయులకు 3:8 "బూతులు" ("filthy communications"; KJV). [6]Luke Hartman, "God's Call to Love," sermon preached at Eastside church of Christ, Midwest City, Oklahoma, 17 July 2005. [7]నీవెక్కడ నివసిస్తావో దానికి తగిన చిత్రాలను జతచేయి. "మీకు తగిన గుర్తింపును అతడు పొందాడు" లాంటివి. [8]"High" (hupselos) అనే విశేషణపు రూపంనుండి "haughty" వచ్చింది. "హెచ్చువాటియందు [things] మనస్సునుంచడమనేది" గ్రీకు తర్జుమా. "Things" అనేది సరఫరా చేయబడిన పదం (KJV చూడు). "People" అనేది సప్లై చేస్తుండాలి అని కొందరు అనుకుంటారు. ముఖ్యమైనవారినుండి ఆదరణను కోరుకోకు. సాధారణ జనుల సాంగత్యంతో ఆనందించు. [9]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 451. [10]John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The

Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 333.

[11]Richard A. Batey, *The Letter of Paul to the Romans,* The Living Word Commentary (Austin, Tex.: R. B. Sweet Co., 1969), 155.

# 56

# ప్రేమింపదగనివారిని ప్రేమించేదెలా

## (12:14, 17-21)

పాఠశాల చదువు పూర్తిచేయనున్న ఒక బాలుడు తన యింటిలోనికి వెళ్లి, "చివరి పరీక్ష రాసేశాను" అంటూ బిగ్గరగా అరిచాడు! అతని తండ్రి, "నీవు గ్రహించలేదు, కాని జీవిత పరీక్షలు యిప్పుడే ఆరంభమౌతున్నాయని" తల ఆడించాడు. పదవి చదువులను మనం ముగించిన తరువాత కూడా, అనుదినం మనం పరీక్షకు లోనవుతాం. మన మార్గంలో వచ్చే పరీక్షలన్నిటిలో, మనం చదువబోయే లేఖన భాగంలో ప్రతిపాదించబడిన దానికంటె కష్టమైనదేదియు లేకపోవచ్చు.

ఆ పరీక్ష రోమా 12:14లో పరిచయం చేయబడింది: "మిమ్మును హింసించువారిని దీవించుడి; దీవించుడి గాని శపింపవద్దు." 17నుండి 21 వచనాలవరకు అది వివరించబడింది:

> కీడుకు ప్రతి కీడెవనికిని చేయవద్దు; మనష్యులందరి దృష్టికి యోగ్యమైనవాటిని గూర్చి ఆలోచన కలిగియుండుడి. శక్యమైతే మీ చేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి. ప్రియులారా, మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి – "పగతీర్చుట నా పని, నేనే ప్రతిఫలమునిత్తును" అని **ప్రభువు** చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. కాబట్టి, "నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు." కీడువలన జయింపబడక, మేలుచేత కీడును జయించుము.

14వ వచనంను మనం చేర్చినట్టయితే, ఈ లేఖన భాగంలో నాలుగు వ్యతిరేకములుంటాయి. ఈ నాలిగింటి సందేశం ప్రాథమికంగా ఒక్కటే.[1]

- "[మిమ్మును హింసించువారిని] శపింపవద్దు" (14 వచనం).
- "కీడుకు ప్రతికీడెవనికిని చేయవద్దు" (17 వచనం).
- "మీకు మీరే పగతీర్చుకొనవద్దు" (19 వచనం).
- "కీడువలన జయింపబడవద్దు" (21 వచనం).

పరస్పర విరుద్ధమైన ఈ నాలుగు అనుకూలమైనవాటిచే తూలన చేయబడ్డాయి. నీ శత్రువులను దీవించు (14 వచనం). మేలైనది చేసి, సమస్త మనుష్యులతో సమాధానంగా నుండ ప్రయాసపడు (17, 18 వచనాలు). పగతీర్చుకొనే విషయం దేవుని చేతికి

అప్పగించు, శత్రువులకు ప్రేమ చూపడంలో దృష్టిని నిలుపు (19, 20 వచనాలు). మేలుతో కీడును జయించు (21 వచనం).

"వ్యక్తికి వ్యక్తికి సంబంధించిన బాంధవ్యాల్లోని మిక్కిలి గొప్ప వాక్యములలో ఒకటి" రోమా 12:17-21 అని John Kachelman పిలిచాడు.[2] హింసించువారు (14 వచనం) అనడంలో - నిన్ను గాయపరచ చూచే అవిశ్వాసులు పౌలు మనస్సులో ఉన్నారు. శత్రువులు (20 వచనం), దుష్టులైన మనుష్యులు (21 వచనం). అయినా, ఈ మూల వాక్యాన్ని అనంగీకారంగానున్న సోదరుల విషయంలో కూడ వర్తింపజేయవచ్చు. సంక్షోభముతో నింపబడిన కుటుంబాలకు సయితం యిది సహాయము చేయవచ్చు. "ప్రేమింపదగనివారిని ప్రేమించేదెలా?" అని నేను ఈ పాఠానికి పేరు పెడుతున్నాను. క్లుప్తంగా 14వ వచనాన్ని చూచి, 17నుండి 21 వచనాలవరకు మనస్సును కేంద్రీకరిద్దాం.

## వాని కొరకు ప్రార్థించు (12:14)

14వ వచనంలో మనమిలా చదువుతాం, "మిమ్మును హింసించువారిని దీవించుడి; దీవించుడి గాని శపింపవద్దు." "దీవించడమంటే," "దేవుని దీవెనను కోరడ మనియు," "శపించడమంటే," "దేవుని శాపమును కోరడమనియు" మనం చూచాం. మనం మొదటిది చేయాలి, రెండవది చేయకూడదు. 14వ వచనమును సాధారణంగా చెప్పాలంటే, మనం మన శత్రువులకొరకు ప్రార్థించాలి.

ఆరాధనా కార్యక్రమాలలో పాల్గొంటాడు గాని ఆ ఊరిలో అతిగా సంతోషంలేని మనిషిగా కన్పించే ఒకని గూర్చి నేను చదివాను.[3] ఒకరోజు అతడు సువార్తికుని ఆఫీసుకు వచ్చి, "ఆ తక్కిన సభ్యులందరు నిజంగా సంతోషంగానే ఉన్నారా లేక వారు అలా నటిస్తున్నారా?" అని అడిగాడట.

"వారిలో అతి ఎక్కువమంది నిజంగా సంతోషంగానే ఉన్నారని నేను తలంచు తున్నానని" సువార్తికుడు బదులిచ్చాడు.

"అయితే, నేను కాదు. నేను దుఃఖములో ఉన్నానని" అతడు చెప్పాడు.

ఆ మనిషిని బాధిస్తున్నదేమో వారు మాట్లాడుతున్నారు. అతడు ద్వేషించే అయిదుగురు పోటీదారులు అతనికున్నారట. "వారు వక్రజనం!" "వారంతా చస్తే బాగుంటుంది!" అని అతడన్నాడు.

"నీవు సంతోషంగా ఉండాలంటే ఏమి చేయాలో నేను చెప్పుతాను, కాని నీవు అలా చేయవు" అని సువార్తికుడు అన్నాడు.

"అవును, నేను చేస్తాను" అని అతడన్నాడు.

ఆ సువార్తికుడు తలను ఆడించి, "లేదు, నీవు చేయవు" అని అన్నాడు.

"అవును, నేను చేస్తాను," "నేనేమి చేయాలో చెప్పు" అని ఆ మనిషి అన్నాడు.

"ప్రతిసారి నీవు పడకకు వెళ్లక ముందు, నీవు మోకాళ్లూని, నీ పోటీదారులలో ప్రతి ఒక్కరి కొరకు పేరు పేరున ప్రార్థించు. నూతన వ్యాపారంతో వారిని దీవించుమని నీవు దేవుని అడుగు" అని సువార్తికుడు అతనికి చెప్పాడు.

“ఏంటీ!” “అది నేను చేయబోయేది లేదు” అని ఆ మనిషి ఆశ్చర్యపోయాడు.

“నీవు అది చేయవని నేను నీకు ముందే చెప్పలేదా?” అని సువార్తికుడన్నాడు.

“నేను చేస్తానని చెప్పాను కదా? నీవు నన్ను మాయ చేశావని” ఆ మనిషి గొణిగాడు.

వారాలు గడిచాయి, నెమ్మదిగా అతని మోములో మార్పును ఆ సువార్తికుడు గమనించాడు. ఒకరోజు ఆ మనిషి తిరిగి సువార్తికుని ఆఫీసుకు వచ్చాడు. “మంచిది, సువార్తికుడా,” “అది పని చేసింది. ఇప్పుడు నేను నా పోటీదారులలో బాగానే కలిసి పోతున్నా. అయితే నేనొక విషయాన్ని ఒప్పుకోవాలి. నేను వారికొరకు ప్రార్థించేటప్పుడు, నేను ఆగి, ‘ప్రభువా, వాటిలో ఒక్క మాటయైనా నేను ఉద్దేశించలేదని’ పైకి చూచి అనేవాడిని. కాలక్రమంలో, ఉద్దేశపూర్వకంగా అనడం ఆరంభించాను – యిప్పుడు నేను సంతోషంగా ఉన్నాను” అని అతడన్నాడు.

ప్రేమింపదగని వ్యక్తిని నీవు ఎలా ప్రేమించగలవు? నీవు చేయగల మొదటి సంగతి నీవు వాని కొరకు ప్రార్థిస్తుండు.

## వానితో సర్దుకుపోజూడు (12:17, 18)

పరీక్షలో ఆ భాగం కష్టమైనదే, కాని 17, 18 వచనాలలో పరీక్ష మరీ కష్టం కానుంది: “కీడుకు ప్రతికీడెవనికిని చేయవద్దు; మనుష్యులందరి దృష్టికి యోగ్యమైనవాటిని గూర్చి ఆలోచన కలిగియుండుడి. శక్యమైతే మీ చేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి.”

**వ్యతిరేకమైనది: ప్రతీకారము చేయవద్దు (17ఎ వచనం).**

17వ వచనం యిలా ఆరంభమౌతుంది, “కీడుకు ప్రతికీడెవెనికిని చేయవద్దు.” అహమును – భద్రపరచుకొనడమనేది బహుగా ప్రాథమికమైన సహజ లక్షణమైయుంది. ఒకడు మనలను అవమానపరచునప్పుడు, మనం తిరిగి కొట్టగోరతాం. వడ్డీతో సహా మనం తిరిగి వానికి చెల్లించాలనుకుంటాం.[4] “కాని వాడు నన్ను మొదట కొట్టాడు!” అంటాడు పసివాడు. ఇది అతని దెబ్బకు సాకుగా భావిస్తాడు. ఈ మనస్తత్వంనుండి అనేకులు ఎన్నడూ బయటికి రారు. “ఈలోక మర్యాదననుసరింప వద్దని” పౌలు వచనం 2లో అన్నాడు. “కీడుకు ప్రతి కీడు చేసే” ఈ లౌకిక శాసనము ననుసరించకుండడం ఎంత కష్టం!

ఈ అంశం మీద దిగ్భ్రమ కలిగించే యేసు మాటలు నీకు జ్ఞాపకమున్నాయా?

> “ ‘కంటికి కన్ను, పంటికి పల్లు’ అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక, నిన్ను కుడిచెంపమీద కొట్టువాని వైపునకు ఎడమచెంప కూడ త్రిప్పుము. ఎవడైన నీమీద వ్యాజ్యెము వేసి నీ అంగీ తీసికొనగోరిన యెడల వానికి నీ పైవస్త్రమును కూడ ఇచ్చివేయుము. ఒకడు ఒక మైలుదూరము రమ్మని నిన్ను బలవంతము చేసినయెడల, వానితో కూడు రెండు మైళ్లు వెళ్లుము” (మత్తయి 5:38–41).

“ప్రతీకారము చేయని ఈ సూత్రం క్రైస్తవులను గుర్తించడానికి ఉన్న అతి విశేషమైన గుణగణాలలో ఒకటైయున్నట్టు”[5] Douglas J. Moo అన్నాడు.

పౌలు ఆజ్ఞకు మినహాయింపులేవైనా ఉన్నాయా? “కీడుకు ప్రతికీడెవనికిని చేయవద్దు” అని అతడన్నాడు (నొక్కి చెప్పింది నాది). గ్రీకు మూల వాక్యంలో, “ఎవనికైనను” అనేది నొక్కి చెప్పడానికి వాక్యపు ఆరంభంలో ఉంది. మనలో అనేకులకు యిది ఎట్టి పరీక్షయై ఉంది!

**అనుకూలమైనది: ఏది సరియైనదో అది చేయి (17బి వచనం).**

మనం కీడుకు ప్రతి కీడు చేయకపోతే, మనలను అవమానించినప్పుడు మనం ఏమి చేయాలి? 17, 18 వచనాల్లో ఉన్న అనుకూలమైన ఆజ్ఞలవైపు తిరుగుదాం. పౌలు యిలా అన్నాడు, “మనుష్యులందరి దృష్టికి యోగ్యమైనవాటిని గూర్చి ఆలోచన కలిగియుండుడి”[6] (17బి వచనం). “యోగ్యమైనది” అనేది *kalos* నుండి తర్జుమా చేయబడింది, అంటే, “స్వభావ సిద్ధముగా ‘మంచిది’ అని అర్థం.” “నైతికంగా మంచి, సరియైన, గంభీరమైన, ఘనమైన వాటిని సూచిస్తుంది.”[7] ఇతరులు ఎలా ప్రవర్తించినప్పటికి, క్రైస్తవుడు మాత్రం మంచి మాదిరియైయుండ ప్రయత్నిస్తాడు. “ప్రభువు దృష్టియందు మాత్రమే గాక మనుష్యుల దృష్టియందును యోగ్యమైన [*kalos* నుండి] వాటిని గూర్చి శ్రద్ధగా ఆలోచించుకొనుచున్నాము” అని పౌలు మరొక చోట అన్నాడు (2 కొరింథీయులకు 8:21).

రోమా 12:17 తరువాత భాగాన్ని J. B. Phillips యిలా తర్జుమా చేసింది: “ ‘జనులు ఏమనుకున్నా’ పరవాలేదు” అని క్రైస్తవులు అనవలసిన పరిస్థితులున్నాయి – ఉదాహరణకు, తన విశ్వాసము నమ్మికల నిమిత్తము అతడు విమర్శింపబడినప్పుడు. అయినా, రూలు ప్రకారం, నిందింపబడడానికి మించి క్రైస్తవుడు జీవించ ప్రయాసపడాలి. “నీ బహిరంగ ప్రవర్తన విమర్శకు పైన ఉండునట్లు చూచుకో” అని Phillips paraphrase చేర్చుతుంది.

**అనుకూలమైనది: సమాధానము కలిగియుండు (18 వచనం).**

తరువాత, ప్రతివానితో సమాధానంగా ఉండడానికి మనం చేయగలదంతా చేయుడని పౌలు చెప్పాడు – ఆఖరికి మనలను గాయపరచేవారితో సహా. 18వ వచనం యిలా అంటుంది, “శక్యమైతే మీ చేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి.” 17వ వచనంలో అన్నట్టే, తన ఆజ్ఞ విషయంలో అపొస్తలుడు విస్తరించి చెప్పుతున్నాడు: “సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి” (నొక్కి చెప్పింది నాది).

“అది అసాధ్యం” అని ఎవరేని ఆక్షేపించవచ్చు! పౌలు ఆలాటిదాన్ని ఎదురు చూచాడు అందుకే, “శక్యమైతే ...” అని అన్నాడు. సమాధానంగా ఉండడం కొన్నిసార్లు అసాధ్యం – ఎందుకంటె సత్యాన్ని గాని, నిజాయితీని గాని రాజీ చేయవలసి వస్తుంది – అది ఎంతో విలువ చెల్లించునదైయుంటుంది. ఇతర చోట్ల సమాధానం అసాధ్యమౌతుంది

ఎందుకంటే, మనం ఏమి చేసినా సరే, మరోవ్యక్తి సమాధానపడడాన్ని ఇష్టపడడు.

అది పౌలు యొక్క రెండవ యోగ్యతకు మనలను తెస్తుంది: "మీ చేతనైనంతమట్టుకు" (నొక్కి చెప్పింది నాది). "సంబంధంలో సగంవరకు మాత్రమే మనం బాధ్యులమై యుంటాం" అని Kachelman అన్నాడు.[8] ఎదుటి వ్యక్తిని మనం నియంత్రుత్వం చేయలేం సరిగదా అతడు ఎలా స్పందిస్తాడో చెప్పలేం. అతడు అంగీకరించినా అంగీకరించక పోయినా, సమాధానాన్ని వృద్ధిచేసే పని నీవరకు అయినంతమట్టుకు చేయాలి. కొండమీద ప్రసంగంలో, "సమాధానపరచువారు ధన్యులు, వారు దేవుని కుమారులనబడుదురు" అని ప్రభువైన యేసు అన్నారు (మత్తయి 5:9).

సమాధానాన్ని నెలకొల్పడానికి మనకు వీలైన సమస్తం చేయకుండ సాకులు వెదకడానికి ఉద్దేశించి – "శక్యమైతే," మీ చేతనైనంతమట్టుకు అనే రెండు యోగ్యతలను పౌలు యివ్వలేదని నేను నొక్కి చెప్పవలసిన అవసరముంది. "నీవు త్వరగా కోపపడు వాడవైతే, నీకు నీవు సహాయం చేసికోలేవు గనుక సరే" అని గాని, లేక "నీవు కొద్దిగా శ్రద్ధ చూపావు, అదే దేవుడు ఎదురు చూచేది" అని గాని అతడు చెప్పలేదు. "సమస్త మనుష్యులతో సమాధానంగా" ఉండడానికి నీకు చేతనైనదంతా చేయుమని అతడు సవాలు చేస్తున్నాడు.

"నేను కీడుకు ప్రతికీడు చేయకపోతే, నా శత్రువు దాన్ని అవకాశంగా తీసికొంటాడు" అని ఎవరైనా యోచింపవచ్చు. అలా కావచ్చు. "కీడుకు ప్రతి కీడు నేను చేయకున్నను, నా శత్రువులు నన్ను యింకను ద్వేషిస్తారు" అని మరొక వ్యక్తి ఆక్షేపణ చేయవచ్చు. అందుకు అవకాశముంది – కాని వారి ద్వేషము వారి సమస్య. సమాధానం నెలకొనడానికి మనం ఏమి చేయగలమో దాన్ని చేయాలని పౌలు అంటున్నాడు. అడవి జంతువును బోనులోనుండి విడిపించడానికి దయగల ఒక మనుష్యుడు ప్రయత్నిస్తున్న కథ ఒకటి చెప్పబడింది. అతడలా చేయగా, ఆ జంతువు బుసలు కక్కుతూ అతని కొట్ట ప్రయత్నిస్తుంది. "ఆ జంతువుకు సహాయం చేయడానికి నీవెందుకు శ్రమపడతావు?" అని దారిని పోయేవాడు అతని అడిగాడు. "అలా బుసకొడుతూ గోళ్లతో బరికడం దాని స్వభావం, సహాయం చేయడం నా స్వభావం. అది తన స్వభావాన్ని మార్చుకోనంత మాత్రాన నేను నా స్వభావాన్నెందుకు మార్చుకోవాలి?" అని అతడు బదులిచ్చాడు.[9]

ప్రేమింపదగనివానిని నీవు ఎలా ప్రేమించగలవు? వానితో సమాధానంగా ఉండ డానికి నీకు చేతనైనంతమట్టుకు చేయి.

## వానికి సహాయము చేయుము (12:19, 20)

పరీక్ష యింకను ఎక్కువ కష్టంగా మారుతుంది. 19, 20 వచనాలలో మనలను గాయపరచ ప్రయత్నిస్తున్నా, వారికి సహాయము చేయుటకు పౌలు సవాలు చేస్తున్నాడు.

**వ్యతిరేకమైనది: పగతీర్చుకొనకు (19ఎ వచనం).**

మరల పౌలు వ్యతిరేక భావంతో చెప్పుతున్నాడు: "ప్రియులారా, మీకు మీరే

పగతీర్చు కొనక" (19ఎ వచనం). 1:7నుండి (యిప్పటివరకు) తొలిసారిగా, పౌలు తన పాఠకులను "ప్రియులారా" అని సంబోధిస్తున్నాడు (*agapetos, agape* కుటుంబపు మాటలనుండి).[10] అతడు యిక్కడ ఆ పదాన్ని ఎందుకు ప్రయోగించాడు? అతని చర్చ యింకను "[*agape*] నిష్కపటమైన ప్రేమను" నొక్కి చెప్పుతున్నట్టే అది అర్థం కావచ్చు (9 వచనం). తన ఆజ్ఞలతో వారు ఏకీభవించడానికి తన సోదరీ సోదరులకు ఎంతో పెనుగులాట అవుతుందని భావించి వారి కొరకు తన హృదయం వెళ్లియుండవచ్చు.

జనుల అభిప్రాయానికి నేరుగా వ్యతిరేకించే బైబిలు ఉత్తరువు ఎక్కడైనా ఉన్నట్ట యితే, అది యిదే: "నీవు సొంతగా పగ తీర్చుకొనకు." వ్యక్తిగతంగా పగతీర్చుకొనడాన్ని ప్రోత్సహించే, దాన్ని కొనియాడే యుగంలో మనం జీవిస్తున్నాం.[11] అనేక రచనలకు, సినిమాలకు, టి. వి. షోలకు పగ తీర్చుకొనడం పన్నాగపు ధోరణియై ఉంటుంది. "నేను కోపపడను, నేను సమం చేస్తాను" అనే స్టిక్కర్లు, పోస్టర్లు టి షర్టులు ప్రకటిస్తాయి. పగ తీర్చుకొనడాన్ని సమర్థిస్తారు (నిర్గమకాండము 21:24; లేవీయకాండము 24:20లను చూడు).[12] మనుష్యులు దీనిని ఏ విధమైన మారువేషం వేసి మింగుడుపడేలా చేయ చూచినా, అది యింకను కీడుకు ప్రతి కీడు చేయడమే అయ్యుంటుంది. అది యింకను పగతీర్చుకొనడమే; "అలా చేయవద్దని" పౌలు యింకను చెప్పుచున్నాడు!

చాలా కాలం కిందట ఫ్రాన్సిస్ బెకాన్ (1561–1626) "పగతీర్చుకొనడంలో ఒక వ్యక్తి శత్రువుకు సమానుడు. అయితే దానిని విస్మరించడంలో అతడు ఉన్నతుడవుతాడు"[13] అని రాసాడు. ఎదురు దెబ్బ కొట్టడంలో మనం రెండు విధాలుగా నష్టపోతాం. ఒకటి మనం అవమానం పొందినప్పుడు కోల్పోయినదానిని మరల కోల్పోతాం. రెండవది (ఇది మరింత గంభీరమైనది) మనం దేవుని ఆజ్ఞలను ఉల్లంఘిస్తే ఆత్మోన్నతిని కోల్పోతాం.[14]

"నేను నా పక్షంగా నిలబడలేదనుకో, నేను బలహీనుడనని జనులు అనుకుంటారు" అని మరొకడు ఆక్షేపణ చేయవచ్చు. అది నిజమే కావచ్చు, కాని దీన్ని ఆలోచించు: పగతీర్చుకొనే మార్గం ఒకనికి ఉన్నప్పుడు, పగతీర్చుకొనేదానికంటే పగతీర్చుకోకుండ ఉండడానికే ఎక్కువ వ్యక్తిగతమైన బలం కావలసియుంటుంది. యేసు సిలువపై ఉన్నప్పుడు, "నీవు దేవుని కుమారుడవైతే సిలువమీదనుండి క్రిందికి దిగి రమ్మని" ఆయన ఎదుటనున్న కొందరిచే శోధింపబడ్డారు (మత్తయి 27:40బి). ఆయన సిలువ మీదనుండి దిగి రాగలవారే. తన శత్రువులను నోరు మూయించగల శక్తి ఆయనకుంది. అయినా, పగతీర్చు కొనకుండుటకు ఆయన తన బలాన్ని ప్రదర్శించారు.

చెడుగు (దుష్టత్వం) శిక్షింపబడకూడదని దాని అర్థమా? కానే కాదు. ఆ శిక్షను కొలిచేది నీవు, నేను కాదని దాని అర్థం. అప్పుడు, దుష్టత్వం ఎలా శిక్షింపబడుతుంది? మన లేఖన భాగాన్ని చదువుతూ పో.

**అనుకూలమైనది: పగతీర్చుకొనడం దేవుని చేతులకప్పగించు (19బి, సి వచనం).**

"మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు [*orge*] చోటియ్యుడి" (రోమా 12:19ఎ, బి). "దేవుని" అనే ప్రయోగం గ్రీకు మూలంలో లేదు. "ఉగ్రతకు చోటియ్యుడి"

అని అది అంటుంది (KJV చూడు). అయినా, తక్కిన వాక్యాన్ని చదివితే, దేవుని ఉగ్రత పౌలు మనస్సులో ఉన్నట్టు తేటపడుతుంది[15]: " 'పగతీర్చుట నా పని, నేనే ప్రతిఫలమిత్తునని' **ప్రభువు** చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది" (19సి వచనం). "పగతీర్చుకొనడం నా బాధ్యత; నేను తిరిగి చెల్లిస్తాను" అని CJB అంటుంది.

పౌలు రెండు తారతమ్యాలను చేశాడు. 17వ వచనంలో, "కీడుకు ప్రతికీడెన్నడు చేయవద్దని" అన్నాడు. ఎందుకు? ఎందుకంటే, అది దేవుని పని: " 'నేనే ప్రతిఫలమిత్తునని' **ప్రభువు** చెప్పాడు" (19 వచనం; నొక్కి చెప్పింది నాది). 19వ వచనంలోని తొలి భాగంలో, మనం పగతీర్చు కొనకూడదు అని అతడన్నాడు (*ekdikeo*). ఆ వచనపు చివరి భాగంలో, ఎందుకో అతడు వివరించాడు: మరల, అది దేవుని పని: " 'పగతీర్చుకొనుట [*ekdikesis*] నా పని ...,' అని **ప్రభువు** చెప్పుచున్నాడు."

"దేవుని ఉగ్రతకు చోటియ్యుడి" అంటే దేవుని పనిని నీవు చేయ ప్రయత్నించకు అని అర్థం. మనం ప్రక్కకు తప్పుకొని దుష్టత్వాన్ని శిక్షించడం దేవుని భద్రతకు వదులుదాం. ఉత్తర అమెరికా దేశంలో సంభవించిన ఒక సంఘటనను Taylor Cave తెలిపాడు.[16] తన భూమిలోనుండి కలపను దొంగిలించే యిద్దరు దొంగలను ఒకడు పట్టుకున్నాడు. అతడు వారిని ఎదుర్కొని, వెళ్లిపొమ్మని వారికి ఆదేశించాడు. వారు వెళ్లుతూ పగతీర్చు కుంటామని ప్రతిజ్ఞ చేశారు. తరువాత, వారు ఆ మనిషిని అతని పెద్ద కుమారుని చంపారు. ఆ యిద్దరిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు ఆ యిద్దరు మనుష్యుల యొద్దకు అతని చిన్న కుమారుని తోడుకొనిపోయి, "ఇదిగో తుపాకి. మేము నీ పక్షాన కాచుకొంటాం. నీకు యిష్టమయ్యింది చేయ్" అని వారు అతనితో అన్నారు. ఆ యువకుడు తుపాకిని తిరిగి యిచ్చివేసి, "లేదు, అది దేవుని పని" అని బదులిచ్చాడు.

Dale Hartman యువకుడైయున్నప్పుడు, "పగతీర్చుకొనే పనిలో దిగి, దేవుడు బాగా చేయగల దానిని నీవు చెరపవద్దు" అని అనుభవశాలియైన సువార్తికుడు అతనితో చెప్పాడట.[17] దేవునికి సమస్తం తెలుసు, మనకు తెలియదు. దేవుడు సమస్తాన్ని చూస్తున్నాడు, మనం చూడడం లేదు. దేవునికి సమస్త శక్తి ఉంది, మనకు లేదు. మన శత్రువులకు మనమే శిక్షను కొలువ ప్రయత్నించినప్పుడు, పాపంతో చుట్టబడిన, అత్యాశతో మేఘాలు కమ్మిన ఆలోచన, పాక్షికమైన మన తెలివి, హృదయాలు ఎరగడంలోని మన అసమర్థత సరిగా చేయకుండ మనలను నిరోధిస్తాయని R. C. Bell అన్నాడు.[18]

దుష్టత్వానికి దేవుడు ఎలా ప్రతిఫలమిస్తాడు? రోమా పత్రికలో కనీసం మూడు మార్గాలు తెలుపబడ్డాయి:

- కొంత శిక్ష పాపం యొక్క సహజమైన పర్యవసానంగా వస్తుంది. "తమ తప్పిదమునకు తగిన ప్రతిఫలము" కొందరు పొందుతారు (రోమా 1:27). Jimmy Allen యిలా రాశాడు, దుష్టులు యిప్పుడు వారి పాపంవలన శిక్షింపబడునంతగా వారి పాపం కొరకు శిక్షింపబడరు."[19]

- కొన్నిసార్లు శిక్ష న్యాయ స్థానాల్లో యివ్వబడుతుంది. 13వ అధ్యాయంలో నొక్కి చెప్పేదేమంటే, మానవ ప్రభుత్వాలు – అధికారులు "కీడు చేయువారి మీద ఆగ్రహము చూపుటకై వారు ప్రతీకారము చేయు దేవుని పరిచారకులు" [*orge*] (రోమా 13:4).
- "దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు [*orge*]. ఆయన ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును." మారుమనస్సు పొందనివారికి అప్పుడు చివరిగాను, సంపూర్ణంగాను పేమెంట్ జరుగుతుంది (రోమా 2:5, 6).

**అనుకూలమయ్యింది: ఆయనను సేవించే మార్గాలను వెదకు (20 వచనం).**

శత్రువుపై పగ తీర్చుకొనడానికి మనకు అనుమతి యివ్వబడకుంటే, మనం ఏమి చేయగలం? మనమతని ప్రేమించి అతనికి సహాయం చేయవచ్చు. ద్వితీయోపదేశ కాండము 32:41ని సామెతలు 25:21తో జతచేసి పౌలు తన కొటేషన్ వెంటాడాడు, "కాబట్టి, నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము" (రోమా 12:20ఎ). లూకా 6:27లోని యేసు ఆజ్ఞకు ఈ మాటలు అభ్యాస సంబంధమైన వర్తింపైయుంది: "వినుచున్న మీతో నేను చెప్పునదేమనగా – మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును ద్వేషించువారికి మేలు చేయుడి." పోరునుండి కేవలం వెడలిపోవడం చాలదు; మన విరోధులకు సహాయపడే మార్గాలను మనం కనుగొనడానికి ప్రారంభించాలి.

"నీ శత్రువు యొక్క బలహీనతను కనుగొని దాన్ని సొమ్ము చేసికోడానికి ప్రయత్నించు" అని లోకం సలహా యిస్తుంది. అతడు ఆకలిగొన్నాడా? వానిని మాడ్చివేయి. అతడు దప్పి గొన్నాడా? దాహంతో వానిని చావనియ్యి. అయితే ప్రేమ ఏమంటుందంటే, "ఆహారము పానీయము, లేక అతని అవసరతలు మరి ఎట్టివైనా, నీ శత్రువు వేటిలో లోపం కలిగి యున్నాడో కనుగొని, వాటిని అతనికందించుము."

ఎవరైనా నీకు కీడు చేసినప్పుడు, నాల్గు సాధ్యమైన ప్రత్యుత్తరాలున్నాయి. ఒకడు నిన్ను గాయపరచినట్టయితే, నీవు అతని మరి ఎక్కువగా గాయపరచవచ్చు; దాన్ని పగతీర్చు కొనుటయై ఉంది. అతడు నిన్ను గాయపరచినట్టయితే, నీవు అతనిని ఆలాగే ట్రీట్ చేస్తావ్; దానిని ప్రతీకారమంటారు. అతడు నిన్ను గాయపరచితే, దాన్ని నీవు నిర్లక్ష్యపెట్టవచ్చు; దాన్ని తిరస్కారము లేక అలక్ష్యమంటారు. చివరిగా, అతడు నిన్ను గాయపరచితే, అతని ప్రేమించి అతనికి సేవ చేయవచ్చు; అది క్రీస్తు మార్గం.[20] Benjamin Franklin యిలా అన్నాడు, "గాయపరచడం నిన్ను నీ శత్రువు క్రింద పెడుతుంది; ప్రతీకారం చేయడం అతనితో నిన్ను సమానునిగా చేస్తుంది; దాన్ని క్షమించడం నిన్ను అతనిపైగా నిలుపుతోంది."[21]

కొంత కాలం క్రితం, ప్రభువు సంఘంలో సభ్యులైన దంపతులొకరిని గూర్చిన సంగతినొక పుస్తకంలో చదివాను. చేతికందివచ్చిన వారి కుమారుడు, తప్పతాగి

కారును నడుపుతున్న తమ కుమారుని తోటి వయస్సువాడైన ఒక యువకుని కారు కింద పడి మరణించాడు. వారు మొదట్లో దుఃఖంతో కుంగిపోయారు. క్రీస్తువారును, పౌలును ఏమి బోధించారో వారు బాగుగా ఎరిగినవారే. దేవుని సహాయంతో, ఆ కుర్రవాడిని దగ్గరకు తీసి, అతని స్థిరపరచ సహాయం చేశారు. చివరికి, అతని జీవితం దీవించబడింది, వారి జీవితాలు కూడా తరించాయి.[22]

మనం మన శత్రువులకు మేలు చేస్తే, వచ్చే ఫలితమేమి? పౌలు సామెతలు 25:22నుండి దిగ్భ్రమ కలిగించే ఈ మాటలను కోట్ చేశాడు: "ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు" (రోమా 12:20బి). "అది రూపకాలంకార భావన, దాని అర్థం తేటగా లేదు" అని పౌలు మాటలను Leon Morris పిలిచాడు.[23] ఈ ప్రయోగం యొక్క పుట్టుపూర్వోత్తాలను గూర్చి ఎన్నో ఊహలు పుట్టాయి. బైబిలు ప్రాంతాల్లో, ప్రజలు పాత్రలను తమ తలలమీద మోస్తారు. శత్రువు యొక్క నిప్పు ఆరిపోయి, అతడు తన నిప్పును తిరిగి మండించడానికి నిప్పుల కొరకు వెదకుతుంటే, తన నెత్తిమీద మోసికొంటూ వెళ్లుతున్న పాత్రలో మండుతున్న బొగ్గులను వేయడం ఔదార్యపు సూచనగా భావించబడుతుంది.[24] "మండుతున్న బొగ్గుల పళ్లెమును తన తలపైన మోసుకొని వెళ్లడంవలన ఒకని పశ్చాత్తాపము బహిరంగంగా రుజువు చేయ బడే ఐగుప్తీయుల కర్మకాండను సూచిస్తున్నట్టు కొందరు రచయితలు సూచించారు."[25] నేను బహుగా యిష్టపడే ఊహను Jimmy Allen చేశాడు. శత్రువులు ఒక పట్టణాన్ని ముట్టడించినప్పుడు, పట్టణవాసులు దండెత్తినవారి తలల మీద ప్రాకారం పైనుండి ఆయా వస్తువులను పడవేస్తారు. అందులో మండుతున్న నిప్పు కణుగులు కూడా ఉంటాయి. దుష్టత్వానికి వ్యతిరేకంగా శ్రేష్ఠమైన ప్రతిక్రియ మేలు చేయడమే పౌలు మాటల్లో అర్థమని Allen తెలిపాడు.[26]

పౌలు యొక్క పోలికకు మూలమేదో మనం ఖచ్చితంగా ఎరుగలేకపోయినా, మనలను బాధించేవానికి మేలు చేయడమే ఆ మాటలకు అర్థమని అనేకులు గ్రహించారు. "నీ ఔదార్యము మంచితనముతో వానిని ఆశ్చర్యపరచుతుంది" అని పౌలు మాటలకు MSG భాష్యం చెప్పుతుంది. "సిగ్గుతో మండిపోయేలా నీవతని చేస్తావు" అని SEB అంటుంది. కీడుకు ప్రతిగా మేలు చేయడం అతని మనస్సాక్షిని రేపి, అతనిని మారుమనస్సుకు తెస్తుంది. "పగతీర్చుకొనడం అతని ధైర్యాన్ని నిర్వీర్యం చేయవచ్చు; కాని దయ వాని హృదయాన్ని పగులగొడుతుంది" అని William Barclay రాశాడు.[27]

నీ శత్రువుకు మేలు చేయడంవలన యిది తప్పనిసరిగా వచ్చే ఫలితమా? కాదు – కాని అలా చేయడం సాధారణంగా నీకు సహాయమైయుంటుంది. నీవు చేయగలిగిందంతా చేశావని నీవు సంతోషిస్తావు. నీవు నీ హృదయాన్ని దుఃఖంనుండి విడి పించుకుంటావు. దీనికి తోడు, కీడుకు ప్రతిగా మేలు చేయడంలో, కీడు చేసినవానిమీద కొన్నిసార్లు అనుకూల ప్రభావం పని చేస్తుంది. సంఘం యొక్క బహిరంగ కూడికలను ఆటంకపరచడానికి, పొరుగువాడు బిగ్గరగా మైకుపెట్టి హిందూ పాటలు పాడించి నట్టు వార్త వచ్చింది. ఒకసారి భయంకరమైన తుఫాను ఆ ప్రాంతాన్ని కొట్టింది. ఆ

పొరుగువాడును యింకా యితరులును ఆ చర్చ్ బిల్డింగ్‌లో ఆశ్రయం తీసికొన్నారు. అప్పుడు సంఘ సభ్యులు తమను ఆశ్రయించిన వారికి మూడు రోజులు అన్నోదకాలు సరఫరా చేశారు. తరువాత, అతడు సువార్తకు లోబడ్డాడు.[28]

శత్రువును హతమార్చడానికి అతి శ్రేష్ఠమైన మార్గం అతని స్నేహితునిగా చేసికొనడమే. ప్రేమింపతగనివానిని ప్రేమించుటెట్లు? అతనికి సహాయం చేసే మార్గాలను వెదకడమే.

## కేవలం అతనికి మేలు మాత్రమే చేయ్ (12:21)

బాధించేవాని గూర్చి పౌలు ఏమి చెప్పాడో దానిని అతడు వచనం 21లో సంగ్రహం చేశాడు: "కీడువలన జయింపబడక, మేలుచేత కీడును జయించుము." "జయించుము" అనే మాట (*nikao* నుండి) *nike* అనేదానికి అది క్రియా వాచకమైయుంది. "జయము" అనేదానికి అది గ్రీకు పదం.[29] మనం అవమానపరచబడినప్పుడు, కీడుచే ముంచివేయ బడడం సులభం. అది మనలను వశపరచుకునేలా మారిపోతాం. మనమీద కీడు (చెడుగు) అయినా జయమొందుతుంది లేదా మనమైనా కీడు (చెడుగు) మీద జయమొందుతామని పౌలు అన్నాడు.

**వ్యతిరేకమైనది: కీడుతో జయమొందకు (21ఎ వచనం).**

21వ వచనం యిలా ఆరంభమౌతుంది, "కీడువలన జయింపబడక." కీడు మనలను ఎలా జయిస్తుంది? మనం చదివిన వచనాలను తిరిగి వీక్షించు. మన శత్రువులను శపించుమని మనం దేవుని అడిగినట్టయితే (14 వచనం), మనం కీడుచే జయింపబడిన వారమైయుంటాం. కీడుకు ప్రతికీడు మనం చేసియుండినట్టయితే (17 వచనం), అప్పుడు కీడే మనలను జయించింది. ఆలాటిది జరిగినప్పుడు, John R. W. Stott చెప్పినట్టు, "కీడుకు మనం వశమైపోయాం, పలుకుబడి అనే పరిధిలోనికి మనం పీల్చబడం, మరియు ఓడిపోయి … దానిచే 'జయించబడినవారమయ్యాం' [Phillips]."[30]

**అనుకూలమైనది: కీడును మేలుచే జయించడం (21బి వచనం).**

కీడు జయించకుండ దాన్ని మనం ఎలా అరికట్టగలం? "మేలుచేత కీడును జయించుమని" పౌలు అన్నాడు (21బి వచనం). దానికి అర్థమేమిటి? మన శత్రువుల మీద దేవుని దీవెన కోరడం (14 వచనం). శక్యమైతే ప్రతివానితో సమాధానంగానుండ ప్రయత్నించడం (18 వచనం). మనపై విరోధంగా ఉన్న ఎవనికైనా మేలు చేయడం – అతని ప్రేమించి, వాని అవసరతలకు సహాయపడడం (20 వచనం).

మేలుతో కీడును జయించుట సులభమా? లేదు. ఇది సాధ్యమా? అవును, ప్రభువువారి బలమువలన అది సాధ్యమే. దేవుని సహాయముతో, నీవు, నేను మేలుతో కీడును జయించగలం.

## ముగింపు

క్రైస్తవులుగా మనం ఎదుర్కొనవలసిన మిక్కిలి కష్టమైన పరీక్షలలో ఒకటి ప్రేమించ దగనివారిని ప్రేమించుటయైయుందని అనడంతో నేను ఈ పాఠాన్ని ఆరంభించాను. పరీక్షలన్నిటివలెనే, యిది కొందరికంటె మరి యితరులకు ఎక్కువ సవాలుగా నిలిచి యుంటుంది. కొందరు, వారి స్వభావంవలనను, పెంపకంవలనను, తమ్మును గాయ పరచినవారిని సహజంగానే గాయపరచగోరతారు. ఏదియెలాగున్నా, ఎవనికైనా యిది మాత్రం అంత సులభమైన పరీక్ష ఏమీ కాదు.

అన్ని పరీక్షలవలెనే, మనం నిజంగా దానికొరకు సిద్ధపడినట్టయితే, దాని నెదుర్కొనడం సులభమే. సిద్ధపడడమంటే, రోమా 12:14, 17-21ల్లో పౌలు ఆజ్ఞాపించిన రీతిగా చేయడానికి మనం తీర్మానించుకొనియుండాలి. ఆలాగే మనం చేయగలిగియుండడానికి మనం సహాయం పొందునట్లు ప్రభువుకు సన్నిహితంగా మనం జీవించాలి.

మనం సిద్ధపడినప్పటికిని, ఈ పరీక్షలో ప్రతిసారి ఉత్తీర్ణులవ్వగలమా? అలా జరుగక పోవచ్చు. అయినా, మనం తప్పిపోయినట్టయితే, ఈ పరీక్షను (ఒక విధంగా) మరోసారి ఎదుర్కోవచ్చు. మన పతనం విషయమై మారుమనస్సు పొంది, క్షమించుమని మనం దేవుని అడుగుదాం. మనలను బాధించినవారి యొద్దకు వెళ్లి, "క్రైస్తవుడిలా నేను స్పందించ లేదు. నా చర్యలను బట్టి నేను సిగ్గుపడుతున్నాను, నన్ను క్షమించగోరుతున్నానని" నీవు చెప్పవచ్చు.

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

నీవు ఈ ప్రసంగాన్ని ఉపయోగించినప్పుడు, క్రైస్తవుడవ్వడంవలన ఒకడు "ప్రభువుకు ఎలా సమీపంగా ఉండవచ్చో" నీవు చెప్పవచ్చు (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38) లేదా, త్రోవ తప్పిన క్రైస్తవుని విషయంలో, ప్రభువునొద్దకు తిరిగి రమ్మని చెప్పవచ్చు (అపొస్తలుల కార్యములు 8:22; 1 యోహాను 1:9). "వ్యతిరేకమైన ఉద్వేగాలకు లోబడడానికి బదులు నీ హృదయాన్ని, జీవితాన్ని ప్రభువుకు సమర్పించుకోమని" నీవు చెప్పవచ్చు. "కీడుమీద విజయం" అనే మరొక పేరు దీనికి పెట్టవచ్చు.

మన పాఠం యొక్క మూల వాక్యంలో, స్వ కుటుంబాన్ని పోషించుకోడానికి సంబంధించిన విషయాలను పౌలు డీల్ చేయలేదు. కీడు జరిగిపోయిన తరువాత వ్యక్తిగత పగ తీర్చుకోవద్దన్న దానిమీదనే అతడు దృష్టిని కేంద్రీకరించాడు.

---

సూచనలు

[1]Adapted from John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994),

334-45. [2]John Kachelman, "How to Really, 'Even the Score,' " sermon preached at Judsonia church of Christ, Judsonia, Arkansas, 14 June 2003. [3]Adapted from C. Roy Angell, *Iron Shoes* (Nashville: Broadman Press, 1953), 52-53. [4]Bruce Barton, David Veerman, and Neil Wilson, *Romans,* Life Application Bible Commentary (Wheaton, Ill.: Tyndale House Publishers, 1992), 243. [5]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 417. [6]అందరికి సత్యమైన విషయాలను సమకూర్చు ఏది సరియైనదో చేయడం సత్యంగా నిలవడాన్ని తెలుపుతుంది. అంతకన్నా అధికమైన దానిని చేకూర్చుతుంది. అందరి దృష్టిలో మంచి విషయాలను గౌరవించు. [7]W. E. Vine, Merril F. Unger, and William White, Jr., *Vine's Complete Expisitory Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 274. [8]John Kachelman, "How to Handle Hostility," *Truth for Today* (May 1989): 27. [9]Adapted from Robert J. Morgan, *Nelson's Complete Book of Stories, Illustrations, & Quotes* (Nashville: Thomas Nelson Publishers, 2000), 267-68. [10]కొందరు తర్జుమాదారులు "స్నేహితులని," "ప్రియ స్నేహితులని" అన్నారు గాని, *agapetos* స్నేహంకంటే బలమైనది.

[11]ఈ పేరాను నీకనుకూలంగా మలచుకో, చిరకాలం ఘర్షణ సాగుతున్న కుటుంబాలతో వ్యక్తిగతమైన పగను తీర్చుకున్న నిదర్శనాలు కనిపిస్తాయి. [12]మొదటిగా యిది అపార్థం చేయబడింది ఎందుకంటె, పాత నిబంధన శాసనము సామాజికమయ్యింది గాని వ్యక్తిగతమయ్యింది కాదు. రెండవది, నేడు మనం నూతన నిబంధన ప్రమాణాల ప్రకారం జీవించాలి (మత్తయి 5:38–42 చూడు). [13]Lewis Copeland, ed., *Popular Quotations for All Uses,* rev. ed. (Garden City, N. Y.: Doubleday & Co., 1961), 391. [14]Dale Hartman, sermon preached at the Eastside church of Christ, Midwest City, Oklahoma, 24 October 2004. [15](ఎవరు ఏమనదలచుకొన్నా) సందర్భం దేవుని ఉగ్రతను సూచిస్తుంది. శ్రమ పొందుచున్నవారి ఉగ్రత అని కొందరన్నారు. [16]Taylor Cave, class taught at Eastside church of Christ, Midwest City, Oklahoma, 14 July 2005. [17]Dale Hartman, class taught at Eastside church of Christ, Midwest City, Oklahoma, 21 December 2003. [18]R. C. Bell, *Studies in Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1957), 141-42. [19]Jimmy Allen, *Survey of Romans,* 4th ed., rev. (Searcy, Ark.: By the author, 1973), 105. [20]Adapted from Jim McGuiggan, *The Book of Romans,* Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1982), 373.

[21]Adapted by Dale Hartman, sermon preached at Eastside church of Christ, Midwest City, Oklahoma, 3 April 2005; USHistory.org™; "The Electric Ben Franklin: The Quotable Franklin" (http: / / www.ushistory.org / franklin / quotable / singlehtml.htm; Internet; accessed 1 June 2006). [22]Bob Stewart, *Revenge Redeemed* (Old Tappan, N.J.: Fleming H. Revell Co., 1991). [23]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 86. [24]Jim Townsend, *Romans: Let Justice Roll* (Elgin, Ill.: David C. Cook Publishing Co., 1988), 86. [25]F. F. Bruce, *The Letter of Paul to the Romans,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 217-18. [26]Allen, 105. [27]William Barclay, *The Letter to the Romans,* rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 170. [28]*India Report,* Central church of Christ, Lufkin, Texas, 15 July 2002. [29]Vine, 453, 660. శ్రోతలకు తెలిసిన వివరణను యివ్వు. [30]Stott, 337.

# అనుబంధపు పాఠాలు

# పౌలు పాత నిబంధనను ఉపయోగించడం

రోమా పత్రికలో పౌలు తరచుగా పాత నిబంధనను కోట్ చేశాడు, కాని "యూదుల సమస్యపైన" ఈ భాగంలో కన్పిస్తున్నట్టు మరెక్కడా కన్పించదు (అధ్యాయాలు 9నుండి 11వరకు). పౌలు పాత నిబంధననే కోట్ చేస్తున్నాడో లేక పాత నిబంధన మూల వాక్యం వంటి పదజాలాన్నే ఉపయోగిస్తున్నాడో చెప్పడం ఎల్లవేళలా అంత సులభం కాదు. అందువలన, 9నుండి 11 అధ్యాయాలవరకు ఖచ్చితంగా ఎన్ని కొటేషన్లు కన్పిస్తాయో మనకు తెలియదు. అంచనాలు 20నుండి[1] 30వరకు[2] మారుతుంటాయి – కాని ఈ మూడు అధ్యాయాలలో పౌలు సమృద్ధిగా పాత నిబంధన లేఖనాలను ఉపయోగించాడని మాత్రం వ్యాఖ్యానకర్తలందరు అంగీకరిస్తారు.

ప్రశ్నలో ఉన్న పాత నిబంధన లేఖన భాగాలను తనిఖీ చేయి (సాధారణంగా సెప్టూజంటునుండి) పౌలు దాదాపు మక్కీకి మక్కీ ఒక లేఖన భాగాన్ని దించినట్లు కొన్నిసార్లు కన్పిస్తుంది. కొన్నిసార్లు పాత నిబంధన మూల వాక్యాన్ని అతడు పేరఫ్రేజ్ చేశాడు. కొన్నిసార్లయితే ఆ లేఖన భాగం యొక్క ఆలోచనను కేవలం యిచ్చేవాడు. ఆ యా సందర్భాలలో రెఫరెన్సులను మిళితం చేసేవాడు. పైగా, అసలున్న భావం గాక పాత నిబంధన వచనాలకు వ్యత్యాసమైనవాటిని అతడు తరచుగా యిచ్చేవాడు.

ఈ భాగంలో పౌలు పాత నిబంధనను ఉపయోగించడానికి సంబంధించి, మూడు విషయాలను గమనించవలసియుంటుంది. (1) దేవుడు వారితో చేసిన వాగ్దానాల విషయంలో తప్పిపోలేదని యూదులను ఒప్పించడం పౌలు యొక్క ప్రాథమిక ఉద్దేశమై యుంది – అందువలన అతడు వారు గుర్తించిన అధికారాన్ని – పాత నిబంధనను సూచించాడు, మరియు వారు బాగుగా ఎరిగిన రీజనింగ్‌ను ఉపయోగించాడు. "తన దినాల్లోని రబ్బీలు చెప్పే భాష్యపు పద్ధతికి అనుగుణంగా పౌలు పాత నిబంధనను ఉపయోగించాడు. అతని వాదనలు మరియు లేఖనముల ఉపయోగము మొదటి శతాబ్దపు యూదులైన తన పాఠకులనేకులను బహుగా ఒప్పింపజేసే విధంగా ఉన్నాయి" అని Richard Batey వ్రాశాడు.[3]

(2) పౌలు యొక్క లేఖనాల ఉపయోగం నేడు మనం ఉపయోగించే విధానానికి అంత వ్యత్యాసమయ్యింది కాదు. మనం లేఖన భాగాలను ముక్కలుగా, తునకలుగా వాడతాం. నేటి సమస్యలను చేర్చేలా లేఖన భాగముల వర్తింపును మనం విస్తరింపజేస్తాం. ("ఒక యిల్లు తనకు తానే విరోధముగా వేరుపడినయెడల, ఆ యిల్లు నిలువేరదు"; మార్కు 3:25 చూడు). లేఖనాల్లోనుండి మనం ఉక్తులను అప్పు తెచ్చుకున్నను భాష యొక్క అలంకారాలుగా వాటిని వాడతాం (కనుపాప) "కంటిపాప" (కీర్తన 17:8 చూడు) మరియు "వస్త్రపు చెంగు" (మత్తయి 9:20 చూడు; KJV).

(3) పౌలు దేవునిచే ప్రేరేపింపబడ్డాడు. పాత నిబంధన లేఖన భాగమునుండి న్యాయ సమ్మతమైన వర్తింపు ఏమైయుంటుందో, ఆత్మద్వారా అతనికి తెలుసు. నేను,

నీవు ఆత్మచే ప్రేరేపింపబడినవారం కాదు గనుక పాత నిబంధన లేఖనాల వర్తింపు విషయంలో మనం బహు జాగ్రత్తగా ఉండాలి.

డేవిడ్ రోపర్

---

సూచనలు

[1]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 302. [2]R. C. Bell, *Studies in Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1957), 121. [3]Richard A. Batey, *The Letter of Paul to the Romans,* The Living Word Commentary series (Austin, Tex.: R. B. Sweet Co., 1969), 133-34.

# దేవుడు మరియు ఇశ్రాయేలు

రోమా 9–11 యొక్క మన పఠనంలో రెండు కఠినమైన వచనాల దగ్గరకు వచ్చాం: 11:25, 26. ఈ వచనాలను వ్యాఖ్యానించడంలో ఒక సమస్య ఏమంటే, భౌతికమైన ఇశ్రాయేలు దేశము యింకను దేవుని "ఏర్పరచబడిన" దేశమైయున్నట్టు అనేకులు ఆలోచిస్తారు. దేవుడు యూదులతో చేసిన వాగ్దానాలను యింకను నెరవేర్చవలసియుంది, కొన్ని ఆశీర్వాదముల విషయంలో ఆయన వారికి యింకా అచ్చియున్నాడని కొందరు నమ్ముతారు. గనుక, వచనాలు 25, 26లను మనం చదువుటకు ముందు ఇశ్రాయేలు గురించి కొంత నోట్సు అవసరమైయుంది.

## "సాధారణ ఎన్నిక" vs. "ప్రత్యేకమైన ఎన్నిక"

ఏర్పరచబడిన దేవుని ప్రజలను గూర్చి మనం అర్థం చేసికోవలసిన సత్యాల్లో ఒకటి ఏమంటే – మెస్సీయను ("క్రీస్తు") లోకములోనికి తెచ్చే దేవుని "ఏర్పాటును" నెరవేర్చడానికి ఈ దేశాన్ని వాడుకోవాలనేది ఇశ్రాయేలును ఏర్పరచుకొనడంలో ఆయన చిట్ట చివరి ఉద్దేశమైయుంది. తన ఏర్పరచుకొన్న జనముగా, ఇశ్రాయేలుకు కొన్ని వాగ్దానాలు చేయబడ్డాయి, కాని ఇశ్రాయేలు (యాకోబు) భౌతిక సంతతిలో ప్రతి ఒక్కని విమోచించ డానికి దేవుడు ఎన్నడూ వాగ్దానం చేయలేదు. Leon Morris యిలా రాశాడు,

> … తన ప్రజలుగా ఉండడానికి దేవుడు ఇశ్రాయేలును ఏర్పరచుకున్నాడు, ఒక ప్రత్యేకమైన విధానంలో తన ఉద్దేశాలను నెరవేర్చుకొనుటకు సాధనమైన ప్రజలు. వారు ప్రత్యక్షతను మరియు అనేకమైన దీవెనలను పొందువారైయున్నారు ([రోమా] 9:4–5 పోల్చి చూడు). … వీటిలో ఏదియు జాతియావత్తు రక్షింపబడతారని ఉద్దేశింపబడలేదు.[1]

యూదుడైయుండ (ధర్మశాస్త్రమును, సున్నతియను ఆచారమును కలిగియుండి)డమే నిత్య రక్షణకు పూచీ అని కొందరు రబ్బీలు నమ్మునట్టు గత పరిశీలనలో మనం గుర్తించాం, కాని దేవుని వాక్యం అలా ఉపదేశించలేదు. ఇశ్రాయేలు కథ అంతటిలో, దేవునికి నమ్మకస్థులైన వారికంటే నమ్మకస్థులు కానివారే ఎల్లప్పుడును ఎక్కువ మందిగా ఉన్నారు.

ఇశ్రాయేలుకు సంబంధించి, "సాధారణ ఏర్పాటుకును," "ప్రత్యేకమైన ఏర్పాటుకును"[2] Jim McGuiggan మధ్య యిలాటి వ్యత్యాసాన్ని చేశాడు. లోకాన్ని ఎవరి ద్వారా ఆశీర్వదింపబూనాడో ఆ ప్రజలుగా ఇశ్రాయేలు దేశాన్ని దేవుడు ఎన్నుకున్నాడు అనేది దేవుని "సాధారణ ఏర్పాటుకు" సంబంధించినదైయున్నది. "ప్రత్యేకమైన ఏర్పాటు" అనేది "ఇశ్రాయేలులో ఇశ్రాయేలును" ఏర్పాటు చేసికొనడం (రోమా 9:6 చూడు) – ఆయన రక్షించే విశ్వాసులు.

## ఇశ్రాయేలుకు దేవుని వాగ్దానాలు నెరవేర్చబడ్డాయి

హారానులో దేవుడు అబ్రాహాముకు ప్రత్యక్షమై తాను చూపించబోయే దేశము (ఆదికాండము 12:1), అంటే కనానుకు పయనించుమని అతనికి తెలిపాడు. ఆ సమయంలో దేవుడు అబ్రాహాముకు ప్రత్యేకమైన వాగ్దానాలు చేశాడు:

> నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగానుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమియొక్క సమస్త వంశములన్నియు నీయందు ఆశీర్వదింపబడును (ఆదికాండము 12:2, 3).

పలు సంవత్సరాల తరువాత, దేవుడు అబ్రాహాముకు యిలా తెలిపాడు:

> నేను నిన్ను ఆశీర్వదించి ఆకాశ నక్షత్రములవలెను సముద్ర తీరమందలి యిసుకవలెను నీ సంతానమును నిశ్చయముగా విస్తరింపజేసెదను; నీ సంతతివారు తమ శత్రువుల గవిని స్వాధీనపరచుకొందురు. మరియు నీవు నా మాట వినినందున భూలోకములోని జనములన్నియు నీ సంతానమువలన ఆశీర్వదింపబడుదురు ... (ఆదికాండము 22:17, 18).

ఈ వాగ్దానాలన్నీ నెరవేర్చబడ్డాయి. అబ్రాహాము యొక్క భౌతికమైన సంతతి ఆకాశ నక్షత్రాలవలె, సముద్ర తీరాన ఇసుక రేణువులవలె అధిక సంఖ్యాకులయ్యారు. "గొప్ప జనము" [దేశము] (భౌతికమైన ఇశ్రాయేలు) అబ్రాహామును తమ "తండ్రి" అంటారు. అబ్రాహాము పేరు లోక వ్యాప్తంగా గౌరవించబడుతుంది.

వాగ్దానంలో అతి ముఖ్యమైన భాగం అబ్రాహాము సంతానం ద్వారా భూమిమీద నున్న సకల జనములు ఆశీర్వదింపబడుదురు, అనేదనుకో. ఆదికాండం 22:18 వాగ్దానాలను పౌలు గలతీయులకు 3లో సూచించాడు: "అబ్రాహామునకును అతని సంతానము నకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు 'సంతానములకును' అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే నీ 'సంతానమునకును' అనెను; ఆ సంతానము క్రీస్తే" (16 వచనం). క్రీస్తు (యేసు) రానే వచ్చారు. అబ్రాహాము వాగ్దానాలు నెరవేర్చబడ్డాయి.

యూదులు యింకను దేవునిచే ఏర్పరచబడిన జనాంగమై ఉన్నారని నమ్మేవారు యిలా ఆక్షేపిస్తారు, "అబ్రాహాము సంతానానికి దేవుడు కనాను దేశాన్ని స్వతంత్రం జేస్తానన్నాడు – ఆ వాగ్దానం యింకను నెరవేర్చబడే విధానంలో ఉంది" అని. దేవుడు అబ్రాహాముతో యిలా అన్న మాట వాస్తవం, "నీకును నీ తరువాత నీ సంతతికిని నీవు పరదేశివైయున్న దేశమును, అనగా కనానను దేశమంతటిని నిత్య స్వాస్థ్యముగా ఇచ్చి వారికి దేవుడనైయుందును" (ఆదికాండము 17:8).[3] ఈ వాగ్దానము ఇస్సాకుకును తరువాత యాకోబుకును తిరిగి చెప్పబడింది (26:3, 4; 28:13, 14; ద్వితీయోపదేశ కాండము 34:1–4 చూడు). ఈ వాగ్దానం యొక్క విస్తీర్ణత యెహోషువ 1:4లో పలుకబడింది: "అరణ్యమును ఈ లెబానోను మొదలుకొని మహా నదియైన యూఫ్రటీసు[4]

నదివరకును హిత్తీయుల దేశమంతయు పడమట మహాసముద్రమువరకును మీకు సరిహద్దు" [మధ్యధరా సముద్రము].

దేవుడు తన వాగ్దానాన్ని నెరవేర్చాడా? యెహోషువ 21లో ఈ సంగ్రహ ప్రతిపాదనలను కనుగొంటాం:

> యెహోవా ప్రమాణముచేసి వారి పితరుల కిచ్చెదనని చెప్పిన దేశమంతయు ఆయన ఇశ్రాయేలీయుల కప్పగించెను. వారు దాని స్వాధీనపరచుకొని దానిలో నివసించిరి. ... యెహోవా ఇశ్రాయేలీయులకు సెలవిచ్చిన మాటలన్నిటిలో ఏదియు తప్పియుండ లేదు, అంతయు నెరవేరెను (43-44 వచనాలు).

ఇశ్రాయేలుకు తన వీడ్కోలు ప్రసంగంలో యెహోషువ యిలా అన్నాడు, "... మీ దేవుడైన యెహోవా మీ విషయమై సెలవిచ్చిన మంచి మాటలన్నిటిలో ఒక్కటియైనను తప్పియుండలేదని మీరు అనుభవ పూర్వకముగా ఎరుగుదురు; అవి అన్నియు మీకు కలిగెను, వాటిలో ఒక్కటియైనను తప్పియుండలేదు" (23:14).[5] సంవత్సరాల తరువాత, చెరనుండి యూదులు కనానుకు తిరిగి వచ్చిన తరువాత, వారు యెహోవాను స్తుతించి చెప్పినదేమనగా,

> దేవా యెహోవా,
> అబ్రామును ఏర్పరచుకొని,
> కల్దీయుల ఊరు అను స్థలమునుండి ఇవతలకు అతని రప్పించి
> అతనికి అబ్రాహామను పేరు పెట్టినవాడవు నీవే.
> అతడు నమ్మకమైన మనస్సు గలవాడవని యెరిగి,
> ........................................................
> అతనితో నిబంధన చేసినవాడవు నీవే.
> నీవు నీతిమంతుడవైయుండి
> నీ మాట చొప్పున జరిగించితివి (నెహెమ్యా 9:7, 8).

తన భూ వాగ్దానాన్ని దేవుడు యూదులకు నెరవేర్చెనా? అవును, ఆయన నెరవేర్చాడు. తన వాగ్దానాలకు నమ్మకస్థుడైయుండడానికి, శతాబ్దాల తరబడి దాన్ని నెరవేర్చుతునే ఉండాలా? ఒకడు మరియొకనికి పది రూపాయలు యిస్తానని మాట యిచ్చి, ఆ పది రూపాయలు వానికి యిచ్చిన తరువాత, అతడు ఆ పది రూపాయలను పోగొట్టుకుంటే ఏమౌతుంది? మొదటివాడు రెండవవానికి ఆ పది రూపాయలు యివ్వవలసియుంటాడా? లేదు – దేవుడు యూదులకు భూమిని యివ్వవలసినవాడైయున్నాడా? లేదు. "యెహోవా ఇశ్రాయేలీయులకు సెలవిచ్చిన మాటలన్నిటిలో ఏదియు తప్పియుండలేదు; అంతయు నెరవేరెను."

## ఇశ్రాయేలు తప్పి పోయింది ఎక్కడ?

రోమా 11:17-24లో పౌలు ఒలీవ చెట్టుయొక్క సాదృశ్యాన్ని ఉపయోగించి, "వారి అవిశ్వాసమువలన" అనేకమంది యూదులు చెట్టునుండి "విరిచివేయబడ్డారు"

(20 వచనం). ఇశ్రాయేలు ఎక్కడ తప్పిపోయారో ఉదహరించడానికి నేను మరొక సాదృశ్యాన్ని చెప్పనిమ్ము: రైల్వే ట్రాక్ సాదృశ్యం - అనేక సాదృశ్యాలవలె, యిది బహుగా క్లుప్తీకరించబడింది అది దూరంగా నెట్టకూడదు; కాని ఏమి సంభవించిందో నీ విద్యార్థులకు అర్థమయ్యేలా సహాయం చేయి.

మొదట, అబ్రాహామునుండి నిత్యత్వంవరకు రైలు పట్టాలు విస్తరించాయి (తరువాత పేజీలో ఉదాహరణ చూడు). ఈ పట్టాల మీద నడవమని దేవుడు ఇశ్రాయేలును కోరాడు.

మొదటి "స్టేషన్" ఆ మార్గంలో దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానాలు (ఆదికాండము 12:1-3; 22:17, 18; గలతీయులకు 3:16). తరువాత స్టేషన్ మోషే ధర్మశాస్త్రం. "అది అతిక్రమమునుబట్టి [వాగ్దానాలకు] చేర్చబడింది" (గలతీయులకు 3:19). "క్రీస్తునొద్దకు" యూదులను నడిపించడానికి ధర్మశాస్త్రము "బాలశిక్షకుడుగా" ఉండింది (గలతీయులకు 3:24) - మొదట ప్రధాన వ్యత్యాసం మన ఉదాహరణలో ఉంది.

యూదులు "ఆ పట్టాల మీద నిలిచియుండినట్టయితే," వారు యేసును మెస్సీయగా అంగీకరించియుండేవారే (మూడవ స్టేషన్), ఆయన మరణంనుండి మేలు పొందడం (నాల్గవ స్టేషన్), మెస్సీయ రాజ్య పౌరులవ్వడం - సంఘము (అయిదవ స్టేషన్). క్రీస్తు రక్తంవలన ముద్రింపబడిన "క్రొత్త నిబంధనను" వారు అవలంబించి యుండవలసింది, అది యిర్మీయా ద్వారా ప్రవచింపబడింది (యిర్మీయా 31:31-34; హెబ్రీయులకు 8:7-13 చూడు). తరువాత, విశ్వాసంవలన జీవించడం, దేవుడు, క్రీస్తుతోపాటు పరలోకంలో జీవించడానికి ఎదురు చూస్తూ కనిపెట్టడం - అది అంతిమ గమ్యం.

అది యూదా జాతి కొరకు దేవుని ఉద్దేశమును, ఏర్పాటునైయుంది. ఏదియెలాగున్నా, వారు పట్టాల మీద నిలువకుండ, యూదుల్లో అనేకులు యేసును మెస్సీయగా నిరాకరించారు. అయినా వారు మెయిన్ లైన్ మీదనే ఉన్నట్టుగా తలంచుతారు, గాని వారు దానిమీద లేరు, సందేహం లేదు. అవిశ్వాసపు ప్రక్కకు తొలిగిన పట్టల మీద ఉన్నారు (యోహాను 8:24 చూడు).

పాత నిబంధన కాలంలో, అన్యజనులు యూదులకు భిన్నమైన పట్టాల మీద ఉన్నారు. క్రీస్తు మోషే ధర్మశాస్త్రమను మధ్య గోడను పడగొట్టబడడంతో అది అంతమయ్యింది (ఎఫెసీయులకు 2:14, 15). క్రీస్తును వెంటాడడానికి యివ్వబడిన ఆహ్వానాన్ని అనేకులు అంగీకరించారు. విధేయతతో కూడిన విశ్వాసంవలన వారు "మెయిన్ లైన్" అని పిలువబడే దానికి మార్చుకున్నారు. (అన్యజనులు క్రీస్తును, సిలువను సంఘాన్ని దాటి మార్గంలో కలిసినట్టు చూపించబడింది. అయితే, వారు అలా చేయలేదనుకో. అన్యజనులకు సువార్త ప్రకటించినట్టు నొక్కి పలికే ఆరవ మజిలీ ఏర్పాటు చేశాం. దేవుడు యూదులకు చేసిన వాగ్దానాలనుండి తాము మేలు పొందుతున్నట్టు అన్యజనులలోనుండి క్రైస్తవులైనవారు గ్రహించనవసరముందని పౌలు రోమా 11:17, 18లో కామెంట్ చేశాడు.)

యేసును అంగీకరించి ఆయన చిత్తాన్ని జరిగించడంవలన యూదులు ఏ

సమయంలోనైనా మెయిన్ లైన్‌కు తిరిగి రావచ్చుననుకో. నేటివరకును, వారిలో అనేకులు "అలా చేయలేదని" చెప్పడానికి విచారిస్తున్నాను (రోమా 11:8).

## ముగింపు

పాత నిబంధన కాలంలో, భౌతికమైన ఇశ్రాయేలు దేవుని "ఏర్పరచబడిన" జనమైయున్నారు. నేడు, దేవుని సంఘము ఆత్మ సంబంధమైన "ఇశ్రాయేలు" (గలతీయులకు 6:16 చూడు). క్రైస్తవులు నేడు దేవుని "ఏర్పరచబడిన వంశమైయున్నారు" (1 పేతురు 2:9).

డేవిడ్ రోపర్

---

సూచనలు

[1]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 399. [2]Jim McGuiggan, *The Book of Romans,* Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1982), 317. [3]ఆదికాండము 17:8 భూమి "నిత్య స్వాస్థ్యంగా" యివ్వబడుతుందని చెప్పింది. "నిత్య స్వాస్థ్యం" అన్నాడు గనుక ఆ మాటలు నేటికిని వర్తిస్తాయని కొందరంటారు, కాని "everlasting" అంటే "యుగాంతంవరకు" అని అర్థం కావచ్చు. సబ్బాతు (ఏడవ దినం) ఆచరణ "నిత్య నిబంధన" అని పిలువబడింది (లేవీయకాండము 24:8); క్రొత్త నిబంధనలో (నూతన మరణ శాసనం) క్రైస్తవుల "ప్రత్యేక" దినం వారంలో మొదటి దినం (అపొస్తలుల కార్యములు 20:7). [4]దావీదు, సొలొమోనుల రాజ్యము యూఫ్రటీస్ "నదివరకు" విస్తరించినట్టు నీవు గమనించవచ్చు (2 సమూయేలు 8:3; 1 రాజులు 4:1, 24 చూడు). [5]దేవుడు తమతో చేసిన నిబంధనను వారు అనుసరించక పోయినట్టయితే, ఆ "మంచి దేశంనుండి వారు త్వరగా నశించిపోవుదురని" యెహోషువ ఇశ్రాయేలీయులను హెచ్చరించాడు (యెహోషువ 23:15, 16).

## నీవు సరియైన మార్గంలో ఉన్నావా?



# మనలను అదిగమించి జీవించుట

# (రోమా 12:1, 2)

> కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి (రోమా 12:1, 2).

క్రైస్తవుడు ఆత్మ సంబంధమైన ఒక నూతన కొలపరిమాణంలో జీవిస్తాడు: రూపాంతరం పొందిన మానసిక స్థాయిలో అతడు నడుస్తాడు (రోమా 12:2). మనం పొంది జరిగించేవాటన్నిటిని మించి "దీని దాటి" మనం వ్రాయునట్లు దేవుడు అడిగాడు.

ఆయన క్షమాపణను పొందడాన్ని అదిగమించి ... దేవునితో మనం నడుస్తాం. పాపముల క్షమాపణతో తృప్తిపొందుమని మన తండ్రి మనలను కోరలేదు. కడుగబడిన దానిని అదిగమించి, క్షమాపణ దేనికి ద్వారం తెరిచిందో దానిలోనికి ప్రవేశించి ఆయనతో జీవించుదాం. దైవ చిత్తానుసారమైన దుఃఖమంటే, దేవునితో మనకున్న సంబంధాన్ని అవి నాశనం చేసినందున మన పాపముల విషయమై మనం పశ్చాత్తాపపడ్డాం. పాప మార్గాన్ని విడిచిపెట్టడానికి క్షమాపణ అనేది దైవిక విధానమైయుంది, దేవునితో నడ చుటలో నూతన స్వాతంత్ర్యాన్ని కౌగలించుకునే మార్గమైయుంది.

మనం అనుభవించిన ఏర్పాట్లను మించి ... యితరుల దీవెనలను వెదకుదాం. మనం యితరులకు దీవెనగా ఉండునట్లు దేవుడు మనలను దీవించాడు. ఇశ్రాయేలు దేశములకు వెలుగుగా ఉండునట్లు ఆయన ఇశ్రాయేలు దేశాన్ని భద్రపరచాడు. ఆయన ఆజ్ఞను మనం విన్నాం. దాన్ని నెరవేర్చడంలో కాలం గడపడానికి ఆశ కలిగియున్నాం. ఆయన మనలను నడిపించినప్పుడు, నశించినవారిని రక్షించడానికి అక్రమ గుహలలో గుండా ఆయన అడుగుజాడలు మనలను నడిపించినా మనం వెంబడించుదాం.

మనకు ఏమి అవసరమని కావాలని అడుగుతామో దాన్ని దాటి ... ఆయన మనకు చేసినదానికి స్తుతించడంలో పని కలిగియుందాం. మనకు ఏమి కావాలని మనం తలంచుతామో మన ప్రార్థనలు ఎక్కువగా ఆ జాబితాలతో కూడినవైయుంటాయి. ఆత్మ సంబంధమైన ఎదుగుదల అంటే, మన విన్నపాలను అదిగమించి దేవుడు ఎవరైయున్నాడు, తన కుమారుని పంపడం ద్వారా ఆయన మనకేమి చేశాడు దానియందు ఆనందించడమై యుంది. మనం విన్నపంనుండి స్తుతికి, మనవినుండి మనకు ఏమి ఉందో దాన్ని అభినందించడానికి వెళ్లదాం.

మనకొరకు జీవించుటను దాటి ... యితరులతో యితరుల కొరకు బ్రదుకుదాం. భూ జనులందరిని హృదయానికి తీసికొని తన హృదయముతో ప్రార్థించి స్తుతించాలని దేవుడు మనలను కోరుతున్నాడు. పౌలు మనలను యిలా కోరాడు: “కక్షచేతనైనను వృథాతిశయము చేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సుగలవారై యొకని నొకడు తనకంటె యోగ్యుడని యెంచుడి” (ఫిలిప్పీయులకు 2:3).

ఆత్మ సంబంధమైన జీవితాన్ని అనుభవించుడని దేవుడు కోరగా యేసు (సశరీరుడు గానున్న) దినములలో శాస్త్రులు, పరిసయ్యులు మతం కొరకు స్థిరపడిపోయారు. వారిని క్రీస్తునొద్దకు నడిపించడానికి ధర్మశాస్త్రాన్ని వెంబడించుడని ఆయన వారిని కోరాడు, క్రైస్తవ యుగము యొక్క నిజమైన మతమది. ధర్మశాస్త్రము మూలము, అంతం కాదు – అది దారియే, సాధింపబడినది కాదు. వారు ధర్మశాస్త్రంతో ఆగిపోయారు, కాని ఏ జీవితానికి తెచ్చుటకు ధర్మశాస్త్రం రూపింపబడిందో దానికి వెళ్లవలసినదిగా దేవుడు వారిని కోరాడు. దేవుని (సంగతులు) కార్యాలు మన ఆగుచోట్లు కాకుండ నిశ్చయించు కుందాం. అయితే, దేవునితో సంబంధ బాంధవ్యాలు సహవాసం ఉండే చోట్లకు దేవుని కార్యాలు మనలను తోడుకొని పోనిద్దాం.

ఒకతను యిలా అన్నాడు, “దినంలో ‘thank you’ అని ఎంత తరచుగా ఒక మనిషి చెప్తుతాడో గమనించడంవలన ఒక వ్యక్తి యొక్క శీలాన్ని ఒకడు చూడగలడు.” ఆలాగే “thank you” అని దేవునికి ఒకడు ఎంత తరచుగా అనడం గమనించడం వలన ఒక వ్యక్తి యొక్క ఆత్మ సంబంధమైన నిజ శీలమైయుంటుంది.

*ప్రార్థనలో, నిన్ను దాటి*
*ఈ ఆత్మ సంబంధమైన (పరిధిని) “పరిమాణాన్ని దాటి”*
*జీవించడానికి దేవుడు ప్రసాదించిన*
*సామర్థ్యం కొరకు దేవుని స్తుతించు.*

ఎడ్డీ క్లోయర్

---

This lesson is a reprint from Eddie Cloer, *Come, Let Us Magnify the Lord* (Searcy, Ark.: Resource Publications, 2004), 14-16.

# మన వరములను కనుగొనుట

## (రోమా 12:3-8)

క్రైస్తవ జీవితం యొక్క పలు విషయాలు రోమా 12:3–8లో నిర్వచించబడ్డాయి. క్రీస్తు ద్వారా దేవుని మహా కనికరము మనకు విస్తరింపజేయబడిన కారణాన (రోమా 3:23, 24; 6:3) ధర్మశాస్త్రానికి వేరుగా, నూతన జీవిత విధానంలో జీవించాలి (6:1–5, 12–15). ఆ నూతన జీవితం జీవించాలంటే మనం సంపూర్ణంగా ప్రభువునకు సమర్పించుకోవాలి, ఏ విధమైన దాపరికం లేకుండ ఆయన కొరకు జీవించాలి (12:1, 2). మనం సంపూర్ణంగా మనలను క్రీస్తుకు అప్పగించుకోవాలంటే అర్థం – దేవుడు మనకు అనుగ్రహించిన సామర్థ్యాలను మనకు చేతనైనంతవరకు ఆయన సేవలో ఉపయోగించాలి (12:3–8). క్రైస్తవులకు లభ్యమయ్యే ఏడు "వరములు" రోమా 12లో పేర్కొనబడ్డాయి: (1) ప్రవచనం, ప్రసంగించడం లేక ప్రకటించడంగా నేను దాన్ని భావిస్తాను – "యెహోవా సెలవిచ్చునదేమనగా" అని ప్రవక్తలు పలికినట్టుగా మాట్లాడాలి; (2) పరిచర్య, లేక సేవ; (3) ఉపదేశం; (4) హెచ్చరిక, లేక ప్రోత్సహించుట; (5) యిచ్చుట; (6) నడిపించుట; మరియు (7) కరుణించుట లేక దయ కలిగియుండుట.

రోమా 12:3–8లో తేటపరచబడనిదేమంటే, ఉపదేశము క్రైస్తవులు, వ్యక్తులకు ఎలా వర్తిస్తుందో తేటగా లేదు. "నాకు ఏమి సామర్థ్యాలున్నాయి?" అని నీవు ఆశ్చర్యపడ వచ్చు; "నా వరములను నేనెట్లు తెలిసికొనగలను?"; "దేవుని సేవలో నా తలాంతులను నేనెట్లు ఉపయోగించగలను?" మన మూల వాక్యాన్ని చర్చిస్తుండగా ఈ ప్రశ్నలను మనం ఆలోచించుదాం.

### మనకు వరములున్నాయా?

"దేవుడు నాకొక వరమిచ్చినట్టు నేనెట్లు తెలిసికొనగలను?" అనే ప్రశ్నతో ఆరంభించుదాం. జవాబు చెప్పక ముందు, దేవుడు నీకు యివ్వనిదేమో నిశ్చయంగా తెలిసికొనడానికి రెండు సంగతులను ప్రస్తావించుతాను. ఆయన నీకు అద్భుతమైన ఏ వరములను యివ్వలేదు; అద్భుతాలుండే కాలం గతించిపోతుంది గనుక. మొదటి శతాబ్దంలో అద్భుత వరములు అనుగ్రహింపబడిన క్రైస్తవులవలె నేడు ఎవడూ స్వస్థపరచ లేదు లేక భాషలతో మాట్లాడలేదు. పైగా, నేటి క్రైస్తవులకు ఆయన లభ్యం చేసిన ప్రతి

*డేవిడ్ రోపర్ వద్దనుండి నోట్:* నేను రోమా 12:3–8 మీద పని చేస్తుండగా, ఒక ప్రసంగంలో నా సహోదరుడు Coy ఉపయోగించిన ఉదాహరణ నాకు గుర్తొచ్చింది. ఆ ఉదాహరణను నేను Coyని అడిగినప్పుడు, అతడు దాన్ని ఉపయోగించి ప్రసంగపు కాపీని నాకు పంపాడు. Heritage Christian University, Florence, Alabamaలో 25 ఆగష్టు 2004 రిట్రీటులో అతడు ప్రసంగించాడు. ఈ స్టడీలో ఆ సందేశమంతా ఉపయోగించడానికి Coy దయతో అనుమతించాడు.

వరమును దేవుడు నీకు ప్రసాదించలేదు. క్రొత్త నిబంధన (రచనా) కాలంలో ఉనికిలో ఉన్న ప్రతి వరముతో క్రైస్తవులను దేవుడు బలపరచనట్టయితే (1 కొరింథీయులకు 12:29-31 చూడు), ఆయన నేడు తన పిల్లలకు ప్రతి వరమును అనుగ్రహించరు - ప్రతిదీ చేయగలనని తలంచకు - ప్రభువు సంఘంలో అవసరమైన ప్రతి పనిని జరిగించగలనని తలంచకు.

ప్రతిదీ చేయగల సామర్థ్యాన్ని దేవుడు మనకు ప్రసాదింపకపోయినా, ఏదో ఒకదాన్ని జరిగించడానికి ఆయన మనకు శక్తినిచ్చాడు! మత్తయి 25:14-30లో చెప్పబడిన "తలాంతులు" డబ్బు మొత్తాలు, మనం ఉపయోగించుతున్నట్టు "తలాంతులు" కావు. అయినా, "అయిదు తలాంతులు," "రెండు తలాంతులు," "ఒక తలాంతు" ప్రజలు రాజ్యంలో ఉన్నారని ఆ ఉపమానం బోధిస్తుంది - అయితే ఏ "తలాంతూ లేనివారు" లేరు. రాజ్యంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఏదో ఒక తలాంతు ఉంది (మనం ఆ పదాన్ని వాడుతున్నట్టు); ప్రతి క్రైస్తవునికి ఏదో ఒక సామర్థ్యం, ఏదో ఒక వరం ఉంది.

నీకు ఏ వరమూ లేదు అనడం అటు నీతిగాని, యిటు వినయంగాని కాదు. మనకున్న తలాంతులు లేవని చెప్పడానికి మూల వాక్యం మనలను ప్రోత్సహించదు. మనలను గూర్చి ఆలోచించుకొనదగిన దానికంటే "ఎక్కువగా తలంచుకొనకూడదని" కోరుతుంది. మనలను గూర్చి తలంచుకొనవలసిన దానికంటే తక్కువగా కూడ తలంచు కొనకూడదు. "నేను ఏమి చేయలేను" అని తలవంచి మెల్లగా మాట్లాడే వ్యక్తి, "నాకు తలాంతు ఉంది ప్రభువు పనికొరకు నేను దాన్ని వాడతాను" అనేవానికంటే శ్రేష్ఠమైన క్రైస్తవునిగా తన్నుతాను రుజువు చేసికొనలేదు.

## మన వరములేవో మనం ఎలా తెలిసికోగలం?

ఇది మనలను రెండవ ప్రశ్న వద్దకు నడిపిస్తుంది: "ప్రతి క్రైస్తవునికి కనీసం ఒక తలాంతు లేక వరము లేక సామర్థ్యము ఉన్నట్టయితే, నాకేముందో నేనెలా తెలిసికోగలను?" దేవుడు ఏమి చేయడానికి నిన్ను బలపరచాడో నీవు గుర్తించడానికి రెండు మార్గాలున్నాయి.

### అడగవలసిన విషయం

"సహజంగా ఏమి చేయడానికి నాకు చేతనౌతుంది?" అని నిన్ను నీవు మొదటిగా అడు గుకోవాలి. ఏమి చేయడానికి నీకు కుదురుతుంది? నీవు ఏమి చేయడానికి యిష్ట పడతావు? నమ్మకమైన క్రైస్తవుల అంగీకారం పొందడానికి నీవు ఏమి చేస్తావు? ఆయన రాజ్యములో వాడునట్లు ఏ ప్రత్యేకమైన తలాంతును దేవుడు నీకు యిచ్చాడో దానిని యితరులు గుర్తించవచ్చు.

క్రీస్తు శరీరములో నీ పాత్రను గుర్తించేలా సహాయపడడానికి ప్రత్యేకించి రోమా 12:3-8 వెలుగులో, దీర్ఘకాలం ఆఫ్రికాలో మిషనెరిగా ఉండిన Eldred Echols మాట్లాడగా నేను విన్న చిన్న సంఘటన యిక్కడుంది. అతడు దీన్ని Michigan Christian College చాపల్ సర్వీస్‌లో మాట్లాడాడు.[1]

నీవు ఒక జన్మ దినపు పార్టీలో ఉన్నావనుకో. క్రీస్తునందు ఒక ప్రియమైన సోదరి

కొరకు ఒక క్రైస్తవ స్త్రీ ఈ పార్టీని ఏర్పాటు చేసింది. ఏడెనిమిది జంటలు స్థానిక సంఘానికి చెందినవారు అక్కడున్నారు. మరియు వారందరు ఎంజాయ్ చేస్తున్నారు. అంతవరకు పార్టీ చాల అద్భుతంగా ఉంది. అలంకారాలు కనుల పండుగగా ఉన్నాయి. సంభాషణ యింపుగా ఉంది. సహవాసము ఎంజాయ్‌బుల్‌గా ఉంది, భోజనం రుచిగా ఉంది.

పార్టీ తారాస్థాయికి చేరుకుంది. దానిని ఏర్పాటు చేసిన ఆ సోదరి ఆనందంతో ఉప్పొంగిపోయింది. అందంగా అలంకరించిన బర్త్‌డే కేకును తేడానికి గదిలో ప్రవేశించింది.[2] ప్రధాన అతిథి సంతోషంతో చప్పట్లు కొడుతోంది. "హేపీ బర్త్‌డే టు యు ... హేపీ బర్త్‌డే టుయు" అంటూ వారందరు పాడనారంభించారు. తటాలున ఆతిథ్యం ఏర్పాటు చేసిన ఆమె కాలుజారి క్రిందపడిపోయింది. కేక్ బోర్లాపడింది, మెత్తగా ఉండే క్రీమ్ భాగం అంతా చితికి నేలమీద, గోడలమీద సమీపంగా ఉన్న అతిథుల మీద పడింది. ప్రతి ఒక్కరు పాడడం నిలిపారు, స్తంభించిన నిశ్శబ్దం నెలకొంది. విందు ఇస్తున్న ఆమె నేలమీద పడింది, ఆమె దుస్తులవైపు, చెడిపోయిన కేక్‌వైపు, అస్తవ్యస్తమైన పార్టీ తీరు చూస్తూ ఎక్కి ఎక్కి యేడ్వసాగింది. నీవేమి చేస్తావు?

- ఏ సంకోచం లేకుండా నీవు త్వరగా ఆమె వద్దకు వెళ్లి, ఆమె ప్రక్క మోకాళ్ల మీద కూర్చుండి, ఆమెను ఓదార్చడానికి చేతులు చాపి ఆమెను కౌగలించి, ఆమె మనసు తేలికపరచే చమత్కారంతో ఆమెకు సహాయపడ నీవు చూడవచ్చు.
- పాత బట్టగాని, మాప్‌గాని తెచ్చి నీవు దాన్ని తుడిచి శుద్ధిచేయవచ్చు. చితికిన కేక్ ముద్దను తీసి వస్తువులు శుభ్రం చేయవచ్చు.
- పడిపోయిన ఆమె వద్దకు వెళ్లకుండానే, "కంగారుపడకు అంతా బాగౌతుందిలే" అన్నట్టి ప్రోత్సాహకరమైన మాటలను ఆమెతో మాట్లాడియుండవచ్చు. "ఇంతవరకు యిది ఎంత అద్భుతమైన పార్టీగా ఉందో! కేకు లేకుండా మనం సరదాను కొనసాగించవచ్చునని" తక్కినవారితో నీవు అనవచ్చు.
- తక్షణం చేయవలసిన దానిని గురించి ఆలోచించి ప్రభువు చిత్తాన్ని అనుసరిద్దామని అక్కడున్న సభ్యులను కోరడానికి నీవు ముందుకు రావచ్చు. "సహోదరుడు గాని, సహోదరి గాని అవసరతలో ఉంటే, అట్టివారికి సహాయం చేయమనే ప్రభువు మాటలను జ్ఞాపకం చేసికొనండి అని నీవు అన్నావు. బైబిలు ఏ మంటుందంటే, ..." అప్పుడు యాకోబు 2:15-17 కోట్ చేయి.
- ఈ చిన్న సంఘటనలో మనమందరం నేర్చుకోవలసిన పాఠాన్ని నీవు చూడవచ్చు. "మేరీ, నీవు దీని విషయంలో కలవరపెట్టబడవచ్చు, కాని దీనినుండి మనం ఏమి నేర్చుకొనగలం? ఒలికిపోయిన కేకో పాడై పోయిన పార్టీయో మన అనుభవంలోని మహా గొప్ప విపత్తు కాదు. మనం **కేక్** పాఠాన్ని గుర్తుంచుకోగలం: 'నిత్యుడగువానిని పట్టుకొని

ఎల్లప్పుడు భద్రంగా ఉండవలసి యుంది' " అన్నట్టు నీవు ఏదైనా చెప్పవచ్చు.

- కేక్ పాడయ్యింది గనుక మరొక కేక్ అవసరమనే నిర్ణయాన్ని నీవు చూడవచ్చు. ఒక ప్లేటులో నీవు కొంత డబ్బువేసి, దాన్ని చుట్టునున్న వారి వద్దకు పంపుతూ, మరొక కేక్ కొనడానికి అందులో డబ్బు వేయమని నీవు కోరవచ్చు.
- వెంటనే పరిస్థితిని సమీక్షించి, ఏమి చేయాలో చూచి, అలా చేయబడేలా నీవు చూడవచ్చు. "అది సరి, యోనా, నీవు మేరీని ఓదార్చు. రూతూ నీవు ప్రిస్కిల్లతో కలిసి ఈ చిందరవందరను శుభ్రం చేయడానికి అవసరమైనది ఎందుకు చేయకూడదు? జాన్ నీవు కలెక్షన్ తీసికో, మత్తయి వెళ్లి కేక్‌ను కొనుక్కొస్తాడు. కేక్ కట్టింగ్‌ను తిరిగి ఏర్పాటు చేసి, అప్పుడు బహుమానాలను యిద్దాం. ఈ మధ్య కాలంలో, జోసఫ్ నీవు మమ్ములను కొన్ని పాటల్లో ఎందుకు నడిపించ కూడదు?" అని నీవు అన్నావు.

నీవు ఏమి చేయ మనస్సు కలిగియుంటావు? అని నేను నిన్ను మరల అడుగు తున్నాను. నీ జవాబు నీ మనస్సులోనే ఉంచుకో, రోమా 12:3-8ను వర్తింపజేయ చూద్దాం:

- నీవు వెంటనే వెళ్లి ఆ స్త్రీని ఆదరించాలనే మనస్సు నీ కుంటే, కరుణించు వరము నీకుంది.
- అనుకోకుండగనే నీవు క్లీన్ చేయనారంభించితే, నీకు పరిచర్య చేసే వరముంది.
- ప్రతి ఒక్కరితో ప్రోత్సాహకరమైన మాటలు నీవు పలుకనారంభించినట్టయితే, నీకు హెచ్చరించే లేక ప్రోత్సహించే వరముంది.
- ప్రస్తుత పరిస్థితిలో ప్రభువు చిత్తం చేద్దామని యితరులను అర్థించితే, నీకు "ప్రవచన" వరముంది ("ప్రభువు కొరకు మాట్లాడడం").
- ఆ ఆకస్మిక సంభవంలో నేర్చుకోవలసిన పాఠాలున్నాయని నీవు ఆలోచించి యితరులతో ఆ పాఠాలను పంచుకో నారంభించినప్పుడు, నీకు ఉపదేశించే వరముంది.
- ఇచ్చుటవలన భౌతిక అవసరత తీర్చవచ్చునని నీవు చూడగలిగి - నీవు యివ్వడానికి యిష్టపడి యివ్వడానికి యితరులను అర్థించినట్టయితే - నీకు ఔదార్యపు వరముంది..
- చేయవలసిన ప్రతిదానిని నీవు చూచి, దాన్ని చేయనారంభించి, యితరులకు పనులను అప్పగించ - ప్రజలు నీ సలహాలను అనుసరించ గోరినట్టయితే - నీకు నాయకత్వపు వరముంది.

అవుట్‌లైన్ చేయబడిన ప్రత్యుత్తరాలకు సంబంధించి, “అలాటి పరిస్థితికి స్పందించడం అనవసరం అని నీవు తలంచవచ్చు!” నీవు రైటు కావచ్చు. వరాలన్నీ విలువైనవి, ఒకదానికంటే మరియొకటి శ్రేష్ఠమైనదేమీ కాదు. ఆ యా పరిస్థితులలో తక్కినవాటికంటే కొన్ని ఎక్కువ ప్రయోజనకరమైనవై ఉంటాయి. ఇప్పుడు వర్ణించబడిన దృశ్యంలో, కరుణించే, పరిచర్య చేసే వరములు ఎక్కువ ప్రయోజనకరమైనవని మనం తలంచవచ్చు. అయినా, రోమా 12 (దానికి సంబంధించిన లేఖన భాగాలనుండి) మనమందరం ఒకే రకమైనవారం కాదని, మనకు వెవ్వేరు వరాలున్నాయని మనం నేర్చుకోవలసియుంది. ఒకే పరిస్థితికి వెవ్వేరుగా మనం స్పందిస్తామని దాని అర్థం. ఇతరులు మనవలె స్పందించలేదని మనమెన్నడూ వారిని తృణీకరింపకూడదు.

ఆలాటి పరీక్ష తీసికొనడంవలన, లేదా నీ సొంత భావాలవైపు తిలకించడంవలన, దేవుడు ప్రసాదించిన సామర్థ్యాలను తేటగా గ్రహించవచ్చు. నేను ఏమి చేసియుండే వాడను? నాకు నిశ్చయంగా తెలియదు. నేను ఆదేశాలు జారీచేసేవానిగాను తాను మాప్ (తుడిచే దాని) కొరకు వెదకే వ్యక్తి ఉంటుందని నా భార్య తలంచుతుంది.

ఆ పరిస్థితిలో సంగతి ఏమైనా, ఉపదేశించే వరము నాకుందని గట్టి నమ్మకం కలిగియున్నాను. “ఉపదేశించే వరము” అంటే నా అర్థం ఏమంటే, నేను ఎరిగినదానిని (లేక నాకు తెలుసునని నేను తలంచేదానిని) యితరులతో పంచుకొనడానికి మనస్సు కలిగియున్నాను – ఎదుటివారు వినదలచుకున్నా లేకపోయినా. ఇటీవల బంగళాదేశ్ ప్రయాణం తరువాత, మా అల్లుడు Dan బంగ్లాదేశ్ గురించి ఒక ప్రశ్న అడిగాడు. “బంగళాదేశ్ ఎక్కడుంది?” అని. కొందరు ఆ ప్రశ్నకు కొన్ని మాటల్లోనో లేక ఒక వాక్యంలోనో జవాబు చెప్తూతారనుకొంటా. నా జవాబు బంగ్లాదేశ్ యొక్క నాగరి-కత, భూగోళం, చరిత్రను గూర్చి ముప్ఫై నిమిషాల ప్రసంగం చేశాను. “ఒకే ప్రశ్న అడగడంలో నేను తప్పు చేశాను. నేను ఎన్నడూ ఊహించనంత సమాచారాన్ని బంగ్లాదేశ్ గురించి తెలిసికొన్నాను” అని తరువాత Dan యింటిలో చెప్పాడు. నాకు అది వరం (కొందరు దాన్ని “శాపమని” తలంచవచ్చు) – ఉపదేశించే వరం. నిజమైన ఉపదేశకుడు చెప్పాలని అనుకుంటాడు – వినేవారెవరికైనా తాను ఎరిగిన సంగతిని పంచుకోవాలనే ఆశ కలిగియుంటాడు.

అది ఒక ఉదాహరణ. తన పరిచర్యలో వాడడానికి దేవుడు తన పిల్లలైనవారికి కనీసం ఒక్క తలాంతైనా యిచ్చియుంటాడు. సహజమైన నీ అభిలాషలను నీవు ఆలోచించినట్టయితే, ప్రభువు సంఘంలో పరిచర్య కొరకైన నీలో అణగియున్న శక్తి విదితమై ఉంటుంది.

### ప్రయత్నించవలసినది

నీకు ఫలాని వరముందో లేదో కనుగొనడానికి దాన్ని ప్రయత్నించి చూడు! “Have a go” అని ఆస్ట్రేలియా స్నేహితుడంటాడు. ఏదో ఒక క్రొత్తది నీవు ప్రయత్నించేవరకు నీలో ఉన్న సామర్థ్యం నీవు ఎన్నడూ కనుగొనలేకపోవచ్చు. తానెన్నడు ప్రయత్నించ కుండనే, “నాకు పాడే వరము లేదు” అని ఒకడు చెప్పవచ్చునా?

మహా గొప్ప ఉపదేశకులు, ప్రసంగీకులు, పాటలు నడిపించేవారు, ఆ పని చేయక ముందు – ప్రయత్నించక ముందు, వారికి ఆలాటి సామర్థ్యం ఉందా అని సందేహించారు – మరియు కొందరి విషయంలోనైతే – వారు ప్రయత్నించారు – ప్రయత్నించారు, ప్రయత్నించారు! ఎట్టకేలకు, యింతకు ముందు చేయని ఒక విషయాన్ని సాధించగలిగి నట్టు నేర్చుకున్నారు. వాస్తవానికి, వారెన్నడు చేయలేమని తలంచినవారే ఆ పనులలో బహు నిపుణులైనట్టుగా రూపొందారు.

నీ వరమును, వరములను నీవు కనుగొనక ముందు, నీ సహజమైన అభీష్టాలు, సామర్థ్యాలు ఏమైయున్నట్టు యితరులు నీయందు చూస్తారో మొదట దాన్ని గూర్చి ఆలోచించు. రెండవది, క్రొత్త కార్యకలాపాలను ప్రయత్నిస్తునే ఉండు. అడుగున పాతిపెట్టబడిన నేర్పులు లేక నైపుణ్యాలు నీకు ఉండవచ్చు. నీ తలాంతులను వృద్ధి చేసికొనడానికి ప్రయత్నించడంలో నీవు వాటిని కనుగొనగలవు.

## మన వరాలను వాడడం ఎందుకు ప్రాముఖ్యం?

అడుగవలసిన మూడవ ప్రశ్న యిది: "దేవుడు నాకు ప్రసాదించిన వరములను కనుగొని వాటిని ఆయన పరిచర్యలో వాడినప్పుడు ఏమి జరుగుతుంది?" దేవుడు నిన్ను సంసిద్ధునిగా ప్రత్యేకించి చేసిన విధానంలో నీవు దేవుని సేవించినప్పుడు, రెండు సంగతులు జరుగుతాయి. (1) రాజ్యములో నీవు సఫలతను కలిగి ఉంటావు. ఇంకొకరు బాగుగా నెరవేర్చగల దానిని నీవు ప్రయత్నించేదానికి బదులు, నీవు బాగుగా చేయగలిగింది నీవు చేసినట్టయితే, నీవు తక్కువ తలాంతు ఉన్నదాన్ని చేసి యివ్వగలిగిన దానికంటెను, సంఘ అభివృద్ధికి నీవు ఎక్కువ సమర్పించువాడవైయుంటావు. (2) నీవు ఎక్కువ సంతోషిస్తావు. "గుండ్రటి రంధ్రాల్లో" "చతురస్రంగా ఉన్న మేకులను" పట్టించడం కష్టంగా ఉంటుంది అది "సంతోషం" కలిగించదు. మనకు వరంగా కలిగింది, మనం చేయగలిగింది స్థిరంగా క్రమంగా చేస్తే క్రైస్తవ జీవితం భరించలేని భారంగా కాక, ఆనందమయంగానూ, ఉత్సాహవంతంగానూ ఉంటుంది.

## వారి వరములను కనుగొనుటకు మనం క్రైస్తవులకు ఎలా సహాయపడగలం?

మరో ప్రశ్నను ఆలోచించు: "ఇతర క్రైస్తవులు వారి వరములను, రాజ్యములో వారి స్థానాలను కనుగొనగలుగునట్లు వారికి మనం ఎలా సహాయపడగలం?" మూడు ఆలోచనలు గుర్తుకొస్తున్నాయి.

(1) దేవుని వరములను గూర్చిన సత్యాన్ని సహోదరులకు ఉపదేశించు. ప్రత్యేకించి, దేవుని పిల్లలలో ప్రతివానికి కనీసం ఒక తలాంతైనా దేవుడు యిచ్చాడని, మరియు సంఘంలో ప్రతి పాత్రయు (పని)యు విలువైనదేయని, ఒకరి పనిని మరియొకరు తక్కువగా చూడకూడదని, మరియు మనకున్న ఏ సామర్థ్యమైనా దేవుని రాజ్యంలో మనం ఉపయోగించాలని గ్రహించేలా సహాయం చేయి.

(2) తమ వరములను పరిశోధించి కనుగొనగలుగునట్లు ప్రజలకు అవకాశాలు కల్పించబడేలా సహాయపడు. స్థానిక సంఘంలో వివిధ రకములైన సేవలకు ఎన్ని అవకాశాలు ఉంటాయో – ప్రతివారికి అవకాశం కలిగేలా చూస్తే – ఒక మినిస్ట్రీ – సంఘము యొక్క ఆత్మ సంబంధమైనదియు, సంఖ్యాపరమైనదియునైన ఎదుగుదలకు అతడు లేక ఆమె విలువైన సమర్పణను చేయగలరు.

(3) సంఘంలో వ్యక్తులను ప్రోత్సహించు, వారు ఎరుగని తలాంతులు వారికి ఉండినట్లు నీకు కన్పించే, లేదా వారు దేవుని పరిచర్యలో వాడని తలాంతులున్నట్టు నీకు తోచేవాటిని ప్రోత్సహించు. "నీవు గొప్ప సువార్తికుడుగా లేక ఉపదేశకుడుగా అవుతావని నేను తలంచుతున్నాను," లేదా "నీ సామర్థ్యంతో నీవు అద్భుతమైన సలహాదారుడిగా" లేదా "నీవు పెద్దగా రూపొందే లక్షణాలున్నాయని" అంటే, అటు సంఘానికిని, యిటు దేవునికిని గొప్ప సేవ చేసినవాడవైయుంటావు.[3]

## ముగింపు

ముగింపుగా, నా సొంత అనుభవానికి నన్ను మళ్లనిమ్ము. ఇతరులకున్న కొన్ని నైపుణ్యాలు నాకు లేకపోవచ్చు. పరిచర్యలోని కొన్ని ఏరియాల్లో అనేకులు ఎక్కువ సఫలతను కలిగి ఉండవచ్చు. నేను మాత్రం ఉపదేశించగలను. కొందరికి, ఉపదేశించడం శ్రమగా ఉండవచ్చు. ఆయా సమయాల్లో ఉపదేశించడం కష్టంగాను, భారంగాను ఉండవచ్చు – కాని నాకు మాత్రం అలా కాదు. అసలు, నేను ఉప దేశించడానికి యిష్టపడతాను. నాకు విషయం బాగా తెలిసినప్పుడు, అందరూ శ్రద్ధను చూపుతున్నప్పుడు పాఠాన్ని సంతోషంగా వింటున్నప్పుడు, నేను వేరొకరికి నా అర్హతను ఇవ్వను. నా ప్రార్థన ఏమిటంటే, నీ వరములను నీవు తెలుసుకుని, సంతృప్తికరంగానూ, మహిమాన్వితంగానూ వాటిని ఉపయోగించు.

కాయ్ రోపర్

---

సూచనలు

[1]I adapted this from Eldred Echols, who said that he had heard it from someone else. A similar illustration is found in Bruce Barton, David Veerman, and Neil Wilson, *Romans,* Life Application Bible Commentary (Wheaton, Ill.: Tyndale House Publishers, 1992), 236. The illustration used by Barton, Veerman, and Wilson revolves around a destitute family attending a worship service. [2]నీ సమాజంలో జనమ్మదినపు కేక్ లేనియెడల ఒక పండుగకు సంబంధించిన ప్రత్యేకమైన ఆహారపు విషయాన్ని ఉదహరించు. [3]క్రైస్తవ స్త్రీలు చేయునట్లు ప్రోత్సహించే కొన్ని విషయాలను నీవు చేర్చ గోరవచ్చు.